ISSN No : 2581-7477

# సాహిత్య ప్రస్థానం

Sahitya Prasthanam

సంపుటి - 4 సంచిక - 11 ఆగస్టు 2023 కృష్ణా పేజీలు 68 వెల రూ. 20



సాహితీస్రవంతి

# మణిపూర్ అమానుష సంఘటనలపై గళమెత్తిన కవిలోకం



పెద్దాపురంలో కొవ్వొత్తులతో ప్రదర్శన

మణిపూర్‌లో మహిళలపై జరిగిన అమానుష కాండను నిరసిస్తూ ... తెలుగు కవిలోకం గళమెత్తింది. నాగరిక సమాజంలో దారుణ దురాగతాలకు పాల్పడ్డ వారిపై వెంటనే కఠిన చర్యలు చేపట్టి, మణిపూర్‌లో శాంతిభద్రతలు నెలకొనేలా చర్యలు చేపట్టాలని కవులు, రచయితలు డిమాండు చేశారు. రాష్ట్రంలో వివిధ చోట్ల సాహితీ స్రవంతి ఆధ్వర్యాన కవి సమ్మేళనాలు, సమావేశాలు, ప్రదర్శనలు జరిగాయి.



కర్నూలు సభలో మాట్లాడుతున్న సాహితీస్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్



ఏలూరులో



నంద్యాలలో






కాకినాడ సభలో మాట్లాడుతున్న జోశ్యుల కృష్ణబాబు, హాజరైన కవులు, రచయితలు

సాహిత్య ప్రస్థానం

ఆగస్టు 2023

సంపుటి : 4 సంచిక : 11

# విద్వేషాలు, విధ్వంసాలు, వివాదాలు

గత మూడు మాసాలుగా దేశం మణిపూర్‌లో హింసాకాండపై కలత చెందుతున్నది. ఈశాన్యాన కొండకోనల్లో మారుమూలల్లో మహిళలపై ఘోరకలి సాగిన తీరు తెలుసుకుని భరతమాత తల్లడిల్లింది. అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహించింది. దేశం సిగ్గుపడాలని ప్రధాని మోడీ పార్లమెంటు భవనం ముందు ప్రవచించారు కూడా. అయితే అత్యున్నత చట్టసభ అయిన పార్లమెంటులో అదే మాట చెప్పడానికి ఒప్పుకోలేదు. ఉభయ సభల్లో ఆ అంశంపై సమగ్రంగా చర్చించడానికి కేంద్రం సిద్ధపడలేదు. అవిశ్వాస తీర్మానం రూపంలో చర్చ చేద్దామని ప్రతిపక్షాలు కొత్త వ్యూహం చేపట్టాల్సివచ్చింది. ఈ లోగా దేశ రాజధాని శివార్లలోని గుర్‌గాం, నూహ్ పట్టణాల్లో మత కలహాలు భగ్గుమన్నాయి. మత సంస్థలు వ్యూహాత్మకంగా పెట్టిన చిచ్చు ఆరు ప్రాణాలు పోవడానికి కారణమైంది. హిందూత్వ శక్తుల కవ్వింపు చర్యలు, వాటిపై అభద్రతతో ముస్లిములు రెచ్చిపోవడం తీవ్ర హింసాకాండకు దారితీసింది. అక్కడ చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునేవారు, పని చేసుకుని పొట్ట పోసుకునే శ్రమజీవులు వలస ప్రాణులు అకారణంగా బలైపోయారు. మణిపూర్ మంటలు ఢిల్లీ పాలకులను చేరడానికి చాలా సమయం పట్టింది కానీ, ఈ విధ్వంసం దావానలంలా వ్యాపించిన హింస దేశానికే కలవరం కలిగించింది.

మత సామరస్యం, లౌకికతత్వం కాపాడుకోవాలని చాలాకాలంగా ప్రజాస్వామిక వాదులు చెబుతున్న మాట ఎంత నిజమో ఆచరణలో అర్థమవుతున్న సందర్భమిది. కానీ, పాలకులు ఆ విధమైన సందేశంతో ముందుకు రావడం లేదు సరికదా పరోక్షంగా ఎగదోసేందుకు కారణమవుతున్నారు. ఎందుకంటే ఈ సమయంలోనే వారణాసిలోని గ్యానవాపి మసీదు వాజ్యం తిరగదోడబడింది. ఒకప్పుడు అయోధ్యలో బాబ్రీ మసీదు/ రామ జన్మభూమి వివాదం రగిలిన తీరులోనే ఇప్పుడు వారణాసి వివాదం రగులుకుంటుందనే సందేహాలు బలపడుతున్నాయి. ఈ మసీదులో పురావస్తు పరిశోధనలు జరపాలంటూ కింది కోర్టు ఇచ్చిన ఆదేశాలు సుప్రీం కోర్టు దాకా వెళ్లి తిరిగి హైకోర్టుకు వచ్చి అనుమతి పొందాయి. అయితే ఆ అనుమతితో నిమిత్తం లేకుండా యుపి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ దాన్ని మసీదు అననక్కరలేదని ఏకపక్షంగా ప్రకటించేశారు. ఇలాటి వైఖరి ఆచరణలో మతోన్మాద రాజకీయాలను ఎలా ప్రకోపింపచేస్తుందో చాలాసార్లు చూశాం. అన్నట్టు మధురలోనూ కృష్ణ జన్మస్థాన్ ఇలాటి మలుపులే తిరుగుతున్నది.

వందల సంవత్సరాల కిందటి చరిత్ర పరిణామాలపై ఇలాటి వివాదాలు పునరావృతం కాకూడదనే పార్లమెంటు 1991 ప్రార్థనా స్థలాల చట్టం ఆమోదించింది. అయోధ్య సమస్యలో సుప్రీం కోర్టు తీర్పును పాటించాలని, మిగిలిన అన్ని చోట్ల 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చిన నాటి యథాతథ స్థితి కొనసాగాలి తప్ప కొత్త వివాదాలు అనుమతించరాదని ఈ చట్టం నిర్దేశించింది. కాని స్వయాన సుప్రీం కోర్టు ఇప్పుడా చట్టానికి కొత్త భాష్యం చెప్పి కొత్త తగాదాలకు తలుపు తీసింది. ఈ వివాదాలు, విధ్వంసాల పర్యవసానాల పట్ల ప్రతి భారతీయుడూ అప్రమత్తంగా వుండాలి. అకారణ ఘర్షణలను నివారించి లౌకిక తత్వాన్ని, సమైక్య భావనను కాపాడుకోవాలి. ■

ప్రధాన సంపాదకుడు
**తెలకపల్లి రవి**
వర్కింగ్ ఎడిటర్
**సత్యాజీ**

సంపాదకవర్గం
**కె.సత్యరంజన్ ◆ కెంగార మోహన్ ◆ వొరప్రసాద్ ◆ చీకటి దివాకర్ ◆ గనారా ◆ కుమార స్వామి**
మేనేజర్ : **కె.లక్ష్మయ్య**

బొమ్మలు
**తుంబలి శివాజీ**
**చిదంబరం**

Owned, Printed and Published by **V. Krishnaiah** 41-9 -16, 1st Floor, F-3, Ramalayam Street, Near Kalpana Prints, Krishna Lanka, Vijayawada (Urban) - 520013, Krishna District. Andhrapradesh. Printed at Sri Chaitanya Offset Printers, 29-7-36, Vishnuvardhan Rao Street, Suryaraopet, Vijayawada - 520 002, Andhrapradesh. Published at 27-30-4, M.B.Vignanakendram, 3rd Floor, Akulavari Veedhi, Governorpet, Vijayawada - 520 001, Andhrapradesh. Editor : Telakapalli Ravi

## కథలు


తాతారావు అలియాస్ రజనీకాంత్ : మారుతి పురోహితం .... 5
సర్కారు తుమ్మ : ఎమ్వీ రామిరెడ్డి ........... 18
ఉంగటం తెగింది! : డా. శాంతినారాయణ ...... 30
గంధపు చెక్క :గన్నవరపు నరసింహమూర్తి 49


## కవితలు


నిర్వాసితులు : అడిగోపుల వెంకట రత్నం 9
ఆకుపచ్చని కల : మామిడిశెట్టి శ్రీనివాసరావు 12
మంగళకరుడు : తగుళ్ల గోపాల్ ............ 13
చెట్టు కళేబరంపై ... : చందలూరి నారాయణరావు 17
దిమ్మిస : డా. కటుకోర్ల్వుల రమేష్ 20
నడుస్తున్నాను : బసు పోతన ............... 25
కవి మరణించాడు : డాక్టర్ ఎన్.గోపి ......... 25
అనుభవైకం : శైలజామిత్ర ................ 26
వివస్త్ర భారతం : లోసారి సుధాకర్ ........... 29
ముసురుకున్న మబ్బులు : బొడ్డ కూర్మారావు ........... 29
కారణమెవరు? : మేడక యుగంధరరావు 35
భుజంపై వాలిన పావురం : ఎస్ హనుమంతరావు ...... 38
నగ్న ఊరేగింపు : చౌశా .................. 45
నగ్నవ్యూహం : బిబిటి తేజస్విని ........ 48
కమ్మని కల : బి.గోవర్ధనరావు ......... 53
ఓ తల్లి కథ : తస్లీమా నస్రీన్ ............. 54
అమ్మకో ఉత్తరం : బంగార్రాజు కంఠ .......... 58
నీడలు నీడలుగా ... : అనూరాధ బండి .......... 62
విడుదల : లక్ష్మి కందిమళ్ల ............ 62


## వ్యాసాలు


భాష - నిర్మాణం : పరిచయం
– డా. డి. ఉదయ కుమారి ......... 10
కొత్తచూపును ప్రసరించే సత్యవతి గారి కథలు
– కె.పి. అశోక్ కుమార్ ............. 14
సమతా దేశనూనె ఆత్మకథ 'మాతంగి దివిటీ'
– డాక్టర్ జి.శైలమ్మ .................. 23
విమర్శనా దీపం 'దరి - దాపు'
– కిరణ శ్రీ ....................... 27
కవిత్వం చేతికి మొలచిన తొమ్మిదో వేలు
– లండ సాంబమూర్తి ............. 36
ముఖాముఖి : భావజాలంలో మార్పే సాహిత్యోద్యమాల పని
– కేంద్రసాహిత్యఅకాడెమీ కన్వీనర్ మృణాళిని 39
జాతి గుర్తించిన వాడే మహాకవి
– దివి కుమార్ ....................... 43
వర్తమానం: అవిశ్వాసంతో మోడీ సర్కారుకు రాజకీయ సవాలు
– తెలకపల్లి రవి ..................... 46
మట్టి పిడికిళ్ల కవన పోరు కేక 'నీటిగింజల పంట'
– మెట్టా నాగేశ్వరరావు ............... 51
ఉత్తరాంధ్ర చారిత్రిక నవల వీర కళింగం
– డా. ఆల్తి మోహనరావు ........ 56
పర్యటన : మండుటెండల జూన్ .. మద్రాసులో పెళ్లి!
– నాగసూరి వేణుగోపాల్ ........... 59
**డైరీ ................................................ 63**



ISSN No: 2581 - 7477

**సాహిత్య ప్రస్థానం మాసపత్రికను ప్రోత్సహించండి. తెలుగు భాష, సాహిత్య వికాసాలకు మీరూ తోడ్పడండి !**

:: రచనలు, చందాలు, విరాళాలు, మనీ ఆర్డర్లు పంపవలసిన చిరునామా ::

సాహిత్య ప్రస్థానం, ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, తాడేపల్లి - 522501, గుంటూరు జిల్లా. ,
ఫోన్ : 0866-2577248, చందా వివరాలకు : 94900 99057, రచనలకు : 94900 99167
ఇ-మెయిల్ : ssprasthanam@gmail.com, వెబ్‌సైట్ : www.prasthanam.com

1 సంవత్సర చందా రూ. 240 ◆ 5 సంవత్సరాల చందా రూ.1000 ◆ 10 సంవత్సరాల చందా రూ. 2000

Bank A/c Details: A/c Name: PRASTHANAM, SBI, Governorpet, Vijayawada. A/c No. 52001500585,
IFSC: SBIN0020343. చెక్కులు, డిడిలపై prasthanam అని రాయగలరు.



# తాతారావు అలియాస్ రజనీకాంత్

- మారుతి పౌరోహితం
944002 05303

ఇంగో నాలుగు గంటల్ల మా తాతారావు సారుని కలుసుకో బోతుండాను. శానా కుశాలుగా ఉండాది. సారుని సూడల్ల అని ముప్పై అయిదేండ్ల నుంచి ఎదురుసూస్తా ఉంటె ఇన్ని దినాలకి అయ్యిండాది. భాస్కారాచారే గనక సారుపత్తా తీయకుండా ఉండింటే ఈఫొద్దు తాతారావు సారుని కలిసేకి అయ్యిండేకి లేదు సూడప్పా! ఎవురు ఈ భాస్కరాచారి? అంటే మా జతగాడు. తాతారావు సారు ఇంట్లఉండి సదువుకున్నాయప్ప. ఇపుడు నవోదయ స్కూల్లోన పనిసేస్తా ఉండాడు. ఈయప్పకి ఇంగ్లీసు రాకుంటే వద్ద కూసోబెట్టుకొని ఇంగ్లీసు నేర్పించిండాడు తాతారావు సారు. ఆ ఇంగ్లీసే ఆయప్పకి నవోదయల కొలువు దొరికేతట్ల సేసిండాది. మాము పదో తరగతి అయిపోయినంక పై సదువులు సదివేకి పట్నం పోతిమి. మా బతుకు వెతుకులాటల ఎవురినీ పట్టించుకోల్యా. మాకందరికీ ఉద్యోగాలు దొరికి కొంచం కుదుట పడినంక తిరిగి సూసుకొంటే “యలే! తాతారావు సారే లేకుంటే ఏమి గతి అయిపోతుంతటిమో సూడు” అనుకొంటా సారును గుర్తు సేసుకొని కలుద్దాం అనుకొంటే యాడ ఉండాడు సారు, ఎప్పుడో వాళ్ళ జిల్లాకి ట్రాన్సుర్ సేపిచ్చుకొని పోయేద్య అని తెలిస్య.

ఎట్లరా దేవుడా అనుకొంటా ఉంటె సెలువుల్లో ఊరికొచ్చిన బాస్కరాచారి “ఏంటికి పేచాడుతార్లె? నాను ఉండాను కదా! సారు యాడ ఉండాడో పత్తా తీసి సూపిస్తా సూడు” అని చాలెంజి సేస్య.

భాస్కరాచారి ఏమి సేసిండాడు అంటే తూర్పు గోదారి జిల్లాల ఉండే ఇస్కూలు అడ్రస్సులు తీసుకొని దినుమూ ఐదు స్కూళ్ళకి కార్డు రాయబట్ట్య. ఇట్లా మీకాడ తాతారావు సారు అని ఒకసారు ఉండల్ల, ఒగ్యాల వుంటే ఈ అడ్రస్సుకి కార్డు రాయండప్పా! అని దినుమూ రాసి ఏసేది. దినూమూ తిరుగుకార్డు ఏమైనా వొస్తాదా? అని ఎదురు సూసేది. ఇట్లా ఒగ ఇరవై దినాలు గడిస్య. ఒగనాడు జవాబు వచ్చేవచ్చ్య. తాతారావు సారు జిల్లా పరిసత్తు ఇస్కూలు, పొన్నమండలలో ఉండాడని ఆ జాబుల ఉండేది. సదివి మా భాస్కరాచారికి ఆఫొద్దు పండగే పండగ సూడప్పా! తరువాత వారమే ఆయప్పకి యానాంల ట్రైనింగ్ ఉంటె ఆడికి అరవై మైళ్ళు పొన్నమండల అని తెలుసుకొని ఎవురిదో స్కూటరు ఇప్పిచ్చుకొని ‘జేమ్స్ బాండ్’ మాదిరి సారుని పుడుక్కుంటా అడీడ అడుక్కుంటా పోయనంట. ఎట్లతిరిగి సారువాళ్ళ ఇంటికాడికి పోయి కనపడితే సారు ఆచ్చర్యపోయనంట. ఏమప్పా ఇంత దూరం ఎతుక్కొంటా ఏంటికి వొస్తివి అనెనంట. సార్! నీకోసం ఊర్ల అందరు నుగ్గ ఎదురు సూస్తా ఉండారు. ఏమనుకొంటివి అన్యనంట. భాస్కారాచారిని సూసి సారు శానా కుశాలు అయ్యిడిస్యనంట. సారు దగ్గర ఒక దినుము అంతాఉండి తిరి గొచ్చిండాడు ఆచారి. ఊరికివొచ్చి జరిగిందంతా సెప్ప్య. అందురుమూ ఎట్లన్నగానీ సారుని పిలిపించాల అనుకొంటిమి. ఫోనుసేసి రమ్మంటిమి.

“అంత దూరం ప్రయాణం చేయగలనా?” అన్య సారు.

“కాదు సార్! వచ్చే తీరాల. మాము ఇమానం టికెట్టు సంసాబాదు కాటికి తీస్తాం.అన్నుంచి కారుల పిలుసకొస్తాం” అని అడుక్కొంటిమి. పెద్ద మనసుత సారు సరేల్యా అన్య. దానికేప్పా నాను ఇప్పుడు సంసాబాదుకి ఫోతుండాను.

ఇంతలోనె మా డ్రైవరు “సారూ! ఉడిపి హొటళ్ళ ఇడ్లీ సాంబార్ తింటానంటివి కదా. అదే సూడు హొటలు” అను కుంటా కారు పక్కకి ఆప్య. ఇద్దరూదిగి హొటల్లోకి పోయి ఇడ్లీసాంబారు తిని మల్లా రస్తాఇడిస్తిమి.రస్తాఎంబడి పోతావుంటే

నా ఇస్కూలు దినాలు గుర్తుకి రాబట్ట్య. ఆరో తరగతి సదివేకి మాగువ్వలదొడ్డి నుంచి గోనేగండ్లకి వొస్తిని. బడి తెరిసిన నాలుగు దినాలకి మా నాయన నన్ని ఎంటబెట్టుకొని గోనెగండ్ల హైస్కూలుకి సేరిపిచ్చేకి వచ్చ్య. నాలుగు దినాలు ఏంటికి ఆలీస్యం అయ్యేద్య అంటే బుక్కులు కోనేకి దుడ్లు పుట్టల్ల కదా? టెస్టు బుక్కులు, నోటు బుక్కులు కొనల్ల. అయితే ఆడ పదో తరగతి సదువుతున్న మా దత్తప్పన్న తిప్పలుబడి సెకండ్ హ్యాండు బుక్కులు రెడీసేసింద్య. ఆ రకంగా కొత్త టెస్టుబుక్కుల వాసన సూసే రాత మాకి లేకుంద్య. నోట్సులు సెకండ్ హ్యాండు పనిసేయవు కదా! కొత్త నోటు బుక్కులు, ఇంకుపెన్ను, రవి ఇంకుసీసా, నటరాజు కంపాస్ పెట్టె, డ్రాయింగ్ బుక్కు, కలర్ పెనిసిల్లు, అసోకా ఎచ్‌బీ పెన్సిలు ఉద్దరపెట్టి గోవిందు అంగట్ల మానాయన ఇప్పిచ్చ్య. బుక్కులసంచి మాత్రం మాసేనుకి యూరియా ఏస్తుండిరి కదా! ఆ యూరియా సంచిత బుక్కుల సంచిని మా ఊరి ఫ్యామస్సు టైలర్ లచ్చుమన్న కుట్టిఇస్తుంద్య. దానికి పైన కప్పుపెట్టి గుండీపెట్టినా, కింద రెండు ఇంచుల పట్టీపెట్టినా, బోయ దుబ్బమ్మ కుట్టనీక్య ఇచ్చిన కొత్త రైకబట్టలో కొంచెం దొంగులుకొని గోటుపెట్టీ ఎంత డెకరేషను సేసినా దాన్ని క్లాసుల యూరియా సంచే అంటా ఉండిరి. అయితే నా మాదిరి పోస్టాఫీస్ నిక్కర్ల బ్యాచ్కుడా యూరియా సంచులు ఉండేగాబట్టీ, మామిసిను లచ్చుమన్న పనితనం వల్ల నా సంచి కొంచం గౌరవం దక్కుతా వుంద్య.

బడిల సేరిన్నాడు పొద్దున పార్థన అయిపోయినంక క్లాసులోకి బయంబయంగా ఫోతిని. కురవ మల్లెసోల్ల కుక్కమాదిరి కిమ్మన ఎనక్కిఫోయి కూసుంటిని. అందరూ కొత్తోల్లే. ఒక్కనాకొడుకూ తెల్దు.

"సారోచ్చ, సారోచ్చ" అని అందరూ లేసి నిలబడిరి.

నానూ లేస్తి. జుబ్బా తొడుక్కొని పంచ కట్టుకొన్న సారువచ్చి మమ్మల్ని "కూసోండి" అన్య. అందరూ కూసుంటిమి.

పక్కనున్నోన్ని అడిగితి "ఆసారు ఎవురురా?" అని.

"బసప్ప సార్ అని ఇంగ్లీసుకు వొస్తాదుల్యా" అని సెప్ప్య.

సారు హాజరు ఏస్య. కడాకి ఉన్న నాపేరు సదివి "కొత్తగా సేరేవ్యనాలే" అని అడిగ్య.

"అవుసార్"అంటి.

"యా వూరు" అని అడిగ్య.

"గువ్వలదొడ్డి" అనిసెప్పితి.

"స్వామి కొడుకువా?" అని అడిగ్య.

"అవును" అంటి.

"కూసో" అన్య.

అందరి తుక్కు తిరిగి "ఏంరా! నిన్నటి వరకి అల్ఫాబెట్నేర్సు కొంటిమి. ఒక్కొక్కరు లేసి అచ్చరము పదము సెప్పండి" అన్య.

ముందున్నోడు ఒగదులేసి 'ఏ' ఫర్ 'ఆపిల్' అని సెప్ప్య. నెస్ట్ అని అంటుంటే ఒక్కొక్కరూ సెప్పబట్టిరి. నాకి సెమట్లుపట్ట్య. ఏంటికప్పా అంటే నాకి ఇంగిలీసు రాదుగదా. మావూర్ల తురకసారు మాకి ఇంగిలీసు సెప్పల్యా. ఎట్లరా దేవుడా అని అనుకొంటా ఉంటే నాపక్కనోడు 'ఓ'ఫర్ 'ఆరెంజ్' అన్య. సార్ 'నెస్ట్' అంటే నాను లేసి గమ్మున నిలబడితి.

"సేప్పులే" అన్య సారు.

కండ్లల్ల నీళ్ళుపెట్టుకొని "నాకి రావు సార్" అంటి.

"రాకఫోతే ఏడుస్తారాలే? నేర్సుకునల్ల" అని "నెస్ట్" అన్య. మద్దిలేటిగాడు ఎమ్బట్నే లేసి 'పి' ఫర్ 'పాట్' అన్య. సారు వానికి ముక్కుచెంపలు ఎయ్యిలే అన్య. మద్దిలేటిగాడు రెండేట్లు వాంచ్య. నాకి కండ్లల్ల నీళ్ళు తిరిగ్య.

"ఏడుసొద్దులే! మీ నాయన మా ఇంటి పూజారి. రేపు ఒక బుక్కు ఇస్తా నేరుసుకుందువు" అన్య.

ఫస్ట్పీరియడ్ అయిపాయ. పక్కనున్న మద్దిలేటిగాడు "ఈసారు ముక్కు సెంపలు ఏపిచ్చినందుకే ఏడిస్తే తాతారావుసార్త ఎట్లలే?" అన్య.

"ఎవుర్లే తాతారావుసార్ అంటే?" అని భయంగా అడిగితి.

"ఆసారు సేతికి దొరికినావు అంటే చింతపండు శారునీళ్లే" అన్య.

"ఏంలే! అంతేటు కొడతాడా?" అంటి.

"సూద్దువుల్యా వొయ్" అన్య.

"ఒంటికి ఇడిసినప్పుపు సూపిచ్చు" అంటి.

"ఈ ఫొద్దు సెలువుపెట్టేద్య, సోమారం వొస్తాడు సూపిస్తాల్యా" అన్య.

"ఏమి సెప్పెకి వొస్తాడు" అంటి.

"మనకిరాడు, ఎనిమిదో తరగతి నుంచివొస్తాడు" అన్య.

బతికినానురా భగవంతుడా అనుకొంటి. రాత్రి అంతా నిద్దర రాల్యా. వొచ్చివొచ్చి సిమ్మంనోట్ల బడినాను కదప్పా అనుకొంటి.

సోమారం పార్థనలో తాతారావు సారు యాడుండాడు అని సూస్తుంటే మద్దిలేటిగాడు కనిపెట్టి "ఆడసూడులే వస్తుండాడు" అన్య.

అవతల పక్క సూస్తి. అచ్చుము రజనీకాంతు మాదిరి ఇస్టైలుగా నడుసుకొంటా వస్తుండాడు. గలాటా సేస్తున్న పిల్లోల్లు అందరూ గమ్మునైరి. నాకి గొగ్గిరికాయలు పొడిస్య. నల్ల కండ్ల అద్దాలు, బెల్బాటం ప్యాంట్, బాబి కాలర్ అంగీ! సూస్తుంటేనే "టైగర్" సిన్మాల రజనీకాంత్ ఎంట్రీ మాదిరి అనిపిచ్చ్య. నా జీవితాన్ని ఈసారే మలుపు తిప్పేది అని అప్పుడు అనుకోనే అనుకొల్యా. బసప్పసారు 'రాయల ఆంగ్లబోధిని' అనే బుక్కు ఇచ్చి నేర్చుకోలే అన్య. మహాప్రసాదం అని తీసుకొని ఆ బుక్కుని శ్రద్ధగా సదివేకి స్టార్టు చేస్తి. అట్లా నా ఇంగిలీసు విద్దే ప్రారంభం ఆయ. అది యాటికి ఫోయప్పా అంటే హైదరాబాదుల నాను ఇంగిలీసు గ్రామరు క్లాసులు సెప్పేకాటికి ఫోయ. నాను హైదరాబాదుల ఇంగిలీసు క్లాసు సెపుతాఉంటే నుగ్గ నగవు వొస్తుంద్య. యెమప్పా ఈయప్పోళ్ళకి గువ్వల్దొడ్డోడు ఇంగిలీసు సెప్పల్లా? అని. క్లాసు సెప్పె ప్రతి నిమిషమూ నాకి సారే గుర్తుకు వస్తుంద్య.

రెండేండ్లు గడిసిపాయ. ఎనిమిదో తరగతికి వొస్తి. నా తిప్పలు

ప్రారంభం ఆయసూడి. గోనెగండ్లల టూరింగ్టాకీసు ఉండాది. మూడు దినాలకి ఒక సినిమా మారతాది. ఈ మూడు దినాలల్ల ఆసిన్మా సూడాల్సిందే. అయితే పెద్దసిక్కు వొచ్చిపద్య. ఏమప్పా అంటే దినుమూ సిన్మాకాడ మా తాతారావు సారు మారువేసంల (లుంగీ కట్టుకొని నెత్తికి తువాలు సుట్టుకొని) ఎవురెవురు సిన్మాకి పోతారు అని కాపు కాస్తా ఉండ్య. దొరికినాం అంటే అంతే కథ. వీపులు ఇమానం మోతలే! అఫ్కోర్స్ మనం ఎప్పుడూ సారుకి సిక్కల్యా అనుకో. మనకీ మారువేసాలు ఉంటాయి గదా. మా సావుకి ఇంకా ఏమంటే రాత్రిపూట తాతారావు సారు మాము సదువుకొంటుండామా? ద్యావర దున్నఫోతుల మాదిరి ఊరిమీద పడి తిరుగుతుండామా అని సూసేకివొస్తుండ్య. రాతిరి బలవంతపు పెళ్ళి కొడుకుల మాదిరి బుక్కులు తీసుకొని సదవనీక్య కూసుంటా ఉంటిమి. ఇంట్లోవాళ్ళు మా పిల్లలు ఎంత సంసారులు అయ్యేర్య గదారా అనుకొంటా ఉంఁడ్రి. మా అక్కను అట్లా వుంటాండే మరి .మాకి కిరికెట్టు, సాఫ్ట్ బాలు, జావలిన్ త్రో, పోల్వాల్ట్ అనే తెలని ఆటలను పరిచయం సేస్య. మా సారు ఆలురవుండరు సూడప్పా!

నేను తొమ్మిదో తరగతి సదివేటప్పుడు ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ మొదులు పెట్టిండ్య. మనమేమో ఎన్టీఆర్ ఫ్యాన్సు. మురళి గాడు, రంగసామి గాడు గూడ్క ఎన్టీఆర్ ఫ్యాన్సే. ముగ్గురూ గోపురం బొమ్మ నీలిమందు డబ్బ కొనుక్కొని ఈత పుల్లని బ్రస్సుగా సేసుకొని గోడల మీద 'తెలుగుదేశం పిలుస్తోంది రా! కదలిరా!' అని రాసేకి రాత్రి తొమ్మిది గంటలప్పుడు ఎలబారితిమి. నాను గోడమీద రాస్తుంటే ఆ నాయండ్లిద్దరు ఎనకల నిలబడి డైరక్సన్ ఇస్తుంఁడ్రి. యెప్పుడొచ్చేడనో ఏమో సూడప్ప! ఎనకాలవొచ్చి నిలబడేద్య తాతారావు సారు. మురళి గాడు, రంగసామి గాడు పరార్ అయ్యేర్య. నాను గోడతుక్కు సూసుకుంటా, నీలిమందుతో రాసుకుంటా "ఏమలే ఏమనకుండారు" అని ఎనక తిరిగిసూస్తే ఎంగేముండాది? తాతారావు సారు! గుండెజారిపోయ! డబ్బా పడేయడము ఉరకడమే ఉరకడము. రాత్రినిద్రనే పట్టల్య!

మరుసటి దినం పార్థన అయినంక పరంగికంప సెట్టు ఆకుని నెత్తిలోన ఎంటికల్ల పెట్టుకొని క్లాసుకి ఫోతి. అట్ల సేస్తే సారోల్లు కొట్టరని మునెప్పగాడు సెప్పిండ్య. ఆ తంత్ర విద్దె ఏమీ పనిచేయాల్యా. మూడో పిరియడ్కి తాతారావుసారు వచ్చె.

రావడం రావడమే నాతుక్కు సూపిస్తా ' ఆంధ్రప్రదేశ్లో మైకా ఎక్కడెక్కడ దొరుకుతుంది" అని అడిగ్య.

నాను లేసినిలబడి వణుకుకుంటా "సార్! ఇంగోసారి అట్లసేయను సార్" అంటి.

"రేయ్! నీవు ఏమిచేస్తే నాకెందుకు? ముందు ప్రశ్నకు జవాబివ్వు" అన్య.

మనం ముందురోజు సెప్పిన పాఠము విని, సదివి ఉంటే గదా సెప్పేకి? ఇంగ సూస్కోఈత బర్రెలు రెండు ఇరిగ్య. వాతలు తేల్య. ఫ్లస్సులు, మైనస్సులు, ఇంట్లా మాదిరిగా లెక్కల గుర్తులు అన్నీ ఈపు మీద పద్య. సారు కొట్టిండాడు అని ఇంట్ల సెపితే ఏంటికి అని అడిగి ఇంకా తొంతారు. కాబట్టి గమ్మున ఉంటిని. ఆ రాత్రి ఆలోచన సేస్తి. ఎంటికప్పా ఈ సారు రాత్రిళ్ళు ఇల్లిల్లు తిరుగుతాడు? మాపుసారి టూరింగ్ టాకీసుకాడ కాపుకాస్తాడు? మనం సదివితే ఈసారుకి ఎమోస్తాది? అందరికీ పట్టనిది ఈ సారుకే ఏంటికి పట్టిండాది? అని ఆలోచన సేస్తి. ఎస్. మనం బాగు పడల్లనే ఇదంతా సేస్తుండాడు. ఇప్పటికీ నేను మారలేదు అంటే మనిషినే కాదని అనుకొంటి. రాత్రంతా నొప్పులత ఏడిస్తికాని, సారు మీద కోపంరాల్యా. ఇంగ అదేసూడి నాను ఆసారుత దెబ్బలు తినడం లాస్ట్. అట్లా తప్పిపోవాల్సిన ఈ గొర్రెపిల్లని దారి తప్పకుండా సూసిన దేవుడు. మా క్లాసుల ఉన్నంతమంది అల్లరు నాయండ్లు ఈ బూప్రపంచంల ఎవురూ ఉండరు సూడప్ప! అట్లాంటి నాయండ్లని అదుపులపెట్టి సదివిస్తుండ్య. ఈ సారును సూసి మిగతా సారొల్లు గూడా బాగా పనిసేస్తా ఉంఁడ్రి. ఒకసారి మురళిగాడు సారు కొట్టినాడని వాళ్ళనాయనని పిలుసకవచ్చి సారుని తిట్టిచ్య. వాళ్ళ నాయన తిడతా ఉంటె ఒక్క మాట తిరిగి అనల్యా. ఆఫొద్దు సారు బాధపడి మాతమాట్లాడల్యా! మాంరెండు దినాలుగూడా ఉండల్యాక పోతిమి. అందరూ సారు దగ్గరికి పోయి ఏడుసుకుంటా సార్తప్పయేద్య అని వేడుకొంటిమి. మురళిగాడు సారు కాళ్ళు పట్టుకునేకి పోయ! సారు మనసు కరిగి మాళ్ళా మాతమాట్లాడ్య. ఇంట్ల కరెంటు వసతి లేనోళ్ళు, సుట్టుపక్కల నుంచి వొచ్చే పిల్లోల్లు పదో తరగతిల బడిలోనే సదువుకొని ఆడనే పండుకుంటా వుంటిమి. రాత్రి పది గంటల వరకి సదివిచ్చి మళ్ళా పొద్దున ఐదు గంటలకే వచ్చి లేపి సదివిస్తా వుండ్య.

తరువాత మామ ఇనింది ఏమంటే సారు లద్దగిరి అనే ఊరికి ట్రాన్సుర్ అయితే ఒక పదిమంది గోనేగండ్ల పిల్లలు సారుతో కలిసి లద్దగిరి స్కూల్లో సేరి సారు ఇంట్లోనే తిని సదువుకుంటా ఉండిరంట. అందరకీ సారే వొండి పెడతా ఉండేనంట . ఈకాలంలో యాసారు పిల్లోల్లని ఇంట్ల పెట్టుకొని సదివిస్తారు సెప్పండి? ఈశ్వరరెడ్డి గాని ఈపు సాపుసేసినా, పెద్దమాబు అన్న ఫీసుకట్టినా, సుంకన్న గాడికి అన్నీ తానైనా, ఒగరా ఇద్దరా అందరికీ ప్రేమనీ, దుడ్లనీ, సదువునీ , జీవితాన్ని పంచిన గొప్ప మనిషి.

"సార్ ! అరైవల్ కాడికొచ్చిండాము. దిగండి" అని డ్రైవరు అనడంతో ఈ లోకంలోకి వొస్తి.

నన్నిదింపి ఆయప్ప పార్కింగ్ కాటికి పోయ. నాను దిగి టికెట్టు కొనుక్కొని డోమెస్టిక్ అరైవల్ కాటికి ఫోతి. అందరూ వాళ్ళ వాళ్ళ కోసం ఎదురు సూస్తుండారు. నాను తాతారావు సారు కోసం ఆత్రంగా కూలికి పోయి వచ్చే తల్లికోసం పిలగాడు మాపుసారి ఎట్లా ఎదురు సూస్తాఉంటాడో అట్లా ఎదురుసూస్తా ఉండాను. ఎదురుగా అదే రజనీకాంత్ మాదిరి సార్ ఎంట్రీ ఇచ్చేప్ప. సూస్తుంటేనే ఆనడకని గుర్తు పడితి. పులి నడకనే. కబాలిరా! అనినట్ల అనిపిచ్చ్య. ఒక్కసారిగా గబాగబా పొయి సారు కాళ్లమీద పడితి.

సంతోషంత కండ్లల్ల నీళ్ళు ధారలు కట్ట్య. నా కన్నీళ్లు సారు పాదాలని తడిప్య.

సారు నా భుజాలు పట్టుకొని పైకి లేపుతా "బాబూ! బాగున్నావా" అన్య.

అదే వాయిస్. పదోతరగతిల సెప్పిన "ద లాస్ట్ సిటీ" పాఠం గుర్తుకు వచ్చ్య. ఆ పాఠం అగ్నిపర్వతం పేలిపోవడం వల్ల వొచ్చే లావాలో మునిగిపోయిన ఒక నగరం కథ. పాఠం సెపుతా ఉంటే లావా కిటికీలనుంచి క్లాసులోకి వస్తావుందేమో అనేటట్ల ఉంటుండ్య. ముప్పైఐదు ఏండ్లు అయినా అదే గొంతు.

"బాగుండా సార్" అంటి. సార్ సేతుల బ్యాగు తీసుకోడానికి పోతే వద్దులే అన్య.

"ఇయ్యి సార్ ! అయిదేండ్లు మాబరువును మోసేర్య. ఇదింత బరువు నన్ను మోయనివ్వు" అంటా బ్యాగు తీసుకొని బయటికి నడిస్తిమి. డ్రైవరు కారు తెచ్చ్య. సారు, నాను కార్లకుసోని గోనెనేగండ్లకి రస్తా ఇడిస్తిమి.

గోనేగండ్లకు చేరుకొనేలోపు వందలమంది పూర్వ విద్యార్థులు కండ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తా ఉండారు. వొగరు కాళు ్ళ మొక్కితే, వొగడు శాలువా కప్పితే, వొగడు పూలు సల్లితే, వొగడు పూలదండ వేస్తె! సేప్పనీక్య లేదుల్యా! ఆ వైభోగం మెరవణి రథం మీద సారును కూసోబెట్టుకొని బాణాలు కాల్సుకుంటా, పూలు సల్లుకుంటా, బ్యాండు మేళం వాన్చుకుంటా ఉరేగింపుగా సారుని మాము సదువుకొన్న ఇస్కూలికి తీసకపోతిమి. ప్రతివొక్కరూ సారు మాజీవితాల్ల వెలుగు నింపిన దేవుడు అన్నోల్లె. ఒక్కొక్కరూ తాతారావు సారు వాళ్ళని ఏవిధంగా తీర్చిదిద్దేడ్యనో సెప్పిరి. ఫీజులు కట్టేడ్య అనీ, అన్నం వండి పెట్టేడ్య అనీ, ఆటలు నేర్పిచ్చేడ్య అనీ! సెపుతుంటే సంతోషానికి లెక్కలేదుల్యా. ఇప్పుడీ జీవితం తాతారావు సారు పెట్టిన భిక్ష అనిరి.

కర్నూలుల పేరుమోసిన డాక్టరు ఆండ్రూస్ అన్న సభల ఇట్లా మాట్లాడె.. "మానాయన పాస్టరు. నాకి పదిల ఐదునూట ఇరవై అయిదు మార్కులు వొచ్చిండ్య. సారు నాగార్జునసాగర్‌ల ఉండే రెసిడెన్సియల్ కాలేజీకి అప్లై సేపిచ్చ్య. ఆడ బైపీసీల సీటోచ్చ్య. అయితే మానాయన అంతదూరం పంపేకి నాత దుడ్లు లేవని పంపల్యా. ఈ విషయం తెలుసుకొన్న సారు సైకిలు వేసుకొని మావూరికి వొచ్చి నాకి జీతం వోచ్చిండాది. నాను పిలుసుకపోయి సేర్పిస్తాను. పిలగాడు ఖచ్చితంగా డాక్టర్ అవుతాడు. నామాట ఇనండి" అని మా నాయన్ని ఒప్పిచ్చి తన దుడ్లత పిలసక పోయ. నాగార్జున సాగర్ల బస్సు స్టాపు దగ్గర నుంచి కాలేజీ ఓమూడు మైళ్ళు దూరం ఉంటాది. నా ట్రంకుపెట్టె నాను మోయలేనని సారే భుజాన పెట్టుకొని మూడు కిలోమీటర్లు మోసుకుంటా పోయి నన్ని సేరిపిచ్చిందేకాక ఖర్చులకి దుడ్లు కూడా ఇచ్చి వచ్చ్య. ఈపొద్దు నాను డాక్టరు కావడానికి సారే కారణం" అని సెపుతా కళ్ళనీళ్ళతో సారుకు పాదాభివందనం సేస్య.

అమెరికా నుంచి మా క్లాస్మేట్ కొడాలి రవీంద్రబాబు గాడు స్కైపుల మాట్లాడ్య. వాడు "నేను ఈరోజు అమెరికాలో ఫార్మసీలో శాస్త్రవేత్తగా పనిచేస్తున్నాను అంటే నాకు హైస్కూలు దశలో దిశా నిర్దేశం చేసిన తాతారావు సారే కారణం. సారు కేవలం ఒక టీచర్ మాత్రమే కాదు. విద్యార్థులకు అన్నీ తానైనవాడు. మారు మూల గ్రామాల్లో ఉన్న మాలాంటి వారి ప్రతిభను మొగ్గ దశలోనే గుర్తించి ప్రోత్సహించి మా సామర్థ్యాలకు తగ్గ మార్గాలను చూపించినవారు. గొప్ప దార్శనీకుడు. మనకు తన కులం తెలువనీయలేదు, మతం తెలువనీయలేదు. ఒక ఉపాధ్యాయుడు ఎలా ఉండాలో ఆచరించి చూపారు. ఈ తరం ఉపాధ్యాయులకు ఆదర్శనీయుడు" అని చెబుతా వుంటే సారు కళ్ళలో ఆనంద భాష్పాలు రాల్య. సారు కూడా తనజీవితం సార్థకం అయ్యిండాది మీ అభిమానం సూసి అని ఉపన్యాసం యిచ్చ్య. సారుకి ఘనంగా అందరమూ సన్మానం సేస్తిమి. బంగారు గొలుసులు ఇచ్చినోల్లు, ఉంగరాలు ఇచ్చినోల్లు, సేతి కడియం ఇచ్చినోల్లు! ఎవురి అభిమానం వాళ్ళది ల్యా! నిజంగా నాకి అనిపిచ్చ్య! మనిసి జీవించడం అంటే ఇది గదా అనుకొంటి.

అందరమూ ఆయన ముందు పిల్లలైతిమి. ముప్పై ఐదుఏండ్ల కిందనాటి జ్ఞాపకాలు గుర్తుసేసుకొంటిమి. మాము కూసున్న క్లాసుకి సారుని తీసకపోతిమి. అందరూ బెంచిల్ల కూసుంటిమి. సారు మాము అందరమూ గతంలోకి పోతిమి. సారు పాఠం సెప్ప్య. మురలిగాడు "సార్! తొమ్మిదో తరగతిల డెస్కు ఇరగ్గొట్టింది ఎవుడు?" అని అడిగితిరి కదా! "రంగసామిగాడు సూడు సార్" అని అందరినీ నవ్విచ్చ్య. జొల్లుఉస్మాన్ గాడు పార్థన జరిగేటప్పుడు ఆవు పిల్లోల్లలోకి బెదిరి వొస్తే దాని కొమ్ములు పట్టుకొని సారు ఎట్లా ఫైటింగ్ సేసింది సేప్ప్య. ఎనకనుంచి మా బువలిగాడు సారు రుస్తుం లే అన్య. అందురూ ఇంగోసారి నగితిమి.

"అసలు మీరు అప్పట్లో మీ జిల్లా నుండి ఈటికి ఏంటికి వొస్తిరి సార్" అని ఒక విలేఖరి అడిగ్య.

"బాబూ! మా జిల్లాలో టీచర్ పోస్టులు ఖాళీ లేనందుకు నాన్ లోకల్ కింద ఇక్కడ అప్లై చేసిఉంటి. ఇక్కడ నన్ను స్కూలు అసిస్టంట్ సోషల్‌గా నియమించిరి. నేను కర్నూలు జిల్లా పరిషత్ లో ఆర్డర్ తీసుకొని చిప్పగిరి దగ్గర ఉండే ఎదురూరుకు బస్సులో వెళతాఉంటె బీడు బూములు చూసి దుఃఖం ఆగలేదు. కనుచూపు మేరా ఒక్క పచ్చని మొక్క లేదు. నీరు లేదు. మాది కోనసీమ కదా! కంటిచూపు మేరా పచ్చదనమే! రోడ్డుకు రెండువైపులా కాలువలే! ఇక్కడ అందుకు భిన్నంగా ఉన్న పరిస్థితులను చూసి గుండె బరువెక్కింది. నేను ఈ ప్రాంతానికి విద్య ఇవ్వడం తప్ప ఏమి చేయగలను ? అనుకొన్నా. చదువు మాత్రమె ఈ ప్రాంతపు భవిష్యత్తును మార్చగలదు అని నా పరిమితుల్లో ఆలోచన చేశా. నిజంగా ఈప్రాంతపు పిల్లలు, వారి తల్లి దండ్రులు నన్ను గుండెల్లో పెట్టుకొని చూసుకొన్నారు. ముఖ్యంగా నేను ఇక్కడ పనిచేసిన దినాలలో జొన్నరొట్టె తినడం అలవాటు కావడం వలననే ఇప్పటికీ ఆరోగ్యంగా ఉన్నాను. పండుగ రోజుల్లో నేను ఒక్కడినే ఉండేవాడిని

కదా. ఎంతమంది పిల్లలు క్యారియర్ తీసుకువోచ్చేవారో! నా తల్లిదండ్రులు ఇక్కడ వుండేవారు కాదు గదా? ఆలోటును ఇక్కడి పిల్లల తల్లిదండ్రులు తీర్చారు" అంటూ గుర్తు చేసుకొన్నారు. మరుసటిదినం సంసాబాద్‌కు ఎలాబారితిమి. నాకి మనసు నిండా దుఃఖం ఉంది. సారు వాళ్ళవూరికి ఫోతుండాడు కదా అని, మరెప్పుడు సూస్తామో అని. ఈ రెండు రోజులు సారుతోనే ఉండాను గదా! ఇప్పటికీ సారు నుంచి నేర్చుకోనేది శానా ఉండాది అనిపిచ్చ్య. సారు మనసు తెల్లకాగితం లెక్క. జేబులో నుంచి పిల్లోల్లు బహుమతిగా ఇచ్చిన బంగారు గొలుసులూ, ఉంగరాలు తీసి నా చేతిల పెడతా ఇవి నీ కూతురికి ఇవ్వు అన్య. నాకి కన్నీళ్లు ఆగల్యా.

ఈఫోద్దుటికీ స్వార్థం లేకుండా ఎట్లా ఉండాదప్ప ఈ దేవుడు అనుకొంటా "సార్! మీ మనవరాలికి ఇవ్వండి. నా శిష్యులు ఇచ్చినారని మీ గుర్తుగా" అంటూ బలవంతంగా జేబులో పెడితి.

"మీ అందరనూ కలవకపోయి ఉంటె నా శేషజీవితం వేరే జ్ఞాపకాలతో గడిచేది. మీరు ఇచ్చిన ఈ అభిమానం అనే జ్ఞాపకాలు నా ఆయుస్సును పెంచాయి. నా వృత్తిధర్మం నేను నెరవేర్చినాను. నేను మీకు ఏమి చేసినానని నామీద ఇంత ప్రేమ కురిపించారు. మీ ఋణం ఎలా తీర్చుకొనేది?" అంటూ కన్నీరు పెట్టుకున్య.

చిన్న పిల్లోడి మాదిరిగా ఏడుస్తూ వుంటే నా కండ్లల్ల నీళ్ళు నిండి మసక బార్య.

"సార్ అంతమాట అనకండి. ఇక్కడ పనిచేసిన ఆరు సంవత్సరాల కాలంలో మీ హృదయాన్ని మాకి అంకితం సేసిండారు. రోజులోని ఇరవై నాలుగు గంటలూ మాకోసమే కర్చుపెట్టేర్య. ఈదినం మాము ఈ ఐదువేళ్ళతో అన్నం తింటుండాము అంటే మీవల్లే.." అనుకొంటా లోపలికి తీసుకవెళితి. సారు డిపార్చర్ కాడికి పోయ. నాను బయటకి వొచ్చి సారు పోయే ఇమానం కోసం ఆకాశం తుక్కు సూసుకుంటా నిలబడితి. నీళ్ళు నిండిన కండ్లకి ఆ యిమానం మసక మసకగా కనిపిచ్చ్య. ■

## మట్టంటే... ?

**వా**డికి మట్టంటే?
దుమ్ముగా... బురదగా... రాళ్ళు... రప్పగా
కళ్ళకి ఒంటికి కాళ్ళకు నచ్చదు
ఏసి గదిలో బతుకు భద్రం... పెళుసు.

వీడికి మట్టింటే ?
సాగు... సాలు... గింజ... మొలకగా
వేరు, కొమ్మ, పూలు, పండ్లు, పంటతో
పచ్చనిలోకంలో బతుకు అందం.. సంతోషం!

**- చందలూరి**
**97044 37247**

## నిర్వాసితులు

**మ**నుషుల్లో మనుషులు వేరు
పాలకులకు పాలిత నిర్వాసితులు
ద్వితీయ శ్రేణి మానవులు!
కాళ్ళుంటాయి, నమ్రతగా నిల్చోటానికి
కళ్ళుంటాయి, కన్నీరు కార్చటానికి
చెవులుంటాయి, వాగ్దానాలు వింటానికి
నోళ్ళుంటాయి, అర్థించటానికి–
కరకట్టలు కట్టకనే
కాలువలు తవ్వినట్లు
నిర్వాసితుల పునరావాసం
పరిహారం యివ్వకనే
ప్రాజెక్టులు పూర్తి!
పగ్గాల్లేని నదులు
ప్రాజెక్టులపై బడి
పొంగి ఉప్పొంగి
నివాసాల్ని ముంచుతాయి
కట్టుబట్టల్తోను కావడి బరువుల్తోను
ప్రాణరక్షణకై నిర్వాసితుల పరుగులు!
మునిగిన తాటిచెట్టు మోములు
ఊపిరాడక గిలగిల్లాడుతాయి
కూలిన చెట్ల గూళ్ళు
పడవల్లా తేలాడుతాయి
ఊరంతా వరదకు గ్రాసమై
నెమరేస్తుంది
ఉప్పెన సముద్రానికి ఆహారమయ్యాక
నిర్వాసితుల నివాసాలు
ఇసుక మేటలౌతాయి!
స్వాతంత్ర్య గణతంత్ర దినోత్సవాలు
కాలంలో పరిభ్రమించి దశాబ్దాలౌతాయి
నిర్వాసితుల కాళ్ళు ప్రదక్షిణ చేస్తుంటాయి
కళ్ళు వీక్షిస్తుంటాయి
చెవులు దిబ్బళ్ళు పడి
నోళ్ళు నినాదాలౌతాయి!
పునరావాసం పరిహారం
కృష్ణాష్టమి ఉట్టిగట్టి
అందుకోమంటూ
ప్రభుత్వం వేలాడదీస్తుంది!

**- అడిగోపుల వెంకటరత్నమ్**
**9848252946**



# భాషలు - నిర్మాణ పరిచయం

- డాక్టర్ డి.ఉదయ కుమారి
అసోసియేట్ ప్రొఫెసర్ - కం -డిప్యూటీ డైరెక్టర్
ప్రసారాంగ ద్రావిడ విశ్వవిద్యాలయం
కుప్పం - 517 426

**మా**నవుడు సంఘజీవి. మానవుల కార్యకలాపాలకు వారి సహకారాలలకు అన్నింటికి భాష అవసరం. భావ వ్యక్తీకరణకు సాధనం భాష. మానవుని సంపద భాష. మానవునికి మాత్రమే సొంతమైందీ భాష. మాట్లాడగలిగిన సామర్థ్యం మానవునికి మాత్రమే ఉంది. జంతుజాలం నుండి మానవుని వేరు చేస్తుంది. భాష, పుట్టుకతోనే మానవుడు మాట్లాడే శక్తిని తెచ్చు కుంటాడు. ఆదిమ కాలంలోని మానవుడు తన ఆవేశాలను, భావాలను తన చేష్టల ద్వారా. సంజ్ఞల ద్వారా నిరూపించేవాడు. వాగ్రూప సంకేతాలు భాషకు మొట్టమొదటి రూపాలుగా మనం చెప్పుకోవచ్చు. ఆ విధంగా మొదలు పెట్టిన భాష, ధ్వనుల రూపంలో, అర్థరూపంలో వెలువడి ఉండవచ్చు. అయితే పరిశీలిస్తే భాష స్వతస్సిద్ధంగానే తన ఉనికిని ఏర్పరచుకున్నదని చెప్పక తప్పదు.

ప్రపంచంలోని వివిధ జాతులవారు వివిధ భాషలను మాట్లాడుతున్నారు. ప్రస్తుతం ప్రపంచ వ్యవహారంలో ఉన్న భాషల సంఖ్య 5,000 వరకూ ఉన్నాయని చెప్పవచ్చు. అయితే ప్రపంచంలో మూడు లేక నాలుగు వేల భాషలున్నాయని అంచనా. ఈ భాషలను భాషా శాస్త్రజ్ఞులు కొన్ని కుటుంబాలుగా వర్గీకరించారు. ఈ వర్గీకరణ శాస్త్రీయంగా జరిగిందని చెప్పు కోవచ్చు. ఈ వర్గీకరణ మూడు రకాలుగా జరిగిందని పేర్కొన వచ్చు. వాటిని ఈ విధంగా చెప్పుకోవచ్చు. భౌగోళిక వర్గీకరణ, ఆకృతిమూల రూపక వర్గీకరణ దీనినే పదరూప వర్గీకరణ లేదా రూపాశ్రిత వర్గీకరణ, వంశానుక్రమ వర్గీకరణలు.

భౌగోళిక వర్గీకరణ తీసుకుటే మనకు ఖండాలు ఐదు. అమెరికా, ఆఫ్రికా, యూరప్, ఆసియా, ఆస్ట్రేలియా ఖండాలు ఉన్నాయి. ఏయే ఖండంలో మాట్లాడే భాషను, ఆ ఖండానికి సంబంధించిన భాషలుగా మనం చెప్పుకుంటున్నాం. మన భారతదేశంలోని భాషలను ఆసియా భాషలని అంటున్నాం. ఒక దేశాన్నిగానీ, ప్రాంతాన్ని బట్టిగానీ చేసే వర్గీకరణను ఒక భాషా వర్గానికి చెందిన భాషలుగా గుర్తిస్తున్నాం. దీనినే మనం 'భౌగోళిక వర్గీకరణ' అని పేర్కొంటున్నాం. ఉదాహరణకు భారతదేశంలోనే అనేక భాషలున్నాయి. భాషా కుటుంబాలు ఉన్నాయి. భారతదేశంలోనే మన హింద్వార్య భాషలు, ముండా భాషలు, ద్రావిడ భాషలు మొదలైన భాషలు కన్పిస్తున్నాయి. కానీ వీటికి పరస్పరం సంబంధం ఉండవచ్చు, లేకనూ పోవచ్చు.

అమెరికా దేశంలో కూడా అనేక భాషలున్నాయి. వాటన్నిటినీ అమెరికన్ భాషలంటున్నాం. పదాల్లో గానీ వాక్య నిర్మాణంలోగానీ ఒక భాషకు మరొక భాషకు సామ్యం ఉ ండవచ్చు లేకనూ పోవచ్చు. కానీ ఈ భాషలు ఒకే ప్రాంతానికి చెందిన భాషలుగా గుర్తిస్తున్నాం. ఒక ప్రాంత భాషలు ఒక వర్గంలోని భాషలుగా పేర్కొంటున్నాం. ఈ ప్రకారం తీసుకుంటే భారతదేశంలోనే నాలుగు భాషా కుటుంబాలు కన్పిస్తున్నాయి. ఇండో ఆర్యన్ భాషా కుటుంబం, ద్రావిడ భాషా కుటుంబం. ఆస్ట్రో ఏషియాటిక్ టిబెటో బర్మన్ భాషా కుటుంబాలు. కనుక ఈ భౌగోళిక వర్గీకరణకు శాస్త్రీయత లేదనే పేర్కొనవచ్చు. దగ్గరగా ఉన్నప్రాంతాల్లో జీవించే ప్రజలలోని భాషా పదాలు, వాక్యాలు ఇవన్నీ ఒక భాష నుండి మరొక భాషలోకి వెళ్ళవచ్చు. పరస్పర వినిమయం పదాల్లో జరగవచ్చు. అయినా దాన్ని శాస్త్రీయంగా ఫలానా భాషనుండి ఇది పుట్టిందని, ఆ భాషలన్నీ ఒకే భాషా కుటుంబానికి చెందాయని గానీ చెప్పలేం. కాబట్టి ఈ భాషలను శాస్త్రీయంగా నిరూపణ చెయ్యలేం కాబట్టి ఈ

వర్గీకరణకు స్పష్టత లేదు. శాస్త్రీయ దృష్టితో భాషలను పరిశీలించనంతవరకు ఈ పై వర్గీకరణనే తీసుకోవల్సిన అవసరం ఉంటుంది.

భాషల్లోని రూప నిర్మాణాన్ని బట్టి భాషలను వర్గీకరించారు భాషా శాస్త్రజ్ఞులు. రూప నిర్మాణంలోని దగ్గరితనాన్ని బట్టి భాషలను వర్గీకరించడం జరిగింది. ఈ వర్గీకరణను మూల రూపక వర్గీకరణ, పదరూప వర్గీకరణ అని రెండు విధాలుగా చెప్పుకోవచ్చు. ఫ్రాంజ్ బాప్ మొదలైనవారు పద నిర్మాణాన్ని బట్టి, వాక్య నిర్మాణాన్ని బట్టి ప్రపంచ భాషలను నాలుగు వర్గాలుగా విభజించడం జరిగింది. అది విశ్లేషణాత్మక, సంయోగాత్మక, ప్రత్యయాత్మక, సంశ్లేషాత్మక భాషలు. మొట్టమొదటి విభాగమైన విశ్లేషాత్మక భాషల్లో లింగ, వచన, భేదాల్ని తెలియజేసే ప్రత్యయాలు ఉండవు. వ్యాకరణానికి సంబంధించినటువంటి మార్పులేవీ సంభవించవు. పదాల స్థానాన్ని బట్టి అర్థం తెలుస్తుంది. పై పదాల క్రమానికి ఎక్కువ ప్రాధాన్యముంటుంది. వాక్యంలో మొదట స్థానం దేనికైతే ఇవ్వబడుతుందో అది నామవాచకమైనా విశేషణమైనా, క్రియ అయినా ఆ విషయాన్ని సులభంగా గుర్తించవచ్చు. ఈ భాషల్లోని పదాలన్నీ ఒకే అచ్చు కలిగి ఉంటాయి. కర్త, కర్మ, క్రియ అనే నిర్మాణంలో వాక్యాలుంటాయి. చైనా, టిబెట్, బర్మా, మలయా, ఆఫ్రికా ఖండ భాషలన్నీ ఈ వర్గానికి చెందిన భాషలే. ఒకే పదస్థానాన్ని బట్టి వేరే స్వరంతో ఉచ్చరించడమన్నమాట. చైనీయుల భాష దీనికి చక్కటి ఉదాహరణగా చెప్పుకోవచ్చు. wo, ta, pa, la అనేవి, wo – నేను; ta- అతడు; pa - భయం; la - వ్యతిరేక పదం. ఇది ఒక వాక్యం. దీనర్థం 'నేను అతనికి భయపడను' ఇది వాక్య నిర్మాణం. వీరి భాషలో వాక్యాలకు ప్రత్యయాలు ఉండవు. టిబెట్, బర్మన్ భాషలు ఈ వర్గానికి చెందిన భాషలే.

లేన్ తా – మనుష్యుడు పెద్దవాడు

రితన్గో – నీవు నన్ను కొట్టుతున్నావు.

ఇందులో పదాల మార్పువల్ల వాక్యానికర్థం మారిపోవటాన్ని కూడా గమనించవచ్చు. ఈ భాషల్లోని ప్రత్యేకత ఇదే అని చెప్పుకోవచ్చు. మిగతా భాషల్లో ఇటువంటి అర్థభేదం కనిపించినా ప్రతిచోటా కన్పిస్తుందని చెప్పలేం. ఒక్కో భాషలో ఉండవచ్చు. మరో భాషలో లేకుండానూ పోవచ్చు.

రెండో వర్గానికి చెందిన భాషలు సంయోగాత్మక భాషలు లేదా సంయుక్త పదరూప భాషలు. అర్థవంతంగా ఉంటూ నిర్దిష్టమైన పదాంశాలు ఒకదానితో మరొకటి చేరడం వల్ల ఏర్పడే భాషలను సంయుక్త పదరూప భాషలని అనవచ్చు. ముండా భాషలు, ద్రావిడ భాషలు. ఇవి ఈ జాతికి చెందిన భాషలని చెప్పవచ్చు. ఈ భాషల్లో ధాతువులు, ప్రత్యయాలు వేరుగా ఉంటాయి. ఇదే ఈ భాషల ప్రత్యేకత. ఈ భాషల్లో పదక్రమానికి ప్రాధాన్యత ఉంటుంది. ఇది, పరానుబంధం, పూర్వానుబంధం, అంతరనుబంధ సంయోత్మాక భాషలు. పదానుబంధ సంయోగాత్మక భాషల్లో ప్రత్యయాలు ధాతువుకు పరంగా చేరడం ఉంటుంది. ఉదాహరణగా తర్ ఉ తరు, తరు గు తరుగు, తరుగు చు తరుగుచు, తరుగు చు ఉన్న తరుగుచున్న తరుగు చున్న అది – తరుగుచున్నది. ఇదే టర్కిష్ భాషలో oda (ఒద) = గది, oda ఒద + lar (లర్) = ఒదలర్ – గదులు ఈ విధంగా ఉంటుంది.

ద్రావిడ భాషలు, యూరల్ – అట్లాయిక్, జపనీస్ మొదలైన భాషలు సంయోగాత్మక భాషలని పేర్కొనవచ్చు. ఇక పూర్వానుబంధ సంయోగాత్మక భాషలు. ఈ భాషల్లో ప్రత్యయాలు ధాతువుకు పూర్వం చేరుతాయి. ఈ నిర్మాణం 'బంటూ' కుటుంబానికి చెందిన భాషల్లో మనం చూడవచ్చు. abanta - many man; umunta - one man; binta - things; ki-na - a thing; bantu - nateon.

అంతరానుబంధ సంయోగాత్మక భాషలు, ఈ భాషల్లో ధాతువులకు, మధ్య ప్రత్యయాలు చేరుతాయి. సంతాలీ, అరబ్బీ భాషల్లో ఈ విధమైన నిర్మాణం ఉంది. అరబ్బీ భాషలో క్త్‌బ్ – కితాబ్ ఈ ధాతువునకు మధ్యలో ఈ, ఆ ప్రత్యయాలు చేరి 'కితాబ్ అయింది. సంతాలీ భాషలో 'దల్' – దపల్‌గా మారింది. ఇందులో 'ప' అనే ప్రత్యయం చేరి 'దపల్' అయింది. ఇక ప్రత్యయాత్మక భాషల్ని గురించి చర్చించుకోవాలి. ఈ భాషల్లో ధాతువు, ప్రత్యయం కలిసివుంటాయి. ప్రత్యయాల్ని, ధాతువుల్ని వేరు చేసి చూడటం కష్టం. ధాతువులకు చేరే ప్రత్యయాల్ని, ధాతువుల్ని వేరు చేసి చూడటం కష్టం. ధాతువులకు చేరే ప్రత్యయా లకు స్వతంత్ర ప్రయోగానికి అర్హంగా ఉండవు. కానీ అటువంటి ప్రత్యయాలు ధాతువులకు చేరడం వల్ల పదాలేర్పడతాయి. లింగ, వచన భేదాల్ని తెలిపే ప్రత్యయాలు విడివిడిగా ఉంటాయి. ప్రత్యయాల ప్రాధాన్యత ఇందులో ఎక్కువగా ఉంటుంది. పదక్రమానికి ఈ భాషల్లో ప్రాధాన్యత ఉండదు. ఈ భాషలకుదాహరణగా ఇండోయూరోపియన్, సెమిటో, హెమిటిక్ భాషలను పేర్కొనవచ్చు. పదాల్లోని అచ్చులు మారడం వల్ల అర్థభేదం సిద్ధించడమనేది సెమిటో, హెమటిక్ భాషల్లో కన్పిస్తుంది. వీటిలోని ధాతువు మూడు హల్లులతో కూడ ఉంటుంది.

ఈ హల్లులు మధ్య సహాయ స్వరాలు రావడం కన్పిస్తుంది. ఇటువంటివి ఒక పదం యొక్క మౌలికమైన అర్థానికి విశేషార్థాన్నిస్తాయి. ktaba - to write; katab[1] = be

write; kit¹b = book or little; k1tib = a writer. సంశ్లేషాత్మక భాషల్లో అనేక పదాలు వాక్యంలో ఒకే పదంగా కలిసి పోవడం ఈ భాషా లక్షణంగా చెప్పుకోవచ్చు. ఈ భాషల్లో పదం, వాక్యమనే తేడా ఉండదు. రెండూ ఒకటిగానే ఉంటాయి. పదాలే వాక్యాలుగా ఉంటాయి. వాక్యాన్ని కొన్ని భాగాలుగాను చేస్తారు. ఈ వాక్య భాగాలకు ప్రత్యేకమైన అర్థాలుండవు. సంస్కృతం ఈ ప్రత్యయాత్మక వర్గానికి చెందిన భాష. తెలుగు భాష సంయోగాత్మక వర్గానికి చెందిన భాష. రెండు భాషల్లోను ప్రత్యయాలున్నాయి. వంశానుగుణ వర్గీకరణను చర్చించవలసి వుంది. భాష పరిణామ శీలి. మార్పులు సాధారణంగానే కలుగుతూ ఉంటాయి. ఒక భాష నుండి మరొక భాష పుట్టడం సహజం. మూల భాషలుకు, దానినుండి పుట్టిన భాషలకు జన్య జనక సంబంధం ఉండితీరుతుంది. ఈ భాషల మధ్య సోదర లేదా వైరుధ్య భావ సంబంధాన్ని నిర్ధారించవచ్చు. దీన్ననుసరించే ఈ వంశానుగుణ వర్గీకరణ చెయ్యబడింది. ఈ వర్గీకరణ చేసేటప్పుడు తులనాత్మకంగా పరిశీలించాలి. ఈ వర్గీకరణ ఆయా భాషలను చేసేటప్పుడు తులనాత్మకంగా పరిశీలించాలి. ఈ వర్గీకరణ ఆయా భాషలను పోల్చితే తెలుగు, తమిళం, మలయాళం, కన్నడం సోదర భాషలుగా గుర్తించాలి. ఈ భాషల్ని పరిశీలిస్తే పదాల్లో సామ్యం కన్పిస్తుంది. తెలుగు– కన్ను, తమిళం – కణ్, కన్నడం – కన్, మలయాళ: – కణ్ మొదలైన పదాల్లో మార్పును గుర్తించవచ్చు. పదాలలో, నిర్మాణంలో ఉన్న సామ్యాన్ని బట్టి ఈ భాషల మధ్య సంబంధాన్ని గుర్తించి, ఇవన్నీ మూలభాషతో సంబంధం కలిగినవని గుర్తించవచ్చు. భాషలను పోల్చేటప్పుడు అన్యదేశ్య పదాలు కాకుండా దేశ్య పదాల్ని గ్రహించాలనే విషయాన్ని గ్రహించాలి. ఈ దేశ్య పదాలలో కూడా ప్రాథమిక పదజాలాన్నే గ్రహించాలి. ఇవేగాక వాక్య నిర్మాణం మొదలైన వాటిని కూడా పరిశీలించి భాషల మధ్య సంబంధాన్ని నిర్ణయించుకోగలగాలి. ■

**"ఏ దేశంలోనైనా సంస్కృతి నిర్మాతలు ముగ్గురే! వారు :**

**1. శ్రమజీవులు,**

**2.శాస్త్రజ్ఞులు,**

**3. సాహిత్య కళాకారులు**

**- గోర్కీ**



## ఆకుపచ్చని కల

**వా**డు ఆకుపచ్చని దేశాన్ని కలగంటున్నాడు
అప్పులు కావిళ్ళతో ఆకలి బుట్టలు మోసి
అన్నం మెతుకై మెరిసేటోడు అన్నమో రామచంద్రా అంటూ
తడిసిన కళ్ళ మళ్ళను
ఆశల మైదానంలో ఆరబెట్టుకుంటున్నాడు

పురిటి నొప్పులు పడుతున్న పుడమి తల్లికి
సుఖ ప్రసవం చేసే మంత్రసాని వాడు!
నాగరికత వేణుగానానికి పరవశించి
నాగలొదిలేసిన నాజూకు బతుకుల మధ్య
మట్టి దేహాన్ని చదునుచేసి పచ్చని అంగాలతో
ప్రకృతితో సంభాషించే ఆకుపచ్చని కల వాడు

అయిదేళ్ళకోసారి పత్రికలలో పతాక శీర్షికలతో అలరించినా
ఒక చిన్న రుణమాఫీతో తీరిపోయే ఆ ఋణబంధానికి
వాడి కష్టాలు కన్నీళ్ళు అందని సంద్రాలే

అప్పుడప్పుడు పస్తుల మంటలు ఆర్పడానికి
ఆ ఇంటి ఇల్లాలి పుస్తెలు చేసే త్యాగం ముందు
ఆ తాజ్ మహల్ సైతం సిగ్గుతో తల దించుకోవల్సిందే!

సేద్యపు మడుల్లో స్వేదనదులై ప్రవహించి
బువ్వ పతాకమై రెపరెపలాడేటోడు
బతుకు ప్రమిదలో ఊపిరి ఒత్తయి వెలగలేక
ఊరి చివర చెట్టుకి ఉరితాడై వేలాడుతున్నాడు

ప్రపంచీకరణ పెనుగాలులకి
కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్న
ఆ సంప్రదాయ సేద్యపు చివరి పనిముట్టును
ఊరి మధ్యన ఊపిరి చెట్టులా నిలబెడదాం!
వాడి ఆకుపచ్చని కలను నిజం చేద్దాం!

**- మామిడిశెట్టి శ్రీనివాసరావు**

# మంగళకరుడు

**కా**డిమాకు పట్టి
వొడ్లతో నువ్వు మైలపోలు రాస్తేనే
ఏ నేలైనా ముత్యాల పందిరైతది
నలుగు పెట్టి , తలకు నూనె రాసి
దిష్టి తీసి గోరుగల్లు తీసినంకనే
ఏ పెళ్ళివాకిలైనా వసంతమాడుతది

సౌందర్య శాస్త్రానికి ముందుమాట
నీతోనే మొదలవ్వాలి.
సన్నాయి ఊదీ ఊదీ
సామవేదానికి సరిగమలు నేర్పిన
మంగళకరుడవు నువ్వు!

ఊరంతటికీ బొడ్డుతాడు కోసి
పురుడు పోసిన మంగలితల్లి
ఊరి బొడ్రాయి లెక్కనే
పూజలందుకోవలసిన గ్రామదేవత

పటేలైనా, పట్వారైనా
మీసాలు మెలేసే ఎంతటి మారాజైనా
నీ ముందల తలవంచాల్సిందే!
మూడు కత్తెర్ల ముడుపులను
ముందుగా అందుకునేది నువ్వే అయినా
నువ్వు కట్టిన ఆకలి ముడుపు ఎవరికి తెలుసు?

సైడ్ కటింగు, ఆర్మీ కటింగు, బేబీ కటింగు
ఎన్ని కటింగులైనా
నీ చేతి విన్యాసాల్లోంచి పుట్టిన రంగుల బొమ్మలు

అహంకారంతో ఊగిపోతున్న వెంట్రుకలను
కత్తిరించడం తప్ప
నీ కత్తికి ఏ రక్తపాతమూ తెల్వదు!

నెత్తి మీద పుండ్లైన చిన్న పిల్లలొస్తే
చీదరించుకోవడం తెల్వదు నీకు
సంకల్లోని వెంట్రుకలకు
మురికి విమోచనం చేస్తావు
ముక్కులో ఊపిరాడని వెంట్రుకలకు
ముక్తిని ప్రసాదిస్తావు
పొద్దు పొద్దున్నే నీ వాకిలి నుంచే
ఊరి ముచ్చట్లన్ని ఊరవిష్కలై ఎగిరిపోతయి!

అనాది నుండి
రెండు కుండల వొడ్ల కట్టడికే
జీవితం మొత్తం ధార పోసి
సౌరం ఎట్లజేసినవే తాతా ?

ఉత్త చేతులతో వచ్చినోడినైనా
కాదని పంపవైతివి
ఇచ్చినపుడే పైసలు తీసుకునుడు తప్ప
మనిషి ఇజ్జత్‌ను కత్తరించడం
నీ జిందగీలో లేదు!

బండ మీదనో
మొద్దు మీదనో కూసోబెట్టి
సౌరం చేస్తడని అనుకుంటరు గానీ
నీ చేతి వేళ్ళ పనితనం ముందు
ట్రిమ్మర్లకు దిమ్మతిరిగి పోతది
వేలకు వేలు వసులు చేసే ఫెషియల్స్ అన్నీ
మర్దన చేసే నీ చేతులకు సరిరావు

“ఎవ్వరు చెప్పినా పని ఇనేది మీ తాత
జకముకసంచిని విడువక పొయ్యేదని”
ఓ దిక్కు సౌరం చేసుకుంటూనే
తరాల తాతల చరిత్రను తెలిపే
శాసనకారుడవు నీవు!

గోరుగల్లు తీసి
మనుషుల మైలలన్ని మాయం చేసే తాతా!
ఈ మాయాప్రపంచాన్ని ఎట్లా చదువాలో చెప్పిపో!

తీరొక్క కత్తెర్లను
పొత్తికడుపులో దాచుకున్న అసిపెనే
కొత్త నాగరికతకు రిబ్బెన్లు కత్తిరించింది కదా.
అయినా గానీ
నిన్నొక అనాగరికుడిగానే చూసింది ఈ సమాజం

సౌరం చేసుకొని ఇంటికొచ్చి
అద్దంల చూసుకున్న ప్రతిసారీ
అప్పు కట్టలేక తిరుగబెట్టుకున్న కాగితం మీద
నీ వేలిముద్రలే కనబడుతుంటయి!

మంగలి తాతా!
అమ్ముల ‘పొది’ నుంచి తీసిన
చిన్న బ్లేడు ముక్కతోనే
ఇప్పటికీ కార్పొరేట్ సెలూన్ల మీద
అలుపెరుగని పోరాటం చేస్తున్నవు!

**- తగుళ్ల గోపాల్**
**95050 56316**




# కొత్తచూపును ప్రసరించే సత్యవతి గారి కథలు

- మందరపు హైమావతి
94410 62732

సత్యవతి గారి కథలు ప్రయాణాల్లో చదవడానికో, ఊసుపోక సమయం గడపడానికి పనికివచ్చే కథలు కావు. పితృస్వామ్య పీడనలో నలిగిపోయి, తమకొక వ్యక్తిత్వం ఉన్నదనే విషయాన్ని మరిచిపోయిన స్త్రీలకు తమ ఉనికిని, ఆత్మగౌరవాన్ని గుర్తు చేసిన కథలు.

స్త్రీ పురుషులు సమానులే అని ఉపన్యాసాల్లో చెప్తూ వాస్తవంలో మాత్రం తద్విరుద్ధంగా ప్రవర్తించే అసమ సమాజంలో, రెండు సిద్ధాంతాల ప్రపంచంలో సమానత్వం కోసం, మనిషిగా మనుగడ సాగించడం కోసం, ఊపిరి పీల్చడం కోసం ఆరాటపడిన కథలు సత్యవతి గారి కథలు.

సత్యవతిగారు అనగానే 'ఇల్లలకగానే పండుగౌనా!', 'సూపర్ మామ్ సిండ్రోమ్', దమయంతి కూతురు, గాంధారి రాగం, పిల్లాడొస్తాడా, సప్తవర్ణ సమ్మిశ్రమం కథలు గుర్తుకు వస్తాయి. వీటన్నిటిలో ముఖ్యమైనది 'ఇల్లలకగానే'. ఈ కథ ఎంత ప్రాచుర్యం పొందిందంటే, పదవ తరగతి చదివే స్కూలు పిల్లలకు ఈ కథ ఆంగ్లానువాదాన్ని పాఠ్యాంశంగా పెట్టేటంత.

మనం చిన్నప్పుడు ఇల్లలుకుతూ, అలుకుతూ తన పేరు మర్చిపోయిన ఈగ కథ విన్నాము. ఇక్కడ పేరు మర్చిపోయింది ఈగ కాదు. సాక్షాత్తూ రెండు కాళ్ళూ, రెండు చేతులూ ఉన్న స్త్రీ. పెళ్ళయ్యాక శారద అనే అమ్మాయి తన పేరు మర్చిపోతుంది. పేరు మరచిపోవడం వెనక చాలా కథ ఉన్నది. పితృస్వామ్య సమాజంలో స్త్రీలకు ఇంటి పని, వంట పని, పురుషులకు ఉద్యోగం, బయటి పని శ్రమ విభజన చేశారు.

పైగా సాహిత్యంలో కూడా స్త్రీ పురుషులిరువురూ సమాన మంటూనే స్త్రీలకు పర్యాయపదాలుగా గృహిణి, గృహలక్ష్మి పదాలను సృష్టించారు. ఇంటిని శుభ్రంగా వుంచడం, వంటపని చేయడం, పిల్లల పెంపకం అన్నీ స్త్రీలు చేయాల్సిన పనులని నిర్ధారించారు. ఇంటిని శుభ్రంగా వుంచుకొంటేనే లక్ష్మీదేవి వస్తుందని, ఆ లక్ష్మీదేవి రావాలంటే స్త్రీలు మాత్రమే కష్టపడాలని సూక్తి ముక్తావళి వల్లించారు. ఎంత చదువుకొన్నా, ఉద్యోగం చేస్తున్నా, కళల కాణాచులైనా, తమ డిగ్రీలను, ప్రతిభను పెళ్ళయిన వెంటనే కట్ట కట్టి అటక మీద పడేస్తున్నారు స్త్రీలు. ఇల్లు తళతళా అద్దంలా మెరవాలని, బూజులు వేలాడకుండా వుండాలని, అదే ఇల్లాలి జీవన ధ్యేయమని వేనోళ్ళ నొక్కి వక్కాణిస్తున్నది పురుషాధిక్య సమాజం. ఆ సమయంలో స్త్రీలు కూడా ఆ మాటలు నిజమేనని నమ్మి తమలో ఉన్న ప్రతిభను మరచిపోతున్నారు. అలా మరచి పోయిన స్త్రీ కథే ఈ కథ. చివరికి తనకు జరిగిన అన్యాయాన్ని తెలుసుకొని, దాన్ని ధిక్కరించి, తన వ్యక్తిత్వాన్ని జెండాగా ఎగురవేసిన కథే 'ఇల్లలకగానే'.

ఇలాటి కథే 'సూపర్ మామ్ సిండ్రోమ్' కథ. పితృస్వామ్య సమాజంలోని సంకుచిత భావాలకు, స్త్రీలను ఎదగకుండా ఉన్న చోటనే కుంగిపోయేలా చేసే వ్యవస్థకు పట్టం కట్టిన కథే ఈ కథ. పెళ్ళయ్యాక ఇంటి పరు మారిపోతుంది స్త్రీలకు. భర్త ఇంటిపేరు వస్తుంది. కానీ ఆ ఇంట్లో ఏ అధికారమూ ఉండదు వారికి. ఐనా ఇల్లు తమదే అని నడుము విరిగిపోయేలా పనులు చేస్తారు. ఒంట్లో బాగా లేకపోయినా మందులు మింగి ఇంటిల్లిపాదికి సేవలు చేస్తారు. మూడు రోజుల ఆటంకం వచ్చినప్పుడు కూడా కుటుంబ సభ్యుల పనులకు ఆటంకం రాకుండా మందులు మింగుతారు. జీవితమంతా మందులే. పొట్ట నిండా మందులే. ఈ వృత్తాంతం మీద రాసిన కథే 'సూపర్ మామ్ సిండ్రోమ్'. ఈ

కథలో గృహిణి అనూరాధ. ఒకరోజు మరణిస్తుంది. చచ్చిపోయాక శరీరమంతా సున్నంలా మారిపోతుంది. దానికి కారణం ఆమె అవసరానికి మించి టాబ్లెట్లు మింగడమే. శవం టాబ్లెట్లుగా మారి చనిపోతుంది ఆమె. గర్భ సంచీ తీసేసారు. ఓవరీస్ లేవు. శవం కాలిపోతున్నప్పుడు ఏదో పగిలిన శబ్దం వస్తుంది. అది ఆమె మెదడు. అది పాచి పట్టిపోతుంది. డాక్టర్లు ఆవిడకు వచ్చిన జబ్బు సూపర్ మామ్ సిండ్రోమ్ అని చెప్తారు. ఆ మాటకు అర్థం ఏమిటంటే ఇల్లు అద్దంలా మెరిసేలా ఉంచుకోవడం, పిల్లల్ని చదివించి అమెరికాకు పంపించడం, ఆదర్శమాత అనిపించు కోవడం అని చెప్తారు. చాలామంది స్త్రీలకు ఈ జబ్బు ఉంటుందని, అమ్మలు వాళ్ళ గురించి ఆలోచించుకోరని, ఇంట్లోవాళ్ళ గురించి, పిల్లల గురించే ఆలోచిస్తారని కథ చెప్పారు.

'గోధూళి వేళ' మరో ముఖ్యమైన కథ. గోధూళి వేళ అంటే ఆవులన్నీ ఇంటికి తిరిగి వచ్చే సమయం. ఆవులు తిరిగి వచ్చే టప్పుడు దుమ్ము బాగా రేగుతుంది. దాన్నే గోధూళి వేళ అంటారు. మేతకు వెళ్ళిన గోవులు తమ పిల్లలకు పాలివ్వాలని ఇళ్ళకు వస్తాయి. ఈ స్త్రీలు కూడా అంతే. ఉద్యోగరీత్యా బయటకు వెళ్ళిన మహిళలు కూడా ఇళ్ళకు చేరుకోవడానికి తొందరపడతారు. కాలేజీలో లెక్చరర్లైనా, మరొకరైనా అంతే. కాలేజీలో సంధ్యారాణి, పుష్పలత, సుధారాణి వీరందరూ గంట ఎప్పుడు మోగుతుందా అని ఎదురు చూస్తారు. రెండు బస్సులు మారి ఇంటికి వెళ్లాలి. కొడుక్కి బాగా లేదని, ఇంటికి వెళ్ళాక వంటపని ఆలస్యమౌతుందని తెగ కంగారు పడుతుంటారు. ఆలస్యమైతే 'ఇంత ఆలస్యమైంది ఏంట'ని ప్రశ్నలు అడుగుతారు. వీటన్నిటి కారణంగా స్కూళ్ళు, కాలేజీలు అయిపోయిన వెంటనే స్త్రీలు ఇంటికి వెళ్ళడానికి ఆరాటపడతారని అంటారు రచయిత్రి. తమ తోటి ఉద్యోగులు అన్ని పనులు చేసుకొని ఇంటికి వెళితే స్త్రీలు మాత్రం తొందరగా వెళతారని అంటారు. స్త్రీలు కూడా ఆవుల్లాంటివారని, ఇంటి బాధ్యతలు వారిని తొందరగా ఇంటికి వెళ్ళేలా చేస్తాయని చెప్తారు ఈ కథలో.

ఈ రెండు కథలు పితృస్వామిక సమాజంలో స్త్రీల జీవితాలను ఫోటో తీసినట్లు చెప్తాయి. అమ్మాయిలు ఎంత చదువుకొన్నా, ఉద్యోగాలు చేసినా, వాళ్ళ మనసులు ఎప్పుడూ ఇంటికే అంకితమనీ, మనసా, వాచా, కర్మణా వాళ్ళు ఇంటి కోసం ఇంటి యొక్క, ఇంటి కొరకే ఆలోచిస్తారని, సమాజం వారిని అలా తయారు చేసిందని వ్యంగ్యంగా చెప్తారు.

గోవు కథ కూడా అంతే. ఒక విధేయురాలైన గృహిణి బీదరికం వల్ల ఏమీ ఆశలు, కలలు లేని ఒక పెళ్ళి కాని అమ్మాయి. నలభై ఏళ్ళకు పిల్లలున్న ప్లీడరును పెళ్ళి చేసు కొంటుంది. ఆ అమ్మాయి గోమతి. పెళ్ళయ్యాక తల్లి కాబోతుంది. కానీ భర్తకు ఇష్టం లేదు. ఆమె ఇష్టం లేకుండా అబార్షన్ చేయిస్తారు. అప్పుడు ఆవులా వుండే గోమతి కూడా ఎదురు తిరుగుతుంది. అంతవరకు తనలో ఉన్న సాధు స్వభావాన్ని మార్చేసుకుంటుంది. భర్తని తన గదిలోని రానివ్వదు. పోట్ల గొడ్డులా మారిపోతుంది.

'ఎచటికి పోతావీ రాత్రి' ఆలోచనలు వెలిగించే కథ. ఈ కథలో ఒకచోట 'నీ కొడుకు చెప్పినట్లు విను, మీ అమ్మ చెప్పినట్లు విను, నీ మొగుడు చెప్పినట్లు వింటూపో' అని అంటారు. 'ఎప్పుడూ స్త్రీ ఒకళ్ళు చెప్పినట్లు వినాల్సిందే తప్ప, స్వీయ అభిప్రాయాలకు తావు లేద'ని చెప్తారు. ఒకప్పుడు బాల్యంలో తండ్రి, యౌవనంలో భర్త, వృద్ధాప్యంలో కొడుకు స్త్రీలని రక్షిస్తారు. స్త్రీకి స్వాతంత్ర్యం అక్కరలేదని చెప్పారు. ఇప్పుడు వాక్యాలు మారాయి కానీ అవే భావాలు, ఎన్నేళ్ళు వచ్చినా మారని ఆలోచనా విధానాలు.

'ఎచటికి పోతావీ రాత్రి'లో కొంచెం ఆలోచనాశక్తి వున్న వాళ్ళు, ఆపదలో ఉన్నవాళ్ళకి సాయం చేయాలనుకొనేవాళ్ళు ఏమీ చేయలేక నిస్సహాయులుగా ఉండాల్సిరావడం, వాళ్ళ భర్తలు సహకరించకపోవడం, జీవితంలో ఓడిపోయి ఆత్మహత్య చేసుకొన్న రోజా, ఫ్యాన్‌కి ఉరిపోసుకున్న మైథిలి, కాలువలో పడిన సుగుణ వీళ్ళందరి తరుపున ఉచితంగా వాదిస్తుంది ఆమె. దానికి ఒప్పుకోని భర్త. ప్రతిదాన్నీ డబ్బు కళ్లతో చూసే మనస్తత్వం. చివరకు ఆమె ధైర్యంగా నిలబడుతుంది. తన ఇష్టప్రకారమే ప్రవర్తిస్తుంది. ఆమె భర్త ఎన్ని విధాలుగా నిరాశ పరచాలని చూసినా ధైర్యంగా తన నిర్ణయం తీసుకుంటుంది.

'దమయంతి కూతురు' తెలుగు కథాసాహిత్యంలో సంచలనం కలిగించిన కథ. దమయంతి వాళ్ళమ్మ చిన్నప్పుడే ఇంట్లోనుంచి వెళ్ళిపోతుంది. దమయంతి కూతురికి పెళ్ళి సంబంధాలు వస్తాయి. పెళ్ళి కొడుకులు వాళ్ళమ్మ గురించి చెడ్డగా మాట్లాడ తారు. సంతోష్ అనే అబ్బాయి మాత్రం పెళ్ళి చేసుకోవడానికి ఒప్పుకుంటాడు. ఈ విషయం వాళ్ళన్నయ్యకు చెప్తుంది. బాల్యంలోనే వెళ్ళిపోయిన తల్లిని గురించి కూతురు బాధపడుతూనే వుంటుంది. 'అమ్మ మనని ఎట్లా మరిచిపోయింది' అని మధన పడుతుంది.

వివాహమయ్యాక స్త్రీలు ఆ వివాహ బంధానికి కట్టుబడి వుండాలి. ఇష్టం లేకపోతే విడాకులు ఇవ్వచ్చు. కానీ మధ్యలో ఇలా ఇల్లు వదిలి వెళ్ళిపోతే ఇంట్లోవాళ్ళు, సంఘం ఆమె మీద అనేక రాళ్ళు వేస్తుంది. వాళ్ళ పిల్లల్ని హీనంగా చూస్తుంది. ఇది ఈ కథలోని వృత్తాంతం. అదే పురుషులు చేస్తే అలా అనరు. భార్య ఉండగానే మరొకరిని పెళ్ళి చేసుకున్నా, ఇంట్లోనుంచి వెళ్ళిపోయినా సంఘం ఏమీ అనదు వాళ్ళను. దమయంతి కూతురే సంఘం విసిరే రాళ్ళకు గాయపడుతుందని బాధపడతారు రచయిత్రి. వాస్తవాన్ని కళ్ళకు కట్టినట్లు చిత్రీకరించారు.

ఈ సమస్య మీద చాలా కథలు ఉన్నాయి. తెలుగు సాహిత్యంలో బుచ్చిబాబు 'చివరకు మిగిలేది'లో దయానిధి

తల్లిదీ ఇలాటి పాత్రే. అక్కడ మగవాళ్ళు అనుభవించేది వేరు. అమ్మాయిలు అనుభవించేది వేరు. సునిశితమైన కథ. తనకు తెలియని వయసులో వెళ్ళిపోయిన అమ్మ కోసం కూతురు పడిన బాధను, హింసను కళ్ళకు కట్టినట్లు రచయిత్రి వ్యక్తీకరిస్తారు ఇక్కడ. కొత్త వస్తువుతో అల్లిన కథ ఇది.

'గాంధారి రాగం' స్త్రీల అణచివేతపై రాసిన కథ. గాంధారికి కళ్ళుంటాయి. కానీ భర్త ధృతరాష్ట్రునికి కళ్ళు లేకపోవడం వల్ల ఆమె కూడా కళ్ళు కనిపించకుండా గుడ్డ కట్టుకుంటుంది. అలాగే పెళ్ళయ్యాక స్త్రీలు కూడా తమలోని శక్తులను, ప్రతిభను అణచి వేసుకుంటారు. కాదు అలా అణచివేయబడతారు భర్తల చేత. ఇదీ ఈ కథ సారాంశం. ఈ కథలో సరస్వతి పెళ్ళి కాకముందు నిజంగా సరస్వతే. కానీ పెళ్ళి అయ్యాక భర్త అహంకారం వల్ల తనలోని శక్తులు బయటకు కనిపించకుండా దాచేసుకుంటుంది. భార్య తెలివిగల అమ్మాయిగా గుర్తించబడడం భర్తకు ఇష్టం వుండదు. చాలా కాలం తనలోని తెలివితేటలను అణిచేసుకొని బతుకుతుంది ఆమె. చివరకు అలా ఉండకూడదని నిర్ణయించు కుంటుంది. చిన్నప్పుడు ఆడిన టెన్నిస్ బ్యాట్ మళ్ళీ పట్టుకుం టుంది. పిల్లలకు తెలీని లెక్కలు చెప్తుంది.

'తిమింగల స్వర్గం' ఒక విభిన్నమైన కథ. చురుగ్గా, కొత్త రకంగా ఆలోచించే మెదళ్ళను తొలగించి, మెదడు మార్చేసి, కొత్త మెదడు పెడతారు. అది 'ఇమిడిపో' 'ఇమిడిపో' అంటుంది. చైతన్యవంతులైన స్త్రీలు కూడా బోన్సాయి మొక్కల్లా మిగిలిపోతారు. 'తిమింగలం' అనేది సంప్రదాయానికి, విధేయతకు ప్రతీక. కొంచెం సొంతంగా ఆలోచించగలిగేవారి మెదళ్ళను ఆపరేషన్ చేసి తీసేసి డబ్బుకి, అధికారానికి ప్రాముఖ్యమిచ్చే మెదళ్ళను పెడతారు. ఇదంతా వారికి తెలియదు. సత్యవతి ఒక కొత్త శిల్పాన్ని ఈ కథలో ప్రవేశపెడతారు. కొంచెం వ్యంగ్యం, పితృస్వామ్య వ్యవస్థ పట్ల కసిని బాగా వ్యక్తీకరిస్తారు ఈ కథలో.

సత్యవతిగారి కథలన్నీ ఆధునిక సంక్షుభిత సమాజంలో, స్త్రీలు, యువతరం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రతిబింబించేవే. 'పిల్లాడొస్తాడా' కథలో రోజూ వచ్చే కొడుకు ఆ రోజు ఎంత ఆలస్యమైనా రాడు. అమ్మమ్మ నిశ్చింతగా వుంటుంది. తల్లి మాత్రం అంతులేని ఆందోళనతో సతమతమౌతుంది. పిల్లాడు ఏ రోడ్డు ప్రమాదానికి  గురయ్యాడో, ప్రేమలో పడి ఏ ప్రమాదంలో చిక్కుకున్నాడో అని పరిపరివిధాల చింతిస్తుంది. అలా ఆలోచిం చడం  ప్రస్తుత పరిస్థితుల్లో సహజమే. ఆ రోజూ, ఆ మర్నాడూ ఇంటికి రాడు. చివరికి ఒకరోజు గంట మోగితే అమ్మమ్మ పిల్లాడొచ్చాడేమో చూడమంటే, తల్లి ఏ విషాదవార్త చెప్పడానికి ఎవరొచ్చారో అని సందేహిస్తుంది. ఆధునిక సమాజంలో భద్రత లేని మానవ జీవితాలను ఒడిసిపడతాయి ఈమె కథలు.

'మాఘ సూర్యకాంతి' ఈ కథ పెళ్ళయ్యాక భర్త చేతిలో పడి హింసకు గురౌతూ మనశ్శాంతి లేకుండా బతికే వివాహిత కథ. ఉద్యోగం చేస్తున్న కమలకు చిన్న వయసులోనే పెళ్ళి చేస్తారు తల్లిదండ్రులు. తల్లి మాత్రం ఇంత చిన్న వయస్సులో పెళ్ళేందుకు అంటుంది కానీ తండ్రి బలవంతం మీద పెళ్ళి చేస్తారు. పెళ్ళి కొడుకు రవికుమార్ కు నిలువెల్లా అహంకారం. ఒక రాత్రి భార్య గొంతు పిసుకుతాడు. కమల అత్తగారింటికి వెళ్ళనంటుంది. ఈసారి కమల తల్లి కూడా కూతురు తరుపున నిలబడుతుంది. కూతురిని అత్తింటికి పంపించదు. ఇదీ మాఘసూర్యకాంతి కథ.

'ఆవిడ' కథలో రోష్ని తండ్రి మరణిస్తాడు. చివరి కాలంలో తనకు తోడుగా ఒక ఆవిడను తెచ్చుకుంటాడు. తండ్రికి సొంత ఇల్లు, ఆస్తి వుంటాయి. బంధుమిత్రులందరూ ఆ ఇల్లు ఆవిడ రాయించేసుకొందని అనుకుంటారు. కానీ ఇల్లు తన పిల్లలకే రాస్తాడు. ఆ తర్వాతే ఆవిణ్ణి ఇంటికి రప్పించుకుంటాడు. తండ్రికి ఆవిడతో బంధం ఏర్పడటం పిల్లలెవరికీ ఇష్టం లేదు. అందరూ ఆమెను నిందిస్తారు. ఆస్తి కోసం తండ్రి దగ్గరకు వచ్చిందని అపోహ పడతారు. కానీ తండ్రి మరణించాక వాళ్ళ ఊహలు అబద్ధాలని తెలుస్తాయి. భార్య పోయాక తన సుఖం కోసం, వేళకు తిండీ, రోగం వచ్చినప్పుడు చాకిరి చేయడానికీ ఆవిణ్ణి తెచ్చుకొన్నాడని తెలుసుకొంటారు. అతని సుఖం కోసమే తప్ప ఆమె సుఖం కోసం ఈ పని చేయలేదనే వాస్తవాన్ని గమనిస్తారు. ఈ సమాజంలో వృద్ధాప్యంలో ఉన్నవారికైనా, పెళ్ళై పిల్లలున్నవాడికైనా మళ్ళీ పెళ్ళి జరుగుతుంది కానీ స్త్రీకి ఒక్కసారి పెళ్ళి కావడమే కష్టం. ఈ కటిక నిజాన్ని కుండబద్దలు కొడతారు రచయిత్రి.

'చీపురు' దిగువ మధ్యతరగతి జీవుల అభద్రతా జీవితం గురించి, డబ్బు లేకపోవడం వల్ల చిన్న పిల్లలు కూడా పడే పాట్ల గురించి చెప్పిన కథ ఇది. స్వర్ణ ఒక మధ్యతరగతి ఇంట్లో పని చేస్తుంటుంది. ఇల్లుగలావిడ చీపురు కోసమని వంద రూపాయలు ఇస్తుంది. ఆ డబ్బులు తీసుకొని వాళ్ళమ్మ వాడుకొంటుంది. ఇల్లు గల అయ్యగారు చపలబుద్ధి కలవాడు. స్వర్ణను చూసి క్రీమో, మొటిమల మందో కొనుక్కొమ్మని వంద ఇస్తాడు. అది తీసుకొని వెళిపోతుంది గబగబా.

ప్రపంచీకరణ వల్ల సంక్లిష్టమైపోతున్న పరిస్థితుల్లో స్త్రీలు, పురుషులు, యువతరం ఎదుర్కొంటున్న సమస్యల గురించి చిత్రీకరించిన కథలు ఇవి. ఒకప్పుడు వంటింటి కుందేళ్ళుగా వున్న స్త్రీలు ఇప్పుడు విద్యావంతులయ్యారు. ఉద్యోగస్థులయ్యారు. కానీ ఇక్కడ కూడా ఆర్థికపరమైన సమస్యలు. వారి జీవితాలలో సుఖం లేకుండా పోయింది. మతం, భక్తి కూడా వారి బ్రతుకులను అల్లకల్లోలం చేశాయి. వీటన్నిటినీ సత్యవతి గారు తన కథల్లో ప్రతిబింబించారు.

సత్యవతి గారు గుంటూరులో 1940లో జన్మించారు. కొంచెం వ్యంగ్యం, కొంచెం హాస్యం రంగరించిన ఈమె కథలు

చదువరులను ఆలోచింపచేస్తాయి. పితృస్వామ్య పీడనలో ఉక్కిరిబిక్కిరైన స్త్రీలు తలెత్తుకొని నిలబడేలా చేస్తాయి. గుంటూరు మిరపకాయల్లా ఘాటుగా వుంటుంది వీరి శైలి. ఈ కథల్లోని ఏ స్త్రీలు కూడా లొంగిపోరు. గొప్ప ఆత్మవిశ్వాసంతో వెలిగిపోతారు. ఎప్పటికప్పుడు ఎదగనీయకుండా మేకులు కొడుతుంటే ఆ మేకుల్ని తీసి విసిరిపారేసి నిటారుగా తలెత్తుతారు. గొప్ప మెలకువ కలిగి వుంటారు. మనుషులుగా జీవిస్తారు.

వస్తు వ్యామోహంతో నిండిపోయిన ప్రపంచంలో కొంచెం ప్రేమ, భావుకత నింపుకోవాలని, వెలుగు పూలు వికసించాలని ఆశిస్తారు. జీవితం పట్ల కొంచెం ఆశావహ దృక్పథం కలిగిస్తాయి. సంప్రదాయాలు, నియమాలు, నిషేధాల ఊబిలో కూరుకుపోతున్న వారిని తలెత్తుకు నిలబడేలా చేస్తాయి ఈమె కథలు.

సత్యవతి గారు ఆంగ్ల సాహిత్యంలో పట్టభద్రులు. విజయవాడలో ఆంగ్ల అధ్యాపకురాలిగా పనిచేశారు. రేవతి ఆత్మకథను 'ఒక హిజ్రా ఆత్మకథ'గా అనువదించారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం పొందారు.

'మంత్రినీడ' ఆమె మొదటి సంపుటి. చాసో స్ఫూర్తి అవార్డు, కొండేపూడి శ్రీనివాసరావు అవార్డును, రంగవల్లి విశిష్ట వ్యక్తి పురస్కారాన్నీ, తెలుగు యూనివర్శిటీ విశిష్ట పురస్కారాలను పొందారు. ఇల్లలకగానే, మంత్రనగరి, మెలకువ, రాగం భూపాలం వ్యాస సంకలనం ప్రచురించారు. ఇంకా యుగళ ఫౌండేషన్ అవార్డు, సుశీల నారాయణరెడ్డి పురస్కారం, మల్లెమాల, గురజాడ, బోయి భీమన్న, పెద్దిబొట్ల సుబ్బరామయ్య, మాలతీ చందూర్, తురగా జానకీరాణి, తానా, కళారత్న, కువెంపు జాతీయ పురస్కారాలు పొందారు.

అరసం, విశాలాంధ్ర సంస్థలు వీరి కథలను సంపుటాలుగా ప్రచురించాయి. పతిభక్తి, నటనలు చాలునులే, వెంకటేశ్వర్లు వెళ్ళిపోయాడు, తాయిలం, భద్రత, భారవాహిక, గణితం, పెళ్ళిప్రయాణం, శుక్రవారం, ముసుగు, పహరా, బదిలీ, ఒక వసుంధర, మెలకువ, ఒక రాణీ – ఒక రాజా, ఇరుకు, ఆజాదీ, కాడి, సప్తవర్ణ సమ్మిశ్రితం, దొంగపిల్లి, భాగం, నాన్న, దేవుడు మొదలగునవి ఈమె కథలు. పురుషస్వామ్యానికి వ్యతిరేకంగా ఆడవాళ్ళలో ఆత్మవిశ్వాసం కలిగించేలా రాసిన ఈ కథలు పాఠకులకు కొత్త చూపునిస్తాయి.

ప్రపంచీకరణ వలన వచ్చే అనర్థాలు, మితిమీరిన సాంకేతిక వస్తువుల ఉపయోగం వలన యువతీయువకుల జీవితాలలో రేగిన అల్లకల్లోలాలకు ప్రతిరూపాలు ఈ కథలు. ముఖ్యంగా స్త్రీలు చదవదగినవి. రెండు చేతులు కలిస్తే కదా చప్పట్లు. పురుషులు కూడా చదవాలి. అప్పుడు కదా చైతన్యపూరితమైన కొత్త సమాజం కోసం కనవచ్చు కలలు. ■

## చెట్టు కళేబరంపై ...

**చె**ట్టు కళేబరంపై ఏమైంది?
పది రోజుల క్రితమేగా
నవ్వుతూ కనిపించి
పిల్లలను, పెద్దలను ఒడిలో పెట్టుకుని
కాయలను కొసిరి తినిపిస్తూ ...

ఒద్దిగ్గా, ముచ్చటగా ఇంటికి కాపలాలా
ప్రతి ఒక్కరి చూపులకు గొడుగుగా
పెద్ద ముత్తయిదువులా గూడులా నీడైన
పచ్చని కాంతుల జీవకళకు ఇప్పుడేమైంది?

పొడుగ్గా, అందంగా, బొద్దుగా ఉందని
ఎవరో అన్నారు.
ఒకడెవడో వచ్చి కొలతలని కొలుచుకున్నాడు
బారలేసి నేలతో ఏదో మాట్లాడాడు

ఆ మరునాడే
ఏ దిష్టి తగిలిందో... ఏ విషం పాకిందో
ఏమి విందో... ఏమి తిందో
ఉలుకూ లేదు... పలుకూ లేదు ...

చేతులు వాలి తల ఒరిగి... రూపు మారి
నాలుక లేని మూగజీవిని
ఏ మూఢత్వం మింగేసిందో?

కొమ్మలకో రేటు, మొదలుకో రేటు కట్టి
నీడను, పచ్చదనాన్ని కొసురుగా
వేరును సహితం విలువ కట్టిన
పచ్చ కాగితాల కాటుకు
ఇరవై ఏళ్ళ గుండె చప్పుడు ఆరిపోయింది!

కళకళలాడిన ఆకులు
గాలికి గలగలమని దూరమై
ఆటలకు దర్జాగా నిలచిన కొమ్మలు
నడుములిరిగి వంట చెరుకలయ్యాయి

చెట్టు కళేబరంపై డబ్బు లుకలుకలతో
పచ్చదనం సమాధిగా
ఖాళీ స్థలం కన్నీటి మడుగయింది!

– చందలూరి నారాయణరావు
97044 37247



# సర్కారు తుమ్మ

- ఎమ్వీ రామిరెడ్డి
98667 77870

రెండో రోజు మూడో వేడుకలో నాలుగో పాటకు నృత్యం మొదలైంది. రెండంతస్తుల డాబా ఎదుట గల ఖాళీస్థలంలో కట్టిన వేదిక– లైట్ల వెలుగులో మెరిసిపోతోంది. పదేళ్ల పాప "ఊ అంటావా మావా, ఊహూ అంటావా" పాటకు డ్యాన్స్ చేస్తోంది. వంద కుర్చీల్లో ఆసీనులైన గ్రామస్థులు, బంధువులు కళ్లప్పగించి చూస్తున్నారు. చప్పట్లతో, ఈలలతో పాపను ఉత్సాహ పరుస్తున్నారు. శబ్దతరంగాల పౌన్ణపున్యాలను పెంచుతూ తగ్గిస్తూ డీజే చిందులు తొక్కుతున్నాడు.

పాప తర్వాత తొమ్మిదో తరగతి కుర్రాడు, ఆ తర్వాత పాతికేళ్ల యువకులు నృత్యం జోరును పెంచారు. కొందరు గృహిణులూ జత కలిశారు. మగాళ్లు లుంగీలు పైకిగట్టి పాదాలు కదిపారు.

"ఇప్పుడు మన ఫంక్షన్ కథానాయకి సురక్ష ఓ పాటకు డ్యాన్స్ చేయాల్సిందిగా కోరుతున్నాం" అంటూ యాంకర్ పాత్ర పోషిస్తున్న ఇంజినీరింగ్ యువతి ప్రకటించింది.

సురక్ష సిగ్గుపడింది. పక్కనున్న నేస్తాలు పట్టుబట్టి, పైకి తీసుకెళ్లారు. చివరి వరస కుర్చీల వెనక వీధి అరుగుపై కూచున్న నాగమల్లి పెదవుల మీద చిత్రమైన నవ్వు మెరిసి, మాయమైంది.

అరుగు మీంచి పైకి లేచి, పైపంచె దులిపి భుజాన వేసుకుని, ఇంటివెనక కొట్టంలోకి నడిచాడు.

'అంబా' అంటూ ఆహ్వానం పలికింది పాడిగేదె. వాటెడు ఎండుగడ్డి తెచ్చి, గాట్లో వేసి, దాని తల నిమిరాడు. అది మోర ఎత్తి, అతని వంక చూసి, సంతోషంగా మేతను నోటితో అందుకొంది.

మొగరానికి నిలబెట్టి ఉన్న నులకమంచం వాల్చుకొని, పైపంచెను చుట్ట చుట్టి తలకింద పెట్టుకొని పడుకున్నాడు. అరుగు మీద మాయమైన నవ్వు మంచం మీద ప్రత్యక్షమైంది.

ఆకాశం వంక చూశాడు. నక్షత్రాలు బలహీనంగా నవ్వుతూ కనిపించాయి. ఒకప్పుడు అవి మనుషులతో మాట్లాడేవి. చుక్కల్ని చూసే నాగలి భుజానేస్కొని పొలం బయల్దేరేవాళ్లు.

ఇప్పుడు కళ తగ్గిపోతోంది.

పల్లె పట్టణంలా మారి, నగరంగా విస్తరించాలని తహతహలాడుతోంది. గుడిసెలు, పెంకుటిళ్లు మాయమయ్యాయి. డాబాలు లేచాయి. దూకుడుగా రాబోయిన డూప్లెక్సులు మాత్రం మేకప్ వేసుకోవాలో వద్దో తేల్చుకోలేక తెల్లమొహం వేశాయి.

ముక్కార్లు పండిన నేలల్లో గీసిన రంగులగళ్లు, ఇప్పుడిప్పుడే వెలిసిపోతున్నాయి.

"ఇంతకీ మన తాహతు పెరిగినట్టా, విరిగినట్టా?" తన ప్రశ్నకు తనే నవ్వుకున్నాడు.

"పది లచ్చలు కూడా పలకని పొలం కోటి దాటిందంటే పెరిగినట్టే గదయ్యా! లేనప్పుడు లేక అగోరించాం. ఇప్పుడైనా కాత్తెంత పిల్లల ముద్దుమురిపాలు సూస్కోవద్దా?" పది రోజుల క్రితం భార్య రత్తమ్మ అడిగిన ప్రశ్న గుర్తొచ్చింది.

'కోటి సంగతి దేవుడెరుగు. ఇప్పుడు అడిగే నాథుడు లేడు. పోగొట్టుకున్న పొలానికి దిక్కూ మొక్కూ లేదు'. నాగమల్లి మనసులో దుఃఖభరిత వర్తమానం సుడులు తిరిగింది.

"ఇప్పుడైతే ఏమంటావు? ఓనీల పండగ సెయ్యనంటావా?" గద్దించింది భార్య.

"సేద్దాం. అంగామా అక్కర్లేదు. పదిమందిని పిలుసుకొని పప్పన్నం పెట్టి పంపిద్దాం" అన్నాడు.

"ఇదిగో, ఎడ్డెమంటే తెడ్డెమనే పనులు మాన్కో. మొన్నటికి మొన్న సాంబయ్యన్న తన మనవరాలి బారసాల ఎంత గనంగా చేశాడు? ఫంక్షన్ హాలు కిటకిటలాడింది. ఇందుపల్లి నించి

వంటగాళ్లని పిలిపిచ్చాడు. చర్చికి బయ్యే పవిత్రమ్మ కూతురి సమర్త బంతికి నాలుగొందల మందిని పిలిసింది. నువ్విప్పుడు పదెకరాల ఆసామివయ్యా" చిన్న వేడుకనైనా అట్టహాసంగా చేసే సరికొత్త అలవాటు ఊళ్లో అన్ని ఇళ్లకూ పాకిందన్న విషయం వివరంగా చెప్పింది రత్తమ్మ.

మనవరాలికి ఓణీలిచ్చే వేడుక ఘనంగా నిర్వహించటానికి ఒప్పుకొన్నాడు. చిన్న కూతురు హైదరాబాదు నుంచి నాలుగు రోజుల ముందే భర్త, పిల్లలతో వచ్చేసింది. బావమరిది బాధ్యతలు స్వీకరించాడు. వేడుక వారీగా లెక్కలుగట్టి సరిపోనూ సొమ్ము తీసుకొని పనుల్లో మునిగిపోయాడు.

శుక్రవారం సాయంత్రం విజయవాడ నుంచి అయిదుగురు డిజైనర్లు వచ్చారు. మనవరాలి మెహందీ వేడుక మొదలైంది. పాతిక మంది కంటే ఎక్కువ కారనుకుంటే, ఆ సంఖ్య యాభై దాటింది. దాదాపు వంద చేతులు ఎరుపెక్కాక, రాత్రి 11 గంటల ప్రాంతంలో డిజైనర్లు రెట్టింపు రుసుము తీసుకుని వెళ్లిపోయారు. బావమరిది భద్రంగా జేబులో దాచుకున్న చిన్న పుస్తకంలో ఆ లెక్కను సరిజేసుకున్నాడు.

శనివారం ఉదయం ఇంటి ఆవరణలోనే గోడకు పదడుగుల వెడల్పు, ఎనిమిదడగుల ఎత్తున పసుపురంగు క్లాత్ కట్టి, దానిపై గులాబి పూలతో అలంకరణ చేశారు. దానికి రెండువైపులా మూలాటంగా పెట్టిన మూడుడుగుల వెడల్పు అట్టలపై మల్లెపూల దండలు వేలాడదీశారు. తామరపువ్వు ఆకారంలో సెట్టింగ్ వేశారు. దాని మధ్యలో మహారాణి కుర్చీ వేసి, సురక్షను కూచోబెట్టారు.

అమ్మలక్కలు చుట్టూ చేరారు. పాప తలపై పెద్ద జల్లెడ ఉంచి, ముందుగా తల్లిదండ్రులతో పసుపునీళ్లు పోయించారు. ధారలు కట్టిన నీరు తల నుంచి తనువంతా తడిపెయ్యటంతో పదకొండేళ్ల సురక్ష వణికిపోయింది. మెల్లగా అలవాటు పడింది. ఆ తర్వాత దగ్గరి బంధువులు జంటలుగా వచ్చి ఒక్కో బిందెతో స్నానమాడించారు. చివరగా స్నేహితులు, మరికొందరు యువతులు దడికట్టి, నీటిని మగ్గులతో పాపపైకి విసిరికొడుతూ పైపుల్తో పిచికారీ చేస్తూ హడావుడి చేశారు. ఆ ప్రహసనం ముగించి, పాప స్నానం చేసి వచ్చాక అందరూ అక్షింతలు వేశారు. రత్తమ్మ అన్నీ తానై తిరగలిలా తిరుగుతోంది.

తనూ అక్షింతలు వేసి, దూరంగా వచ్చి, ఇంటిగేటు పక్కనే అరుగుపై కూచున్నాడు.

"నాగమల్లిగా! ఏనాడన్నా ఓణీలిచ్చే పిల్లకి పసుపునీళ్ల తానం జేయించిన దాకలా ఉందా? ఏందిరా ఈ అంగామా?" చుట్టను విసిరేస్తూ అన్నాడు అరుగు మీదే కూచొని ఉన్న సుబ్బారెడ్డి.

"కలికాలం." లోపలే అనుకున్నాడో బయటికి అనేశాడో గుర్తులేదు తనకు.

రెణ్నెల్ల క్రితం క్రిష్ణారావు తండ్రి చనిపోయాడు. పేరుకు చౌదరే గానీ, కొత్తగా రియల్ ఎస్టేట్ వ్యాపారం జేసి దెబ్బ తిన్నాడు. అయినా తప్పలా. తండ్రి దశదిన కర్మ గ్రాండ్‌గా చేశాడు. చికెన్, మటన్, చేపల వంటకాలతోపాటు రిటర్న్ గిఫ్టులతో పరువు 'నిలుపుకోటానికి' మరిన్ని అప్పులు చేశాడు. రెండెకరాల నాగిరెడ్డి, తన మనవరాలి పుట్టినరోజు వేడుకను ధూంధాంగా చేయాల్సి వచ్చింది. హఠాత్తుగా ఐశ్వర్యం మీద పడ్డ భ్రాంతిలోంచి జనం అంత తేలిగ్గా బయటికి రాలేక పోతున్నారు. ఒకరో ఇద్దరో వద్దామని ప్రయత్నించినా, ఇరుగు పొరుగు శక్తిమేర ఊబిలోకి నెట్టేస్తున్నారు.

పెద్ద కూతురు గుర్తొచ్చింది. అమ్మమ్మ గారింట్లో ఉండగా పెద్ద మనిషి అయింది. ఉత్తరం రాస్తే, అయిదో రోజు తాను పన్నెండు కిలోమీటర్లు నడిచి, మామ గారింటికెళ్లాడు. చాపమీద కూచోబెట్టి, అయిదుగురు ముత్తయిదువలు ఆశీర్వదించారు. మామ గారు సైకిలుపై మంగళగిరి వెళ్లి, యాభై రూపాయలు పెట్టి కొత్త బట్టలు కొనుక్కొచ్చాడు. అత్తమామలు మనవరాలి చేతుల్లో ఆ బట్టలు పెట్టి, నోట్లో బెల్లం ముక్క వేశారు. అప్పుడు అదో పెద్ద వేడుక.

"యావయ్యో... యాడున్నావు?" దూరంగా వినిపించిన భార్య మాటతో మంచంపై లేచి కూచున్నాడు నాగమల్లి. చకచకా వచ్చింది రత్తమ్మ.

"ఓర్నీ మడిసి పాడుగానూ. బర్రే గొర్రా లేకుండా బతకలేవా? ఆడ... పిల్లలూ పెద్దలూ ఆడతా పాడతా ఉంటే, నువ్వేందీ ఈడొచ్చి కొట్టానికి కాపలా కాత్తన్నావు!" భర్తను లాక్కుపోయింది.

అమెరికా నుంచి పెద్ద కూతురు వీడియో కాల్ చేసినట్లుంది... చిన్న కూతురు తన కూతురి డ్రెస్సును, నగల్ని డెడ్ క్లోజప్పులో చూపిస్తోంది.

నాగమల్లిని పిల్లలు బలవంతంగా వేదిక మీదికి లాక్కెళ్లారు. "తాతా, స్టెప్స్ వేయాలి" అంటూ మనవడు బతిమాలాడు. నాగమల్లి 'ఏహె, పోండిరా' అని కసురుకున్నాడు. పిల్లలు వదల్లేదు. వాళ్ల కేకలు భరించలేక, సరేనన్నాడు. పిల్లలు కిందికి దిగారు. నాగమల్లి పంచె బిగించి కట్టాడు. తలగుడ్డ చుట్టాడు. ఎనభైల నాటి అక్కినేని పాట మొదలైంది. ఒకప్పుడు నాటకాలు వేసిన అనుభవంతో అచ్చు ఏఎన్నార్‌ను అనుకరిస్తూ స్టెప్స్ వేస్తుంటే, పిల్లలు నోళ్లు తెరుచుకొని అట్లాగే ఉండిపోయారు.

పాట ముగియగానే పిల్లలంతా పైకి వచ్చి, నాగమల్లిని చుట్టేశారు.

మనవడు తాత బుగ్గలపై ముద్దులిచ్చాడు.

❖❖❖

పొద్దున్నే లేచి, బమ్మల కాడ చేలో జన్నదంటు కోసుకొచ్చి, గేదెముందు పడేశాడు నాగమల్లి. ఎనిమిదింటికంతా స్నానం చేసి, ఇడ్లీ తిని, పంచె కట్టుకొని, చొక్కాపై పైపంచె వేసుకొన్నాడు.

"ఏ పనిలో బడితే ఇక అదే రంది. ఆ గొడవల్లో పడి, సాయంత్రం పిల్లకి ఓనీలిచ్చే ఫంక్షన్ ఉందన్న మాట మర్చి పోమాకు. నాలుగింటికల్లా వచ్చేయ్" భార్య మాటలకు తల కదలికలతోనే సరేనన్నట్లు సమాధానమిచ్చి, బయటికి నడిచాడు.

చంద్రారెడ్డితో కలిసి శిబిరం దగ్గరకు వెళ్తుండగా, చింతా రామయ్య ఎదురయ్యాడు. మెడలో కొత్తగా చేరిన మందపాటి బంగారు గొలుసును సవరించుకుంటూ "ఎల్లండెల్లండి. ఆ పోరాటమేదో ఇంకాత్తె గట్టిగా సెయ్యండ్రా. ధర్నాలు సేత్తన్నారు, పాదయాత్రలు సేత్తన్నారు... అడవులు మాత్రం అట్నే ఉ ండిపోయినయ్. ముక్కెమంత్రి ఆ అంటల్లా, ఊ అంటల్లా" అంటూ ముందుకు సాగిపోయాడు.

పాతికెకరాల భూస్వామి రామయ్య. ధరలు ఆకాశంలో ఊరేగుతున్న రోజుల్లో ఎకరం కోటిన్నర చొప్పున నాలుగెకరాలు అమ్మి, ప్రకాశం జిల్లాలో దండిగా భూములు కొన్నాడు. నాలుగంతస్తుల డాబా కట్టాడు. బెంజి కారు కొన్నాడు. తమ తరఫున వాదించే లాయర్ల ఫీజుల నిమిత్తం, ఊరూరా శిబిరాల ఏర్పాటు కోసం రైతులందరూ విరాళం అందించినా రామయ్య రూపాయి విదిల్చలేదు. ఇతర గ్రామాల్లోనూ రామయ్య తరహా 'మహానుభావులు' తక్కువ సంఖ్యలో ఏమీ లేరు.

ఇద్దరూ శిబిరానికి చేరుకున్నారు. మూడు వాహనాల్లో సుమారు వందమంది ఎక్కాక, అవి ఉత్తర దిక్కుగా కదిలాయి. తుళ్లూరు మండల కేంద్రంలోని శిబిరం నుంచి మరికొన్ని లారీలు, ట్రాక్టర్లు వాటికి జత కలిశాయి. వాహనాలు సీడ్ యాక్సెస్ రోడ్డులోకి మళ్లాయి.

ఆ రోడ్డుకు ఎడమపక్క అడవుల్లా విస్తరించిన సర్కారు తుమ్మచెట్లు. ఒకప్పుడు అవన్నీ నడెండాకాలంలో కూడా పచ్చగా పంటలపాటలు పాడుతుండేవి. కుడిపక్కన... గత ప్రభుత్వం నిర్మించిన బహుళ అంతస్తుల భవనాలు అసంపూర్ణ రూపాలతో, అనాథ ప్రేతాల్లా!

"ఎందుకు వదిలేశారు? కిటికీలు, తలుపులు పెట్టిబీ రంగులేస్కొని కనీసం అధికారులైనా నివాసం చెయ్యొచ్చుగదా? జనం సొమ్ము కాదా ఇదంతా? ఇట్లా అడివిపాలు జేత్తారా?" నాగమల్లి మనసులో ఏవేవో ప్రశ్నల ప్రతిధ్వని.

"ఏంది మల్లీ, తెగ ఆలోసిత్తన్నావ్?" చంద్రారెడ్డి అడిగాడు.

# దిమ్మిస

గతుకులు గతుకులుగా వున్న
ఈ రాళ్ల వంతెన మీద
నీ శక్తినంతా కూడగట్టి
బలంగా బాదుతూనే వుండు
అటువైపు ఎల్లాలంటే
నువ్వు చెయ్యాల్సింది ఇదే !

చెమట చుక్కలు ఆగకుండా
రాలిపడుతూనే వుంటాయి
అలసిపోకు
నెత్తిమీద సూరీడు సురుక్కు సురుక్కున
పొడుస్తూనే వుంటాడు
సేదతీరకు
మనం ముద్దాడిన నేలను
అక్రమంగా ఎవడో లాగేసుకుంటాడు
నిస్తేజంగా వుండకు ...

అడుగులేయ వీలుకాని
ఈ అసంబద్ధ దారిలో
ఒకానొక అక్రమ గెలుపు
సాఫీగా గుర్రమెక్కి పోతది
ఆశ్చర్యపోకు చూస్తూ ఊరుకోకు
రక్తం సలసల మరగనీ
రెక్కలు ముక్కలు చేసుకునైనా
ఈ కాంక్రీటు మొనల మధ్య
కాసింత మెత్తటి మట్టిని పరువు

ఒడిదొడుకుల ఈ దారిపొంట
తడబడుతూ ఎంతకాలం నడుస్తావ్
మోసాల కింద నలుగుతున్న
బతుకుల్ని చూస్తూ
కాలం కుతకుత ఉడికి
దొర్లి పోతాంటది పోనీకు మర్లపడు
చైతన్యం ముందు సాగిల బడ్డతి

గుర్తుపెట్టుకో
రహదారెంట నువ్వు దర్జాగానే నడవాల
రాబోయెటోళ్లకు సక్కటి దారిని సూపాల
ఇంకెందుకు ఆలస్యం
ఉక్కు సంకల్పాన్ని పిడికిళ్ల మధ్య బిగించి
కొట్టు దిమ్మిస ..!

- డా. కటుకోఝ్వల రమేష్
9949083327

"ఏం లేదు రెడ్డీ, ఈ అడవులు మాయమవుతాయంటావా?" బెంగగా అడిగాడు.

రాజధాని కోసం భూములివ్వటానికి మొదట ఎవ్వరూ ముందుకు రాలేదు. అక్కడో అంతర్జాతీయ స్థాయి నగరం ఏర్పాటవుతుందన్నారు. అధికారులు భూసమీకరణలో విజయం సాధించారు. సేకరణ దాకా వస్తే మొదటికే మోసమని రైతులు భయపడ్డారు. 'రాజధాని బిడ్డ' తమ గ్రామాల్లోనే పెరిగి పెద్దదైతే, ఆ మురిపెమూ మహా ఐశ్వర్యమూ తమకే దక్కుతాయన్న ఆశతో మొత్తానికి అందరూ పత్రాలు సమర్పించుకున్నారు. నాగమల్లి, చంద్రారెడ్డి కూడా అట్లాగే ఇచ్చారు.

నాలుగెకరాల నాగమల్లికి పొలమే లోకం. గొర్రు తోలటం లో, నాగలి దున్నటంలో దిట్ట. అందరూ 'నాగలి మల్లి' అని పిలిచేవారు. రెక్కలు ముక్కలు చేసుకొనే అతడి గుణానికి మట్టి పుటం పెట్టింది. మంచి దిగుబడులిచ్చి దీవించింది. ఒక్కో ఎకరం కొంటూ పదెకరాల రైతుగా పలుకుబడి పెంచుకున్నాడు. అందులో ఆరెకరాలు రాజధానికి పోయింది.

గ్రాఫిక్స్, డిజైన్స్ దగ్గరే తత్తర్లాడిన నగర నిర్మాణం... ప్రభుత్వం మారటంతో పూర్తిగా చతికిలపడింది. రాజధానికే ఎసరొచ్చింది. ఆ బిడ్డ ఇక్కడే ఉంటదో, తల – మొండెం – ఆత్మలుగా మూడు ముక్కలై చెల్లాచెదురవుతుందో తెలియని స్థితి.

"మట్టిని నమ్ముకొని నాశనమైనోడు లేడురా మల్లీ. బిడ్డ మన దగ్గరే ఉంటది" ధైర్యం చెప్పాడు చంద్రారెడ్డి.

వాహనాలు మందడం గ్రామానికి చేరుకున్నాయి. ఒకట్రెండు తప్ప 29 గ్రామాల నుంచీ వాహనాల్లో వేలమంది రైతులు వచ్చారు. వందో రెండొందలో కాదు; ఆనాటికి అమరావతి ఉద్యమం 1300 రోజులకు చేరింది. పెద్ద వేదిక మీద బ్యాక్‌గ్రౌండ్ బ్యానర్‌పై 'నాలుగేళ్ల నరకంలో నవనగరం' అని రాసి ఉంది. దానికెదురుగా వేసిన కుర్చీల్లో జనం కూచున్నారు.

స్టేజీకి రెండు వైపులా, జనానికి మూడు పక్కలా వందల మంది పోలీసులు మోహరించారు.

అమరావతి జేఏసీ నాయకులు స్వాగతం పలికారు. అఖిల పక్షాలు, ప్రజాసంఘాల నాయకులు ఒక్కొక్కరే మైకు ముందు కొచ్చి ఉపన్యసిస్తున్నారు. రెండో వరసలో కూచున్న నాగమల్లి తన చుట్టూ పరికించాడు. ఎడమపక్క నెక్కల్లు శంకరరావు కూచున్నాడు. అన్న పొలాన్ని కూడా తనే కౌలుకు చేసి, ఇద్దరు ఆడపిల్లల్నీ చదివించి, పెళ్లిళ్లు చేసి పంపాడు. తనకంటూ మిగిలిన రెండెకరాలూ రాజధానిలో కలిసింది. కౌలుకు చేసుకునేందుకు నేల మిగల్లేదు. ఇల్లు గడిచే మార్గం దొరక్క సతమతమవుతున్నాడు.

అతని పక్కనే అనంతారం ఏసుపాదం. వ్యవసాయ కూలీ. పత్తికట్టె పీకటంలో, గడ్డివాములు వెయ్యటంలో మొనగాడు. ఇప్పుడా పనులేవీ లేవు. ముప్పూట్లా పొట్టను సాగు చేసుకునే దిక్కులేదు. భారంగా శ్వాస తీసుకుంటూ కుడిపక్క నాలుగో కుర్చీలో కూచున్న వెంకటపాలెం వెంకాయమ్మ ఎప్పుడూ గడప దాటి ఎరగదు. భర్త మంచాన పడటంతో, తనే పోరాట బాటలో కాలూనింది.

తన ముందు వరసలో ఎదురుగా కూచొని ఉంది రాయపూడి భవాని. ఇద్దరు పిల్లలు పుట్టగానే, భర్త హఠాన్మరణం చెందాడు. అన్న, వదిన అయిదారు లక్షలు కూడా పలకని తమ ఎకరం పొలాన్ని భవానికే ఇచ్చేసి లండన్ వెళ్లిపోయారు. చదువూసంధ్యాలేని భవాని తన రెండెకరాలకు తోడు ఆ ఎకరం అండతో సంసారం నెట్టుకొచ్చింది. రాజధాని కాగానే, ఆ ఎకరం కోటికి చేరగానే, అన్నావదినలు ఊడిపడ్డారు. తమ భూమిని అమ్మకానికి పెట్టారు. భవాని భగ్గుమంది. "తొండలు గుడ్లు పెట్టే నేల. నడుములిరిగిపొయ్యేలా బాగు చేశాను. దున్నాను. విత్తాను. పంటనేలగా సక్కదిద్దాను. ఇప్పుడు మీరొచ్చి అమ్ముకుంటారా?" అంది.

వదిన గయ్యిన లేచింది. అన్న నోరెత్తలేదు. ఉన్న రెండెకరాలూ ప్రభుత్వానికిచ్చి, ఇప్పుడు న్యాయం కోసం రోడ్డెక్కింది.

నీరుకొండ వీరేశం, నిడమర్రు ముస్తఫా, పెనుమాక రాజా... ఒకరేమిటి, అక్కడ చేరిన ప్రతి రైతు వెనకా ఓ కన్నీటి కథ. కన్నీరు పెట్టడం గిట్టని రైతులు జట్టు కట్టారు. కదం తొక్కారు. ఉద్యమంలోకి ఉరికారు. ఊరూరా నిరసన పతాకాలు ఎగరేశారు.

మూడు రాజధానుల ప్రకటనకు నిరసనగా కొందరు రైతులు ఆత్మహత్యలకు ప్రయత్నించారు. మందడం, వెలగ పూడి, వెంకటపాలెం, కృష్ణాయపాలెం మీదగా వేలాది మంది కార్మికసంఘాల నాయకులు మార్చ్‌పాస్ట్ నిర్వహించారు. బంద్‌కు పిలుపిచ్చారు. అమరావతి మహిళా జేఏసీ సభ్యులు తుళ్లూరు నుంచి ర్యాలీ నిర్వహించి 'జై అమరావతి' అంటూ నినాదాలు చేశారు.

29 గ్రామాల్లోనూ రైతుల నిరసన శిబిరాలు ఏర్పాట య్యాయి. ప్రభుత్వం ప్రతి ఊళ్లోనూ పోలీసుల పహారా ఏర్పాటు చేసింది. ఆందోళనలు ఆగలేదు, ప్రభుత్వం దిగిరాలేదు.

రైతులు న్యాయ పోరాటానికి సిద్ధమయ్యారు. ప్రభుత్వంలో చలనం లేదు. న్యాయస్థానం నుంచి దేవస్థానానికి మహా పాదయాత్ర చేశారు. నలభై అయిదు రోజులపాటు నడిచి, తిరుమల వెంకన్న ఎదుట తమ గోడు వెళ్లబోసుకున్నారు.

రాజ్యం గుండె కరగలేదు. పైగా, ఆర్-5 జోన్ అంకాన్ని తెరపైకి తెచ్చింది.

"మౌలిక సదుపాయాలు కల్పించాకే రైతులిచ్చిన భూముల్ని సీఆర్డీఏకు బదిలీ చేసుకోవాలనేది ఒప్పందం. అలాంటి ఏర్పాట్లేమీ లేకుండా, మన భూమిని ఇంకెవురికో ఎట్లా కేటాయిస్తారు? సెంటుకో ముక్కగా కత్తిరించి, ఇళ్లు కట్టుకోటానికి ఎట్లా పంచిపెడతారు?"... రైతుసంఘం నాయకుడొకరు వేదికపై నుంచి ఆవేశంగా మాట్లాడుతున్నాడు.

"మాస్టర్ ప్లాన్‌లోనే మార్పులు చేశారు. అదేమంటే, పేదలకు ఇళ్లద్దా... అంటూ ప్రభుత్వం మొసలి కన్నీరు కారుస్తోంది. ఎవడబ్బ సొమ్మని ఇది? ఆ నా కొ..." మరో నాయకుడు ఆవేశాన్ని అదుపు చేసుకోలేక, దూషణకు దిగాడు.

పక్కనున్న పోలీసులు స్టేజీపైకి వచ్చి, ఆ నాయకుణ్ని హెచ్చరించారు. అతను మరింతగా రెచ్చిపోవటంతో, మరికొందరు పోలీసులు చుట్టుముట్టారు. వేదికపైనున్న నాయకుల్ని కిందికి దించి, బలవంతంగా పోలీసు వ్యాను ఎక్కించటానికి ప్రయత్నించారు. శివంగిలా లేచింది భవాని. తూటాలా దూసుకుపోయింది. రైతుసంఘం నాయకుణ్ని లాక్కెళుతున్న పోలీసును ఒక్క తోపు తోసింది.

మహిళా పోలీసులు పరిగెత్తుకొచ్చి, భవానిని పెడరెక్కలు విడిచి పట్టుకొన్నారు. ఆమెను రక్షించుకోటానికి తోటి రైతులు, మహిళలు రాళ్లతో ఎదురుదాడికి దిగారు. ఆయుధాల అండతో పోలీసులు వాళ్ల ప్రయత్నాల్ని తిప్పి కొడుతున్నారు. ఆ హడావుడిలో భవాని కిందపడిపోయింది. చీరకొంగు ఆమె గొంతుకు బిగుసుకుంది. అది గమనించిన నాగమల్లి పోట్లగిత్తలా అటువైపు ఉరికాడు. భవానిని చుట్టుముట్టిన పోలీసుల్ని బీడుభూముల్లో గడ్డ విరిచిన చేతులతో విసిరి అవతల కొట్టాడు.

పోరు పురెక్కింది. అరగంటలోపే మరికొన్ని వందలమంది పోలీసులు చేరుకున్నారు.

నిరసన కేంద్రం యుద్ధక్షేత్రంలా మారింది. లాఠీలు పైకి లేచాయి. కాల్పులు గాల్లో ఎగిరాయి. తలలు పగిలాయి. చేతులు విరిగాయి. రెండువైపులా క్షతగాత్రులు ఎలమీద నిలబడ్డారు.

రెండు గంటల తర్వాత పాతిక మంది రైతులు తుళ్లూరు పోలీసుస్టేషన్‌లో ఉన్నారు. నాగమల్లి, భవానిలపై గట్టి కేసులు కట్టారు. జేఏసీ నాయకులు లాయర్లతో చేరుకునేసరికి సాయంత్రం అయిదు దాటింది. తిండిలేక నీరసించిన నాగమల్లికి మనవరాలు గుర్తొస్తోంది. అప్పటికి ఇరవై సార్లు భార్య నుంచి ఫోను. ఏం చెప్పాలో అర్థంగాక ఫోనెత్తలేదు.

అధికారిక ప్రహసనాల అనంతరం విడుదలైన నాగమల్లి, బస్సెక్కి రాత్రి ఎనిమిది గంటలకు ఇంటికి చేరుకున్నాడు. వేడుక చివరి అంకానికి చేరి, అప్పటికే అందరూ భోజనాలు చేస్తున్నారు.

చిరిగిన చొక్కా, దాన్నిండా రక్తపు మరకలు, కుడి మోచేతి కింద గాయం, కళ్లల్లో మిణుకు మిణుకుమంటున్న ప్రాణం... నాగమల్లిని ఆ స్థితిలో చూసి, అందరూ నోరెళ్లబెట్టారు.

ఎదురొచ్చిన రత్తమ్మ ఏడుపందుకుంది. "ఆ పోలీసు నా బట్టల సేతులిరిగిపోను. కాళ్లు పడిపోను. నోరూ వాయీ లేని మడిసిని కొట్టడానికి ఆళ్ల సేతులెట్టా వచ్చాయయ్యా..."

"ఇదిగో, నువ్వట్టా ఏడవమాకు. నాకేం గాలేదు. సొక్కా మార్చుకొని ఇప్పుడే వత్తా"నంటూ ఇంట్లోకి వెళ్లాడు నాగమల్లి. అయిదు నిమిషాల్లో ఉతికిన బట్టలు ధరించి, వేదిక దగ్గరకు వచ్చాడు.

"రండి నాన్నా. మీ ఆశీర్వాదం కోసమే మనవరాలు ఎదురు చూస్తంది" అంది కూతురు.

నాగమల్లి-రత్తమ్మ కలిసి అక్షింతలు వేశారు. డబ్బులు పెట్టిన కవర్ని పాప చేతుల్లో పెట్టారు.

వచ్చినవారంతా నిష్క్రమించారు. కూతురు, అల్లుడు, పిల్లలు పై అంతస్తులోకి వెళ్లారు.

నాగమల్లి, రత్తమ్మ కింద గదిలో పడుకున్నారు.

"యావయ్యో... నీకో సంగతి జెప్పాల" అంది భార్య తెచ్చిపెట్టుకున్న నవ్వుతో.

"చెప్పు" అన్నాడు నాగమల్లి, హూనమైన దేహానికి విశ్రాంతినిచ్చేందుకు ప్రయత్నిస్తూ.

"ఇందాక పెద్దమ్మాయి ఫోన్జేసింది. డిసెంబరులో వత్తన్నారంట. సిన్నోడికి పదకొండు, పెద్ద మనవడికి పదిహేనేళ్లు గందా... వాళ్లచ్చినప్పుడు ఇద్దరికీ గలిపి గనంగా పంచెల ఫంక్షన్ సెయ్యమని అడిగింది".

భార్య నవ్వు వెనక గూఢార్థం బోధ పడుతోంది. బలవంతంగా కళ్లు మూసుకున్నాడు.

అడవులు ప్రత్యక్షమయ్యాయి. బలిసిపోతున్న పిచ్చిచెట్లు. అడ్డదిడ్డంగా అల్లుకుపోతున్న ముళ్లతీగలు. అడవుల్లో చిక్కుబడిపోయాడు. ఎట్లా బయటికి రావాలో అర్థం కావటం లేదు.

అరుస్తున్నాడు. ఆక్రోశిస్తున్నాడు.. నినాదాలిస్తున్నాడు.

**(2023 జులై 9 నాటికి అమరావతి ఉద్యమం 1300 రోజులకు చేరుకుంది)**

■





# ఆచార్య సమతా దేశమానె ఆత్మకథ 'మాతంగి దివిటీ'

– డా॥ జి.శైలమ్మ
అసిస్టెంట్ ప్రొఫెసర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ పబ్లికేషన్స్
ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం – 517 426
96183 61905

**ఒ**క వ్యక్తి గురించి, ఆ వ్యక్తి చేసిన పనులు మంచివి, చెడ్డవి. తనకు తానే సమాజ శ్రేయస్సును దృష్టిలోవుంచుకొని చేసిన త్యాగాలు, సమాజంతో తనకున్న సంబంధాన్ని తెలియ జేసేవి జీవిత చరిత్రలు. వ్యక్తులు తమ గురించి తామే రాసుకొనే చరిత్రల్లో స్వీయచరిత్ర (ఆత్మకథ) యథార్థ సంగతులు, పోరాటాలు వుంటాయి. సంఘంలో ఆచారాలు, సంప్రదాయాలు, రాజకీయాలు విధి విధానాలుంటాయి. స్వీయ చరిత్ర రాసిన కవుల్లో మొదటి దళిత రచయిత్రి ఆచార్య సమతా బి. దేశమానె గారు. ఈమె కన్నడ రచయిత్రి. దళితుల జీవన విధానం, దళిత స్త్రీలతో మిగిలిన సామాజిక వర్గాల వారు ఎటువంటి సంబంధాలను కొనసాగిస్తున్నారు. దళిత స్త్రీలు అడుగడుగున పడుతున్న ఆవేదనలు, ఆహార సమస్యలు, ఆరోగ్య సమస్యలు, ఋణభారం, ఆర్థిక జీవన విధానం వంటివి వివరిస్తూ తామెదుర్కొన్న ప్రతికూల పరిస్థితులను తెలియజేస్తూ రచించారు. ఆత్మకథ మొదటిగా ఒక దళిత మహిళ రాయడం విశేషం.

సమతా బి.దేశమానె కన్నడంలో రాసిన ఈ ఆత్మకథను ఆచార్య కె.ఆశాజ్యోతి తెలుగులోకి తీసుకొచ్చారు. కర్ణాటక, కలబుర్గిలో వున్న మాదిగ కుటుంబం, ఆచారాల పేరుతో అనాగరికంగా జీవించే సంస్కృతినెదిరించి విద్యతో విలువైన జీవితానికి అర్థం చెప్పిన బాబురావు, రత్నమ్మ దంపతులకు ఎనిమిది మంది పిల్లలు. ఏడుగురు ఆడపిల్లలు, ఒక అబ్బాయి. వీరి ముందున్న సవాలు వారు ఈ పిల్లల్ని పోషించడం. వారు చెప్పులు కుట్టి జీవించొచ్చు కాని చెప్పులు కుట్టే పని చేయడం లేదు. ఇక ఆడపిల్లలను మాతంగికిచ్చి వివాహం చేసి మాతంగులుగా మార్చొచ్చు. అలా చేయలేదు. తమ పిల్లల్ని బాగా చదివించాలనుకున్నారు.

అందరిలాగే మానవ విసర్జితాలను మోసి పందులను పెంచుకోవచ్చు. కాని అలాంటి పనులు చేయడానికి ఏ మాత్రం ముందుకెళ్లలేదు. కొత్త మార్గాన్నెంచుకున్నారు. కూరగాయలు, పండ్లు అమ్మి జీవనం సాగించనారంభించారు. ఆ కుటుంబంలో ఒక్కొక్కరు ఒక్కో శక్తిగా ఆవిర్భవించారు. చుట్టూ కంపు, తాగునీటికి వెతలు, వర్షం వస్తే ఇల్లంతా ఒరిపిడి, వంటినిండా కప్పుకోడానికి దుస్తులు లేని స్థితి... కడుపు నింపుకోవడం కోసం శ్రమను పెట్టుబడిగా పెట్టారు. బతకడానికి ప్రతి చిన్న అవకాశాన్ని వినియోగించుకున్నారు. ఏడుగురు అమ్మాయిలు సమాజ శ్రేయస్సు లక్ష్యంతో పలు రకాల ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తించడం గమనార్హం. ఒక్కో అక్షరం దేశమానె జీవితంలో ఎదురైన సంఘర్షణ నుంచి మొలకెత్తినవి. డా॥ బి.ఆర్. అంబేద్కర్, మహాత్మపూలె ఆశయ కిరణాలు సమతా దేశమానె కుటుంబ సభ్యులు. డా॥విజయలక్ష్మి క్యాన్సర్ వైద్య నిపుణురాలై కుటుంబానికి మాదిరైనారు. సోదరుడు అజయ్ ఘోష్ నాయవ్యాదిగా స్థిరపడ్డారు. యుగాంత్రి మహిళాభివృద్ధి, సంక్షేమం కోసం పని చేస్తూవున్నారు. డా॥ సమతా దేశమానె బెంగుళూరు విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా సామాజికశాస్త్రం బోధిస్తున్నారు. సోదరి డా॥ జాగృతి అర్థశాస్త్ర అధ్యాపకురాలిగా విశ్వవిద్యాలయంలో పని చేస్తున్నారు. ఇలా అందరూ ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారు.

చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న సందర్భంలో కూడా తల్లి రత్నమ్మ తన కుమార్తె నాగరత్నమ్మను పి.హెచ్‌డి. పూర్తి చేయమని చెప్పి, ఉద్యోగం చేసే మరో కుమార్తెనడిగి 5 వేలు ఇచ్చి, చదువు ప్రాధాన్యాన్ని వివరించింది. "నాగూ! నువ్వు పిహెచ్.డి. చెయ్యి. అందరితో బాగుండు" (పు:167) అని చెప్పి కుమార్తెను ప్రోత్సహించింది. ఆ మాటను నాగరత్న

శిరసావహించారు.

ఆ కుటుంబంలోని పిల్లలు ఇరుగుపొరుగు వారితో వచ్చే గొడవలు ఎదిరించి ఘన విజయాలు సాధించారు. లండన్ ఆక్స్‌ఫర్డ్ రౌండ్ టేబుల్ సమావేశానికి భారతదేశ ప్రతినిధిగా వెళ్ళిన మొదటి మహిళ సమతా దేశమానె. దళిత సాహిత్య అకాడెమి పురస్కారానికి కర్ణాటక సమితి ప్రతినిధిగా ఎన్ని కయ్యారు. ఇండియన్ సోషియాలాజికల్ సొసైటీ శాశ్వత సభ్యులుగా ఉన్నారు. కర్ణాటక రచయిత్రుల సంఘంలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తూ సామాజిక శాస్త్ర అధ్యాపకురాలిగా విధులను నిర్వర్తిస్తున్నారు. "చనిపోయిన తరువాత తిరిగి బతకాలి అంటే ఒక పని చేసిపోవాలి. జనం చదవడానికి ఏదైనా రాసిపో. కాకపోతే నీ గురించి రాయడానికి ఏదైనా పని చేసిపో" అన్న అంబేద్కర్ మాటలు ఆమెకు అక్షరాలా సరిపోతాయి.

మాతంగి దివిటి ఒక మురికివాడలో పుట్టి, వీధిలో కూరగాయలమ్మి బతుకు నిర్మించుకోవాలని ప్రయత్నించి, తాను కోరుకున్న దానికంటే ఎక్కువ పొంది ఇప్పుడు బెంగుళూరు విశ్వవిద్యాలయంలో సమాజశాస్త్ర విభాగంలో ప్రొఫెసరైన అపురూపమైన కథగా సమాజం ముందు నిలబడుతుంది. మాతంగి దివిటిలో అవమానం, చైతన్యం, సవాలు, అవకాశాలు, బాధ, నిరాశ, హృదయం గాయపడే అంశాలు, అణచివేత, నిందలు అంటరానితనం ఎదుర్కొని అంధకారపు సమాజ కట్టుబాట్లను పటాపంచలు చేసిన ఒక దళిత కుటుంబం. వాళ్లు సాధించిన విజయ పరంపరలున్నాయి. 'అంటరానితనం' పాటించే ఉన్నత సామాజికవర్గంతో కలిసిపోవాలనుకున్నా కలవనీయని 'కులం' దూరం దూరంగా ఏదోక పని చేసుకుంటూ జీవనం సాగించే ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల వ్యథలున్నాయి.

బెంగుళూరు విశ్వవిద్యాలయంలో వీరి పర్యవేక్షణలో ఏడుమంది విద్యార్థులు పిహెచ్.డి. పట్టా పొందారు. కర్ణాటక ప్రభుత్వం 'రాజ్యయువ పురస్కారం', కిత్తూరు రాణి చెన్నమ్మ పురస్కారం, డా॥బాబు జగజ్జీవన్ రాం పురస్కారం ఇచ్చి గౌరవించింది. కర్ణాటక రచయిత్రుల సంఘం 'విశిష్ట రచయిత్రి' పురస్కారమిచ్చి గౌరవించింది. మూడు జీవన చరిత్రలు, మూడు కవితా సంకనాలు, ఇరవైకి పైగా వీరు పుస్తకాలు రచించారు. దీపపు నుసి ముఖాన్ని కమ్ముకున్నా దీపం వెలుగులో చేతులు కాల్చుకుని అత్యున్నత స్థాయికి వెళ్లిన సమతా మనందరికి ఆదర్శప్రాయురాలు.

యుగాత్రి, జాగృతి, విజయలక్ష్మి అక్కలు సమతా తల్లి చేస్తున్న కూరగాయలమ్మేపనిలో చేదోడువాదోడుగా వుండేవారు. మగవాళ్లు చేసే బలమైన పనులున్నా చేసేవారు. వారి చేత పేదరికం ఏ పనైనా చేయించగలిగే సామర్థ్యాన్నిచ్చింది. సమతా దేశమానె అక్క యుగాత్రి పడిపోయిన ఇంటిగోడను కట్టగలిగింది. ఇద్దరు ముగ్గురు కూలీలు కట్టే గోడను తనొక్కటే కట్టగలగడానికి కారణం కూలీకొచ్చిన వారికి డబ్బులిచ్చే స్థోమత లేకపోవడమే. దాంతో, కష్టపడి తమ ఇంటి పని తామే చేయడం నేర్చుకున్నారు.

**విజయలక్ష్మికి** చదువుకోవాలన్న పట్టుదల అణువణువునా వుండేది. ఈమె సమతకు అక్క. కూరగాయలంగడి చూసుకో మని విజయకు చెప్పి తల్లి బయటకు వెళితే పశువులు వచ్చి కూరగాయలు మేసి వెళ్లిపోయేవి. అవి మేస్తున్నా గమనించ కుండా విజయలక్ష్మి శ్రద్ధగా చదువుకునేది. పేదరికంలో ఆమెకు చదువు పట్ల వున్న శ్రద్ధను గమనిస్తూ వున్న శరణ బసవేశ్వర వాణిజ్య కళాశాల ఆచార్యులు రత్నమ్మకు విజయలక్ష్మి గురించి చదివించమని చెప్పేవాడు.

"రత్నమ్మా! విజ్జును తిట్టకు. ఆ అమ్మాయికి చదువు పిచ్చి పట్టింది. మా ఇంట్లో డబ్బు, పొలం, ఆస్తి, అంతస్తు అన్నీ ఉన్నాయి. కానీ ఎవరూ చదవరు. మీ పేదరికం వల్ల మీ వద్ద డబ్బు లేదు. అందుకే చక్కగా చదువుతారు. అది నీకు ఇప్పుడు అర్థం కాదు" (పు:50.) ఆచార్యులు విజయలక్ష్మి గురించి చెప్పడం తల్లికి ఎంతో ఆనందాన్ని కలిగిస్తుంది. విజయలక్ష్మి మెడిసిన్ చదివి, డాక్టరు అయ్యారు. కుటుంబానికి స్తంభంలా నిలబడ్డారు.

**సమతా దేశమానె భావస్ఫోరకమైన సందేశం**

"బంతిని ఎంత గట్టిగా నేలకు కొడతారో అంతే జోరుగా పైకి లేస్తుంది. నా ప్రయాణపు దారంతా ఎక్కువ భాగం ఇలానే సాగింది. నా ఆలోచనలు, కలలు, సమాధి కట్టాలని చూశారు. బతుకులోని రంగులను చెల్లాచెదురు చేసి దూరంగా నిలబడి హితవచనాలు పలికారు. ఇసుక మీద అంత:పురం కట్టి చీకటి నీడల వెంట వెళ్ళేలా గోరి కట్టారు. ఆ గోరీ పైనే సదా పరిమళించే పారిజాతపూల హారం పచ్చగా పరిమళిస్తోంది". అని సమతా దేశమానె పేర్కొన్నారు. యథార్థ జీవితంలో ఎదురైన శ్రమలు మంచికేనంటారు ఆమె. మూఢ నమ్మకాలతో సాగుతున్న ఆచారాలను వదిలేసి, కొత్త బతుకు ఎంచుకున్న ఒక దళిత కుటుంబం చదువు ద్వారా సాధించిన ప్రగతికి ఆమె కుటుంబం ఒక నిలువెత్తు నిదర్శనం. ఇప్పుడు వారు భారతదేశం గర్వించేలా ఉన్నతస్థాయిలో ఉన్నారు. 'మాతంగి దివిటీ' స్ఫూర్తినిచ్చే పుస్తకం. ఆ అనువాద ఆత్మకథను ద్రావిడ విశ్వవిద్యాలయం ప్రచురించింది.

■

## నడుస్తున్నాను

నడుస్తున్నాను
అవును,
నగ్నంగానే నడుస్తున్నాను.
నిజం
నిస్సిగ్గుగానే నడుస్తున్నాను.
ఆకలేస్తేనే గాని పంజా విసరని
జంతువుల మధ్య కాదు
ఆకలే చావని అక్రూరుల మధ్య
మగతనమే మనతనం అని
విర్రవీగే వికారుల మధ్య
ఆరంగుళాల అవయవమే
ఆయుధమని భ్రమించే వెర్రివాళ్ల మధ్య
నిర్భయంగానే నడుస్తున్నాను.

మట్టి గడ్డనయి నేను మారినపుడే కదా
విత్తులా వాడు నానుండి జన్మించింది
పాలకుండనై నేను పిండినపుడే కదా
వాడి కడుపు నిండి చెట్టయి పెరిగింది
మర్రిచెట్టులా ఎదిగిన వాడు
ఊడల్లా మట్టినే తొలిచి
నా మానాన్నే పెకలిస్తున్నాడు

వాడి ప్రతీకార పరపతికి
నా నగ్నత్వాన్ని ఊరేగిస్తున్నాడు.
వాడి లోపల వికారాల వినియోగానికి
నా రక్తమాంసాలు చిదిమేస్తున్నాడు
అయినా, నడుస్తున్నాను
మనుషుల ముసుగులో
మెదులుతున్న మృగాళ్ల మధ్యలో
వాడి అమ్మలా, అక్కలా, ఆలిలా
నడుస్తున్నాను.
నా శరీరం ఛిద్రమై,
నా అవయవాలు ముక్కలై
వికృత చేష్టల విలయానికి సమిధనై
ఈ (అ)నాగరిక సమాజ చరిత్రకి సాక్షినై
నడుస్తున్నాను.

**- బసు పోతన**
**9440878247**

## కవి మరణించాడు

**- డా.ఎన్. గోపి**

కవి మరణించాడు
వారసులు
అతని అముద్రిత రచనలను
రద్దీ కింద అమ్మేశారు
రాతి బాట్లతో దండె కొట్టే
పాత కాగితాల బేహారికి
వాటి విలువ తెలియదు.

అతడు అపురూపంగా
సేకరించుకున్న పుస్తకాలను కూడా
ఎవరెవరికో దానమిచ్చారు.
మిగిలిన గ్రంథాల కోసం
లైబ్రేరీల చుట్టూ తిరుగుతున్నారు
వాళ్లు బీరువాలడుగుతున్నారు!

ఒకప్పుడు అప్పులు చేసి
పుస్తకాలు అచ్చు వేశాడతడు
అడుగని వారికి కూడా
ఉచితంగా పంచేవాడు

ఆవిష్కరణ సభల్లో
వక్తలు ప్రశంసిస్తుంటే
కళ్లు మూసుకొని వినేవాడు
తన కవిత్వంతో
సమాజంలో మార్పును ఆశించేవాడు.

తండ్రి కీర్తి ప్రతిష్టలు
పిల్లలకు ఇష్టమే గాని
అతడెందుకు గొప్పవాడో
వారికి అర్థం కాని విషయం !

అతని రచనా వైభవం
అర్ధాంగికి పట్టలేదు
దానివల్ల
ఆమె పడ్డ బాధలు
ఆమెకే తెలుసు.

కవి శరీరానికి
ఆరడుగుల జాగా దొరికింది గాని
అతని కీర్తి కాయానికి మాత్రం
ఒక్క గది కూడా మిగల్లేదు !

■

## అనుభవైకం



**త**ల చుట్టూ పాత బట్ట
చేతిలో ఊత కర్రతో
ఎదురుపడిన తాతను అడిగాను
ఎలా వున్నావు తాతా అని ...

కళ్లకు చేతిని అడ్డం పెట్టుకుని
నన్ను చూశానన్న ఆనందంతో
మెరిసే కళ్ళతో
"ఏముందీ? నడిచినంతసేపూ బాగానే ఉంటుంది
ఎటొచ్చీ పడుకుంటేనే చేసేవారు లేరు" అన్నాడు

మరొకనాడు ఇలాగే ఎదురైతే
నీ పిల్లలు ఏం చేస్తున్నారు అని అడిగాను
మళ్ళీ అదే కళ్ళు.. అదే ఆనందంతో
"అన్నీ చేస్తున్నారు .. కానీ
నన్ను చూసుకోవడం తప్ప" అన్నాడు

ఒకానొక సాయంకాలం ఎదురైతే
"నీ ఆరోగ్యం ఎలా ఉంది తాతా" అని అడిగాను
కళ్ళు కలువపూవుల్లా విచ్చుకోగా
"నీకెదురొచ్చాను అంటే బావున్నట్లే కదా" అన్నాడు

వారం తర్వాత ఎదురుపడితే
"తిన్నావా తాతా?" అనడిగాను
"ఏం తిండి? ఆత్రం ఎక్కువ. ఆకలికి తక్కువ" అన్నాడు
"ఏం? ఒక్కడివే ఉన్నావా?"
"ఒక్కడిగానే వచ్చాను.. ఒక్కడిగానే పోతాను" అన్నాడు
నిర్లిప్తంగా.
మరి నీకంటూ ఎవరూ లేరా? అని అడిగాను
లేకేం? పడిపోకుండా పట్టుకుని నడిపించే భూదేవి తల్లి
నేనున్నాను అని భరోసా ఇచ్చే తండ్రి ఉన్నారు కదా?
అన్నాడు
ధైర్యంగా ముందుకు నడుస్తూ ...

మరి నీ భవిష్యత్ ఏమిటి? అని అడిగాను
ఆ మాట నచ్చలేదేమో తాతకి ముఖం చిన్నబోయింది
ఇప్పటిదాకా జరిగింది భవిష్యత్తే కదా
ఇంకా కావాల్నా బిడ్డా" అన్నాడు ముందుకు నడుస్తూ.

ఇన్నాళ్ళూ
నాదే కవిత్వమనుకున్నాను
కానీ ఇపుడే అర్థమయింది
అతని మాటలకు మించిన కవిత్వం ఏముంటుందని
ఆ అనుభవానికి మించిన భావం ఎక్కడుంటుందని?

**- శైలజామిత్ర**
**92909 00879**

**సాహిత్య ప్రస్థానం**
విలువైన పత్రిక .. విలువలున్న పత్రిక
**చందాదారులుగా చేరండి ..**
**మీ మిత్రులను చేర్పించండి ..!**
**వివరాలకు 94900 99057 ను**
**సంప్రదించండి.**




# విమర్శనా దారిదీపం దరి - దాపు

- కిరణశ్రీ
94904 00858

సాహిత్య సృజనకు ముడి సరుకు మానవ జీవితం. సాహిత్యం సమాజ ప్రతిబింబం. సృజన రంగంలో మంచి చెడ్డల్ని విడమర్చి చెప్పే దశగా విమర్శ అభివృద్ధి చెందింది. విమర్శనం ద్వారా ఉత్తమ సాహిత్యం ఎలాంటిదో తెలుసుకున్న పాఠకులలో తాము కూడా ఉత్తమ సాహిత్యానికి కృషి చేయాలని ప్రయత్నిస్తారు. సాహిత్య పఠనానికి విమర్శ దోహదం చేస్తుందనడంలో ఎలాటి అభిప్రాయభేదం లేదు. తెలుగు సాహిత్య విమర్శలో ప్రక్రియా విమర్శకు పట్టం గట్టిన విమర్శకుడు విశ్వనాథ సత్యనారాయణ. ఇతిహాసాలను, పురాణాలను, ప్రబంధాలను ఒకే కొలమానాలతో తూచకూడదని చెప్పిన ఆయన, పాశ్చాత్యులు ఎంతో విలువైందిగా భావించే జానర్ క్రిటిసిజంను తెలుగువారికి అలవాటు చేశారు. ఈ పంథానే కోవెల సంపత్కుమారాచార్య, తుమ్మపూడి కోటేశ్వరరావు, జి.వి.ఎస్. సుబ్రహ్మణ్యం, ముదిగొండ వీరభద్రయ్య, రాచపాళెం చంద్రశేఖర రెడ్డి వంటివారు అందిపుచ్చుకున్నారు. రాచపాళెం చంద్ర శేఖరరెడ్డి విమర్శపై కొత్తచూపును కలిగే విధంగా ఎన్నో విమర్శనా గ్రంథాలను వెలువరించారు. ఇప్పుడు కవిత్వంలో నిబద్ధత - నిమగ్నతలపై తనదైన శైలిలో గతంలో రాసిన వ్యాసాలే కాకుండా, 2022 వరకూ వచ్చిన వ్యాసాలను చేర్చి, మొత్తం 13 వ్యాసాలతో 'దరి-దాపు' పేరుతో ఆవిష్కరించారు.

మొదటగా 'రచయిత - నిబద్ధత' అన్న వ్యాసంలో ఒక తాత్విక నేపథ్యానికి, ఒక ఆలోచనా విధానానికి కట్టుబడి ఒక వర్గం పట్ల పక్షపాతం వహించి రచనలు చెయ్యడమే నిబద్ధత అని నిర్వచించారు. రచయిత నిబద్ధుడు కావడమంటే పీడిత ప్రజల పక్షాన నిలబడడమే అన్నారు. ఈ విషయాన్ని వివరిస్తూ నన్నయ వద్ద నుంచి ఆరంభించి, సంఘ సంస్కరణోద్యమం, జాతీయోద్యమం, అరసం, విరసం, దిగంబర కవిత్వం, స్త్రీవాద కవిత్వంలో రచయితలు నిజాయితీగా చూపిన నిబద్ధతను సోదాహరణంగా నిరూపించారు. విశ్వనాథ, శ్రీశ్రీ ఇద్దరూ నిబద్ధత గల రచయితలే కానీ ఎవరి నిబద్ధత ఎటువైపు అనే ప్రశ్నకు సమాధానాలు వేరువేరుగా ఉంటాయని చెప్పారు. తమ నిబద్ధతను చాటుకొని తమ చారిత్రక భూమికను నిర్వహించవలసిన బాధ్యత ప్రతి రచయిత మీద ఉందన్న విషయాన్ని గుర్తుచేశారు. 'రచయిత - ప్రాపంచిక దృక్పథం' అన్న వ్యాసంలో రచయితలను నడిపించేది ప్రాపంచిక దృక్పథమేనని చెప్తూ, కంటిముందు కనిపించే జీవితం పట్ల, ప్రపంచం పట్ల రచయిత అవగాహనే ప్రాపంచిక దృక్పథం అంటారు. ప్రాచీన కవుల ప్రాపంచిక దృక్పథంతో బాటు ఆధునిక కాలంలో తెలుగు సాహిత్యం మీద మార్క్సిజం ప్రభావం పడ్డాక రచయితలు సమాజాన్ని వర్గదృష్టితో విశ్లేషించారని అన్నారు. పీడించే వాళ్ళు, పీడింపబడే వాళ్ళు అనే దృష్టి ప్రబలిందని చెప్పారు. అలాగే సాహిత్యంలో కొత్త కొత్త ధోరణులు వస్తున్న కొలదీ కొత్త కొత్త విశ్లేషణలకు ప్రతిబింబంగా నిలిచిందని వివరణనిస్తూ, ఈ విశ్లేషణలకు దారి చూపించేది మాత్రం ప్రాపంచిక దృక్పథమే అన్న విషయం స్పష్టం చేశారు.

'సమాజ గమనం - సాహితీ సాక్ష్యం' అన్న వ్యాసంలో వ్యాస వాల్మీకులు పరిణామం చెందుతూ ఒక పరిపక్వదశకు చేరుకున్న ఫ్యూడల్ వ్యవస్థను భారత రామాయణాల్లో ప్రతిబింబించారని, తరువాతి కాలంలో వచ్చిన పెట్టుబడిదారీ వ్యవస్థ గురించి చెప్పి, ఒక వ్యవస్థ భిన్న కాలాలలో, భిన్న వర్గాలను ఎలా కదిలించిందో వివరించారు. సాహిత్యం ఆ విధంగా కాల ప్రవాహంతో పాటూ తానూ ప్రవహిస్తూ, కాల ముద్రికలను పసిగడుతూ వస్తుందని చెప్పారు. ఇది సాహిత్యం

నిర్వహించే బాధ్యత. చలన సమాజానికి సాహిత్యం కూడా స్పందిస్తుందని, సాక్ష్యంగా నిలుస్తుందని వివరించారు. 'సమాజ చైతన్యం - రచయిత చైతన్యం' అన్న వ్యాసంలో ఏ కాలంలోనైనా సమాజానికి ఒక చైతన్యం ఉంటుందని, అప్పటి ప్రజల ఆలోచనా విధానం, జీవిన విధానమే ఆ చైతన్యమని, అప్పటి సమాజ స్వభావంలో ఆ చైతన్యం ప్రతిధ్వనిస్తుందని తెలియజేశారు. రచయిత సమాజానికున్న చైతన్యంతో తన చైతన్యాన్ని సమన్వయం చేసి రచనలు సాగిస్తూ, అప్పుడున్న స్థితిని పేర్కొని, అసలుండవలసిన స్థితిని సూచిస్తాడని చెప్పారు. అయితే ఒకే కాలంలో రెండు మూడు రకాల చైతన్యాలుండడానికి కారణం రచయితల చైతన్యంలోని వైరుధ్యాలని విశ్వనాధ, చలం, మునిమాణిక్యాలను ఉదాహరిస్తూ చెప్పారు. రచయితలు ఎప్పుడూ ప్రతిపక్షంగా ఉండడం, సమాజం కన్నా ముందు నడవడానికి ప్రయత్నించడం సమాజ శ్రేయస్సని సూచించారు.

'సామాజిక సమస్యలు రచయితల బాధ్యత'లో రచయితలు సమాజంలో నుంచి తీసుకున్న వస్తువును తమదైన ప్రాపంచిక దృష్టితో విశ్లేషించి, ఎలా ఉండాలో చెబుతారని తెలియజేశారు. ఓల్గా నవల 'స్వేచ్ఛ'లోని 'నా మాట'ను ఉటంకిస్తూ రచయితలను పరిష్కారాలు అడగడం తెలివితక్కువ అని, అలా అడగొద్దని కొ.కు ఏనాడో చెప్పారని చెప్పిన మాటలకు స్పందిస్తూ, అరవై యేళ్ళ క్రితం కొ.కు చెప్పారని ఓల్గా అలా అనడం సరికాదన్న అభిప్రాయం వెలిబుచ్చారు. అసలు ఆ నవలలో ఓల్గా ఉమ - శ్రీధర్ల స్వేచ్ఛా కలయికను ప్రత్యామ్నాయంగా చూపడం, పరిష్కారాన్ని సూచించడమే అన్న అభిప్రాయం వెలిబుచ్చారు. 'రచయిత కంఠస్వరం'లో రచయితలకు సమాజం నచ్చితే ప్రశంసిస్తారని, నచ్చకపోతే విమర్శిస్తారని, దీని వెనుక వారి ఆర్థిక, సాంఘిక నేపథ్యాలు, తాత్విక, రాజకీయ దృక్పథాలు ఉంటాయని అన్నారు. వీటిలోనుండే రచయిత కంఠ స్వరం వినిపిస్తుందని, ఆ స్వరమే వారి పక్షపాతాన్ని, ఆలోచనలను బహిర్గతం చేస్తుందని చెప్పారు. అయితే రచయిత కంఠ స్వరం ఎప్పుడూ సమాజాన్ని నిన్నటికన్నా ఇవాళ, ఇవాల్టికన్నా రేపు ఇంకొంచెం అందంగా మలచడానికి చేసే ప్రయత్నమే ఈ ధిక్కార కంఠ స్వరమని పేర్కొన్నారు. 'సాహిత్యం - స్థలకాలాలు'లో సాహిత్యం ఎప్పుడూ స్థలకాల నిబద్ధమై ఉంటుందని వివరిస్తూ, జాగ్రఫీ లేకుండా సాహిత్యం పుట్టదని కవి శివారెడ్డి అన్నారని, సార్వత్రిక దృష్టితో చూడడం వల్ల చాలా అనర్థాలున్నాయనీ, ప్రాచీన సాహిత్యాన్ని స్థలకాలాదుల్లో చూస్తేనే మనకు వాస్తవం బోధపడుతుందని సూచించారు.

సాహిత్య సృష్టి ఒక ఎత్తైతే, దానిని అవగాహన చేసుకోవడం మరో ఎత్తని, రచయిత అనుభూతికి, విమర్శకుని అనుభూతికి మధ్య ఏర్పడే స్పర్ధ గాని, సమన్వయం గాని సాహిత్యావగాహన అవుతుందని అన్నారు. ఇటీవల సాహితీ పరుల్లో వచ్చిన విపరీత ధోరణి చరిత్రను తిరస్కరించడమని ఆవేదన వ్యక్తం చేసారు. నాతోనే పొద్దు పుట్టింది అనుకోవడం అశాస్త్రీయమని 'సాహిత్యావగాహన-శాస్త్రీయత'లో అన్నారు. నిబద్ధత అనేది ఏ రచయితకైనా అవసరమని, నిబద్ధత లేకుండా సాహిత్య సృష్టి జరగదని, ఇటీవల సిద్ధాంతాల పేరుతో రాద్ధాంతాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పోకడలు సంఘానికి మేలు చేయకపోగా, కీడే ఎక్కువ చేస్తాయని 'నిబద్ధత- సృజనాత్మకత'లో ఉద్బోధించారు. సంస్కృతి సమాజం సృష్టి. సమాజం ప్రజలందరి నివాస స్థలం. సంస్కృతి కూడా ప్రజలదే! సంస్కృతి కొందరి గుత్త సొత్తు కాదని 'సమాజం-సంస్కృతి'లో విశదీకరించారు.

సమాజంలో ఎప్పుడూ పురోగమన వాదులూ, తిరోగమన వాదులూ ఉంటారని, రచయితల మధ్య నిరంతరం ఘర్షణ జరుగుతూనే ఉంటుందని అందువల్ల 'అటా ఇటా? నువ్వెటువైపు' అని నిర్ణయించుకోవాలేగానీ తామరాకు మీద నీటుబొట్టులా ఉండొద్దని చెప్తారు. 'అభ్యుదయ సాహిత్యం' శ్రమను గౌరవిస్తుందని, శ్రమైక జీవన సౌందర్యాన్ని వర్ణిస్తుందని, దోపిడీ వర్గాన్ని ప్రతిఘటిస్తుందని చెప్పారు. ఈ రకం సాహిత్యమెప్పుడూ ప్రజాపక్షమే వహిస్తుంది. చివరిగా 'సాహిత్య విమర్శ'లో విమర్శ ఒక ప్రజాస్వామిక ప్రక్రియ అని, రచన చేయడం రచయిత హక్కయినట్లే, విమర్శకులకు ఆ రచనను ఆమోదించే హక్కు, వ్యతిరేకించే హక్కూ ఉంటాయని అన్నారు. పాఠకులను ప్రేమించే విమర్శకులెవ్వరూ పాఠకులకు అర్థం కాని విమర్శ రాయరని, భాషాడంబరంతో భయపెట్టకూడదని చెప్పారు. ఈ 'దరి-దాపు' గ్రంథం రచయితలకు, విమర్శకులకు శాశ్వత దారిదీపమై నిలుస్తుంది. ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి విమర్శనా మకుటంలో మరో కలికితురాయి అని చెప్పుకునే గ్రంథం ఇది. ■


**సాహిత్య ప్రస్థానం**

విలువైన పత్రిక .. విలువలున్న పత్రిక

**చందాదారులుగా చేరండి .. మీ మిత్రులను చేర్పించండి ..!**

## వివస్త్ర భారతం



ఇంకా చెప్పు
కోడానికేముంది
దేశం గురించి
దేహపటం గురించి
గత వైభవం గురించి
ఘన కీర్తి గురించి
ధర్మాల గురించి దైవాల గురించి
వేదాల గురించి మనువాదాల గురించి
పుక్కిట పురాణాల గురించి
పుచ్చు పట్టిన వ్యవస్థ గురించి
వీధుల్లో విశ్వవేదికల్లో
ఒట్టి మాటలు నంగి కూతలు
దొంగ వేదంతాలు వల్లి వేయటం తప్ప
నిత్యం సత్యం వధ చర్మం చెర
నిజం పలికితే నాలుకలు నేల మీద తెగిపడతాయి
మానాలు మంట కలిసి పోతాయి
హక్కులను అడిగిన అన్యాయాల్ని వేలెత్తి చూపిన అమ్మతనాన్ని
ఆడతనాన్ని వీధుల్లో ఊరేగిస్తారు
సిగ్గుపడడానికి ఏముంది!
శీలం శిలువేశాక
మానం బహిరంగ రహస్యమై మిగిలాక
కన్నీళ్లు కార్చిన కాళ్లు కడిగిన
జాతీయ గీతాలు పాడిన
జాతీయ పతాకాలు ఒంటికి కప్పిన
దేశం వివస్త్రమై మిగిలాక
ఇంకా ఏం మిగిలింది చెప్పుకోవడానికి?
ఒక ఆదిమ సంస్కారం బరితెగించి
ఆంబోతై బలహీనులను కుమ్ముతుంటే
దండనాధికారం చేష్టలుడిగి కూర్చుంటే
ఇంకా చెప్పుకోడానికి ఏముంది!
కన్న భారతి కౌరవ సభలో ద్రౌపదిగా నిలబడ్డాక
దేశం ఇప్పుడు ఒక ధృతరాష్ట్రం !

- లోసారి సుధాకర్
99499 46991

## ముసురుకున్న మబ్బులు

ఆ మబ్బులు నడుస్తున్నాయి
ఊరుముతున్నాయి
గోదారి తీరంలో కదులుతున్నాయి
పోలవరం ప్రాంతంలో సాగుతున్నాయి-

గాలిసోకితే చాలు వానై రావటానికి
ఎన్నెన్ని మబ్బులో
కళ్ళలో వత్తులేసుకు చూస్తున్నాయి
కదలే మేఘాల వలయాలతో కలవాలని
ఎన్నెన్ని మబ్బులో
ఆశగా ఆలోచిస్తున్నాయి
జబ్బుతో మబ్బులు
దెబ్బ తగిలి గిజగిజలాడుతున్న మబ్బులు
ఊళ్లకు ఊళ్ళు ఖాళీ చేస్తున్న మబ్బులు
వలస రెక్కలు తొడుక్కున్న మబ్బులు
అస్తిత్వాన్ని కోల్పోతున్న మబ్బులు
ఉనికిని వదులుకుంటున్న మబ్బులు
ఇప్పపూల పరిమళాలకు
దూరమౌతున్న మబ్బులు
సహజ వనరులు వసంతాలు
ఎండమావులై రోదిస్తున్న మబ్బులు
ఏ మబ్బుని తాకిన స్పృశించినా కదిపినా
కనిపించేది ఉరుమే
వినిపించేది పిడుగుల మాటలే
వళ్లంతా సలుస్తున్న పునరావాస పుళ్ళతో
పొంచివున్న ముంపు గుండెపోట్లతో
ఏకాకిలవుతున్న దిగులు గాయాలతో
కదులుతున్న మబ్బులు
ఉరిమి, గర్జించి కుండపోతలవ్వాలని
అడుగులో అడుగేసి
కదులుతున్న మబ్బులు-
ఆమబ్బుల్ని తాకే
ఉపశమన గాలులు వీచే వరకు
ఆ మబ్బుల నుంచి
నవ్వుల పూలు కురిసేవరకు
ఇలా ...
నవజీవన చైతన్య ప్రవాహం సాగాలి
అడుగులో అడుగేసుకు నడవాలి!

- బొడ్డ కూర్మారావు
99595 00360



# ఉంగటం తెగింది!

- డా. శాంతి నారాయణ
95022 36670

**సు**ంకన్న ఇల్లంతా ఆనందం విరబూస్తా వుంది. పట్టణంలో ఎవరింటికీ రాని, ఇంట్లో ఎవరూ వూహించని అపురూపమైన పండగ అతని ఇంటి ఆవరణంలోకొచ్చి వాలిపోయింది. తమ జీవితాలకు కొత్త వెలుగునిచ్చిన ఆ పండగతో ఇంటిల్లిపాదీ మురిసిపోతావుంది. సుంకన్న తల్లిదండ్రుల ముఖాల్లో తరతరాల శ్రమజీవన సాఫల్యత కళకళలాడుతావుంది. బోసినవ్వుల్లో అంతులేని సంతృప్తి పరిమళిస్తావుంది. సుంకన్న ముఖంలో విజయసాధన గర్వం తొణికిసలాడతా వుంది. శరీరమంతటా శ్రమజీవన కళ నిగనిగలాడతా వుంది. అపురూపమైన సంభ్రమ ఆశ్చర్య ఆనంద ఉద్వేగాలకు లోనయిన శరీరంలో నుంచి ఉబికివస్తున్న స్వేదజలంలో శ్రమసుగంధాలు, మాగువాసనల్ని వెదజల్లుతున్నాయి. అతని భార్య నాగమ్మ కళ్లల్లో, ముసుగు వేసుకున్న యుగయుగాల ఆశాకాంతి విచ్చుకోసాగింది. కూతురు సుశీల పెదవుల మీద సంతోష సరాగాలు జాలువారుతున్నాయి.

ఆరోజు ఇంటర్ ఫలితాలొచ్చినాయి. సుంకన్న కొడుకు రమేష్‌కు స్టేట్ ఐదో ర్యాంకు వచ్చింది. ఫలితాలు వచ్చిన గంటసేపటికే ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్‌తో పాటు కొంతమంది లెక్చరర్లూ, ఇంటర్‌మీడియట్ బోర్డు జిల్లా అధికారులూ సుంకన్న ఇంటికి వచ్చి సుంకన్న దంపతులనూ రమేష్‌నూ ఆనందోత్సాహాలతో అభినందించినారు. తమ విద్యార్థికి స్టేట్ ర్యాంక్ రావడం తమ కళాశాలకే కాకుండా రాష్ట్ర ప్రభుత్వ జూనియర్ కాలేజీలన్నింటికీ గర్వకారణమని పొగడి, సుంకన్న దంపతులకూ, రమేష్‌కూ శాలువలు కప్పి పూల బొకేలు అందించి సత్కరించినారు. సుంకన్న జీవిత వృత్తిని తెలుసుకొని ఆశ్చర్యపోతూ మరింత హర్షాతిరేకంతో అభినందనల వర్షం కురిపించినారు. సరిగ్గా అప్పుడే సుంకన్న కుటుంబానికి ఆత్మబంధువైన తరిమెల అమరనాథ్ వచ్చి స్వీట్ పాకెట్ అందించి, రమేష్‌ను అక్కునజేర్చుకొని మురిసిపోయినాడు.

అధికారుల ఆత్మీయుల రాకతో ఆ ఉదయం ఎన్టీఆర్ కాలనీ అంతా కొత్త కళను సంతరించుకుంది. సుంకన్న కుటుంబం కారణంగా తమ కాలనీకంతా గొప్ప పేరొచ్చిందని కాలనీవాసులు గర్వంగా చెప్పుకుంటూ, కుటుంబ సభ్యులందరినీ గౌరవంగా పలకరించి చేతులు చేతులు కలిపి మురిసిపోయినారు. దాదాపు పదకొండు గంటల వరకూ వచ్చీపొయ్యేవాళ్లతో సుంకన్న ఇంటిలోగిలి అంతా వూపిరి పీల్చుకోలేనంత సందడితో కళకళలాడింది. సందడి తగ్గిపోయినాక కుటుంబసభ్యులందరూ వొకచోట కూర్చొని వొకరికొకరు ఆనందాన్ని పంచుకున్నారు. అందరి ప్రోత్సాహంతో ఎమ్‌సెట్‌కు బాగా ప్రిపేర్ కావాలనుకున్నాడు రమేష్. ఎమ్‌సెట్‌తోపాటు ఐఐటీకి కూడా ప్రిపేరయితే బాగుంటుందని, ఇంటర్లో మాదిరే వాటిల్లో కూడా మంచి ర్యాంకు తెచ్చుకుంటే బాగా పేరున్న విద్యాసంస్థల్లో ఫ్రీసీట్ వొస్తుందని, ఫ్రీసీటొస్తే నాయనకు చదివించే భారం వుండదని, అమ్మానాన్నల సంపాదనతో కుటుంబం ఇబ్బంది లేకుండా నడుస్తుందని తమ్మునికి ప్రేమగా హితబోధ చేసింది సుశీల. డిగ్రీ ఫైనల్ చదువుతున్న సుశీల మాటలు ఆ ఇంట్లో అందరికీ నీతి సూత్రాలే.

తరతరాల నుంచీ విద్యాగంధం లేని కుటుంబం సుంకన్నది. తరిమెలలో వూరవతల మాదిగగేరిలో వెట్టి మారెప్ప కొడుకుగా, చదువుమీద మనసు పడి, తండ్రి ప్రోద్బలంతో చదువుకుంటున్న సుంకన్న, ఏడవ తరగతిలో ఉన్నప్పుడు వొకనాడు తన కులం కారణంగా జరిగిన అవమానంతో చదువు మానేసి వృత్తి పనికీ కూలి పనికీ దిగి, తండ్రి మారెప్పకు చేదోడు వాదోడయినాడు. పెళ్లయి ఇద్దరు పిల్లలు పుట్టి పెరుగుతున్న కాలంలో ఎన్నో యిబ్బందులు ఎదుర్కొన్న సుంకన్న, మారుతున్న కాలపరిస్థితులను గమనించి వొక దృఢమయిన నిర్ణయంతో పల్లెనుంచీ పట్నం చేరుకున్నాడు.

తరిమెల నాగిరెడ్డి పుట్టిన నేల ప్రభావమో, తనకంటే వయసులో పెద్దవాడయిన తమ తరిమెల అమరనాథన్న మాటల ప్రభావమో, శ్రమశక్తిని మాత్రమే నమ్ముకొని పట్నం నడిబొడ్డున పాపులర్ షూమార్ట్ ముందర కులవృత్తిని నీడగా చేసుకొని జీవితాన్ని ప్రారంభించినాడు సుంకన్న. చాలా క్రమశిక్షణతో, నిర్లక్ష్యానికి చోటివ్వకుండా, చెప్పులు కుట్టే తన వృత్తిపట్ల ప్రేమాభిమానాలు పెంచుకొని శ్రమపడుతూ, ఇతర ఏ దురలవాట్లకూ లోను కాకుండా ఏడుకేడుకు శ్రమఫలితాన్ని పెంచుకోసాగినాడు. వేన్నీళ్లకు చన్నీల్లు తోడు చేసుకున్నట్లు, తన భార్య నాగమ్మను డ్వాక్రా మహిళాసంఘంలో చేర్చి దాని ద్వారా వొక కుట్టు మిషన్ ఏర్పాటు చేసినాడు. నాగమ్మ కూడా ఐదో తరగతి వరకూ చదువుకోవడంతో చాలా తెలివిగా హుషారుగా ఇంట్లోనే కాలనీ వాళ్ల బట్టలు కుడుతూ సుంకన్న శ్రమకు తన శ్రమనూ జతచేస్తూ సంసారాన్ని చక్కబెట్టుకోసాగింది. పిల్లల చదువుల్ని ప్రోత్సహిస్తూ, చదువులకు అంతరాయం కలగకుండా కూతురూ కొడుకులిద్దరినీ ఇంటి పనుల్లో పాలుపంచుకునే విధంగా తీర్చిదిద్దుతూ, వృద్ధులయినా ఆరోగ్యంగా నిమ్మళంగా 'తొద' లేకుండా వున్న అత్తామామల్ని కన్న తల్లిదండ్రుల మాదిరి ప్రేమగా చూసుకోసాగింది నాగమ్మ.

ఒక చిన్న బాడుగ ఇంట్లో 'జీనుత్తం'గా ప్రశాంతంగా సక్రమమయిన పద్ధతిలో కుటుంబాన్ని నడుపుతూ పిల్లల్ని ప్రభుత్వ విద్యాలయాల్లోనే శ్రద్ధగా చదివించుకుంటూ ఇరవయ్యేండ్ల కాలంలో నాలుగురాళ్లు వెనకేసుకున్నాడు సుంకన్న. విద్యావంతురాలైన కూతురు సుశీల సూచన మేరకు తమ కాలనీ పక్కనే వొక మూడుసెంట్ల ఇంటి స్థలాన్ని కొనుక్కున్నాడు. తమ వంశంలో డిగ్రీ కాలేజీ మెట్లెక్కిన మొదటి వ్యక్తి తమ కూతురేనని గర్వపడే సుంకన్న దంపతులిద్దరూ, ఆ అమ్మాయి సూచన ప్రకారమే, తమ ఇంటికి ఆత్మబంధువయిన తరిమెల అమరనాథన్న సహకారంతో ప్రభుత్వం కట్టించి ఇచ్చే యింటిని మంజూరు చేయించుకున్నారు. ఇంటికి వొక వైపున యింకా ఖాళీ స్థలం వుండడంతో ఆ యింటికి అదనంగా మరొక రెండు రూములు కట్టించుకొని ఈ మధ్యనే ఆ ఇంట్లో చేరుకుంది సుంకన్న కుటుంబం. ఆ కొత్త యింటిలోనే ఇప్పుడు సరికొత్త పండగ కళ పరిమళిస్తావుంది.

ఆ రోజు చెప్పుల కుట్టే పనికి తనకు తానే సెలవు ప్రకటించుకున్నాడు సుంకన్న. ఇంట్లో అందరికీ చేపల కూర ఇష్టమని, అమ్మానాయనలు మటన్‌ఖైమా అంటే లొటకలేస్తారని ఇంట్లో నాగమ్మకు చెప్పి, ఆమె చెప్పిన మార్కెట్ దినుసులన్నీ రాసుకొని సైకిలెక్కి మార్కెట్టుకు బయలుదేరినాడు.

సుంకన్న సైకిల్ తొక్కుతున్నాడే గానీ అతని మనసు గాలిలో తేలిపోతావుంది. ప్రతిరోజూ ఠంచనుగా తొమ్మిదన్నరకు బయలుదేరి వెళ్లే సుంకన్న ఈ రోజు పదకొండు గంటలప్పుడు పోతున్నాడేమిటబ్బా అని, విషయం తెలియని కొందరు వింతగా చూస్తూ అడుగుతున్నారు. అందరికీ ఆనందంగా విషయం చెప్పుతూ ముందుకు సాగిపోతున్నాడు సుంకన్న. తన అత్తామామలకు వక్కాకు సంగతి మరిచిపోవద్దని, పాతూరు కాయగూరల మార్కెట్టు మొగదాల తమలపాకుల నరసమ్మ దగ్గర మంచి 'కవటాకులు' వొక కట్ట తీసుకొని రమ్మని, తరిమెల రంగయ్యసెట్టి అంగట్లో బొరుగొక్కలూ, వడుగూరు పొగాకూ, కట్లపొడీ వొక నెలకు సరిపొయ్యేటంత తెమ్మని నాగమ్మ పదే పదే చెప్పిన మాటలు గుర్తుకొచ్చి తృప్తిగా నవ్వుకుంటూ గాంధీబజారు చేరుకున్నాడు సుంకన్న.

అనంతపురం పాతూరు గాంధీబజారూ తాడిపత్రి బస్టాండూ ఆ పక్కనే వున్న కూరగాయల మార్కెట్టూ ఎప్పటిమాదిరిగానే రద్దీగా వున్నాయి. జనం సంతజేస్తున్నట్లు బిలబిల పారాడుతున్నారు. చేపల మార్కెట్టుకు పోడానికి ముందే నాగమ్మ చెప్పిన సరుకులన్నీ తీసుకునేది మేలనుకొని ముందుకుపోతూ, వొక షాపుదగ్గర సైకిల్ దిగి స్టాండ్‌వేసి షాపు పైనున్న బోర్డు వైపు ఎగాదిగా చూడసాగినాడు సుంకన్న. 'తరిమెల రంగయ్యశెట్టి హోల్‌సేల్ డీలర్స్' అని పేరు కొంచెం కొత్తగా కనిపించడంతో 'అదా కాదా' అని తటపటాయించినాడు.

'రేయ్ సుంకా, యేమి యెగాదిగా చూస్తాండావు? షాపు మనదేరా! ముందుపక్క రోంత డిజైన్ మార్చి, పేరు గుడకా మనూరి పేరుండేతట్ల మార్చినాంలే... రా రా, యేమి శానా దినాలకొస్తివే!' అంటూ లోపల వక్కలు తూకమేస్తున్న రంగయ్యశెట్టి పిలవడంతో సుంకన్న మెటికలెక్కి షాపులోకి పొయినాడు.

'నాలుగైదు నెల్లకిందట వొచ్చినప్పటికీ యిప్పటికీ రోంత తేడా కనిపీడంతో మీ అంగడి యిదేనా కదా అని డౌటొచ్చిందయ్యా! అందికే యెగాదిగా జూస్తి... అందరూ బాగుండారా సావుకారీ? వూరి కాడ మీ అన్నయ్య తిప్పయ్యసావుకారీ ఆయిన పిల్లోల్లూ అందరూ బాగుండారా? మనూరికాడుండే తోటను ఉప్పరోల్ల గంపన్నకు గుత్తకు ఇచ్చినారంటనే, యాల సావుకారీ?' అని వుండూరి సంగతులు ప్రస్తావించినాడు సుంకన్న.

'అవున్రా సుంకన్నా. ఇప్పుడు పల్లెల్లో మా యట్లావాళ్లు వ్యవసాయం సొంతంగా చేయిచ్చుకుండేకి అయితాదేమప్పా? కోరుకో గుత్తకో చేసుకోడానిగ్గాడా యెవురూ ముందుకు రావడంల్యా. నీళ్లేమో బోర్లల్లో దండిగా వుండాయి. పన్జేసే మనుషులే కరువయిపోయినారు. మొన్నటిదంకా వాన్లు రాక, తుంగబద్ర కాలవనీళ్లు సరిగ్గా అందక, బోర్లన్నీ యెండిపోడంతో సన్నకారు రైతులు శానామంది వ్యవసాయం యెగపెట్టి టవున్లు చేరుకుండ్రి. మీయట్లా మాలా మాదిగోల్లుగుడకా వొళ్లొంచి కూలిపనులకు పొయ్యేకి నచ్చక, నీ మాదిరే వొగొగరు మెల్లిగా అనంతపురం చేరుకుండారు. ఇంగ ఆడే వుండే వాళ్లయినా, యెవుడూ సేద్యం పనులకు పొయ్యేకి ఇష్టం ల్యాక మొగం తిప్పుకుంటావుండారు. ఉపాదిహామీ పనుల పేరుతో గవుర్మెంటు

వ్యవసాయాన్ని గబ్బులేపిందిరా! ఇప్పుడు ఆ పనులకు పొయ్యేకి గుడకా జనం సుముఖంగా లేరంటప్పా! యేంటివేంటివో పతకాల పేర్లతో గవుర్మెంటు జనాన్ని కుచ్చోబెట్టి మేపుతా అందర్నీ శ్రమపడే దానికి దూరం జేస్తావుంటే యింగెవురు కూలి పనులకు వొస్తా రప్పా? అలగా జనానికి యిట్ల దానం చేసుకుంటాపోతే వాళ్ల జీవితాలు బాగుపడతాయేమిరా?'

రంగయ్యశెట్టి తరిమెలలో తమ తోట బీడుపడిందన్న అక్కసుతో బీదా బిక్కినీ ప్రభుత్వాలనూ కొంచెం ఘాటుగానే ఆడిపోసు కున్నాడు. అతని మాటల్లో కొంత వాస్తవముందని అనిపించినా పేదోల్లందరినీ అతడు 'అలగాజనం' అని అన్నప్పుడు సుంకన్న మనసు చివుక్కుమనింది. అయితే తమ వూరి షావుకారి, చిన్నప్పుడు అతని పొగాకు వ్యాపారంలో కూలికి పోతా, వాళ్ల చిల్లరంగట్లో అప్పోసప్పో చేసి సరుకులు కొంటా, వాళ్ల పొలాల్లో కూలి పనులు చేస్తా వాల్లు పెట్టింది తింటా బతికిన తను, ఆయనతో వాదనకు దిగగలడా? అందుకే చెప్పినదంతా మవునంగా విన్నాడు తప్ప పెదవి విప్పి మాట్లాడలేదు సుంకన్న. అతని మౌనాన్ని గమనించిన రంగయ్య ఏమనుకున్నాడో యేమో! తమ పల్లెసంగతులు పక్కనపెట్టి, 'పల్లె నుంచీ తెగదెంపులు చేసుకో నొచ్చినవానికి నీకేం తెలుస్తాయిలేరా అక్కడుండే రైతుల పడుబాట్లు? సరే గానీ, ఏమొచ్చినావు? వక్కలూ పొగాకూ కావల్లనా?' అని అడిగినాడు. అక్కడ దొరికే పొగాకు మట్టలూ కట్లపొడీ వక్కలూ తొందరగా తీసుకొని పోవల్లని, ఏవేవి ఎన్నెన్ని కావల్లనో చెప్పి నాడు సుంకన్న. ఒక కేజీ పొగాకూ నాలుగు శేర్లు కట్లపొడీ ఇన్నూరు గ్రాములు వక్కలూ కట్టివ్వమని అంగట్లోని పని మనిషిని పురమాయిస్తూ, 'ఇంగా ఆడే, నా ఫ్రెండ్ కోటేశ్వర్రావుగాని పాపులర్ షూమార్ట్ దగ్గర్నే అదే పని చేసుకుంటా వుండావేమిరా? టౌనుకొచ్చి శానా దినాలాయగదా. యాడన్నా కొట్టమో గిట్టమో యేసుకుండావా?' అని అడిగినాడు రంగయ్య. ఆ అడగడంలో చులకనభావం వినిపించింది సుంకన్నకు.

'పనేమో ఆడే చేసుకుంటా వుండానయ్యా! రుద్రంపేట అవతల ఎన్టీఆర్ కాలనీ పక్కన రోంత స్థలం తీసుకోని రెండ్రూములు యేగేసుకుండాను సావుకారీ' అని చెప్పుతా, అంగట్లోని మనిషి కట్టించిన సరుకులు తీసుకొని డబ్బులిచ్చినాడు సుంకన్న. వొక యాభై రూపాయల నోటు వెనక్కిస్తూ, 'పర్వాలేదులేరా, తీసుకో...' అంటూ వుండూరి ప్రేమను చూపించినాడు రంగయ్యశెట్టి.

'మండీ అంగడిగా మార్చినంక చిల్లరగా యెవురికీ అమ్మడం లేదురా! రాక రాక నువ్వొచ్చినావని ఇస్తావుండాను. షాపులో పని చేసే మనుషులు దొరక్క శానా యెడాముడిగా వుందిరా సుంకా! మీ మాదిగోల్ల పిల్లోల్లయినా పరవాలేదు, యెవురయినా వుంటే కొంచెం సూడప్పా! అవును నీ కొడుకుండాడు గదా, వీలయితే వాన్ని పంపు. తెలిసినోడయితే రోంత నమ్మకంగా వుంటాడు. జీతం బాగనే ఇస్తాలే' అని వల విసిరినాడు రంగయ్య. అంతలోనే ఇద్దరు మనుషులొచ్చి రంగయ్యకు నమస్కారం చేసి, అతని సీటు వెనక గోడకు వొక ఫ్లెక్సీ తగిలించినారు. అదేమోటో నని చూస్తూ 'పై భాగంలో పెద్ద కమలం గుర్తు, దానికింద భారతీయ జనతా పార్టీ అనే అక్షరాల కింద తరిమెల రంగయ్య శెట్టి పేరు, పేరు పక్కన బిజెపి జిల్లా కార్యదర్శి' అని రాసినదంతా చదివి అర్థం చేసుకొని 'పొయ్యొస్తానయ్యా' అని చెప్పి షాపు బయటికొచ్చి సైకిలెక్కి మార్కెట్టు వైపు వెళ్లినాడు సుంకన్న. నాగమ్మ చెప్పినవన్నీ కూరగాయల మార్కెట్లో తీసుకొని ఆ తర్వాత చేపలూ మటన్ ఖైమా కొట్టించుకొని ఇంటికి బయలుదేరినాడు.

సైకిల్ తొక్కుతూ రంగయ్యశెట్టి, మాటల్నీ తరిమెలలో అతని వ్యవహారాన్నీ గుర్తుచేసుకోసాగినాడు.

ఈయన దృష్టిలో బీదాబిక్కీ అలగాజనమన్న మాట! ఆ జనమే ల్యాకుంటే తమ తరిమెలలో ఈయన చిల్లరంగిట్లో అంత సంపా దిచ్చుకుండేవాడా? ఈ పొద్దు అనంతపురం గాంధీ బజార్లో ఇంత పెద్దషాపు పెట్టి లక్షల్లో యాపారం చేసుకుండేవాడా? ఆ వేణుగోపాల్ నగర్లో అంత పెద్ద మాడీ ఇల్లు కట్టిచ్చుకుండేవాడా? మాదిగీ మాలోల్లయినా పర్వాలేదు, మండీ అంగిట్లో పన్జేసేకి వొగ పిల్లోడు కావల్లంట! తన కొడుకయితే రోంత జీతం యెక్కవ యిస్తాడంట! సన్నప్పుడు తాను నమ్మకంగా పన్జేసినాడని, నాలుగు మాటలు తిట్టినా పడుంటాడని, అందుకే తన కొడుకయితే తన మాదిరే నోరెత్తడని శెట్టి శానాదూరం ఆలోశెన చేసినట్లుంది. తనను గాట్లో యేసుకుండేకేనేమో, సరుకుల లెక్కలో వొగయాభై తక్కువ తీసుకుండాడు! తన కొడుకు ఇంటర్లో రాష్ట్రంలోనే మంచి ర్యాంకు తెచ్చుకోనుండేది తెలీదేమో పాపం! సదువుసందెలు ల్యాకపోయినా, తన కొడుకును ఇతగాని దగ్గర పన్జేసేకి జీతగానిగా పంపుతానా? సన్నప్పుడు గతిలేనోళ్లమని, యెదురు మాట్లాడమని యెప్పుడెప్పుడు ఎన్నెన్ని బండకూతలు కూసి అవమానించిండేదీ తాను మరిచిపొయ్యింటానని అనుకుండా డేమో! మనసును గాయపరిచిండే మాటలు మాసిపోతాయా?

అంగట్లో రంగయ్యశెట్టి చెప్పిన మాటలతో గతాన్ని గుర్తుకు తెచ్చుకొని గట్టిగా పెదవుల్ని పండ్లతో వొత్తుకుంటూ బరువుగా నిట్టూర్చి, తన కొడుకు సంగతిని జ్ఞాపకం చేసుకొని తనలో తాను నవ్వుకుంటా ఇల్లు చేరుకున్నాడు సుంకన్న.

❖ ❖ ❖

టైం పది గంటలయ్యింది. ఎండ చురుకుముట్టిస్తావుంది. క్లాక్ టవర్ దగ్గర రోడ్లు రద్దీగా వున్నాయి. నాలుగు లేన్ల ఫ్లైవోవర్ ఇంకా వోపెన్ కాలేదు. పండ్ల వ్యాపారులు ఫ్లైవోవర్ మీదికి ఎవరూ వెళ్లడానికి వీల్లేకుండా అడ్డంగా దొబ్బుడు బండ్లమీద రకరకాల పండ్లు పెట్టుకొని అమ్ముతున్నారు. క్లాక్‌టవర్‌కు ఎడమవైపున్న మున్సిపల్ కాంప్లెక్స్‌లో పాపులర్ షూమార్ట్టూ, మరో రెండు చెప్పుల షాపులూ దర్పంగా కనిపిస్తున్నా యి. అదేమి పద్ధతో గానీ చెప్పుల షాపుల ముందర నిల్చుకొని షాప్‌కీపర్లు కస్టమర్లను తమ షాపుకు రమ్మని తమ షాపుకు రమ్మని, చేపల మార్కెట్టు దగ్గర గోలగోల చేస్తున్నట్లు పిలుస్తు

న్నారు.

పాపులర్ షాపు ముందు వైపున, రోడ్డుకు దగ్గరగా ఆరడుగుల ఎత్తున ప్రత్యేకంగా తయారు చేయించుకున్న పెద్ద గొడుగును గాలికి వూగులాడకుండా భద్రంగా వొక 'గుంజ' సపోర్టుతో నిలబెట్టి, దానికింద నీడలో వొక పది చదరపు అడుగుల టార్పాల్ పరిచి దాని మీద వొక వైపున కూర్చున్నాడు సుంకన్న. అతని వెనక చెప్పులు కుట్టే సామాన్లు తెచ్చిన రెండు ట్రంకు పెట్టెలున్నాయి. పెట్టెల్లో నుంచీ బయటికి తీసిన సామాన్లన్నీ ఏది ఎక్కడ ఉండాల్నో అక్కడ మట్టంగా పెట్టి పనిలోకి దిగినాడు.

నిన్న పెండింగ్ పెట్టినది కావచ్చు, వొక చెప్పును తీసుకొని 'ఇనఫారం' మీద పెట్టి, 'పట్టీ' కింది భాగంలో రెండు చిన్న మేకులు వొత్తి, 'గూటం'తో గట్టిగా కొట్టి పాలిష్ చేసి పక్కన పెట్టినాడు. మరొక చెప్పు మెడిమ కింద అరిగిపోయిన భాగాన్నంతా రఫ్ బ్రెష్‌తో క్లీన్ చేసి, వొక చెక్కముక్కతో డబ్బీలోని (వజ్రం బకను) సొల్యూసన్ తీసుకొని, క్లీన్ చేసిన చెప్పుకింది భాగానికంతా రాకి పక్కన పెట్టినాడు. దానికి సరిపొయ్యేటంత సింథటిక్ సోల్‌ను సిజర్‌తో కత్తిరించుకొని ఆ ముక్కను రఫ్ బ్రష్‌తో క్లీన్ చేసి, దానికీ సొలూసన్ అంటించినాడు. రెండు నిమిషాలు ఆరిన తర్వాత చెప్పు కింది భాగానికి అతికించి 'ఇనఫారం' మీదపెట్టి గూటంతో గట్టిగా తట్టిడిసినాడు. తట్టడిసిన చెప్పును కాలికింద పెట్టుకొని, ఎక్స్ట్రాగా కనిపిస్తున్న సింథటిక్ సోల్‌ను 'రెంపీ'తో నీట్‌గా కోసేసి, పాలిష్ చేసి పక్కనుంచినాడు. ఇంకొక చెప్పును తీసుకొని వొక వైపు తెగిపోయిన 'ఉంగటా'న్నీ మధ్య'పట్టీ'నీ కొనభాగాల్లో 'రెంపీ'తో లైట్‌గా చెక్కేసి, వాటికి సరిపోయేటంత పల్చటి లెదర్‌సోల్‌ను అతికించి, సిమ్‌కోపాలీత్రెడ్ తీసుకొని 'ఆరి'తో కుట్లు వేయసాగినాడు. అంతలోనే మోటర్‌బైక్ మీదొచ్చిన వొక మనిషి కిందికి దిగి, సైడ్ స్టాండ్ వేసి, 'ఏరా సుంకా, ఈడేనా వుండేది?' అని పలకరించినాడు. తల పైకెత్తి చూసి, 'నువ్వా సావుకారీ?' అంటూ వినయంగా రంగయ్యశెట్టిని మాట్లాడించినాడు సుంకన్న.

'కోర్టురోడ్డు ఆంధ్రాబ్యాంకులో నుంచీ బయటికొస్తావుంటే, రాయి తట్టుకొని చెప్పు 'ఉంగటం' తెగిపోయిందిరా! కొత్తచెప్పులు! వారమాయ తీసుకొని!' అంటూ చెప్పులు సుంకన్న దగ్గర వొదిలినాడు రంగయ్య.

'అయ్యో, కొత్త లెదర్ చెప్పులు గదయ్యా! 'వొగతాయంగ' ఈ వుంగటం తెగిపోదు. రాయి గట్టిగా తగినట్లుంది. స్టూలు మింద కూచ్చో అయ్యా. పది నిమిషాల్లో కుట్టిస్తాను.' అంటూ ఉంగటం తెగిన చెప్పును చేతికి తీసుకున్నాడు సుంకన్న. అంతలోనే వొక బొల్లేరా వాహనమొచ్చి ఆగింది. వాహనం దిగొచ్చిన పోలీస్ ఆఫీసర్, 'సుంకన్నా, అర్జెంట్‌గా ఎస్పీ ఆఫీసుకు పోవల్ల, తొందరగా బూట్‌పాలిష్ చెయ్యప్పా' అంటూ అట్లే నిలుచుకొని, బూట్ కాలును పీటమీద పెట్టినాడు.

రంగయ్య చెప్పులు పక్కనబెట్టి, వినయంగా చకచకా ఇన్‌స్పెక్టర్ కాలిబూట్లను పాలిష్ చేసినాడు సుంకన్న. నిగనిగ మెరుస్తున్న బూట్లను చూసుకొని తృప్తిపడుతూ ఇన్‌స్పెక్టర్ యాభై రూపాయల నోటిచ్చి, చిల్లర కోసం ఆశించకుండా వాహనమెక్కి వెళ్లిపోయినాడు. కిక్కురుమనకుండా అదంతా నోరెల్లబెట్టి చూస్తున్న రంగయ్య, 'ఐదు నిమిషాలు బూట్‌పాలిష్ చేసినందుకు యాభై రూపాయలా రా? నీ పనే బాగుందిగదప్పా! ఈ లెక్కన నువ్వు దినానికి యా మాత్రం సంపాదిస్తావురా?' అని ఆసక్తిగా అడిగినాడు.

'యెట్ల లేదన్నా దినానికి పదైదు నూర్లకు తక్కువ గాకుండా కూలి గిట్టుకుంటాదయ్యా. పరవాలేదు' అని నవ్వుతూ రంగయ్య చెప్పులు చేతికి తీసుకున్నాడు సుంకన్న.

'అంటే నెలకు నలభై యాభై వేలు ఆడతా పాడతా సంపాదిస్తావన్న మాట! భళే బాగుందిరా నీ పని! పెట్టుబడిలేని వ్యాపారం! పెద్దగా కష్టపడేది గుడకా యేమీ లేదు! వూరకనే, నీ పిల్లల్ని గుడకా ఈ పనికే యేసుకుండేది మేలు గదరా! వాళ్లను సదివిస్తావుంటే, ఇంగ అంతటితో ఆపి, లక్షణంగ నీ పనికే యేసుకోరా! వాళ్లు చదువుకొని యేమి ఇంజనీర్లో డాక్టర్లో అయితారనుకుంటావుండావా? పెద్ద పెద్ద చదువులు చదువుకున్నోళ్లే వుద్యోగాలు దొరక్క బేకారుగా బజార్లల్లో తిరుగుతా వుండారు. ఇట్ల కాకి నడకా ల్యాకుండా అట్ల అంసనడకా రాకుండా వూరకనే వాళ్లను యాల గబ్బులేపుతావప్పా?' అంటూ తన అగ్రకుల వర్గతత్వాన్ని వినిపించినాడు రంగయ్య శెట్టి. ఆ మాటలు మనసులో గట్టిగా కుచ్చుకున్నాయి సుంకన్నకు. అవమాన బాధలో నుంచీ పుట్టిన నవ్వును ముఖమ్మీద పులుముకొని, ఏమి బదులిస్తే బాగుంటుందోనని వొక నిమిషం ఆలోచన చేయసాగినాడు. అతని ముఖాన్ని చూసి ఏమనుకున్నాడో యేమో, 'సరే వొగ పది నిమిషాల్లో ఉంగటం కుట్టేరా, నేను ఆ లోపల, పాపులర్ షూమార్ట్ కోటప్పను కలిసొస్తాను. వాడు నా స్నేహితుడే కదా!' అంటూ షాపువైపు ముందుకెళ్లినాడు రంగయ్య.

'సుంకన్న ఐదు నిమిషాల్లో రంగయ్య చెప్పును సరిచేసి మరొక పని చేసుకుంటా ఆలోచిస్తున్నాడు.

తన వృత్తిమీద తనకెంతో ప్రేమాభిమానాలు! ఎవరి వృత్తి వాళ్లకు గొప్పది! చాకలోల్లూ మగలోల్లూ మాదిగోల్లూ చేసుకుండే కులవృత్తులు నీచమయినవా? బతుకుదెరువుకోసం వొగొగరిది వొగొగ వృత్తి. అయితే తరతరాల్నుంచీ కులవృత్తులు చేసుకుంటా బతికేవాల్లు అదే వృత్తి చేసుకుంటా వుండల్లనా? మారుతున్న కాలాన్ని బట్టి, అన్ని కులాల వాల్లూ తమ పిల్లల జీవితాలు బాగా వుండల్లని కోరుకుంటారు. తక్కువ కులాల వాల్లు అట్ల కోరుకోగూడదని ఈ శెట్టి అబిప్రాయమా? అంటే యాడుండేవాల్లు ఆడే వుండల్లని యితగాని ఉద్దేశమా?

మనసులో చాలా గట్టిగా చర్చించుకుంటున్నాడు సుంకన్న. అంతలోనే రంగయ్యశెట్టి వచ్చినాడు. చెప్పులు అతని ముందరికి జరిపినాడు సుంకన్న. చెప్పలు తొడుక్కుంటూ 'ఎంతియ్యల్ల రా

సుంకా?' అని జోబీలో నుంచీ చిల్లర తీయసాగినాడు రంగయ్య.

'ఏమిస్తావు లేయ్యా! మొన్న అంగిట్లో యాభై రూపాయలు తక్కువ తీసుకుంటివి. ఇప్పుడు ఉంగటం కుట్టిన దానికీ నీతో తీసుకుంటానా? అవునయ్యా, అడగడం మర్చిపోయినా, నీ కొడుకులు ఏమి సదువుకుంటా వుండారయ్యా?' అని నిమ్మలంగా అడిగినాడు సుంకన్న.

'పెద్దోడు బీటెక్కూ చిన్నోడు డాక్టర్ కోర్సూ చదువుతున్నార్రా!' అంటూ దర్పంగా గర్వంగా సాగదీసి చెప్పినాడు రంగయ్య.

'అవునేమయ్యా? బాగనే సదువుతావుండారే! అది సరే సావుకారీ, నాకు తెలీక వొగమాట అడగల్లనుకుండాను...' అంటూ కొంచెం నసిగినాడు సుంకన్న.

'ఏంది రా, ఏమడగల్లని అనుకుండావు?'

'మీ అంగిట్లో పొగాకూ కట్లపొడి యాపారం బ్రమ్మాండంగా జరుగుతాది గదా, పని మనుషులు దొరక్క వొంటిగానివి. శానా యిబ్బంది పడతావుండావు. కొడుకులిద్దర్నీ అంగిట్లో పెట్టుకుంటే మేలు గదయ్యా! మీ కట్లపొడి యాపారానికి మించినవా కొడుకుల సదువులు?'

సుంకన్న మాటలతో, చెప్పు 'ఉంగటం' తెగిన సంగతేమోగానీ అతని మెడమీద నరం తెగినట్లయిందేమో, 'యేం మాట్లాడతా వుండావురా? నీ పిల్లలూ నా పిల్లలూ వొగటేనా?' అని కోపంగా చూస్తూ ఏదో గొనుగుతూ మోటర్‌బైకెక్కి వెళ్లిపోయినాడు రంగయ్య.

❖❖❖

'రా అమర్, శానా దినాలకు వొస్తివి గదప్పా! అందరూ బాగుండారా?' అంటూ అంగట్లోకి వస్తున్న తరిమెల అమర నాథ్‌ను పలకరించినాడు రంగయ్య.

'అందరమూ బాగుండాము రంగా! నీ వ్యాపారం బాగుంది కదా! కొడుకులు బాగా చదువుతున్నారంట గదా! చాలా సంతోష మప్పా!' అంటూ రంగయ్య వెనకాల కమలం బొమ్మతో వున్న ఫ్లెక్సీని చూసి, అక్షరాలు చదివి అసహనంతో 'యేంది రంగా, నువ్వు బిజెపి పార్టీలో చేరడమేంది? తరిమెల రంగయ్యశెట్టి అని పేరు పెట్టుకొని తరిమెల గ్రామస్తునిగా ఆ పార్టీలో చేరడం నీకు సిగ్గుగా లేదా?' అని గట్టిగా అడిగినాడు అమరనాథ్. అతడేదో చెప్పినాడు. చిన్ననాటి స్నేహితులయిన ఆ ఇద్దరి మధ్యా కొంచెంసేపు వాదోపవాదాలు జరిగినాయి.

దేశం గర్వించదగిన కమ్యూనిస్టు నాయకుడు నాగిరెడ్డి కారణంగా తమ తరిమెల పేరు దేశమంతటా సుప్రసిద్ధ మయిందని, అటువంటి మహానాయకుని ఆలోచనలతో చైతన్య వంతమైన నేలలో పుట్టిన వాడు మతవాద పార్టీ బిజెపిలో చేరడం అవమానకరమని హితవు పలికినాడు అమరనాథ్. అతనితో వాదించే ఆలోచనాశక్తిలేక మౌనం వహించినాడు రంగయ్య. అతని మౌనాన్ని చూసి శాంతం వహించినాడు అమర్. మాటల సందర్భంలో 'మనూరి సుంకన్న కొడుకు ఇంటర్లో స్టేట్‌ర్యాంక్ సాధించి వూరి పేరు నిలబెట్టినాడప్పా! అటువంటి పిల్లోన్ని చెప్పులు కుట్టే పనికి వేసుకోమని సుంకన్నకు సలహా ఇస్తావేమయ్యా నువ్వు? తరిమెల మనిషిగా మాదిగీ మాలోల్లతో అట్లనా మాట్లాడేది?' అని దండించినాడు అమర్. తన పొరపాటును అంగీకరించినాడు రంగయ్య.

'సరే గానీ రేపు ఉదయం పది గంటలకు క్లాక్‌టవర్ దగ్గరుండే ఎన్జీవో హోంలో నా పుస్తకావిష్కరణ సభ జరుగుతుంది. నువ్వు తప్పకుండా రావల్ల రంగా, మరిచిపోవద్దు!' అని గట్టిగా చెప్పి షాపులోనుంచీ బయటికొచ్చినాడు అమరనాథ్. ఇంటికి వెళు తూ వెళ్లుతూ చెప్పుల షాపు దగ్గరున్న సుంకన్నను పలకరించి, 'రేపు మీటింగుకు వొక పది నిమిషాలు ముందుగా రా సుంకన్నా! అట్లే నీ భార్యాపిల్లలందర్నీ పిలుచుకొని రా' అని ప్రేమగా పిల్చినాడు.

'ఏమోనయ్యా, నాకు రోంత బయంగా వుంది. పెద్ద పెద్దోల్లంతా వస్తారేమో రెడ్డీ!' అంటూ బిడియ పడసాగినాడు సుంకన్న. 'యేం పర్వాలేదులే సుంకన్నా, నేనుంటాను గదా, భయమెందుకు?' అని ధైర్యం చెప్పి వెళ్లిపోయినాడు అమరనాథ్.

❖❖❖

ఎన్జీవో హోం మీటింగ్ హాలు జనంతో కిటకిటలాడతా వుంది. అతిథులందరూ అనుకున్న టైంలోపలే హాల్లోకి చేరుకున్నారు. కవులూ, కథా రచయితలూ, సాహిత్యాభి మానులూ, చాలామంది కొత్త శ్రోతలూ వేదిక ముందున్న కుర్చీల్లో కూర్చున్నారు. ముందు భాగంలో ఖాళీ సీట్లు లేక తరిమెల రంగయ్య వెనక వైపున కూర్చున్నాడు.

సభా నిర్వాహకుడు శ్రోతలందరికీ స్వాగతం పలికి, అతిథు లందరినీ వేదిక మీదికి ఆహ్వానిస్తూ పుస్తకావిష్కర్తను గురించి రెండు మాటలు చెప్పి తరిమెల సుంకన్నను సాదరంగా ఆహ్వానించడంతో సభంతా వొక్కసారిగా ఉద్విగ్నతకు లోనయింది. అందరూ చప్పట్లు కొడుతూ చూస్తుండగా సుంకన్న భయపడుతూ జంకుతూ వెళ్లి వేదిక మీద కూర్చున్నాడు. వొకవైపున మాజీ వైస్ ఛాన్సలర్, జాయింట్ కలెక్టర్, మరొకవైపున సభాధ్యక్షుడూ, సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీతా, పుస్తక రచయిత తరిమెల అమరనాథ్, వాళ్ల మధ్యలో బిడియపడుతున్న సుంకన్న కూర్చు న్నారు. ఆ దృశ్యం చూసి సుంకన్న భార్యాపిల్లలూ బంధువర్గమూ ఆనందాశ్చర్యాలతో చెమ్మగిల్లిన కళ్లతో పొంగిపోతున్నారు. వెనక భాగంలో కూర్చున్న రంగయ్యశెట్టి తన కళ్లను తానే నమ్మలేక విస్మయంగా చూడసాగినాడు.

సభ ప్రారంభమయ్యింది. అమరనాథ్, సుంకన్న చెప్పులు కుట్టుతూ అతని పిల్లల్ని చదివిస్తున్న సంగతినీ, సుంకన్న

దంపతుల శ్రమనూ కలల్నీ నెరవేరుస్తూ వారి కొడుకు ఇంటర్లో సాధించిన విజయాన్నీ ప్రస్తావించినాడు. భారతీయ వర్ణ వ్యవస్థలో సాగుతున్న అంతులేని సాంఘిక వివక్షకు గురవుతూనే తన ఆశయాన్ని నెరవేర్చుకొని తలెత్తి గర్వంగా బతుకుతున్న శ్రమజీవి తమ తరిమెల సుంకన్న చేతులమీదుగా తన పుస్తకాన్ని ఆవిష్కరించుకోవడం తనకెంతో గర్వకారణమని సగర్వంగా చెప్పుకున్నాడు అమరనాథ్. పేరు చెప్పకుండా, ఇటీవల సుంకన్ననూ, అతని పిల్లల చదువుల్నీ అవమానించిన వొక అగ్రవర్ణుని ఉదంతాన్ని వివరించి, విద్యావంతులందరూ తమ వర్ణ వర్గ స్వభావాన్ని వదులుకోవాలని అభ్యర్థించినాడు. ఆ మాటలు విని మౌనంగా తలదించుకున్నాడు తరిమెల రంగయ్య. వెంటనే వెళ్లి తమ షాపులో వున్న కమలం పార్టీ ఫ్లెక్సీని తీసేయించాలని, తనకు అవసరం లేని పార్టీ జిల్లా కార్యదర్శి పదవికి రాజీనామా చేయాలని గట్టిగా నిర్ణయించుకున్నాడు.

కొత్త ఆలోచనలతో సభ ముగిసింది. అందరి మెదళ్లలో చెప్పులు కుట్టే సుంకన్నా, ఇంటర్లో స్టేట్ ర్యాంకు సాధించిన అతని కొడుకు రమేష్ మెదల సాగినారు.



## సుంకోజి దేవేంద్రాచారికి కెఎన్.జయమ్మ స్ఫూర్తి పురస్కారం

**త**న తల్లి శ్రీమతి కె.ఎన్. జయమ్మ గారి జ్ఞాపకార్థం సాహిత్యరంగంలో ప్రగతిశీల భావాలతో ఉత్తమ సాహిత్య కృషి చేస్తున్న సాహిత్య కారులకు రెండేళ్లకు ఒకసారి కె.ఎన్.జయమ్మ స్ఫూర్తి పురస్కారాన్ని ఇవ్వాలని నిర్ణయించామని ప్రముఖ రచయిత పలమనేరు బాలాజీ (94409 95010) తెలిపారు. బహుజన జీవితాన్ని, దుఃఖాన్ని పోరాటాన్ని తన రచనల్లో ప్రతిభావంతంగా ఆవిష్కరిస్తున్న కథా, నవలా రచయిత సుంకోజి దేవేంద్రాచారి (49)కి మొదటి కెఎన్ జయమ్మ స్ఫూర్తి పురస్కారాన్ని అందజేసినట్టు చెప్పారు. 06–08–2023 ఆదివారం పలమనేరు– గంగవరం, సాయి గార్డెన్ సిటీలోని కళామందిరంలో జరిగిన సాహిత్య సభలో పురస్కారం అందజేశారు. ఈ సభలో ప్రముఖ సాహితీవేత్త ఆర్.ఎం.ఉమామహేశ్వరరావు, సి.భానుమూర్తి రెడ్డి (సీనియర్ కథా రచయిత లేట్ శ్రీ సి.వేణు గారి కుమారుడు), నాయుని చంద్రశేఖర మూర్తి తదితరులు పాల్గొన్నారు.

**– పలమనేరు బాలాజీ**
**94409 95010**
**అధ్యక్షులు, పలమనేరు రచయితల సంఘం, చిత్తూరు జిల్లా**

## కారణమెవరు?

**నా**కే తెలియనంతగా
ఇష్టమైన పద్యాల్ని, పదాల్ని
పరవశంతో పాడనీయకుండా
పెదాలకు హుక్కులు బిగిస్తున్నదెవరు?
ఎదురింటి పెద్ద రంగు ముందు
తలొంచుకుపోయేలా
తరతరాల భయాల్ని
నా బుర్రలో జొనిపిందెవరు?

ఊరేగింపు మధ్యలో ఇంట్లోంచి లాక్కెళ్లి
నుదుట కుంకుమ పూసి జైశ్రీరామ్ అనమంటే
అన్నం మెతుకుపై
పేరు చెరిగిపోతుందేమోనని
భయపడి అన్నానే
తప్పు చేసినోడిలా
సినిమా హాల్లో అందరూ నన్నో ఉగ్రవాదిని
చూసినట్టు చూస్తుంటే
చిన్నబోయిన పిల్లలకోసం
చేతులు కట్టుకు నిలబడ్డానే
నోట్లో మూత్రం పోస్తున్నా
కడగట్టువాడిగా మమ్మల్ని
ఎందుకు పుట్టించావని దేవుడ్ని
గుడి మెట్లపై నిలదీయలేకపోయానే!
పదేళ్ల బిడ్డడ్ని హాస్టల్లో చంపి
'మమ్మల్ని ఎదిరిస్తే ఇదే శిక్ష' అని హెచ్చరించి
శవాన్ని బురదలో విసిరేస్తే
నా తలరాతని కన్నీళ్లు కార్చి
మిన్నకుండిపోయానే
ఇంతలా వణికి వణికి
ఇంట్లో ముడుచుకు కూర్చున్నా
నా బిడ్డ జడలు పట్టి నగ్నంగా ఊరేగిస్తూ
అడ్డొచ్చిన కొడుకు తల నరికి
గుంజకు వేలాడదీసి
పూనకంతో ఊగిపోతూ
దేశాన్ని వల్లకాడు చేస్తున్నవారెవ్వరు?
నగ్న దేహాల్ని జెండాలుగా ఊరేగిస్తున్నా
అడగలేని నిస్సహాయతను
ఇంతలా నా దేశ ప్రజల్లో నింపిందెవ్వరు?

**- మేడక యుగంధరరావు**
**90320 56738**




# కవిత్వం చేతికి మొలిచిన తొమ్మిదో వేలు

- లండ సాంబమూర్తి
96427 32008

**బా**ల సుధాకర్ కవిత్వం రాసే చేతికి ఇప్పటికి ఎనిమిది వేళ్ళు మొలిచాయి. 'అస్తిత్వ వాచకం' తొమ్మిదో వేలు. సంపుటి తర్వాత సంపుటిగా అతడు ఎందుకు వస్తున్నాడు అని అడగక ముందే తన పేరును చంపావతిగా మార్చుకుని నదిని కాబట్టి ప్రవహిస్తున్నానని చెప్పాడు. ఇప్పుడు బాల సుధాకర్ ఈ తొమ్మిదో వేలికి ఏ పరిమళం అద్దాడు? ఎక్కడెక్కడ కొత్తగా వున్నాడు? అస్తిత్వ వాచకం ఏ అస్తిత్వాల గురించి మాట్లాడు తుంది? ఏ మేరకు సఫలమైంది? అనే ప్రశ్నలు సహజం.

'నిర్వేదస్థలం' నాటికీ ఇప్పటికీ కవి జీవితంలో వచ్చిన మౌలికమైన మార్పు పేరు : పల్లవి. సంపుటిలో మొదటి ఐదు కవితల్లో కవి చేసే 'నూతన అభివ్యక్తి' ప్రతిపాదన వుంది. అమ్మతో పాటుగా గుండెల్లోకి రమ్మని సహచరికి పంపే ఆహ్వానం వుంది. 'జీవితం' కథని కలిసే రాద్దాం అనే ఆమె ప్రతిస్పందనా వుంది. "కవిత్వానిదేముంది/ మనసు గాయపడి నపుడల్లా/ భావం స్రవించబడుతుంది" అని ఆమె ముందు కవిత్వాన్ని తక్కువ చేసి చూపే సాహసమూ వుంది. "విరుద్ధ దేహాలను ఒకే ఆలోచనా తాటిపైకి తీసుకొచ్చింది చీర" అనే 'చీర రాజకీయం' కూడా వుంది. సహచరిని అర్థం చేసుకునే క్రమంలో వచ్చిన 'నొప్పి' కవిత నిర్వహణ పరంగా ఒక ఆణిముత్యం. 'ఇన్ ద మెన్సెస్ టైం' కవిత కవిలో గింజ కడుతున్న స్త్రీ హృదయం. 'ఒక విధ్వంస స్వరం'లో అతడు పూర్తిగా స్త్రీ హృదయాన్ని సంతరించుకున్నాడు. "పాలిండ్లు" కవిత ఒక ప్రకంపన. మాతృత్వానికి దూరమైన వేదన వల్ల కావొచ్చు. పిల్లలు పుట్టకపోవడానికి స్త్రీని దోషిగా చూపే సమాజం అజ్ఞానం వల్ల కావొచ్చు. "ఇప్పటికిది ఎన్నిసార్లో తప్పిపోయిన ఆమె పాలిండ్లను/ పిచ్చెక్కినట్లు వెతుక్కుంటుంది" అంటాడు కవి. పాపకు నాన్న రాసిన లేఖ– 'ఇట్లు మీ నాన్న'. ఈ కవితలో కవి అమ్మంత మెత్తగా ఉన్నాడు. ఐతే స్త్రీల భద్రత విషయానికి వచ్చినప్పుడు మాత్రం అవసరమైనప్పుడు ఆయుధాలు పట్టడం ప్రాథమిక హక్కుల్లో 'తదుపరి హక్కు' అని భూమి అప్పజెల్లెళ్లకు చెప్పడానికీ వెనుకాడలేదు.

ప్రతి కవినీ వెంటాడే మోహం పిల్లలు. రోజూ బడి పిల్లలతో గడిపే సుధాకర్‌లాంటి కవికి పిల్లలే లోకం. 'గాలింపు' కవితలో 'రెక్కలడుగుతున్నారు పిల్లలు' అనే సూటి వాక్యంతో మొదలై "రెక్కలను కత్తిరించినవాడి తలను/ ఉత్తరించినంత వరకూ నిద్రపోరు పిల్లలు" అని ముగిస్తాడు. ముగింపులో కవి పిల్లల స్థాయిని దాటి మాట్లాడినట్టు అనిపించింది. 'రెక్కల పిల్లలు' ఒక అందమైన కవిత. మూడు ఫ్రేముల్లో చూపెట్టిన దృశ్యాలు ఆలోచింపజేస్తాయి. "రెక్కలు తొడుక్కోవాలన్న ఆకాంక్ష ముందు/ ఆకాశం లోబడుతుంది" అనడంలో కవి యొక్క పరిణతి కళాత్మకత జమిలిగా ప్రతిఫలించాయి. "గుండెల్లో చెమ్మలేని రాజ్యంలో/ పిల్లలే కాదు పిట్టలూ ఎగరవు" (తడి లేని చోట) అని ప్రకటించినా, "భూమ్మీద పిల్లలందరి ముందు/ చేతులు కట్టుకుని పశ్చాత్తాపం ప్రకటించే/ రోజొకటి వస్తుంది" అని హెచ్చరించినా, "పిల్లలకే వాస్తవాలేమిటో తెలిస్తే/ ప్రపంచం కూలిపోతుంది/ /భూమి సిగ్గుతో ఉవేసుకుంటుంది" (నిరసన తెలిపే పిల్లలు) అని పరితపించినా ప్రతి కవితలోనూ కవికి పిల్లల పట్ల, వారి భవిత పట్ల ఉన్న బాధ్యత, పిల్లల పైనున్న అచంచల విశ్వాసం ప్రేమ తెలిసి వస్తాయి.

కవి చూపు మెల్లగా బడివైపు మళ్ళుతుంది. 'అంతిమ పరిష్కారం' కవిత, ఈ కవి రాసిన "తరగతి స్వప్నం" దీర్ఘ కవితకు కొనసాగింపులా తోస్తుంది. బడి చుట్టూ రాజకీయం కంచె కట్టడం, బడి వేదికగా రాజకీయం చేయడం పద్ధతి కాదని నిక్కచ్చిగా చెబుతాడు. 'అధికారం వేయికాళ్ళతో నడిచి

గుడ్లుమిుతానంటే కుదరదు/ /భయపెట్టి బెదిరించి పనులు కానిచ్చుకోవడం/ ఏ విషసంస్కృతో బడి గమనిస్తుంది' అంటాడు. సాంకేతికత మిషతో టీచర్లను పిల్లలకు దూరం చేసే ఎత్తుగడను "ఏదున్నర ఇంచీల తెర విరగబడి నవ్వు తుంది" అంటూ ఖండిస్తాడు కవి. తమ చేతులతో తమ కళ్ళనే పొడుచుకునేలా ప్రేరేపించే ప్రభుత్వ పన్నాగంలో పడిపోవద్దని హెచ్చరిస్తాడు. 'కౌమారం పిట్ట' కవితలో కవి ఎరుక ప్రశంసనీయం. కౌమార సంక్షిష్ట కల్లోల భావోద్వేగ దశను కవి చూపించిన విధానం బాగుంది. తన విద్యార్థి తనలోని ప్రతిభకు పదును పెట్టుకుని ఉన్నత స్థానానికి ఎదుగుతుంటే గర్వపడాల్సిన గురువు, అదే విద్యార్థి తన కళ్ళముందే కూలిపోతే తట్టుకోలేదు. ఇలాంటి ఒక విషాదాంత కవితే 'రాజా - an artist. అయితే, విషాదాన్ని పాఠకుడు అనుభవించేలా చేయడంలో కవి ఇంకాస్త శ్రద్ధ పెట్టాల్సింది.

'అనగనగా ఒక వేట కథ' పదికాలాలు నిలబడే కవిత. రాజ్యం పన్నిన వలల్నీ వేసే ఎరల్నీ, ప్రజల్ని విడగొట్టి పబ్బం గడుపునే కుట్రల్నీ చిన్నాభిన్నం చేయడానికే కవి ఈ కవితను అల్లాడేమో! 'వాడికి కావలసినవి ఒకటి రెండు చేపలు కాదు/ వాడిక్కావలసింది సముద్రం/ సముద్రంలోని చెమటా రక్తం// ... ఈసారి వేటగాడు/ వేటను బతికించుకోవడం కోసం/ ముందే రాసుకున్న పన్నాగంలో భాగంగా/ చేపలతో స్నేహానికొచ్చాడు' అంటూ దృశ్యాలు దృశ్యాలుగా సాగిన ఈ కవితను అల్లడంలో కవి నేర్పు కనబడింది. 'సముద్రం చనిపోలేదు బతికే వుంది' అనడం దగ్గర కవిత ప్రారంభంలోకి తెరుచుకుంటుంది. శీర్షిక కవిత (అస్తిత్వ వాచకం)లో 'లోకికత్వం ఈ నేల రక్తం/ భిన్నత్వం ఈ నేల సౌరభం/ ఎవడి ఆకలి వాడిదైనట్టు/ ఎవడి ఆహారం వాడిదైనట్టు/ ఎవడి భాష వాడిది/ భాష నా అస్తిత్వవాచకం' అంటాడు. ఇంకాస్త ముందుకు వెళ్ళి 'నా భాషంటే నా బతుకే/ బతుకునే చెరిపేస్తా నంటే/ నువ్వే గీతలు గీసినా చెరిపే తీరుతాను/ ఏ పీఠాలైనా కూల్చే తీరుతాను' అనే మాటలు ప్రత్యేకించి ఇది ఉత్తరాంధ్ర ధిక్కార గొంతుక. పూరించిన సమరశంఖం.

సామాజిక కవితల శ్రేణిలో 'వెలికుండ' కవిత మరో గట్టి గింజ. రాజస్థాన్‌లోని ఒక ప్రైవేట్ బడిలో టీచర్ తాగే కుండలో నీళ్ళు తాగిన కారణానికి కుల కాఠిన్యం చేతిలో బలైపోయిన ఓ దళిత పిల్లాడి వ్యథార్థ కథ ఈ కవితకు నేపథ్యం. లోలోపల కదలిక తెచ్చేలా ఆలోచింపజేసేలా మలిచాడు కవి. ఒక సంఘటనను తక్షణం కవిత్వం చేయడం కంటే కాస్త సమయం ఇచ్చి నేపథ్యాన్ని లోపలికి ఇంకించుకుని రాయడం వల్ల ఈ కవిత బలంగా నిలబడింది. రాజకీయ కవితల వరుసలో 'అబద్ధాల పుట్ట' ఎన్నదగింది. 'ఒకటి రెండు అబద్ధాలు చెప్పు/ పీచుమిఠాయిల్లా బాగుంటాయి/ గొర్రెలా ఎవడైనా తలూపు తాడు/ మరీ అబద్ధాల కొండను నిర్మిస్తే/ నవ్వుతారు' అని ఎత్తుకుని, 'నీ అబద్ధాల పుట్టని పగలగొట్టడమే/ ఇప్పుడు సరికొత్త ప్రారంభం' అని ముగిస్తాడు.

అభిమానించే సాహితీవేత్త గురించో, స్ఫూర్తిని రగిలించే వ్యక్తిత్వం గురించో కవిత కట్టడం కవులకు అలవాటు. ఆ పరంపరలో 'అడివి పువ్వు' (ప్రొ.జర్ర అప్పారావు), 'జి.ఎన్.సాయిబాబ', 'వంతెన ముందు' (ప్రొ.మేడిపల్లి రవి కుమార్), 'తడి చేయి' (తెలుగు వెంకటేష్ ), 'గద్దిఅన్నారం కవితలు' (కె.శివారెడ్డి) వంటి కవితలు వచ్చాయి. అన్నీ అలరిస్తాయి. వాక్యాల నిండా కవి స్వచ్ఛంగా ప్రవహిస్తాడు. వీటిలో 'వంతెన ముందు' కవిత ప్రత్యేకం. "అతడిని ఇక్కడి నేల అన్నం మెతుకు మీద/ సగౌరవంగా ముద్రిస్తున్నాను/ వంతెన ముందు మోకరిల్లి అతనిలో నన్ను నేను/ ఐక్యం చేసుకుంటున్నాను" అంటాడు. కవిలోని ఆరాధనాభావం అంతా కవిత్వమై మెరిసింది. అలాగే, 'ఎల్లోరా కవితలు'ను అందంగా చెక్కాడు కవి. "మనుషులు విగ్రహాల్లా విగ్రహాలు మనుషుల్లా/ కనిపిస్తున్న తన్మయస్థితిలోంచి/ మళ్లీ తొలి నుంచి చిగురులు వేస్తూ/ నేను' అంటూ ఒకానొక అనుభూతి ప్రపంచంలో వదిలేసిపోతాడు.

వాన కురిస్తే ఆనందించని మనిషుండడు. అదే వాన జడివాన్నై ఊరూవాడను మింగేస్తుంటే, రైతు కష్టాన్ని ఊడ్చుకు పోతుంటే దుఃఖించని మనిషీ ఉండడు. ఆ దుఃఖంలోంచి పుట్టినవే 'వానపాఠం', 'కోత' కవితలు. 'బతుకులో నవ్వు గింజలను నాటాల్సింది పోయి/ వాన దుఃఖం నాట్లు వేస్తుంది' (కోత). కవిత మొత్తాన్ని ఎగతెగని వాన గీసిన దుఃఖచిత్రాలతో నింపేస్తాడు.

కవిని వెంట తిప్పుకునే మరో ఆకర్షణ నది. "నది ముఖమే నా ముఖం. నది దుఃఖమే నా దుఃఖం/ నా పేరు చంపావతి" అని తను చంపావతిగా మారిన వైనాన్ని వివరిస్తాడు. 'నదిని ముద్దాడిన ఎండ', 'నదికి చెట్టు రాసిన కవిత', 'నా పేరు చంపావతి' కవితలు అన్నీ గుండెలు నిండుగా నదిని నింపు కుని రాసినవే. జానపద సొబగులతో అలరారిన 'ఇక్కప్ప సుమ్మ', 'గోసి','సుట్ట','మా వూరి కవితలు','ఊర సెరువు' వంటి కవితలు మాండలికపు తళుకులద్దుకుని మెరిసాయి. పల్లె యాసతో ఆధునిక అభివ్యక్తిని సాధించాలన్న కవి తపన నెరవేరినట్టైంది. 'మా వూరి కవితలు' కవి ఊరిని బొమ్మ కట్టి చూపుతుంది. 'ఇక్కప్ప సుమ్మ' కవిత ఒక దృశ్యకావ్యం. 'సందమామని తలకు తొడుక్కుని/ ఆకసం మరేల మురుస్తుందో తెల్దు/ ఇసరాపు ఇక్కప్ప మాతరం సుమ్మని తలకి సుట్టుకుని/భలే కులాస పడతంది' అని నెత్తి మీద బరువు మోసేటప్పుడు కూలీలు తల మీద పెట్టుకునే సుమ్మని చందమామతో పోల్చి కవి దృష్టిలో సుమ్మకున్న స్థానం,

శ్రమజీవుల పట్ల తనకున్న అభిమానాన్ని ఆకాశం అంతెత్తున నిలబెడతాడు. 'మా తూరుపు గెడ కర్ర మీద/ రెప రెపరెపలగ ఎగిరె మా అస్తిత్వపు జెండా గోసి', 'గోసి మా అచ్చియ్యితాత కాల వంకీల/ పూసిన నెలవొంక' అని గోసి కథ చెబుతాడు. సుట్టను కవి వర్ణించిన తీరు సుట్టతాగని వాడు వృథా అన్నట్టు ఉంటుంది. "సూరీడు మా సుట్ట సివరే కూకోవాల/సందురూడు మా సుట్టనీడల ఎదగాల' అంటాడు. ఈ కవితలన్నీ పల్లె జీవన చిత్రాల్ని అద్భుతంగా చిత్రిస్తాయి. చిన్న కవితలు కొన్నున్నాయి. స్త్రీవాద కోణం నుంచి రాయబడ్డ 'ఇంటిపేరు', కవిత్వం గురించి చెప్పిన 'కవితలు', మత్స్యకార బతుకు చిత్రం 'మా బతుకు' చిట్టివే కానీ గట్టివి.

కొన్ని చోట్ల తీవ్రతను చెప్పడానికి పదాన్ని పునరావృతం చేయడం అదనం (అనవసరం) అనిపించింది. ఒకటీ అరా చోట్ల కవితా వస్తువుకు పోల్చిన వస్తువుతో అన్వయం కుదిరిందా లేదా అని కవి విశ్లేషించుకోవాలి (ఉదా: గోసి కవిత మొదటి రెండు లైన్లు). సరళమైన వాక్యాలతో, కొత్త భావ చిత్రాలతో, మాండలికపు సౌందర్యంతో సాంద్రమైన కవిత్వాన్ని నిర్మించాలనే కవి ప్రయత్నం 'అస్తిత్వ వాచకం'తో విజయవంతం అయ్యిందని చెప్పొచ్చు. ■

## విశాలాక్షి కథల, కవితల పోటీ

**వి**శాలాక్షి సాహిత్య మాసపత్రిక వదాన్యుల సహకారంతో కథలు, మినీ కథలు, కవితల పోటీ నిర్వహిస్తోంది. కథల పోటీలో రూ. 6000, రూ. 5000, రూ. 4000 బహుమతులతో పాటు 7 కథలకు రూ. 1000 వంతున ప్రత్యేక బహుమతులు ఉంటాయి. మినీ కథల పోటీలో రూ. 3000, రూ.2000 ప్రథమ, ద్వితీయ బహుమతులతో పాటు 10 మందికి రూ. 1000 వంతున 10 కథలకు తృతీయ బహుమతులు ఉంటాయి. కవితల పోటీలో కవితకు రూ. 1000ల వంతున 15 కవితలకు రూ. 15000లు బహుమతులు అందజేస్తాము. రచనలు ఆగస్టు 19 లోపు ఈ చిరునామాకు రచనలు పంపించాలి.

విశాలాక్షి సాహిత్య మాసపత్రిక, 27-5-487, పద్మావతి నగర్, బాలాజీ నగర్, నెల్లూరు – 524002. ఫోన్ : 80085 62742 కు సంప్రదించవచ్చు.

విజేతలకు నగదు బహుమతులతో పాటు అక్టోబర్‌లో జరిగే వార్షికోత్సవ సభలో మెమెంటో, శాలువాతో సత్కారం ఉంటుంది.

**– ఈతకోట సుబ్బారావు**
**సంపాదకులు**

## భుజం పై వాలిన పావురం

**సా**హిత్య పేజీ కోసం
ఆ పత్రిక కొన్నా ...
ఆ పేజీకి బదులు
రెండు స్థానిక వార్తల పేజీలు
సమాజ ప్రతిబింబం కానరాక
ఒకింత చింతలో నేను ...
బహుశా మరెవరో కొన్న కాపీలో
రెండు సాహిత్య పేజీలు ....
నిన్నటి రిబ్బన్ కటింగ్ ఫోటో కనిపించక
విసుగులో ఏ ఛోటా రాజకీయుడో ...

గ్రంథ పఠనానుభవం అనే గంధర్వ లోకానికి
దగ్గరి దారి సాహిత్య పేజీ
ఏ రైలు ప్రయాణంలోనో
క్విక్ లంచ్ లాంటిది సాహిత్య పేజీ ...

పత్రిక పూతరేకుల మధ్య పరచుకున్న
మాధుర్యపు నెయ్యీ బెల్లాల సమ్మేళనం
సాహిత్య పేజీ ...

మంచి మాటలు రాసుకోవడానికి
టేబుల్‌పై వుంచుకున్న నోటుబుక్కు
తెరచుకున్న పెన్ను
చేతిలో పొగలు కక్కే కాఫీకప్పు
సాహిత్య పేజీ ...

కడలి ఒడ్డునే వున్న ఆక్వేరియంలా
చేతనా సారస్వత మహాసంద్రపు
మినీయేచర్ రూపం సాహిత్య పేజీ ...

పీడిత తాడిత గొంతుల పోరుకేకని
అధికార పీఠాల గుండెలదిరేలా వినిపించే
ఇన్‌స్టెంట్ మైకు సాహిత్య పేజీ ...

ప్రతి 'సోమ'వారమూ
పాఠక హృదయ కాసారాల్లో
భావుకతా చంద్రికలను విరజిమ్మే
చంద్ర పుష్పం సాహిత్య పేజీ ...

మరుసటి రోజు
తప్పిపోయిన పెంపుడు పావురం
హఠాత్తుగా భుజంపై వాలినట్టు
పార్లర్ కౌంటర్‌పై నిన్నటి సాహిత్య పేజీ !

**- ఎస్. హనుమంతరావు**
**88978 15656**



# సాహిత్యోద్యమాల పనల్లా భావజాలంలో మార్పు తీసుకురావడమే!

**- ప్రముఖ రచయిత్రి,**
**కేంద్ర సాహిత్య అకాడమీ కన్వీనర్ మృణాళిని**

**"విమర్శ చెయ్యాల్సిన పని, ఏ రచన ఎందుకు బాగుందో ఆ కారణాలను పాఠకులకు వివరించడం, బాగులేని విషయాలను రచయితకు ఎత్తి చూపడం. సంయమనంతో ఈ పని చెయ్య గలిగిన వాళ్లే మంచి విమర్శకుల"న్నారు ప్రముఖ రచయిత్రి, సాహిత్య అకాడమీ తెలుగు విభాగం కన్వీనర్ మృణాళిని. కవి, రచయిత డా.టేకుమళ్ళ వెంకటప్పయ్య 'సాహిత్య ప్రస్థానం' తరపున ఆమెతో ముచ్చటించారు. ఆ ముఖాముఖి ఇదీ...**

**మీ బాల్యం, విద్యాభ్యాసం గురించి క్లుప్తంగా చెప్పండి?**

నేను పుట్టింది కాకినాడలో. పుట్టిన ఏడాదికే నాన్న గారికి విజయనగరం, అక్కడి నుంచి విశాఖపట్నం బదిలీ అయింది. అక్కడ రామకృష్ణ మఠం వారి శారదా బాలవిహార్‌లో మూడో తరగతి వరకు చదువుకున్నాను. నాలుగో తరగతి అసలు చదవలేదు. తర్వాత తిరుపతిలో టంగుటూరు ప్రకాశం పంతులు పాఠశాలలో ఏడో తరగతి వరకు చదివాను. 8వ తరగతి నుంచి కావలి విశ్వోదయ బాలికల పాఠశాలలో చదివాను. ఇంటర్మీడి యట్ తొలి సంవత్సరం కావలిలో జవహర్ భారతిలో చదివాను. రెండో సంవత్సరం సమయానికి హైదరాబాద్‌కు వచ్చాం. రెడ్డి మహిళా కళాశాలలో ఇంటర్, బి.ఏ పూర్తిచేశాను. ఎం.ఏ. ఎం.ఫిల్. పిహెచ్.డి (తెలుగు) ఉస్మానియా ఆర్ట్స్ కళాశాలలో. తర్వాత ఎం.ఏ ఇంగ్లీష్ కూడా ఉస్మానియా నుంచే దూరవిద్య ద్వారా చేశాను. ఎం.ఏ విమెన్స్ స్టడీస్ కొడైకెనాల్ మదర్ థెరీసా విశ్వవిద్యాలయం నుంచి దూరవిద్య ద్వారా చేశాను.

**'మృణాళిని' అన్న పేరు మీ తాత గారు పెట్టిందేనా? ఆ మాటకు అర్థం?**

ఈ పేరు పెట్టింది మా తాత గారు కాదు; మా నాన్న. ఆయన రవీంద్రనాథ్ టాగోర్ అభిమాని. టాగోర్ భార్య పేరు మృణాళిని. అదీ ప్రేరణ నా పేరుకు.

**తెలుగుపై మీ మక్కువకు కారణం తాతగారైన రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ గారని అనుకోవచ్చా?**

తెలుగుపై మక్కువకు కొంతవరకూ తాతగారే కారణం. నేను తిరుపతిలో ఉన్న మూడేళ్లు మాత్రమే తాతగారితో ఉన్నాను. ఆయన ఇంటికి పండితుల రాకపోకలు కుతూహలం కలిగించేవి. అదే సమయంలో మా మేనమామ జయంత భార్య పద్మత్త నా చేత నవలలు చదివించుకోవడం వల్ల ముందుగా నవలల మీద ఆసక్తి పెరిగింది. ఒకసారి స్కూల్లో పద్యాల పోటీ పెట్టినపుడు, ఏ పద్యాలు చదవాలని మా తాతగారిని అడిగితే రుక్మిణీ కల్యాణం పద్యాలు నేర్చుకోమన్నారు. 'ఘనుడా భూసురుడేగెనో' పద్యంతో ఫైనల్స్‌కి వచ్చాను. ఫైనల్లో 'నమ్మితి నా మనంబున' పద్యం చెప్పాను. ఫస్ట్‌ప్రైజ్ వచ్చింది. ఇవన్నీ తెలుగు మీద ఆసక్తిని పెంచాయి. కావలిలో చదువుతూండగా 9వ క్లాసులో నిర్ణయం తీసుకున్నాను. ఏకంగా పిహెచ్.డి తెలుగులోనే చెయ్యాలని. అప్పుడేదో అనుకున్నా కానీ, నిజంగా చేస్తానని ఊహించలేదు.

**మీ మొదటి రచన ఏమిటి?**

నా మొదటి రచనగా నేను గుర్తించేది ఎం.ఏ ఫస్టియర్‌లో ఉన్నపుడు వనితలో రాసిన 'నిర్ణయం' అనే కథ. బిఏలో ఏవో రాసినా అవి గుర్తులేవు. ఆ కథకు చాలామంచి స్పందన వచ్చినా మళ్లీ వెంటనే రాయలేదు. 1981లో జ్యోతి మాసపత్రిక కోసం 'ప్రేమిస్తే ఏమవుతుంది' అనే హాస్య నవలిక రాశాను. నాకెప్పుడూ రాయడంకంటే చదవడమే ఇష్టం.

**మీరు ఏఏ ప్రక్రియల్లో రచనలు చేశారు?**

నేను కాలమ్స్, కథలు, నవలికలు, వ్యాసం, నాటికలు, పాటలు, చాలా కొన్ని కవితలు, చాలా ఎక్కువ అనువాదాలు చేశాను. రేడియోకు, టీవీకి అప్పటికప్పుడు స్క్రిప్టులు రాశాను. ఏదో ఒక ప్రక్రియలో ఎక్కువ కృషి చేసివుంటే బాగుండేదని చాలామంది అంటారు. కానీ నాకు అభిరుచులు అనేకం, ఏదో ఒకదానికి పరిమితమై వుండే రకాన్ని కాను. అలాగే నా అంతట నేను రాసిన వాటికంటే ఎవరో రాయమంటే రాసినవే ఎక్కువ.

మరో విషయం. నాకు అందరూ రాసినవే రాయడమంటే పెద్ద ఆసక్తి ఉండదు. నన్ను నేను రిపీట్ చేసుకోవడం కూడా ఇష్టం ఉండదు. అందుకే విమర్శలో కూడా పురాణ పాత్రలపై ఇంతిహాసం, ప్రపంచ సాహిత్యంపై విశ్వ మహిళా నవల, తులనాత్మక సాహిత్యంతో నిశ్శబ్ద విప్లవాలు, సినిమాలపై, సినిమా పాటలపై విశ్లేషణలూ, ఇలా విభిన్నంగా రాయడానికి ప్రయత్నించాను. నా రచనల్లో విమర్శ వ్యాసాలు, పరిశోధనాత్మక వ్యాసాలూ ఉన్నాయి. రచయితల పరిచయ వ్యాసాలూ ఉన్నాయి. వ్యంగ్య వ్యాసాలూ ఉన్నాయి. ఏదైనా కొత్తగా చెప్పలేకపోతే రాయకూడదన్న నియమం కూడా ఉంది. కనక ఎక్కువగా రాయడానికి ఇష్టపడను.

**తెలుగు విశ్వవిద్యాలయంలో తులనాత్మక పరిశీలన విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేసే సమయంలో, ఎదుర్కొన్న సవాళ్ళు– సాధించిన విజయాలు ....**

తులనాత్మక అధ్యయన కేంద్రంలో నేను లెక్చరర్‌గా చేరే సమయానికి నాకు దాని గురించి ఏమీ తెలీదు. విద్యార్థులకు చెప్పడం, నేను నేర్చుకోవడం ఒకేసారి జరిగాయి. కనక ఆ విషయంలో నా పరిజ్ఞానం ఇంకా అసంపూర్ణమే. అక్కడ సవాలు ప్రధానంగా భాషలకు సంబంధించింది. మాది పరిశోధక కేంద్రం కనక, విద్యార్థులకు పరిశోధనాంశం ఎంపికే పెద్ద సవాలుగా ఉండేది. కనీసం మరో భాష ఒక్కటైనా రాకపోతే ఈ కేంద్రానికి మేముగానీ, విద్యార్థులు కానీ పనికిరాము. తెలుగు సాహిత్యాన్ని ఇంగ్లీషు, హిందీ సాహిత్యాలతో పోల్చడం ఎక్కువ. అంటే గైడ్స్‌గా ఉన్న మాకు ఆ రెండు భాషల్లోనూ తెలుగుతో పోల్చగల రచనలూ, రచయితలూ తెలిసి వుండాలి. అంటే మేము భారతీయ సాహిత్యాన్ని, విశ్వసాహిత్యాన్ని చదువుకోవాలి. అది ఎప్పుడూ పెద్ద సవాలే. వాటితో పాటు, సాహిత్యానికి ఇతర కళలతో గల సంబంధం కూడా తులనాత్మక పరిశోధనలో భాగమే. నా దగ్గర చేసిన వారిలో సాహిత్యం–నాట్యం, సాహిత్యం–సినిమా, సాహిత్యం–నాటకం ఇత్యాది అంశాలపై చేసిన వారున్నారు. ఆ అంశాలు చాలా తృప్తిని కలిగించాయి.

**స్త్రీవాద ప్రచారంపై మీరు చేసిన కృషి గురించి క్లుప్తంగా చెప్పండి.**

స్త్రీవాదం గురించి నేను ఇచ్చిన ఉపన్యాసాలు, చెప్పిన పాఠాలు ఎక్కువ. రాసింది తక్కువ. 'నిశ్శబ్ద విప్లవాలు' పుస్తకంలో గ్రీకు, భారతీయ పురణాల్లో స్త్రీల గురించి విశ్లేషించాను. కానీ దాన్ని నేను అసంపూర్ణ రచనగానే భావిస్తాను. ఇంకా రాయదగ్గ విషయాలు అందులో చాలా ఉన్నాయి. ఎప్పటికైనా ఒక పెద్ద గ్రంథం ఆ అంశంపై రాయాలి. ఇక, 'ఇంతిహాసం'లో భారతీయ పురాణ స్త్రీ పాత్రల్లో ఉన్న ఆధునికతను చూపడానికి ప్రయత్నిం చాను. ఇప్పుడు మనం స్త్రీవాద దృక్పథంతో చెబుతున్న విషయాలు కొన్నయినా పురాణ పాత్రలు చెప్పేశాయన్నది అవి చదివితే నాకనిపించింది కనక ఆ అంశాలను అందులో ప్రస్తావించాను. ఉదాహరణకు ఒంటరి తల్లుల మనోధైర్యం, స్వయంవరం వెనక ఉన్న పురుషాధిక్య భావజాలం, భర్త జీవితంలో భార్యకున్న స్థానం ఇవన్నీ అందులో వచ్చాయి. తర్వాత కోమలి గాంధారం స్త్రీవాద రచనే!

**మీ ప్రసిద్ధ రచనలు కోమలి గాంధారం, తాంబూలం గురించి క్లుప్తంగా చెప్పండి.**

కోమలి గాంధారం, తాంబూలం నా రచనల్లో చాలా పేరు తెచ్చి పెట్టినవి. 1998లో వార్తకు నన్ను ఒక హాస్యరచన రాయమని ఎడిట్ పేజీ సంపాదకులు గోపాలకృష్ణ గారు అడిగినపుడు– సరదాగా అత్తాకోడళ్ల మధ్య ఒక చిన్న సంఘటన రాశాను. అది ఆయనకు నచ్చి, దాన్ని కాలమ్‌గా రాయండి అన్నారు. కొన్ని స్టాక్ పాత్రలని పెట్టి కథలు అల్లితే ఎలా ఉంటుందనుకుని మొదలుపెడితే అది రెండేళ్లపాటు కొనసాగింది. కోమలి పాత్ర వ్యక్తిత్వాన్ని నిర్ణయించుకోవడంతో సగం పని పూర్తయిందని చెప్పవచ్చు. మధ్య తరగతి కుటుంబంలో స్త్రీలు, ఇంటా బయటా ఎదుర్కొనే చిన్న చిన్న వివక్షలను, ఆంక్షలను తీసుకుని, ధైర్యంతో, చాతుర్యంతో, హాస్యస్ఫూర్తితో వాటిని ఎదుర్కొనే సంఘటనలు కల్పించి రాసిన కథలివి. స్త్రీవాదమంటే సీరియస్ విషయమన్నది కాదనలేం. బాధాకరమైన అణచివేతలు, దౌర్జన్యాలు, అసమానతల గురించి ఎందరో రచయిత్రులు, కవయిత్రులు అప్పటికే రాస్తున్నారు. నేను ఎంచుకున్న వస్తువు కనీకనిపించని వివక్షలకు సంబంధించింది. రోజువారీ జీవితంలో మనం సహజమని అనుకుని పెద్దగా పట్టించుకోని సందర్భాల్లోనూ ఈ వివక్ష ఉంటుందని చూపే సన్నివేశాలే ఈ కథల్లో ఉంటాయి. ఇంట్లోనూ, ఆఫీసులోనూ మగవాళ్లలో ఉన్న ఈ బలహీనతలను, మూర్ఖత్వాన్నీ కోమలి ఎలా ఎత్తి చూపిందన్నది కథల వస్తువు. వాక్చాతుర్యమే ఆమె ఆయుధం కనక హాస్యం బాగా పండింది. కోమలి చాలామందికి ఫేవరెట్ స్త్రీపాత్ర అయిందని తెలిసి తృప్తిగా అనిపించింది. ఇక *తాంబూలం* విషయానికి వస్తే... నిత్య జీవితంలో నాకు చాలా సంఘటనలను, మానవ ప్రవృత్తులను చూసినపుడు నవ్వొస్తూంటుంది. చాలామంది మనుషులు తమని తాము చాలా సీరియస్‌గా తీసుకుంటారు. అది కూడా నాకు హాస్యాస్పదంగా అనిపిస్తుంది. ఆధునిక జీవితంలో వస్తున్న మార్పులు, మానవ సంబంధాల్లోని కృతకత్వం, రాజకీయ నాయకుల తెలివి తక్కువతనాలు ఇవన్నీ కలగలిపి రాసిన రచన అది. నాకు హాస్యం, అధిక్షేపం చాలా ఇష్టం. వేమనను, గురజాడను, పి.జి, వుడ్‌హౌస్‌నీ, ముళ్లపూడిని ఇష్టపడే మనస్తత్వం నాది. వీటికి తోడు మా తాతగారి వ్యాసాల్లోని సునిశితమైన వ్యంగ్యం కొంత పట్టుబడిందేమో! (ఈ మాట సి.ధర్మారావు గారు మొదటిసారి నాతో అన్నారు).

**ఒక సాహిత్యంలో వున్న శబ్ద చమత్కారం ఇంకో భాషలోకి వెళ్ళదు అంటారు. ఈ విషయంలో అంటే మాల్గుడి డేస్, గుల్జార్ కథల అనువాద విషయంలో మీరెదుర్కొన్న సాధక బాధకాలేమిటి?**

అనువాదాలు ఎన్నో చేశాను గానీ, నాకు నచ్చినవి మీరు

పేర్కొన్న గుల్జార్, మాల్గుడి కథలే. నాకు అనువాదం పట్ల ఉన్న అవగాహన ఇది ప్రతి రచయితకూ ఒక కంఠస్వరం (టోన్) ఉంటుంది. ముందు దాన్ని అర్థం చేసుకోవాలి అనువాదకుడు. అప్పుడు దానికి తగ్గ పదాలు దొరుకుతాయి. గుల్జార్ కథల కంటే కూడా మాల్గుడి కథల అనువాదం కష్టం. ఆర్.కె. నారాయణ్ కంఠస్వరం అంత సులువుగా పట్టుబడదు. ఐరనీ ఆయన శైలి. దానికి తగ్గట్టుగా రాయడానికి ప్రయత్నించాను. ఆ పుస్తకం ఇప్పటికి 10 ఎడిషన్లు పూర్తి చేసుకుందంటే, ఎంతో కొంత న్యాయం చేశాననే నమ్ముతున్నాను. మాల్గుడి డేస్ ఇంగ్లీషు రచనే కనక, నేరుగా మూలం నుంచి అనువదించాను. గుల్జార్ కథలు ఉర్దూలో రాసినవి. నేను ఇంగ్లీషు అనువాదం ద్వారా తెలుగు చేశాను. కనక అక్కడక్కడా కొన్ని సందేహాలొచ్చేవి. నాకు ఢిల్లీలో ఉర్దూ తెలిసిన మిత్రుడున్నారు (మధుకర్ ఉపాధ్యాయ్). ఆయనకు ఫోన్ చేసి, అనుమానం వచ్చిన చోట్ల ఇంగ్లీషు వాక్యం చెప్పి, అది ఉర్దూలో ఎలా ఉండివుంటుందో అడిగి కనుక్కుని రాశాను. ఆ అనువాదానికి కూడా మంచి స్పందనే వచ్చింది.

**అనువాద విషయంలో 'పుస్తకంలో వున్న ప్రపంచాన్ని పాఠకుల ప్రపంచంలోకి తీసుకురావడం' ఒకటి. 'పాఠకుల ప్రపంచాన్ని పుస్తకపు ప్రపంచంలోకి పట్టుకెళ్ళడం' ఇంకొకటి అని విమర్శకులంటూ ఉంటారు. మీరు ఏ విధానం ఫాలో అయ్యారు?**

నేను మొదటి పంథానే అనుసరించాను. పుస్తకంలోని ప్రపంచాన్ని లక్ష్యపాఠకులకు పరిచయం చెయ్యడానికే ప్రయత్నించాను. అప్పుడే వాళ్లకు కొత్త అనుభవాన్ని అందించగలం. అదే అనువాదం లక్ష్యం కూడా.

**వచన కవిత్వం, పద్య కవిత్వం తీసుకుంటే మీ దృష్టిలో ఏది మీ అభిమాన పాత్రమైంది?**

ప్రాచీన సాహిత్యం పట్ల నాకు గౌరవం, అభిమానం ఉన్నాయి. నచ్చని అంశాలూ ఉన్నాయి. మహాభారతం వంటి రచన ప్రపంచంలో మరెక్కడా లేదని నమ్ముతాను. దాన్నే అత్యుత్తమ గ్రంథంగా భావిస్తాను. ఇకపోతే, పద్యకవిత్వం ఇష్టమా, వచన కవిత్వం ఇష్టమా అంటే వచన కవిత్వం సులభంగా అర్థమవుతుంది అన్నది వాస్తవం. చెప్పదలుచుకున్నది తక్కువ మాటల్లో శక్తిమంతంగా చెప్పే అవకాశం వచన కవిత్వానికే ఉంది. అయితే వచన కవిత్వం పలచబడ్డం చాలా సులువు. ఉన్నత స్థాయి వచన కవిత్వాన్ని రాయగలిగిన కవులు మనకు కొందరే ఉన్నారు. పద్య కవిత్వం కూడా అవధానాల పుణ్యమాని పలచబడింది. కానీ, నా ఉద్దేశంలో రూపం కంటే సారం ముఖ్యం. విషయం గొప్పదైనపుడు, కవితాగుణం పుష్కలంగా ఉన్నప్పుడు అది పద్యమా, వచనమా అనే విషయాన్ని పట్టించుకోను. అంతిమంగా విషయమే గెలుస్తుంది.

**మీ సాహిత్య విమర్శనా మీ దృక్పథం ఏమిటి?**

నిజానికి నాకిష్టమైన ప్రక్రియ విమర్శే. విమర్శ అంటే 'వ్యతిరేక దృక్పథం' అనే అభిప్రాయం ఇప్పుడు నాటుకుపోయింది కానీ, నిజానికి విమర్శకుడు అంటే సహృదయుడు అనే అర్థాన్నే నేను స్వీకరిస్తాను. ఏ రచనలోనైనా మంచివుంటే ముందు దాన్ని ప్రస్తావించి, తరువాత దోషాలను ఎత్తిచూపడం సరైన పద్ధతి. ఊరికే తిట్టడానికి కొందరు విమర్శకు పూనుకుంటారు. అది అంత పనికిమాలిన పుస్తకమని వారు అనుకున్నపుడు దాని గురించి ఎందుకు రాయడం? నాకేమాత్రం నచ్చని పుస్తకాన్ని నేను సమీక్షించడానికి కూడా పూనుకోను. మనం తిట్టామని ఎవరికిష్టమైన రచన వారు చదవకుండా ఉండిపోరు. విమర్శ చెయ్యాల్సిన పని, ఏ రచన ఎందుకు బాగుందో ఆ కారణాలను పాఠకులకు వివరించడం, బాగలేని విషయాలను రచయితకు ఎత్తి చూపడం. సంయమనంతో ఈ పని చెయ్యగలిగిన వాళ్లే మంచి విమర్శకులు. అలా చేయడం వల్ల, యువతరానికి, విద్యార్థులకు ఒక రచనను ఎలా విశ్లేషించాలో అర్థమవుతుంది. అంతే కానీ, మన ఆరాధననో, మన కక్షనో చూపించుకోడానికి వ్యాసాలు రాయడం అసలు విమర్శే కాదు.

**మీరు 'నెరేటివ్ టెక్నిక్ ఇన్ తెలుగు నావెల్' అని ఒక విమర్శనా గ్రంథం వ్రాశారు కదా? నెరేటివ్ టెక్నిక్ అంటే ఏమిటో క్లుప్తంగా చెప్పండి. అలాగే కథా రచనలో ఈ నెరేటివ్ టెక్నిక్ చొప్పించడం అసంభవం అంటారా?**

నెరేటివ్ టెక్నిక్ అంటే కథాకథన శిల్పం. ప్రతి మంచి నవలలోనూ మంచి శిల్పం ఉంటుంది. అంటే కథలో ఏం చెబుతున్నామన్నది వస్తువైతే, ఎలా చెప్తున్నామన్నది శిల్పం. అంతే కానీ, అదొక బ్రహ్మ పదార్థమో, ఆకాశం నుంచి ఊడిపడిన చమత్కారమో కాదు. ప్రతి నవలా రచయితా తను చెప్పదలుచుకున్న విషయాన్ని చెప్పేందుకు ఇతివృత్తం, దృక్కోణం, పాత్రలు, సన్నివేశాలు, వాతావరణం, ప్రారంభం, ముగింపు ఇత్యాదుల పట్ల శ్రద్ధ వహిస్తాడు. సరైనవి ఎంచుకుంటాడు. దాన్నే శిల్పం అంటాం గానీ, తప్పనిసరిగా ఒక ఫ్లాష్‌బాక్ గానీ, సినిమా టెక్నిక్ గానీ, ఉత్తరాల రచనగానీ, డైరీ రచనగానీ ఉంటేనే శిల్పం అని అర్థం కాదు. చాలామంది టెక్నిక్ అంటే వస్తువునుంచి విడిపోయిన లక్షణమని అనుకుని, నాకు టెక్నిక్ పట్ల ఆసక్తి లేదు అనీ, టెక్నిక్‌ని పట్టించుకునే రచయిత చౌకబారు రచయిత అనీ అనుకోవడం నాకు తెలుసు. అంటే వాళ్లకి టెక్నిక్ (శిల్పం అనే అర్థంలో) అంటే అవగాహనే లేదని అర్థం. తెలుగులో నవలా శిల్పం పట్ల అవగాహన కొంచెం తక్కువే అయినా (చాలామంది కథ చెప్పుకుంటూ, సన్నివేశాలు పేర్చుకుంటూ పోతారు తప్ప ఒక ఫోకస్‌తో నవల రాయరు), తెలిసిన వాళ్లు లేకపోలేదు. వస్తుశిల్పాలు ఉన్నతంగా ఉన్న నవలల్లో చివరకు మిగిలేది, అసమర్థుని జీవయాత్ర, అల్పజీవి, డా. కేశవరెడ్డి నవలలు మొదలైనవి చెప్పుకోవచ్చు. దృక్కోణం అనే శిల్ప సంబంధమైన విషయంలో రావిశాస్త్రి 'గోవులొస్తున్నాయి జాగ్రత్త' చెప్పుకోదగ్గ రచన. అందులో కథకుడు కిరీటిరావు అవిశ్వసనీయ కథకుడు (Unreliable Narrator). ఇలాంటి కథకుడు ఒకడుంటాడని

సిద్ధాంతం రావిశాస్త్రికి తెలిసివుండక పోవచ్చు. కానీ ఆ కథకు అది అమరిందని గుర్తించడంలో ఆయన జీనియస్ ఉంది. శిల్పపరంగా మనకు చాలామంది మంచి కథలు రాసినవారు న్నారు. ఇది చాలా విస్తృతమైన అంశం కనక ఇక్కడే ఆపేస్తున్నాను.

**మీకు నాటకరంగంలో కూడా అనుభవం ఉందని విన్నాను. ఆ విశేషాలు క్లుప్తంగా చెప్తారా?**

నాకు నాటకరంగంతో ఉన్న పరిచయం చాలా తక్కువ. రెండు, మూడు స్టేజీ నాటకాల్లో నటించాను. మొట్టమొదటిది జె.వి.సోమయాజులుగారి దర్శకత్వంలో, అది కూడా రవీంద్ర భారతిలో. తెలుగు విశ్వవిద్యాలయం ఉత్సవాల సందర్భంగా వేసిన నాటిక. తర్వాత ఓల్గా రాసిన 'వాళ్ళు ఆరుగురు' నాటికలో చలం 'అరుణ'గా; 'చరిత్ర స్వరాలు'లో కందుకూరి రాజ్యలక్ష్మి పాత్ర వేశాను. ఈలోగా 'భువన విజయం' పద్ధతిలో కవయిత్రుల తో రూపొందించిన 'సరస్వతీ విజయం'లో ముద్దుపళనిగా నటించాను. అది హైదరాబాద్ దూరదర్శన్‌లో కూడా ప్రసారమైంది. ఇకపోతే నేను రాసిన నాటికలు కొన్ని ఆకాశవాణి హైదరాబాద్‌లో ప్రసారమయ్యాయి. కోమలిగాంధారంలోని కొన్ని కథలను నాటికలుగా రాసి, నేనే కోమలి పాత్ర వేసి, ఆకాశవాణి మహిళా కార్యక్రమాల్లో ప్రసారం చేశాం. అలాగే నేను వరల్డ్ స్పేస్‌లో తెలుగు విభాగం 'స్పందన'కు డైరెక్టర్‌గా పనిచేసినపుడు, చందమామ బేతాళ కథలను నాటకీకరించి ప్రసారం చేసాను. రచన, దర్శకత్వం నావే.

**మొదటిసారి ఒక మహిళ కేంద్ర సాహిత్య అకాడెమీ కన్వీనర్‌గా రావడం చాలా సంతోషకరమైన విషయం. దీనిపై మీ అనుభూతి ఏమిటి?**

కేంద్రసాహిత్య అకాడెమీ కన్వీనర్ పదవికి ఎన్నికైన మొట్టమొదటి మహిళ కావడం ఆనందం కలిగించే విషయమే. కాకపోతే ఎవరున్నా, ఆ నియమ నిబంధనలకు లోబడి పనిచేయాలి. నేనూ అదే చేస్తాను. మంచి కార్యక్రమాలు చెయ్యడానికి ప్రయత్నిస్తానని మాత్రమే చెప్పగలను. నాకు అది ఒక పదవిగా, స్టేటస్‌గా ఏమీ అనిపించదు. ఒక బాధ్యతగా మాత్రమే కనిపిస్తుంది.

**సాహిత్య అకాడెమీ వారు ముఖ్యంగా తెలుగులో వచన కవిత్వా నికే ప్రాధాన్యత ఇచ్చి, పురస్కారాలిస్తున్నారని, ఇతర ప్రక్రియలను పట్టించుకోవడం లేదని కొందరంటారు. ఇదెంతవరకూ నిజం?**

అవార్డుల విషయానికి వస్తే, ఇప్పుడు ఎక్కువగా వస్తున్నవి వచన కవితలు కాబట్టి అలా అనిపించవచ్చు. కానీ కథ, నవల, విమర్శలకు కూడా అవార్డులు వచ్చాయి. నిజానికి నాటకాలకు రాకపోవడం గురించి మనం బాధపడాలి. తెలుగులో గొప్ప నాటకాలు ఎక్కువ రాకపోవడం నిజం కావచ్చు. కానీ ఉన్న మంచి నాటకాలకు కూడా గుర్తింపు రాకపోవడం మరింత నిజం. దాని గురించి ఆలోచించడం అవసరం.

**సాహిత్యోద్యమాలు ఏవీ అనంతకాలం కొనసాగినట్టు కనిపించదు. కొంతకాలం ఉధృతంగా సాగి చల్లారిపోతున్నాయి. దీనివల్ల ఆ ఉద్యమాలు అనుకున్న మార్పులు సంఘంలో వస్తాయంటారా?**

సాహిత్యోద్యమాలు వేటికీ కంటికి కనిపించే ఒక ఫలితం ఉండదు. ఆ మాటకొస్తే స్వాతంత్ర్యోద్యమం తప్ప మరి దేనికీ అలాంటి ఫలితం లేదు. అవి చేసే పనల్లా వ్యక్తుల భావజాలంలో మార్పు తీసుకురావడం. కొంతవరకు భావవిప్లవం తీసుకు రావడం. పైగా ఏ ఉద్యమానికైనా తొలి రోజుల్లో ఉండే వాడి, వేడి తర్వాత ఉండకపోవడం సహజం. అంతమాత్రాన అవి విఫలమయ్యాయని కాదు. ఉదాహరణకు స్త్రీవాద ఉద్యమాన్నే తీసుకుంటే, హఠాత్తుగా స్త్రీపురుషులు సమానమైపోలేదు. వివక్ష తుడిచిపెట్టుకుపోలేదు. కానీ స్త్రీల గురించి తల్లిదండ్రులు, భర్తలు, పై స్థాయి ఉద్యోగుల ఆలోచనల్లో ఎంతోకొంత మార్పు వచ్చింది. ముఖ్యంగా రచయితలు, స్త్రీల గురించి రాసేటప్పుడు ఇది వరకటిలా విచ్చలవిడిగా కాక, జాగ్రత్తగా (ఇంకా చెప్పాలంటే ఒళ్ళు దగ్గరపెట్టుకుని) రాస్తున్నారు. స్త్రీలకు తమ ఆలోచనలు నిస్సంకోచంగా బయటపెట్టే వాతావరణం కొంతైనా ఏర్పడింది. ప్రభుత్వం కూడా 'పని చేసే చోట లైంగిక వివక్ష నిరోధం' వంటి చట్టాలు తీసుకువచ్చింది. గృహహింస, విడాకులు, దాంపత్యంలో అత్యాచారంపై న్యాయవ్యవస్థ చర్చిస్తున్నది. చట్టాలు తీసుకు వస్తోంది. ఇవన్నీ స్త్రీవాదం విజయాలే.

**చివరిగా మీరు యువ కలాలకు ఇచ్చే సందేశం ఏమిటి?**

యువకలాలకు సందేశమివ్వడం కష్టం. ఎందుకంటే నా సందేశాలు కోపం తెప్పించేవే తప్ప, ప్రోత్సహించేవిగా వారికి అనిపించకపోవచ్చు. యువకలాలనే కాదు. కొత్తగా కలం పట్టుకునే ఏ వయసువారికైనా నా సందేశం: ముందు బాగా చదివి తర్వాత రాయమని. రెండోది, రాసినదానికి తక్షణ విజయం కోరుకోవద్దని. పుస్తకం రాసిన దగ్గర్నుంచి అవార్డుల కోసం తాపత్రయ పడవద్దనీ. ఎందుకంటున్నానంటే, తను రాసిన పుస్తకం ఎవరికైనా అపురూపంగానే ఉంటుంది. అది సహజమే. కానీ ఇటీవలి కాలంలో చాలామంది ఒక్క పుస్తకం రాసి, తాము మహారచయితలమైపోయామని అనుకోవడం చూస్తున్నాం. అవార్డుల కోసం లాబీయింగ్ మొదలుపెట్టేయడం చూస్తున్నాం. ఒక్కసారి ఈ లాబీయింగ్‌లలో పడ్డారంటే వాళ్లు ఎప్పటికీ రచయితలుగా ఎదగలేరు. పదిమందికీ చెప్పదగ్గ, వారితో పంచుకోదగ్గ ఆలోచన లేదా అనుభవం నా దగ్గరుందని అనిపించినప్పుడే రాయాలిగానీ, అందరూ రాస్తున్నారు కనక, నేనూ రాయాలని అనుకోవడం అవివేకం. అలా మన ఆలోచన ప్రత్యేకమైందని ఎప్పుడు తెలుస్తుంది? విస్తృతంగా చదివినప్పుడు. అందుకే మళ్ళీ మొదటికి వచ్చాను. రాయడం కంటే ముందు చదవమనే నా సలహా అందరికీ. ■




# జాతి సొంతం చేసుకున్నవాడే మహాకవి

- దివికుమార్
9440167891

ఎవరి గురించి ఎంతెంత రాసినా ఇంకా రాయవలసిందేదో మిగిలి ఉంటుందో, ఏ కవి రాతలు ప్రతినిత్యం సజీవంగా జాతి గుండెల్లో ప్రతిధ్వనిస్తూ ఉంటాయో, ఆ కవి చిరంజీవి! అతను ఆ జాతి కవి! అతడిని కొందరు మహాకవి అని పొగిడారు. ఇంకొందరు ప్రజాకవి అని పిలిచారు, మరి కొందరు విప్లవ కవి అని ప్రశంసించారు, వేరొక కొందరు రేపటి కవి అంటున్నారు. మరేదో సరికొత్తగా ప్రకటించడానికి ఇంకా ఆస్కారం ఉన్నవాడు, పాఠకుడు ఎదిగేకొద్దీ మరింత అర్థమయ్యే కవిత్వమైనవాడు, లోకం బాధ కావ్యం బాధగా మార్చిన వాడు కనుకనే 'అతని కవితా వాక్యాలు తెలుగు వారి నోట నినాదాలుగా నానుడులుగా' నిలిచాయి. ఈపాటికే మనందరి ఊహల్లో కదిలే అతడే అతడే శ్రీశ్రీ!

అతడిని కవిత్వ రహస్యం తెలిసిన కాళిదాసు, పెద్దన్న, కృష్ణశాస్త్రిల సరసన కూర్చోపెట్టాడు తిలక్. పదహారేళ్లుగా అలుపెరగకుండా శ్రీశ్రీ గంటలు మోగిస్తూ, శ్రీశ్రీ పై వెలువడిన ప్రతి అక్షరాన్ని నిక్షిప్తం చేస్తూ, బహుశా భారతదేశంలో మరే కవికి జరగనంతటి విశేష విశిష్ట విశ్లేషణాత్మక ప్రచారం చేస్తున్నారు, సింగంపల్లి అశోక్ కుమార్. అందులో భాగంగా శ్రీశ్రీపై వెలువరించిన 155వ ప్రచురణ శ్రీశ్రీ! ఓ శ్రీశ్రీ!

సాహితీ ప్రియుడైన మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ గారి ఆర్థిక సహకారంతో ఈ పుస్తకం వెలువడింది. శ్రీశ్రీ 40వ వర్ధంతి జూన్ 15న ఎక్స్ రే సంస్థ నిర్వహణలో విజయవాడ ఘంటసాల సంగీత నృత్య కళాశాలలో నల్లూరన్నగా వేరుగాంచిన కామ్రేడ్ నల్లూరి వెంకటేశ్వర్లు గారి చేతుల మీదుగా ఈ పుస్తక ఆవిష్కరణ జరిగింది. 40వ వర్ధంతి కనుక, ఏదో ఒక సందర్భంలో శ్రీశ్రీ గురించి రాసిన, చెప్పిన, అక్షరబద్ధమై ఉన్న 40 మంది అమర రచయితల అభిప్రాయాలను ఒక అర పేజీ పట్టేటట్లు 100 పేజీల ఈ పుస్తకంలో ఇచ్చారు. 40 మంది అమర రచయితల జీవిత విశేషాలను క్లుప్తంగా పరిచయం చేస్తూ వారిపై 'అసి' రాసిన ముఖపత్ర కవితలు కూరుస్తూ, ఇది విడుదలయింది. పైవన్నీ ఒక పేజీలో అమర్చి, రెండో పేజీలో ఒక శ్రీశ్రీ సూక్తితో పాటు 40 మంది చిత్రకారులు గీసిన శ్రీశ్రీ చిత్రాలు, శ్రీశ్రీపై అసి రాసిన పుటకొక మినీ కవితతో ఈ పుస్తకం వెలువడింది.

శ్రీశ్రీ గురించి ఏదో ఒక అభిప్రాయం ఏర్పరచుకోని ఆధునిక సాహిత్యకారుడు ఉండడు. అందరూ కాగితం మీద పెట్టకపోవచ్చు. అందరి అభిప్రాయాలు ముద్రణకు నోచుకోను పోవచ్చు. శ్రీశ్రీ మరణించిన 25 సంవత్సరాలకు (2008) అమర రచయితల 25 మంది అభిప్రాయాలను పుస్తక రూపంలో తెచ్చిన సాహిత్య నిధి ఇప్పుడు ఆయన 40వ వర్ధంతికి 40 మంది అమర రచయితల అభిప్రాయాలను క్రోడీకరించింది.

అమర సాహితీవేత్తలు అంటే ఇప్పటికే కాలం చేసిన వారు. శ్రీశ్రీ కంటే 23 ఏళ్లు చిన్నవాడైన సుబ్బారావు పాణిగ్రాహి ఆయన కంటే 14 ఏళ్ళు ముందే అమరుడయ్యాడు. (అరెస్టు చేసి పోలీసులు కాల్చి చంపారు) అందరిలోకి తక్కువ వయసులో చనిపోయింది ఆయనే.

తన జముకల కథ ద్వారా శ్రీకాకుళ గిరిజన ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేసినవాడు పాణిగ్రాహి. ధిక్కార స్వరానికి పేరుగాంచిన బమ్మెర పోతన, తిరుగుబాటు వీరుడైన అల్లూరి శ్రీరామరాజుతో పాటు శ్రీశ్రీని కూడా తన కళారూపంలో తెలుగుజాతి మరువలేని మహనీయులుగా పేర్కొన్నాడు. దానినే ఈ పుస్తకంలో ఇచ్చారు.

శ్రీశ్రీ కంటే వయసులో పెద్దవారైన తాపీ ధర్మారావు, దేవుల పల్లి కృష్ణశాస్త్రి అభిప్రాయాలు ఇందులో ఉన్నాయి. శ్రీశ్రీకి దాదాపు సమ వయస్కులైనవారు ఆరుగురు ఉండగా, 10 నుంచి 20 ఏళ్లకు పైగా చిన్నవారు ఏడుగురు, ఆ తర్వాత పదేళ్లలో 15 మంది, 30 నుంచి 44 ఏళ్ళ చిన్నవారు ఇంకొక పదిమంది ఉన్నారు. ఈ వరుసలో అతి చిన్న వారి కంటే ఇంకా సజీవులుగా మన నడుమ సంచరిస్తున్న వారు చాలామంది ఉన్నారు కనుక వారి పేర్లు తర్వాత కాలంలో.. అనుకోవచ్చు!

ఈ నలభై మంది బాగా లబ్ద ప్రతిష్టులైన వారే! ప్రస్తావన పూర్వకంగా కొన్ని పేర్లు మాత్రమే ఉటంకించగలం. కవిత్వాన్ని తల్లిగా భావించిన శ్రీశ్రీ దానిలో 'ఒక లక్ష నక్షత్రాల మాటలు, ఒక కోటి జలపాతాల పాటలు, శతకోటి సముద్ర తరంగాల మ్రోతలు' విన్నానని చెప్పుకున్నాడు. పదం కాని అక్షర సముదాయాన్ని (చివరి అక్షరం మినహా సప్త స్వరాలను) ఒక అర్థవంత మైన పదంలాగా భాసింపచేయడం శ్రీశ్రీకి భాషపై భావంపై గల పట్టును తెలియపరుస్తుంది. దాన్ని యాదాటి కాశీపతి 2014లో రాసిన 'మధ్య తరగతి మందహాసం'లో పేర్కొన్నాడు.

'కాశీపతి గారు రాసుకోండి' అన్నాడు శ్రీశ్రీ. ఆయన రాసుకుంటున్నాడు.

"పద పద పద/ ముందుకె పద/ నీదే కద.. ఈ సంపద/ అడ్డు తగులు వాడెవడు?... ముళ్ళ పొద.../ పాడెయ్ వాడికిక సరిగమపద" సరిగమపద అనేది ఒక పదం కాదు. సంగీత స్వర జతుల బీజాక్షరాలు. వాటితో ఒక భావాన్ని సృష్టించటం ఇక్కడ శ్రీశ్రీ సాధించిన అక్షర విన్యాస విజయం. సమయ స్ఫూర్తితో కూడిన అవధాన పండితుల పద విరుపుల విన్యాసం కూడా ఇందులో కనిపిస్తుంది.

**ప్రముఖుల అభిప్రాయాలు కొన్ని!**

"ప్రజల మీద అంత అధికారం సంపాదించుకున్న శ్రీశ్రీ నిజంగా ధన్యుడే!" – తాపీ ధర్మారావు

"నవ కవిత్వావరణలో మరో కవిత్వోద్యమానికి ప్రతినిధిగా నిలబడ్డాడు." – దేవులపల్లి కృష్ణశాస్త్రి

18 ఏళ్ల వయసుకే శ్రీ శ్రీ రచించిన 'ప్రభవ' ఖండకావ్యం లోని కవితా ప్రతిభను అందరికంటే ముందు పసిగట్టిన (1928) కొంపెల్ల జనార్ధన రావు "ఈ కవి కవిత ఇంకను సుసంపన్నము కాగలదను ఆశ పొడమును. భావ స్వాతంత్రమును భాషా సౌష్టవమును మెచ్చదగియున్నవి." అని ప్రశంసించాడు.

ఈ పుస్తకంలో ఆ కాలపు ముఖ్యమైన ఇద్దరు కమ్యూనిస్టు నాయకులు శ్రీశ్రీ గురించి రాసినవి తెలుసుకోవటం అవసరం. అనేక కమ్యూనిస్టు పత్రికల సంపాదకుడైన కామ్రేడ్ మద్దుకూరి చంద్రశేఖర రావు "శ్రీరంగం శ్రీనివాసరావు తన మరో ప్రపంచం గీతంతో ప్రజాసాహిత్యానికి నాందీ ప్రస్తావన చేశారు" (శ్రీశ్రీని మహాకవిగా మొదటిసారి అభివర్ణించిన కామ్రేడ్ చండ్ర రాజేశ్వర రావు, శ్రీ శ్రీ మహాప్రస్థానం కావ్యానికి యోగ్యతా పత్రం రాసిన గుడిపాటి వెంకటచలం తదితరుల గురించి 2008లో మొదటి 25 మంది అమర రచయితల పుస్తకంలో ఇచ్చారు)

మరొక ముఖ్య నాయకుడు కామ్రేడ్ మాకినేని బసవ పున్నయ్య... "శ్రీశ్రీని నవయుగ విప్లవ వైతాళికుడు... అంటే దాన్ని పొగడ్తగా కొట్టేయడానికి వీల్లేదు." అన్నారు.

బహు యూరోపియన్ భాషల్లో పండితులు రోణంకి అప్పలస్వామి గారు... "ఆంధ్రులు ఖండాంతరాలకు వెళ్లినా శ్రీ శ్రీ వంటి కవి తమకు ఉన్నాడని సగర్వంగా చెప్పుకోవచ్చు." అని అంటే చెంఘీజ్‌ఖాన్ నవలతో సుప్రసిద్ధులైన తెన్నేటి సూరి... "భావ చిత్ర నిర్మాణంలో శ్రీశ్రీ అందవేసిన చెయ్యి. ఉజ్వలమైన శబ్ద, రూప, కాంతి, చలనాలు కలిగి అవన్నీ ఎంతో చైతన్య యుతంగా కనిపించుతై." అని విశ్లేషించారు.

ఇప్పటివరకు శ్రీశ్రీ కంటె వయసులో పెద్దవారు, సుమారు సమ వయస్కులు ఆయన గురించి రాసిన వాటిలో కొన్ని చూసాం. ఇంకా శ్రీశ్రీ కవిత్వంతో ప్రభావితులైన 30 మంది పైన రచయితలు కవులు ఇందులో ఉన్నారు.

స్థలాభావం చేత కొద్దిమంది అభిప్రాయాలను మాత్రమే ఉటంకిస్తాను.

"ఎక్కడ నిజమైన ప్రజా ఉద్యమాలు ఉంటాయో అక్కడ తప్పకుండా శ్రీ శ్రీ పేరు ఉండి తీరుతుంది." – భూషణం

"మహాప్రస్థానం కావ్యం శ్రీశ్రీ విశ్వరూపం...

శ్రీశ్రీని చదివి ఉండకపోతే నేను ఈపాటికి పరమ చండాలమైన రచనలు చేస్తూ కుళ్లు కంపు కొడుతూ ఉండేవాడిని." – కెఎన్.వై.పతంజలి

"శ్రీశ్రీ is an international poet of all times. ఆయన తెలుగువాడు కావడం మనకు గర్వకారణం!" (సి.వి)

విశేషం ఏమిటంటే శ్రీశ్రీ గురించి 40 మందీ చాలా వైవిధ్యంతో కూడిన అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

ఈ పుస్తకానికి ముందు మాటలుగా తెలుగునాట వామపక్ష సాహిత్య సంఘాలుగా వుంటూ ఉన్న అరసం (పెనుగొండ లక్ష్మీనారాయణ), విరసం (అరసవిల్లి కృష్ణ), జనసాహితి (దివికుమార్), సాహితీ స్రవంతి సంస్థల బాధ్యుల (తెలకపల్లి రవి) చేత రాయించారు.

"మళ్లీ శ్రీశ్రీని, అభ్యుదయ భావజాలాన్ని, కమ్యూనిజాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి. సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమాన్ని నిర్మించాలి. సాంస్కృతిక పునర్వికాసం కలుగజేయాలి. ఈ బాధ్యత మనందరిది." అన్నారు అరసం బాధ్యులు పెనుగొండ.

" శ్రీశ్రీ పల్లకి కోరలేదు. పల్లకి మోసే బోయిల గురించి దుఃఖపడినాడు. శ్రీశ్రీ సృజించిన పిడికెడు అక్షరాలు శ్రామిక వర్గానికి ఆసరా అయినాయి.... శ్రీ శ్రీ మరణం తర్వాత జీవించిన కవి." అన్నాడు విరసం అధ్యక్షుడు అరసవల్లి కృష్ణ.

"శ్రీశ్రీ సాహిత్యాన్ని ఎన్నెన్ని కోణాల్లో విశ్లేషించి వెలికి తీయవచ్చునో రుజువుపరిచే విధంగా సాహిత్య నిధి కృషి కొనసాగటం అభినందనీయం. అదే ఒక యావగా, శ్వాసగా, ధ్యాసగా తపిస్తే తప్ప ఇలాంటి కృషి సాధ్యం కాదు." అని జనసాహితి అధ్యక్షుడు దివికుమార్ రాయగా, సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షుడు తెలకపల్లి రవి ... 'శ్రీ శ్రీ పథికుడు సింగంపల్లి' లో... " సింగంపల్లి ఎప్పుడూ శ్రీశ్రీలో స్నానం చేసి పునీతుడవుతుంటాడు. తెలుగులోనే కాదు ఇతర సాహిత్యాల్లో కూడా ఇలా ఒక మహాకవి పైనే కేంద్రీకరించి అక్షరాక్షరం అందించేందుకు తపించడం జరిగి ఉండదేమో!" అని పేర్కొన్నారు. (ఘంటసాల సంగీత నృత్య కళాశాల వేదికపై నిర్వహించిన శ్రీశ్రీ 40వ వర్ధంతి సభలో సాహితీ స్రవంతి తరఫున సత్యాజీ పాల్గొన్నారు)

శ్రీశ్రీ సాహిత్యనిధి పదహారేళ్ళ క్రితం తన కృషిని ప్రారంభించినప్పుడు 100 పుస్తకాలు లక్ష్యంగా చేసుకుంది. అది పూర్తయిన వెంటనే మరొక వంద కోసం అంతకు ముందు కంటే వేగంగా పరిగెడుతోంది. గత ఏప్రిల్‌లో శ్రీశ్రీ 113వ జయంతి సందర్భంగా పది రకాల పుస్తకాలు వెలువరిస్తే – 40వ వర్ధంతి జూన్ 15కు మరొక ఐదు పుస్తకాలు రెండు నెలలు తిరగకుండానే పూర్తిచేశారు. మనం పరిచయం చేసుకున్న ఈ పుస్తకం 155ది. మిగిలిన నాలుగు ఇవీ!

1. ఎన్టీఆర్ శతజయంతి ప్రత్యేక సచిత్ర లఘు పత్రిక, 2. తాడి ప్రకాష్ 'అశ్రు దీపాల ఆల్విదా'. 3. సూరపనేని హరి పురుషోత్తమరావు 'శ్రీశ్రీ మనిషితనం' 4.కేకే రంగనాథాచార్యులు 'శ్రీశ్రీ – భావ విప్లవం'. ఈ 155వ పుస్తకంలోని 40 మంది అమర కవుల ప్రతి ఒక్కరిపై 'అసి' పేరుతో సింగంపల్లి అశోక్ కుమార్ విడివిడిగా ఒక మినీ కవిత రాశారు. ఒక్క శ్రీ శ్రీ పైనే ప్రతి పేజీలో రాసిన మినీ కవితలు 40 ఉన్నాయి. 40 మంది చిత్రకారులు గీసిన 40 చిత్రాలను కూడా ఇందులో ఇచ్చారు.

'మహాకవి శ్రీశ్రీ' శీర్షికతో రాసిన సింగంపల్లి కవిత్వ పాదాలతో దీన్ని ముగిద్దాం. " తెలుగు సాహిత్యంలో ఎర్ర జెండా! ప్రపంచ సాహిత్యంలో తెలుగు జెండా!! కష్టజీవికి ఇరువైపులా నిలబడ్డ శ్రీశ్రీకి శ్రమైక జీవన సౌందర్యమే ఎజెండా!." ఈ పుస్తకాల కోసం సింగంపల్లి అశోక్ కుమార్‌ని 92462 77375 మొబైల్ నెంబర్లో సంప్రదించవచ్చు.

■



## నగ్న ఊరేగింపు

**నా** దేశంలో
పైశాచికత్వం పరిఢవిల్లుతోంది
రాక్షసత్వం రాజ్యమేలుతోంది

క్రూరత్వం పెచ్చుమీరుతోంది!
మానవత్వం మంటగలిసింది!
విద్వేషం విలయతాండవం చేస్తోంది!
ఉన్మాదం రెచ్చిపోయింది!

నేటి ఆటవిక అంధయుగంలో
పోలీసులు దిష్టిబొమ్మలు!
స్టేషన్లు పాడుబడిన కొంపలు!

ప్రజల రక్షణ గాలిలో దీపం
మహిళల మానానికే తీరని అవమానం
ఆడబిడ్డలను అవమానించి
వివస్త్రలుగా ఊరేగించి
సామూహిక అత్యాచారం చేసిన
మేకిన్ ఇండియాను చూసి
సభ్య సమాజం సిగ్గుతో తలదించుకుంది!

నిస్సిగ్గుగా
తల ఎత్తుకుని
రాజకీయ వ్యభిచారం చేస్తున్న
పాలక హంతకులను ఏం చేద్దాం?

వారి ఉన్మాద నగ్నత్వాన్ని
బట్టబయలు చేసి
సమాధానం చెప్పాలని నిలదీద్దాం!

**- చౌశా**



# అవిశ్వాసంతో మోడీ సర్కారుకు రాజకీయ సవాలు

- తెలకపల్లి రవి

**మ**ణిపూర్ ఘోర దురంతాలపై ప్రకటన చేయడానికి, చర్చ జరపడానికి నిరాకరిస్తున్న ప్రధాని మోడీ వైఖరితో పార్లమెంటు విలువైన కాలం వృథా అయిపోతున్నది. మణిపూర్ పుత్రికలపై జరిగిన అమానుషానికి దేశమంతా సిగ్గుపడాలని చెప్పిన మోడీ అదే మాట సభలో చెప్పడానికి సిద్ధం కాకపోవడం ఇందుకు కారణమైంది. చర్చకు మొహం చాటేస్తున్న మోడీని దారికి తేవడానికి, మణిపూర్‌తో సహా దేశ పరిస్థితిని సాకల్యంగా చర్చించడానికి ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానం నోటీసు ఇవ్వడంతో ఈ ఎత్తుగడకు బ్రేక్ పడింది. నోటీసును ఆమోదించి కూడా చర్చకు సమయం నిర్ణయించకుండా కాలయాపన చేయడంలో బిజెపి సర్కారు డొల్లతనం వెల్లడైపోయింది. తాము చర్చకు సిద్ధంగా వున్నా ప్రతిపక్షాలు ముందుకు రాలేదని హోంమంత్రి అమిత్ షా ఆరోపించడం ఇందులో భాగమే. వాస్తవానికి ఈ వ్యవహారంలో రెండవ ప్రధాన పాత్రధారి అమిత్ షానే, హోంమంత్రిగానూ, ఈశాన్య రాష్ట్రాలలో బిజెపి బాధ్యుడు గానూ ఆయనకు కీలకమైన బాధ్యత వుంది. మహిళలపై సామూహిక అత్యాచారం మే 3-4 తేదీల్లో జరిగితే మరో పదిహేను రోజుల తర్వాత పర్యటనకు వెళ్లింది ఆయనే, ఇప్పుడు తెలియవస్తున్న సమాచారం ప్రకారం అప్పటికే ఆ దారుణ ఘటనపై పోలీసు స్టేషన్లలో ఎఫ్ఐఆర్ నమోదైంది. బాధితులే వచ్చి ఫిర్యాదు చేశారు. ఒక కల్లోలిత రాష్ట్రంలో ఎఫ్ఐఆర్ నమోదైన తర్వాత కూడా పరిస్థితి తెలుసుకోలేకపోవడం హోం మంత్రి అసమర్థతకు అద్దం పడుతుంది. నిఘా సంస్థలకు ఆధ్వర్యం వహించే మంత్రికి ఈశాన్య రాష్ట్రంలో ఎగుస్తున్న మంటలు కనిపించలేదంటే ఎలా విశ్వసించడం? అక్కడకు పర్యటనకు వెళ్లినప్పుడైనా ప్రభుత్వం, పోలీసు శాఖ, నిఘా వర్గాలు చెప్పలేదా? వందల సంఖ్యలో జరిగితే ఇదొక్కటి పట్టుకుంటారేమని నిస్సిగ్గుగా వాదించిన ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ చెప్పలేదా? ఈశాన్య చాణక్యుడుగా చెప్పుకునే అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ నివేదించలేదా? ఇంతకన్నా ఆత్మవంచన మరేముంటుంది? అలా అయితే ఇందుకుగాను హోంశాఖ అధికారులు అమాత్యులపై చర్య తీసుకోవద్దా?

**వీడియో తీసిన వారి అరెస్టు**

ఈ ఘటనతో పాటు మణిపూర్‌లో జరిగిన మరెన్నో అఘాయిత్యాల బాధాకర వివరాలు ఇప్పుడు బయటికొస్తు న్నాయి. వాటిపై ఏ చర్యలూ తీసుకున్న దాఖలాలు మాత్రం కనిపించడం లేదు, దేశవ్యాపితంగా ఇంతగా ఆగ్రహావేశాలు రగిలించిన ఈ కేసులోనే కేంద్రం చేసిందేమిటి? ఆ రోజు వీడియో తీసిన వ్యక్తిని అరెస్టు చేశారట! జరిగింది షూట్ చేసి దేశమంతా అందుబాటులోకి తెచ్చినందుకు కేసు నమోదు చేశారట. ఇదేగాక ఇలాంటి ఘటనలు ఎలా ఎన్ని జరిగాయో దర్యాప్తు చేసే బాధ్యత సిబిఐకి అప్పగించారట! ఏదో సామెత చెప్పినట్టు సిబిఐ, ఐ.బి, రా వంటి సంస్థలు సక్రమంగా పనిచేస్తే ఈ పరిస్థితి ఎందుకు వచ్చేది? పైగా పంజరంలో చిలకగా పేరుమోసిన సిబిఐ ఇలాంటి వాటిని సమర్థంగా వెలికితీసిన ఉదాహరణ ఒకటైనా వుందా? అన్ని సందర్భాల్లోనూ మారణ కాండ జరిగిన తర్వాతనే కదా సిబిఐ రంగంలోకి వచ్చేది? ఈ విషయమైనా ప్రభుత్వం పార్లమెంటుకు చెప్పలేదు. సుప్రీం కోర్టులో అఫిడవిట్ ద్వారా తెలియజేసింది. మీరు చర్య తీసుకుంటారా లేక మేమే రంగంలోకి దిగాలా అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డివై.చంద్రచూడ్ అక్షింతలు వేశాక అనివార్యంగా ఇచ్చిన జవాబిది. సుప్రీంకోర్టు ఇలా అడగడం కూడా ఇష్టం లేని బద్రి శేషాద్రి అనే తమిళ పాత్రికేయుడు యూట్యూబ్ ఇంటర్వ్యూలో సిజెఐ పైనే అవాకులకు దిగారు. ప్రధాన న్యాయమూర్తికి ఒక తుపాకి ఇచ్చి పంపిస్తే ఘర్షణలను నివారిస్తారేమో చూడాలని అపహాస్యం చేశారు. అది పర్వత

మయమైన సంక్లిష్ట ప్రాంతం. అక్కడ హత్యలు జరుగుతాయి. హింసాకాండ మనం ఆపలేం అని తేల్చిపారేశాడు. దీని మీద కవి అరసు అనే అడ్వకేట్ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు అతడిని అరెస్టు చేశారు. దేశంలో ఎందరో రచయితలు, పాత్రికేయులను నిరంకుశంగా అరెస్టు చేసిన బిజెపికి ఇది మాత్రం మహాపరాధమైపోయింది. తమిళనాడు బిజెపి అధ్యక్షుడు అన్నామలై వెంటనే తీవ్రంగా ఖండించేశారు. అంటే అక్కడ ఆదివాసులపై దాడులను, ఈశాన్యంలో అంతర్యు ద్ధాన్ని ఆపకపోగా దేశ ప్రధాన న్యాయమూర్తినే అపహాస్యం చేసిన వ్యక్తిని విచారించకూడదన్నమాట. ప్లాటినం తరహా ఖనిజాలతో పాటు అపారసంపదలకు నిలయమైన ఆ ప్రాంతాన్ని బడా కంపెనీల పాలు చేయడానికే కావాలని కల్లోలం సృష్టించినట్టు కూడా మీడియా సంస్థలను పేర్కొంటున్నాయి.

### వంకర వాదనలతో పక్కదారి

మణిపూర్‌పై మాట్లాడే బదులు అలవాటైన అధ్వాన వ్యూహాలన్నిటినీ అమ్ముల పొదిలోంచి తీసింది బిజెపి. బెంగాల్, రాజస్థాన్‌లలో మహిళలపై ఇలాంటి ఘటనలే జరిగాయని పోటీ పెడుతోంది. నిజానికి బెంగాల్‌లో జరిగిన ఘటనల్లో బిజెపికి కూడా వాటా వుంది. అదలా వుంచితే అమానుషాలను నివారించడానికి బదులు ఒకదానికి ఒకటి పోటీ పెట్టడం ఏం రాజనీతి? ఇంకోటి మయన్మార్‌ను, చైనాను ఇందుకు కారణంగా నిందించడం. మయన్మార్ సైనిక పాలకుల అణచివేత కారణం గా శరణార్థులు వచ్చి తలదాచుకుంటున్న మాట నిజమే. కాని మైతేయి, కుకీ తెగల మధ్య బిజెపి సృష్టించిన అంతర్యుద్ధానికి వారెలా కారణమవుతారు? ఇక భారత మాజీ సైన్యాధికారి నవరత్నే ఏకంగా చైనానే వీటన్నిటికీ కారణమని తేల్చిపారేశారు! ఒకవైపున విదేశాంగ మంత్రి జైశంకర్ అంతకు ముందు మోడీ చైనా నేతలతో చర్చలు జరిపి సంబంధాల మెరుగుదల గురించి మాట్లాడుతూ మాజీ సైన్యాధిపతి ఇలా అనడం దానికి విస్తార మైన ప్రచారం కల్పించంలో విదేశాంగ నీతీ కనిపించదు. బిజెపికి కేంద్రానికి కావలసింది ఈ గండం నుంచి గట్టెక్కడమే. అందుకు మార్గం ఇతరులపై దాడి చేయడం, చర్చను దారి మళ్లించడం. వాస్తవానికి మణిపూర్ అంటున్నా ఈ జ్వాలలు ఈశాన్య మంతటినీ కబళించే ప్రమాదం వుంది. మిజోరాం ముఖ్యమంత్రి ఇప్పటికే పలు రకాల నిరసనలలో, ఆందోళనలలో పాల్గొన్నారు. కేంద్రం వైఖరిని నిరసిస్తూ ఇది తమ భద్రతకు కూడా ముప్పని హెచ్చరించారు. మిజోరాంలో కుకి, జో ఉపజాతి ప్రజలు అధికంగా వుంటారు. అక్కడ శరణార్థి శిబిరాలు నిర్వహించడం కూడా బిజెపి సహించలేకపోతున్నది. వీటన్నిటినీ అస్సాంకు తరలించాలని కేంద్రం ప్రతిపాదించడం అందుకే. అయితే అస్సాం ముఖ్యమంత్రి హిమంత ఈశాన్య కల్లోలం సూత్ర ధారుల్లో ఒకరు. సరిహద్దు రాష్ట్రాలన్నిటితో దానికి తగాదాలు ఉన్నాయని గుర్తుచేసుకుంటే ఇదెంత ప్రమాదకరమైన సూచనో స్పష్టమవుతుంది. హిందూ ముస్లిం తగాదాలను ఇతర జాతి కలహాలను రాజేయడంలో అస్సాంకు దారుణమైన చరిత్ర వుంది. పాలనా పరంగానూ ప్రజాస్వామిక చర్చలతోనూ సమస్యను పరిష్కరించే బదులు రాజకీయ కోణంలో ఉపయోగించు కోవడమే బిజెపి పరమ సూత్రంగా వుందని ఈ ఉదాహరణలన్నీ విశదం చేస్తాయి. అత్యాచారానికి గురైన మహిళలను సాటి మహిళలే పట్టించారని మరో విపరీత వాదన కూడా పాలక పార్టీ ప్రచారంలో పెట్టింది. విద్వేషాలు రగిలించిన తర్వాత ఎవరు ఏం చేస్తారో ఎవరు చెప్పగలరు? అందులోనూ మైతేయి ప్రజలను కుకీల పైకి ఉసిగొల్పిన తర్వాత.. మైదాన ప్రాంత ప్రజలను కూడా గిరిజనులుగా గుర్తించాలని ఇంఫాల్ హైకోర్టు బాధ్యతారహితంగా ఇచ్చిన తీర్పును సుప్రీం కోర్టు కూడా తప్పు పట్టింది, అయినా రాష్ట్ర ప్రభుత్వం బిజెపి నాయకత్వం ఆమోదిం చాయి. ఆ రాష్ట్రంలోనేగాక మొత్తం ఈశాన్యంలో రాజకీయ మద్దతు పెంచుకోవడానికి ఆడిన నాటకమే ఇంతటి విపత్కర పరిస్థితికి కారణమైంది. ఇప్పుడు మరెవరిపైనో నిందలా?

### ప్రతిపక్షాల ప్రతిఘటన, వైసిపి టిడిపి వంత

ఒకవైపు ఇంత దారుణమైన నిందలేస్తూనే అమిత్ షా ఉభయ సభల్లో ప్రతిపక్ష నాయకులైన మల్లికార్జున ఖర్గే, అధీర్ రంజన్ చౌదరిలకు లేఖలు రాస్తారు. చర్చకు సహకరించా ల్సిందిగా లేఖలు రాయడం కన్నా కపటం ఏముంటుంది? ఖర్గే అన్నట్టు ఒకవైపున మోడీ ప్రతిపక్షాలను దేశ వ్యతిరేక శక్తులతోనూ టెర్రరిస్టులతోనూ పోల్చి మాట్లాడుతూ మరోవైపున ఇలాంటి మెత్తటి లేఖలు ప్రయోగిస్తే ఫలితం ఏముంటుంది? ప్రతిపక్షాలు ఇండియా అని తమ కూటమికి పేరు పెట్టుకున్నారు గాని ఇండియన్ ముజహదీన్‌లోనూ ఈస్టిండియా కంపెనీలోనూ కూడా ఇండియా వుందని అవహేళన చేసిన మోడీ మాటలు దేన్ని సూచిస్తాయి? నిజానికి చర్చ సంగతి అటుంచి పార్లమెంటు లో మణిపూర్‌పై వేసిన ప్రశ్నలకు కూడా ఈ అంశం కోర్టు పరిధిలో వుందంటూ సమాధానాలు ఇవ్వకుండా తిరస్కరిస్తున్నా రు. నేను మూడోసారి అధికారంలోకి వచ్చాక దేశాన్ని మూడో ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతానని ప్రధాని ప్రగల్భాలు పలుకు తున్నారు. సహజంగా భారత దేశం పెద్ద దేశంగా ఇప్పుడు అయిదో స్థానంలో వుంది. అయితే మనకన్నా చైనా ఆరు రెట్లు పెద్ద ఆర్థిక వ్యవస్థగా పెంపొందుతున్నది. అయిదు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ కావడమే పెద్ద గొప్ప విషయంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పుకున్న రోజులు ఎవరూ మర్చిపోరు.

ఇప్పటికీ కూడా మన ఆర్థిక వ్యవస్థ 3.2 ట్రిలియన్లు దాటలేదు. చైనా 17.3 ట్రిలియన్ల దగ్గర దూసుకుపోతున్నది. జిడిపి గొప్పలు అలా వుంచి తలసరి ఆదాయంలో మన వెనుక బాటును, అంతులేని అసమానతలను విమర్శకులు మోడీకి సరిగానే గుర్తు చేశారు.

పరిస్థితికి సంబంధించిన పూర్తి నిజాలు దేశానికి తెలియడం కోసం ప్రతిపక్ష పార్టీలకు చెందిన 21 మంది ఎంపీలు మణిపూర్‌లో స్వయంగా పర్యటన చేస్తున్నారు. దీనివల్ల అక్కడ పర్యటించకుండా దాటేసిన మోడీ తీరుకు అది సమాధానమూ అవుతుంది. ఇంత కీలకమైన సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాన పాలక పార్టీలైన వైసిపి, తెలుగుదేశం బిజెపికి అనుకూలంగా వ్యవహరించడం అవకాశవాదానికి పరాకాష్ట. ఎ.పి కీ అనేక విధాల అన్యాయం చేసిన మోడీ సర్కారును నిలదీయడానికి ఈ అవకాశం ఉపయోగించుకునే బదులు అవిశ్వాస తీర్మానాన్ని వ్యతిరేకించాలని వైసిపి నిర్ణయించింది. అమిత్‌షా చెప్పిందే సరైందని ప్రతిపక్షం వైఖరి తప్పని ఆ పార్టీ నేత విజయ సాయిరెడ్డి ప్రవచించారు. ఢిల్లీ ఆర్డినెన్సు బిల్లుపైనా మద్దతు ప్రకటించారు. టిడిపి ఎం.పి గల్లా జయదేవ్ మొదట్లో బలపరుస్తామని సూచించారు. అయితే ఎన్‌డిఎలో చేరుతామన్నా చేర్చుకోలేదని, అధికార పూర్వకంగా తమ మద్దతు కోరలేదని ఆపార్టీ కొంత సమయం తీసుకుంటున్నట్టు కనిపిస్తుంది. ఇంతవరకూ మణిపూర్ విషయంలో కేంద్రాన్ని బిజెపిని పల్లెత్తు మాట అన్నది లేదు. కొంత జాప్యం వ్యూహం అనుసరిస్తున్నా టిడిపి ప్రతిపక్షాలతో ఓటు చేస్తుందన్న అంచనా ఎవరికీ లేదు. కాంగ్రెస్‌తో కలసి వేదిక పంచుకోబోమన్న బిఆర్ఎస్ మాత్రం వ్యతిరేకంగా వుంటాననే చెబుతున్నది. ఏది ఏమైనా ప్రభుత్వం పడిపోయే ముప్పు లేకున్నా ఈ అవిశ్వాస పర్వం అయిదు రాష్ట్రాల ఎన్నికల తరుణంలో బిజెపికి పెద్ద రాజకీయ సవాలుగానే మారింది. **(తాజాగా హర్యానా మత కలహాలు, వారణాసి మసీదు వివాదం వంటి పరిణామాలు జరిగాయి. వాటిని సంపాద కీయంలో చూడొచ్చు.)** ■


**సాహిత్య ప్రస్థానం**

విలువైన పత్రిక ..

విలువలున్న పత్రిక

**చందాదారులుగా చేరండి ..**

**మీ మిత్రులను చేర్పించండి ..!**


# నగ్నవ్యూహం



**ఓ**యీ ధర్మసంస్థాపనకై
అవతరించిన
జాతీయదేవుడా.. !
'మను'ధర్మాన్ని నాలుగు
పాదాల మీదా నడిపించ
పూనుకున్న
దేశకాలపు దివ్యపురుషుడా!
...

గద్దె కోసం దక్షిణాన
రోజుల తరబడి తిష్ఠ వేసావే ..
ఈశాన్య జ్వాలలు చల్లార్చడానికి అడుగైనా పెట్టలేదేమయ్యా?

జనసంద్రమంతటికీ తెలిసిపోయాక
నోరువిప్పక తప్పలేదు గానీ ...
ప్రజాగొంతుకలు
కాలభైరవ డమరుకాలై మ్రోగేంతవరకూ
నీ గొంతు పెగల్లేదేమయ్యా?

వినబడలేదా నీకు
కలియుగ ద్రౌపదుల ఆర్తనాదాలు..?
కనబడలేదా నీకు
కలికాల రక్కసుల దాష్టీకాలు ..?

బహుశా అంతపెద్ద
ప్రపంచాన్ని దున్నేస్తున్న మహానాయకుడివి కదా..
ఇంత చిన్న ప్రదేశం కనిపించకపోయి ఉండచ్చూలే..

అయినా, నా పిచ్చిగానీ
ముసుగు లోపలి
అసలు రూపం తెలిసి కూడా అడుగుతున్నానేమిటో..

అయినా అందరికీ తెలిసిందేగా ..
నేటి మనోరోగగ్రస్త మహాభారతపు
వికృతపర్వంలో ఇదొక నగ్నవ్యూహం అంతేగా ...

కానీ ఒక్క నిజం చెప్పాలని ఉంది
వాళ్ళు నగ్నంగా ఊరేగించింది స్త్రీల దేహాలని కాదు;
దేశ గౌరవాన్ని, భారతదేశ గౌరవాన్ని ...

**– బి.బి.టి.సుందర తేజశ్విని**



# గంధపు చెక్క

- గన్నవరపు నరసింహమూర్తి
77520 20123

**ఆ** రోజు నేను మా ఊరు వెళ్ళగానే మా రైతు సత్యం వచ్చి రామం మేస్టారు గారు చనిపోయారనీ చెప్పాడు. ఆ వార్త విని నేను చాలా ఆశ్చర్యపోయాను.

రామం మేస్టారు గారికి మా ఊరితోపాటు చుట్టుపక్కల నాలుగైదు ఊళ్ళలో ఎంతో మంచి పేరుంది. అతని దగ్గర చదివిన నాలాంటి వాళ్ళెందరో వృద్ధిలోకి వచ్చి మంచి మంచి పదవుల్లో ఉన్నారు.

కేవలం ఆ మాస్టారి వల్లే చాలామంది మా ఊరి హైస్కూల్లో చేరేవారు. అతను లెక్కలతో పాటు ఇంగ్లీషు, సైన్స్ బాగా చెప్పేవారు. ఒకవేళ ఎవరైనా చదువులో వెనకబడితే వాళ్ళకు ఇంట్లో ఉదయం, సాయంత్రం ఉచితంగా విద్యను నేర్పేవారు. అలా ఎంతోమంది సామాన్యులు, చదువులో వెనకబడ్డ వాళ్ళు అతని దగ్గర చదువుకొని పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులై జీవితంలో పైకి వచ్చేరు.

నేను కూడా పదవ తరగతి వరకు మా ఊరి హైస్కూల్లో రామం మాస్టారి దగ్గరే చదివి జిల్లాకు ప్రథముడిగా నిలిచాను. ఆ తరువాత ఇంటర్లో కూడా 90 శాతం పైగా మార్కులు సాధించి ఇంజనీరింగ్ చదివి ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వంలో మంచి స్థానంలో ఉన్నాను.

నాకు తెలిసి మాస్టారు మా ఊళ్లో పాతిక సంవత్సరాలు పనిచేసారు. మధ్యలో రెండు సంవత్సరాలనుకుంటాను పక్క ఊరు బదిలీ మీద వెళ్ళి మళ్ళీ మా ఊరి వచ్చేసారు. మధ్యలో ఎన్నోసార్లు ఆయనకు బదిలీ అయినా మా ఊరి వాళ్ళు మా నియోజకవర్గ ఎమ్మెల్యేలని ఒత్తిడి చేసి ఆ బదిలీని రద్దు చేయించేవాళ్ళు.

మాస్టారు గారికి ఇద్దరు కొడుకులు. 'పండిత పుత్రః శుంఠ' అన్నట్లు వాళ్ళు చదువులో బాగా రాణించలేదు. ఎందరికో విద్యాజ్యోతిని ప్రసాదించిన మాస్టారు తన కొడుకుల విషయంలో మాత్రం ఓడిపోయారు. వాళ్ళు ఎంతో కష్టం మీద ఇంటర్ పూర్తిచేసి ఏ ఉద్యోగాలు రాక మా ఊళ్ళోనే వ్యవసాయం చేసుకుంటున్నారు. వాళ్ళ వల్ల మేస్టారు గారు ఎన్నో సమస్యలను ఎదుర్కొన్నారు. అతనికి లేనిపోని తలనొప్పులు తెచ్చేవారు వాళ్ళిద్దరూ. ఐదేళ్ళ క్రితం మా తల్లితండ్రులు చనిపోవడంతో నేను మా ఊరు వెళ్ళడం తగ్గించేసేను. అందువల్ల మా ఊరి విషయాలు ఈ మధ్యన నాకు తెలియటం లేదు. ఇప్పుడు మా పొలం అమ్మవలసిన అవసరం రావడం వల్ల మా రైతు సత్యంతో మాట్లాడాలనీ వచ్చాను. ఎప్పుడైతే సత్యం రామం మాస్టారు గారు చనిపోయారనీ చెప్పాడో అప్పటినుంచి నా మనసు బాధకు లోనై ఆ సాయంత్రం అతని కుటుంబ సభ్యులను పరామర్శించడానికి వెళ్ళాను.

మాస్టారు గారి భార్య జానకమ్మ గారు రెండేళ్ళ క్రితమే చనిపోయింది. ఇప్పుడు ఇద్దరు కొడుకులు అదే ఇంట్లో విడివిడిగా మధ్యలో గోడ కట్టుకొని ఉంటున్నారు.

నేను వెళ్ళేసరికి పెద్ద కొడుకు విశ్వనాథం ఉన్నాడు. అతను నా క్లాస్‌మేట్. రెండవవాడు శేషు పొలానికి వెళ్ళేడనీ చెప్పాడతను.

విశ్వనాథానికి ఇద్దరు పిల్లలు. మా ఊరి స్కూల్లోనే చదువుతున్నారు. పరామర్శ అయిన తర్వాత వాళ్ళ నాన్న గారు ఎలా చనిపోయారో విశ్వనాథం చెప్పాడు.

"ఎలా ఉంది నీ పరిస్థితి? పంటలు బాగా పండుతునాయా? ఆర్థిక సమస్యలు ఏమీ లేవు కదా" అనీ అడిగాను వాడిని.

నా మాటలు వినీ వాడు కొద్దిసేపు మౌనం దాల్చి చెప్పటం మొదలు పెట్టాడు.

"శర్మా! మా నాన్నగారు మేము సరిగ్గా చదువుకోలేదన్న కోపంతో మాకు పెద్దగా ఆస్తులేవీ మిగల్చలేదు. కొన్ని

విషయాలు చెప్పడం నాకిష్టం లేదు. కానీ చెప్పక తప్పని పరిస్థితి. నాన్నగారు మాకు అన్యాయం చేసి మా రైతు సీతన్న కుటుంబానికి ఎంతో సహాయం చేసారు . మాకున్న ఐదెకరాల్లో రెండెకరాలు వాళ్ళకు రాసేసాడు. అలాగే మన పక్క ఊరికి చెందిన నారాయణ అనే వాడి కుటుంబానికి కూడా చాలా డబ్బు ఇచ్చేడు. మాకు మాత్రం ఆమూడెకరాలు తప్పా ఏమీ మిగల్చలేదు." అని చెప్పాడు కోపంగా.

వాడి మాటలు నాకు చాలా ఆశ్చర్యం కలిగించాయి. మొదటిసారి మాస్టారుగారి గురించి అదీ తన కొడుకు నోటి వెంట చెడుమాటలు వింటునాను.

"మాష్టారు గారు ఎందుకు వాళ్ళకిచ్చేరు? ఏదైనా కారణం ఉందా? అదీకాక మీ నాన్న గారికి పదవీ విరమణ తరువాత గ్రాట్యూటీ, ప్రావిడెంటు ఫండ్, ఫించను వస్తాయి కదా? ఆ డబ్బునేం చేసారు?" అనీ విశ్వనాథాన్ని అడిగాను.

వాడు ఏదో చెబుదామనీ అనుకుంటున్న సమయంలో వాడి భార్య సీత బయటకొచ్చి "ఇంకెక్కడి ఫించను నాయనా? మా అత్తగారు చనిపోయారు కాబట్టి ఆ డబ్బులు ఇంకరావు. అలాగే గ్రేట్యూటీ, ప్రావిడెంటు ఫండ్ డబ్బుల్ని తనకు కావలసిన వాళ్ళకి ఇచ్చేసి మాకు అప్పులు మాత్రం మిగిల్చి వెళ్ళిపోయాడు." అనీ ఏడుస్తూ చెప్పింది.

ఆమె మాటలు విన్న తరువాత నాకు ఏం జరిగిందో అర్థం కాలేదు. మాస్టారు గారు గురించి వాళ్ళు చెబుతున్న మాటలు వినీ నా మస్తిష్కం మొద్దుబారిపోయింది.

"వాళ్ళకెందుకు ఇచ్చారు? మరి మీరు వద్దనీ చెప్పలేదా?" అనీ ఆమెను అడిగాను.

"వూరకే ఎందుకు ఇస్తారు నాయనా ? ఆ సీతన్న భార్యతో అతనికి ఏవో సంబంధాలున్నాయనీ ఊళ్ళో అందరూ చెప్పు కుంటున్నారు. అందుకే డబ్బంతా ఆ కుటుంబానికే పెట్టేసారు." అని చెప్పి ఆమె లోపలికి వెళ్ళిపోయింది.

ఆమె మాటలు విన్న తరువాత నాకు అక్కడ ఒక్క క్షణం కూడా ఉండబుద్ధి కాలేదు. వెంటనే లేచి బయటకొచ్చేసాను.

ఆ సాయంత్రం మారైతు సత్యంతో కలిసి మా పొలానికి వెళ్ళేను. నేను విశాఖపట్నంలో ఒక ఇల్లు కొనుక్కుంటున్నాను. కాబట్టి డబ్బు అవసరం పడి మా పొలంలో రెండెకరాలు సత్యానికి అమ్మెయ్యాలని వచ్చాను. వాడితో ఆ విషయాలన్నీ మాట్లాడిన తరువాత మాస్టారు గురించి అడిగాను.

"సత్యం ! ఇందాక మాస్టారు గారింటికి వెళ్ళాను. వాళ్ళు మాస్టారుగారి గురించి చాల చెడుగా మాట్లాడారు. అతను సీతన్న కుటుంబానికి రెండెకరాల పొలం, మరికొంత డబ్బిచ్చారనీ, అలాగే పక్క ఊరి నారాయణ కుటుంబానికి కూడా చాలా డబ్బు ఇచ్చారనీ ఏవోవో చెప్పారు. వాళ్ళు చెప్పిన మాటలు వింటుంటే నాకు చాలా బాధ కలిగింది. ఇంతకూ అసలు విషయమేమిటి?" అని వాడిని అడిగాను.

"ఆళ్ళు కొడుకులు కాదు బాబు... దొంగనా కొడుకులు... అతని కడుపున సెడబుట్టారు. ఆ పెద్దకొడుకు యిస్సుగోడు ఓ పెద్ద ఎదవ. ఆడు ఆ సీతన్న కూతురు సుశీలకి మాయమాటలు సెప్పి పాడు చేసాడు. దాంతో దాని మొగుడు దాన్ని ఒగ్గేసాడు. దాంతో అది సనిపోవాలనీ నూతిలో గెంతేసింది. ఆ కొడుకు సేసిన తప్పు తెలుసుకొనీ మేట్టారు బాబు ఆ కుటుంబాన్ని ఆదుకున్నారు. సుశీలని బతికించడాని కయ్యే హాస్పిటల్ ఖర్చుని మాట్టారు బాబే భరించారు . ఒకేళ అది సచ్చిపోయివుంటే ఆ ఎదవని పోలీసులు జైల్లో ఎట్టేద్దురు. తన కొడుకు వల్ల ఆ కుటుంబం పాడైపోయిందనే ఆ కుటుంబాన్ని ఆదుకున్నారు తప్ప ఇంకోటి కాదు."

"అలాగే మాస్టారి రెండో కొడుకు శేషు గోడు పక్క ఊరి నారాయణని మోటారు సైకిల్‌తో గుద్దేయడంతో అతను సని పోయాడు. దాంతో అతని భార్య, పిల్లడు అనాథలైపోనారు. అందుకు వాళ్ళకు కొంత డబ్బిచ్చారు.

ఆళ్ళకు డబ్బిచ్చారనే మాట్టారు బాబు అంటే కొడుకులకు, కోడళ్ళకు కోపం. అంతే కానీ ఆళ్ళు సేసిన తప్పుల్ని సెప్పరు.

మేట్టారు బాబు దేవుడు లాంటోడు. అందర్నీ ఒకేలా సూత్తాడు. ఆ మేట్టార్ని తప్పుగా అనుకుంటే పురుగులు కారిపోతారు." అని చెప్పాడు సత్యం.

సత్యం మాటలు విన్న నాకు చాలా ఆనందం కలిగింది. మనసులో మేస్టారి గారి మీద ఉన్న సందేహాలన్నీ తొలగి పోయాయి. మాస్టారు గారు గంధపు చెక్కలాంటివాడు. దాన్ని ఎంత అరగదీస్తే అది అంత ఎక్కువ సువాసన వెదజల్లు తుంటుంది .

ఇప్పుడు మాస్టారు గారు అంటే నాకు గౌరవం మరింత పెరిగింది. ఆ సంతృప్తితో ఇంటికి బయలు దేరాను. ■

**సమాజం మతం మత్తులో పడకుండా వుండాలంటే, మూఢనమ్మకాలు తొలగిపోవాలంటే విద్యావిధానంలో మార్పు రావాలి.**

\- థామస్ అల్వా ఎడిసన్,
ప్రపంచ ప్రసిద్ధ శాస్త్రవేత్త.




# మట్టి పిడికిళ్ల కవన పోరు కేక నీటిగింజల పంట

- మెట్టా నాగేశ్వరరావు
99510 85760

తెలుగు కవిత్వంలో ఉత్తరాంధ్రది ఉత్త సంతకం కాదు, అది ఉవ్వెత్తున ఎగసిన పోరుజెండా. రైతాంగ పోరాటాల ధీరత నుంచీ నేటివరకు తూర్పుపొద్దున ఎరుపు కవన వర్ణమై చైతన్యాన్ని ప్రకటిస్తూనే వుంది. ఛాయారాజ్ ఛాయల్లోనైనా, గంటేడ, అట్టాడ సిరా నుంచైనా, సిరికి, పాయల, మౌళి, సాంబమూర్తి లండా అక్షరాల్లోనుంచైనా– చూసొదొకటే సీరియస్ నెస్. అక్షరాన్ని సామాజికం, మానవీయం, ప్రశ్నల గొంతు చేయడం అక్కడి నిత్య వ్యవహారం. కాలక్షేప కవిత్వం అక్కడి నుంచి వినబడదు. దీనికి తాజాగా 'నీటి గింజల పంట' కవిగా వస్తోన్న కంచరాన భుజంగరావు సృజనపుటలు తిప్పినా అదే పంథా కనబడుతున్నది. మెటా పోయట్రీగా రాసుకున్న ఈ పంక్తులు తాకండి..

"నాగలి వెంట నడిచే కవిని నేను
కవిత్వమే నా కుడిచేయి
మట్టిగంగలో ఓటిపడవ నా పల్లె
కాగితం కనురెప్పల మీద నిర్నిద్ర స్వప్నాల
కుండపోత నా కవిత్వం
మట్టిగూటిలో దాగివున్న జీవం నేను"

కంచరాన కవికి మట్టి, నాగలి, తన పల్లె, అక్కడ బతుకుల్లోని దైన్యం విడదీయరానంత అనుబంధ పదాలు. అతడి సిగ్నేచర్‌లోని ప్రత్యక్షరాలు. కవి పుట్టిన ఊరు గొప్పది. అతడి అక్షరాల పల్లకినెక్కి ఊరేగే భోగం పల్లెది. ఆ ఊరి బాగోగుల పరిస్థితులను ప్రతిబింబిస్తూ 'మట్టిగంగలో ఓటి పడవ' రాసాడు. అతడి వాస్తవిక భావవ్యక్తీకరణ శక్తిని చదువుదాం.

"తొలిపొద్దులు మెలిదిరిగిన మౌనంలో
పడమటి సూరీడ్ని వెంబడిస్తున్న
ఒంటరి గొర్రెపిల్ల మా వూరు
పైరుపచ్చని ఉరుకుల పిల్ల కాలవల్లో
వెనుదిరిగి మొదలు తెంచుకున్న
జలలేని కొండవాగు మా వూరు
పాలకంకుల పాట పాడే మడిచెక్కల్లో
కూలికోకల కొంగు బంగారమై
రెక్కచిరుగుల్ని దాచుకున్న సీతాకోక మా వూరు.."

... ఇలా సాగే కవితలో విచక్షణ పదాలతో భావోన్నతితో ప్రాదేశికతను పురివిప్పాడు. మెటాఫర్ శిల్పాన్ని కలగలుపుకున్న భావచిత్రాల పోతబోశాడు. మరికొన్ని భావప్రతిమల ప్రతిభను పసిగడదాం.

*కాయకష్టానికి గంజినూకల స్వర్గం దిగిరావడం, పుట్టి ముని గాక ఒడ్డుజేరిన ఓటిపడవ మా వూరు, కళాయి పూత లేని నిలువుటద్దం మావూరు..* ఇలాంటి బిగువున్న కవనంతో ఊరి కవిత మనసుని దోచుకుంటుంది. కవితలోని ఫలశ్రుతి గాంధీజీ కోరిన గ్రామస్వరాజ్యం. అది ఇప్పటికీ ఎండమావి భావన మిగిలిపోయిందన్నది ఈ కవి ఆవేదన.

"అక్షరమే నా ఆలంబన
కవిత్వమే నా కుడిచేయి" అని ప్రకటించిన ఈ కవికి మట్టికీ విడదీయలేనంత జిగిరీ. దృశ్యాదృశ్య సౌందర్య పోషకమైన మట్టి దృష్టాంతాన్ని శోధిస్తుంటాడు. మనసున్న మన్ను మనిషిపై చిలికే మమత గురించి పదాల ప్రయోగశాలలో అనియతంగా పరీక్షిస్తుంటాడు. ఎందుకో చూద్దాం.

"మట్టిగుండెలో పొగిలే సమకాలీన సాగుదుఃఖాన్నీ
ముల్లిపికంపలు మొలిచిన అప్పుల సాలుల్లో
కవి పదానికీ రైతు పాదానికీ మధ్య వలపోస్తాను
పొలానికి మళ్లే చెమటవాన లాంటి
కుర్రకాలువలేవీ కనిపించవేమనీ దిగులవుతాను
నింగి అంతర్గృహం నుండి నేల అంతరిక్షం వరకూ
నాగలి ఉనికిని వెతుక్కుంటాను
జీవనిర్జీవ సంపదల్ని పదిలంగా దాచుంచిన
మట్టి మహాపేటిక రహస్యాలను గాలిస్తాను"

కవిత్వం నిండా మట్టి తలపోతలే. సాగుదుఃఖాన్ని అక్షరాల

బండినెక్కించి తోలుకొచ్చాడు. నాగరికతల వికాసమైనా, బతుకు భూమికైనా మట్టేననీ ఎలుగెత్తాడు. తడిస్పర్శకు పులకల మొలకయ్యే తల్లితనానికి కవి ఓ ఉదాహరణగా మలచుకున్నానంటాడు. సంపుటి శీర్షిక 'నీటిగింజల పంట' కవితలోనూ.. మట్టిబతుకుల గోసని వెల్లడిజేస్తాడు.

"ఇది గిజిగాని పచ్చని వెన్నెలగూడు
మాలాంటి చెమట పిట్టలకు మంటి ఆకాశం
విషాదమేమిటంటే
ఎగిరే రెక్కలూ మావికావు
ఎగరేసే చేతులూ మావి కావు"

మంటి ఆకాశంలో చెమటపిట్టలు సాగుదార్లు. వాళ్లు ఆ ఆకాశంలో చెమటోడ్చుతారే గానీ జీవితాల్ని ఎగరేసుకోలేరు. అందుకే వాళ్లకు తప్పడం లేదు వలసకంపు శోకం. వలసను కంపు (దుర్గంధం) గా అనడం ఔచిత్యమే.

"పెదవులు పగలిన పొలాల నోటివెంట
భళ్లున కారే నాగలిరక్తం
ఇక్కడొక తెరిపిలేని దుఃఖం దాఖలా
మేతకొచ్చే మేఘాలే తప్ప
కురిసిపోయేవేవీ ఇటుచూడని
చినుకు భ్రమల వరద గుడి
మబ్బులు మింగిన మా కొండపల్లం"

ఇలా తన ప్రాంతం మట్టిని నమ్మిన చెమట బతుకుల వెనకబాటునీ, వలసదుఃఖాన్నీ చెబుతూనే, ఆత్మవైభవాన్నిలా అంటాడు.

"సూర్యుడు నిదుర లేవాలన్నా
పరగడుపున మా చెమటచుక్కలు కొన్ని
అతడిగొంతులో పడాల్సిందే
మా రెక్కల్ని మేం నమ్ముకోవాలే గానీ
నింగినీదడం పెద్దకష్టమేంగాదు మాకు!"

ఈ కవికి ఏ పదం ఎక్కడ పొదగాలో మర్మం తెలుసు. కవిత్వభాషకీ మామూలు భాషకీ అంతరమూ తెలుసనీ పై పంక్తులు బాహాటం చేస్తున్నాయి.

సుకవి ఎపుడూ సమకాలీనతకు పెద్దపీట వేస్తాడు. బర్నింగ్ విషయాల మీద పెద్దయెత్తునే రాస్తాడు. కంచరానలో ఆ సుకవి లక్షణం విరివిగా వుంది. బోల్డ్‌గా సమకాలీన దుస్థితిని యెండ గట్టాడు. కొన్ని గమనింపులు చేద్దాం.

తెలుగు భాషను మరచిపోతున్న కాలం యిది. పరభాషను మోజుగా మొదలెట్టడం, మాతృభాషకు గోరీ కట్టడం చకచకా జరిగిపోతున్నది. ఓ కవి ఓ కవితలో ఇలా అంటాడు.

"అమ్మభాష కు గోరీకట్టీ
అమ్ముకునే భాషకు పట్టంగట్టే
ద్రోహులెవరు!?
ఇంకెవరు దేశీయులే!"

అమ్మనుడిని 'పలుకుబడి పాయల్లో' అన్న కవితగా రాసాడు కంచరాన. తెలుగుభాషను కీర్తిస్తూ యిలా అన్నాడు.

"తల్లిభాషతోనే బుద్ధి వికాసం
చామ్ స్కీ చెప్పినా ఛాయారాజు చెప్పినా
మాతృభాష పునాదుల మీదే జ్ఞానప్రకాశం
అమ్మమాట తృణీకరించి
అందలాలెక్కాలనుకుంటే
అరుగుని తవ్వి
ఆకాశానికి నిచ్చెన పేర్చడమే!"

మరొకచోట జనాల ఓట్లతో నెగ్గిన ప్రజాప్రతినిధులు శాసనసభల సాక్షిగా, మీడియా మైకుల వేదికగా మాట్లాడే హీన బూతుభాషలను 'మార్చుకోండి ప్లీజ్!' అనే కవితలో విన్నవించాడు.

"ఆవేశకావేశాలు ఎన్నున్నా
మృదువైన రాగాలతో
అవలీలగా పలికించగల
శిష్ట నిరసన ఛందస్సుని
ఆశ్రయించండి ప్లీజ్
పిల్లలంతా గమనిస్తున్నారు
భాష మార్చండి ప్లీజ్ !"

రాబోయే తరాలను కాపాడుకునే బాధ్యత కవులదే కాదు బాధ్యతాయుతమైన పదవీలో వున్నవాళ్లదే కాదు, ప్రతి మనిషిదీ!

కేవలం అట్టహాసంగా, ప్రహసనంగా చేసిన అమృతోత్సవా లను ఎద్దేవా చేశాడు. వాస్తవికతను ఈ దేశాన్ని నడిపే రౌతులకు బొమ్మకట్టించాడు 'సెల్ఫీ కాదు' కవితలో...

"ముదురుతున్న విద్వేష ఛాయలను
మసకబారిన మరకల గోడలను
వజ్రోత్సవ వేడుక రంగులతో
పెయింటింగ్ వేసి కప్పుకోవచ్చు
కానీ ఒక చెమటజెండా ఒంటిమీద
చిరుగుల అంగీ ఎగురుతున్నప్పుడు"
పెట్టుబడి ఒక్కటే
వీసా లేకుండా దేశాలు తిరిగేస్తున్నప్పుడు
కొండల్ని మేరువులుగా బలిపించి
కూసుల్ని కురచబార్చినపుడు
అభివృద్ధి నడక ఎక్కడో తప్పటడుగులు వేసింది"

నిజాల్ని నిర్భయంగా రాసినపుడే కవి దమ్ము తెలిసేది. ఏలికల కుట్రలను భగ్నపరిచేవాడే కవి. అవార్డుల మాయలో పరిగెట్టి మరణించే కవులున్న నేటికాలంలో కంచరాన కవిత్వం పసగలది. ప్రశ్నల్ని విల్లంబులుగా సంధించగలిగింది. 'ఎర్రెర్రని పొద్దుపొడుపులోకి' ఇతడి పద్యాలు అస్తిత్వం కోల్పోయిన వాళ్లందరినీ స్వాగతించాడు. తన అక్షరాలను పిడికిళ్లుగా

అందిస్తున్నాడు. రెండు గుండెల వాళ్ల కపటత్వాన్ని ఎదురొడ్డీ, ఉన్న ఒక్కగుండెను స్వేచ్ఛాకాశం కోసం, ప్రజాపతాకను చేసి ఎగరేద్దామంటూ పిలుపునిచ్చాడు.

కంచరాన కవిలో తాత్వికుడున్నాడు. "ఊపిరిబొట్ల కానుక" కవితే నిదర్శనం. జీవితాన్ని సత్యమార్గంలో వ్యాఖ్యానించాడు. చీకటి వెలుగుల శోభాయాత్రగానూ, నిత్యోత్సవంగానూ, ఎడతెగని కోరికల ఉత్సవంగానూ, ఆశను బతికించే ఉత్సాహం అంటూ ఇలా తోవను చూపుతున్నాడు.

"యుద్ధం ముగిసే వరకూ
తెగువే ఆయుధమని నమ్మాలి
సాటి మనిషి పట్ల ప్రేమ
కొలతల్లేని సహజాతమై
దోసిళ్లలో ఒలికిపోవాలి
ప్రాణానికి ప్రాణానికీ ప్రియమార మరికొన్ని
ఊపిరిబొట్లను కానుకివ్వాలి"

వైషమ్యాలు లేని జీవితాలు కడదాక శాంతితో వర్ధిల్లుతాయనే ఈ బాపతు కవితలు నేటికెంతో ఆవశ్యకాలు.

కవి అనిపించుకోవడం సులభమేమీ కాదు. వస్తువులో నిజాయితీ వుండాలి. ఆచరణ లేని పాదాలు అతడిని వేలెత్తి చూపుతాయి. అలాగే వస్తుసోయితో పాటు కవిత్వ నిర్వహణ శిల్పంతో అలరించే ప్రతిభ కూడా జమిలిగా వుండాలి. వస్తు, శిల్పాల జమిలీరాగంతీయడంలో కంచరాన కృతకృత్యుడయ్యాడు. సంక్షిప్తత అలవర్చుకుంటే అతడి కవిత్వం మరింత శోభాయమానం. మట్టి మీద, రైతు మీద రాసిన కవితల్లోని భావాల్లో అక్కడక్కడ పునరుక్తి పదాలు పరిహరిస్తే చాలు; కంచరాన కవిత జిగిబిగి అవుతుంది. క్రియాపదాలెక్కువగా వాక్యాల చివర లేకుంటే బాగుండేది. అరిగిపోయిన సంస్కృత పదాల స్థానే దేశీయ పదాలను పొసగితే చాలు, ఈ కవికి వంకబెట్టువాడుండడు. అనేక నూతన పదచిత్రాలు, ఆలంకారిక సొగసు 'నీటిగింజల పంట'గా మనసుని దోస్తుంది.

తొలి కవితాసంపుటితో సీరియస్ పోయట్‌గా మదిలోకి చేరుకున్నాడు.

"నా గుండెకు నీ గుండెకూ నడుమ
ఉద్వేగపు స్తంభాలపై
రసవంతెనొకటి నిర్మిస్తాను
కవిత్వంతో ఆయువు పొడిగించుకుంటాను"

కంచరాన కవిగా మంచికవిత్వాన్ని వాగ్దానం చేస్తున్నాడు. సమాజ పురోభివృద్ధికి ఆకాంక్షలు పలుకుతోన్న కంచరాన భుజంగరావు కవితాసేద్యానికి మనసారా అభినందనలు. ■



## కమ్మని కల

వర్షం వస్తోంది!
బయటకు వెళ్లడం ఎందుకు?
ఇంట్లోనే వుందామనుకున్నా..
నేనెక్కడున్నా ..
వాన తన ఆటపాటలతో
నన్ను అలరిస్తోంది
నా హృదయవీణను మీటి–
గడచిన జ్ఞాపకాలను మళ్ళీ పూయిస్తుంది!

ఈ చినుకు మువ్వల నేస్తం
నా మనసుకు రెక్కలు తొడిగి
ఏడు రంగుల స్వప్న సౌధాలకు
తీసుకెళ్ళి నాలో మిగిలిన
నిరాశను, నిస్సత్తువను
ఒక్కసారిగా దూరం చేస్తుంది!
ఊహలు నిజమయ్యే వేళను
నా ముందు నిలుపుతుంది!

చినుకు పూలను కురిపించి
ప్రియమారా పలకరించి..
వలపు పిలుపులను
ఏకాంతంగా వినిపిస్తుంది!
దాచిన రహస్యాలను
గుర్తుకుతెచ్చి చిద్విలాసంగా
చిటపటలాడుతుంది!

ఎవరు కాదన్నా, లేదన్నా
వాన తన పద్ధతిని వీడదు
హద్దును దాటదు
మనిషితనాన్ని– మరిచిన మనిషిలాగ..
స్వార్థపు తలుపులను తెరిచిన
మనసులాగ వుండదు!

కాలం పంపిన కబురందుకొని
వర్ష ఋతువుగా మారుతుంది!
మట్టి పరిమళాలను వెదజల్లుతూ –
ఏరువాకను కలగంటుంది!

– బి.గోవర్ధనరావు
94419 68930



# ఓ తల్లి కథ

మూలం : తస్లీమా నస్రీన్
అనువాదం : పి.శ్రీనివాస్ గౌడ్
99494 29449

1

**నా** తల్లి కళ్ళు పసుపు రంగులోకి మారాయి,
గుడ్డు లో పసుపు జన లాగ..
మితిమీరి నిండిపోయిన నీళ్ళ ట్యాంక్‌లాగ
ఆమె బొడ్డు ఉబ్బిపోయి
ఏ క్షణంలోనైనా పగిలిపోవడానికి సిద్ధంగా ఉంది.

నిలబడలేక, కూర్చోలేక
వేళ్లను కూడా కదిలించలేక
ఆమె అక్కడే పడుకుంది
ఆమె చివరి రోజుల్లో
తను తల్లిలా అసలు కనిపించలేదు

ప్రతి రోజు ఉదయం, సాయంత్రం
బంధువులు వచ్చి
పవిత్రమైన రోజయిన, శుక్రవారం,
చనిపోవడానికి సిద్ధంగా ఉండమని..
'లా ఇలాహ ఇల్లల్లాహ్, అల్లా ఒక్కడే' అని
జపిస్తూ పలుకుతూ.. చెపుతుంటారు.

ఇద్దరు దేవదూతలు
మున్కర్ మరియు నకీర్లను
నిరాశ పరచవద్దని వారు ఆమెను హెచ్చరించారు.

చివరకు ఆమెకు మరణం సంభవించినప్పుడు
ఆమె గది, పెరడు శుభ్రంగా వుండాలని
ఆ పరిమళపు సుర్మా,
నీలి నయన ఛాయన అత్తరు తగ్గకుండా వుండాలని
బంధుగణమంతా నిర్ధారించారు
వ్యాధి ఆమె శరీరం మొత్తాన్ని దాదాపుగా కబళించింది
అది చివరిగా మిగిలిన
ఆమె కొద్దిపాటి సత్తువనూ హరించింది
ఆమె కళ్ళని వాటి కనుగవల నుంచి
ఉబ్బిపోయేలా చేసింది,
ఆమె నాలుకను తడి ఆరిపోయేలా చేసింది.
ఆమె ఊపిరితిత్తుల నుండి గాలిని జుర్రేసింది.

ఆమె ఊపిరి పీల్చుకోవడానికి ఇబ్బంది పడుతుండగా..
ఆమె నుదురు, కనుబొమ్మలు
నొప్పితో విలవిలలాడాయి.

ప్రవక్త పట్ల గౌరవాన్ని, భక్తిని
ఆమె ప్రదర్శించాలని
ఇంటిల్లిపాదీ అరిచి ఆజ్ఞాపన చేశారు ...
ఆమె జన్నతుల్ ఫెర్దౌస్ (అత్యున్నత స్వర్గం)
చేరుకుంటుందని ప్రతి ఒక్కరూ నమ్మారు!

ఒక అందమైన మధ్యాహ్నం
పరలోక ఉద్యానవనములో
ఆమె ముహమ్మద్‌తో
చేయి చేయి కలిపి నడుస్తుందని
అందరూ నమ్మారు.
ఇద్దరు కలిసి విందు పానీయాల భోజనం చేస్తారని
అందరూ అనుకున్నారు.
పరలోక ఉద్యానవనంలో
తను మహమ్మద్‌తో కలిసి నడుస్తానని
ఆ తల్లి తన జీవితేచ్ఛను కలలుగన్నది!

కానీ ఇప్పుడు, అదే సమయంలో
ఆమె ఈ భూమి నుండి వీడ్కోలు తీసుకునే సమయంలో..
ఏమి ఆశ్చర్యం !
ఆమె వెనక్కి తగ్గింది..!

వెలుపలికి అడుగు పెట్టి,
తోటలోకి వెళ్ళే బదులు
ఆమె నా కోసం బిరుయి అన్నం వండాలని కోరుకుంది

చేపల కూర వండి,
మొత్తం హిల్సా వేయించాలని ఆమె కోరిక.
ఎర్ర బంగాళా దుంపలతో
నాకు కారంగా పులుసు చేయాలని కోరుకుంది.
ఆమె తోటలో దక్షిణ మూల నుండి
నా కోసం ఒక చిన్న కొబ్బరికాయను
కోయాలని కోరుకుంది

పట్టు చేతి విసనకర్రతో
నాకు విసరాలని ఆమె కోరుకుంది
నా నుదిటి మీద
చెల్లాచెదురుగా వున్న వెంట్రుకలను
సరిచేయాలని అనుకుంది

నా మంచం మీద
కొత్త పడక దుప్పటి వేయాలని
నాకోసమే..
రంగురంగుల ఎంబ్రాయిడరీతో
ఒక గౌను కుట్టాలని కోరుకుంది
అవును, ఆమె పెరటిలో
చెప్పులు లేకుండా నడవాలని కోరుకుంది
ఒక వెదురు కర్ర సాయంతో
ఒక లేత జామమొక్కను పెంచాలని కోరుకుంది
ఆమె హస్నుహనా తోటలో కూర్చుని పాడాలని కోరుకుంది
అందంగా వున్న ఈ రాత్రిలో
ఇంత ప్రకాశవంతమైన చంద్రుడ్ని
ఆమె మునుపెన్నడూ చూడలేదు
మా అమ్మ తను బతకాలని
చాలా బలంగా కోరుకుంది!

## 2

పునర్జన్మ లేదు, నాకు తెలుసు,
అంతిమ యుగాంతమూ లేదు
స్వర్గం, నెమలి, వైన్, గులాబీ కన్యలు
ఇవి ఉచ్చులు తప్ప మరేమీ కావు..!
నిజమైన విశ్వాసులచే ఏర్పాటు చేయబడినవి

అమ్మ వెళ్ళడానికి ఏ స్వర్గం లేదు
ఆమె ఎవరితోనూ ఏ తోటలో నడవదు
మోసకారి నక్కలు ఆమె సమాధిలోకి దూరతాయి
ఆమె మాంసాన్ని తింటాయి
ఆమె తెల్లటి బొమికలు చూర్ణమై
గాలిలో కలుస్తాయి!

అయినప్పటికీ,

నేను స్వర్గాన్ని విశ్వసించాలనుకుంటున్నాను
ఏడేడు లోకాలలో
ఎక్కడో ఒక అద్భుతమైన
అద్భుతమైన స్వర్గం
మా అమ్మ అక్కడికి చేరుకుంటుంది
ఇహపరాలు దాటిన తర్వాత
పల్ – సిరాట్ ఈ వారధి
దాటడం అసాధ్యం అనిపిస్తుంది
అక్కడ, ఒకసారి ఆమె ఆ వంతెనను
సులభంగా దాటితే
చాలా అందమైన మనిషి,
ప్రవక్త ముహమ్మద్
ఆమెకు స్వాగతం పలుకుతారు
ఆలింగనం చేసుకుంటారు

ఆమె తన విశాలమైన ఛాతీపై కరిగిపోయినట్లు
ప్రవక్త భావిస్తాడు
ఆమె నీటి బుగ్గలో స్నానం చేయాలని కోరుకుంటుంది
ఆమె నృత్యం చేయాలని,
ఆనందంతో ఎగరాలని కోరుకుంటుంది
ఆమె అన్ని పనులు చేయగలదు
ఆమె ఇంతకు ముందెన్నడూ ఇలాంటివి ఎరగదు
బంగారు పళ్లెంలో మాంసం వస్తుంది
నా తల్లి తన ఇష్టానుసారం తింటుంది
తోటలో ఆమెను కలవడానికి
అల్లా స్వయంగా కాలినడకన వస్తాడు
ఆమె జుట్టులో ఎర్రటి పువ్వును ఉంచుతాడు
ఆమెను ఉద్రేకంతో ముద్దు పెట్టుకుంటాడు
ఆమె మృదువైన తూలికా శయ్య మీద నిద్రపోతుంది
ఏడు వందల మంది హూర్‌లు వింజామరలు విసురుతారు
సౌందర్యంతో వెలిగే యవ్వన దేవదూతల ద్వారా
వెండిపాత్రలో చల్లని నీరు అందించబడుతుంది!

ఆమె నవ్వుతుంది,
అపారమైన ఆనందంతో..
ఆమె శరీరం మొత్తం ఆడుతుంది
ఈ భూమిపై ఆమె
తన దుర్భర జీవితాన్ని మరచిపోతుంది

ఒక నాస్తికురాలిగా
'ఎక్కడో ఒక స్వర్గం ఉంది' అని ఊహించడానికి
ఎంత బావుంది..!

■






# ఉత్తరాంధ్ర చారిత్రిక నవల
# వీర కళింగం

- డా. ఆల్తి మోహనరావు
99638 95636

**ఆం**ధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా విడిపోయిన తర్వాత రాయలసీమ, ఉత్తరాంధ్రల వెనబాటుతనంపై, అభివృద్ధికి ప్రత్యేక సారించటంపై చర్చ జరుగుతోంది. ఈ విషయంలో రాయలసీమ చాలావరకు ముందుంది. ఉత్తరాంధ్ర నుంచి ఇప్పుడు ఈ స్వరం వినిపిస్తోంది. ఈ మధ్యనే ఈ నేల ప్రాచీన చరిత్రను వివరిస్తూ నల్లి ధర్మారావు 'ప్రాచీన కళింగాంధ్ర', ఆచార్య కె.ఎస్.చలం 'త్రికళింగ దేశ చరిత్ర', అజశర్మ 'ఇంకెన్నాళ్లీ వెనుకబాటు' రెండు సంపుటాలు, అట్టాడ అప్పలనాయుడు, సన్నశెట్టి రాజశేఖర్ ఆధ్వర్యంలో వచ్చిన 'ఉత్తరాంధ్ర' మాసపత్రికలు ఈ ప్రాంత చరిత్రను తవ్వి తీసే చరిత్ర పుస్తకాలుగా వచ్చాయి. అలాగే సాహిత్యంలో అట్టాడ అప్పలనాయుడు రాసిన 'బహుళ' నవల వందేళ్ళ వర్తమాన కళింగాంధ్ర రాజకీయ, సామాజిక, సాంస్కృతిక గాధను గానం చేసింది. గార రంగనాథం సంపాదకత్వంలో ఈ ప్రాంతంలో విస్మృతికి గురైన రచయితల జీవితాలు "విస్మృత కళింగాంధ్ర సాహితీ ప్రభ'గా వెలువడింది. ఈ క్రమంలోనే 'హేతువాద దృక్పథంతో, ఆచరణీయమైన ఆదర్శాలతో, తార్కిక సిద్ధాంతాలతో, సమస్త జగతిని జాగృతి పరిచిన నా జననిని దర్శించాను. ఆ దర్శన భాగ్య ఫలమే ఈ నవల' అంటూ కళింగాంధ్ర ప్రాచీన చరిత్రను అన్వేషించి, శోధించి, కనిపెట్టిన చారిత్రక ఆధారాలకు కల్పిత పాత్రలను జోడించి 'వీర కళింగం' అనే ఈ అద్భుత చారిత్రక నవలను తీర్చిదిద్దారు డాక్టర్ దీర్ఘాసి విజయభాస్కర్.

ఈ నవల వెనక ప్రధాన ఉద్దేశం కళింగాన్వేషణమే. "అది బహుదూరపు గతకాలపు వైభవం. మతవిద్వేషాలకు బలై, మరుగున పడ్డ చరిత్ర. భూమి పొరల్లోకి, మానవ మేధస్సు అట్టడుగు అరల్లోకి, జారిపోయి విస్మృతికి గురైన నాగరికత. స్థానిక చరిత్రల పునరుద్ధరణ చైతన్య భావజాల తొలకరి జల్లులకు తలపైకెత్తి మొలకెత్తాలని ప్రయత్నిస్తున్న భూగర్భస్థ సంస్కృతి."

కళింగానికి వెళ్తే పాదంతో చేసిన పాపమని, దానికి ప్రాయశ్చిత్తంగా సర్వప్రుష్టం, పునస్తోమమనే క్రతువులు చేయించేవారట పూర్వకాలంలో. ఇప్పటికీ సీకాకులమోదురా అనే నీరస భావన బయట ప్రపంచానికి ఉంది ఈ ప్రాంతం మీద. నిజంగా ఈ ప్రాంతం అంత పాపం చేసిందా? అవును జంబూ ద్వీపంలో మిగిలిన ప్రాంతమంతా జ్ఞానంలో మొగ్గ, పువ్వు, తొడిమలుగా ఉన్న కాలంలోనే పండుగా ఉద్భవించడం ఈ ప్రాంతం చేసిన తప్పు. హేతువాదాన్ని అనుసరించి ఏర్పడిన జైన, బౌద్ధాలను పోటాపోటీగా అనుసరించడం ఈ ప్రాంతం చేసిన తప్పు.

ఇతిహాసాల నుంచి ఈ కళింగాన్ని వెనుకకు నెట్టే బలమైన కుట్ర దాగి ఉంది. రారాజు అయిన దుర్యోధనునికి తమ బిడ్డ భానుమతిని ఇచ్చిన నేల. అంతటి రారాజు చరిత్రలో రెండు మూడు శ్లోకాలకు పరిమితం అయ్యేటట్టు చేశారు ఈ ప్రాంత ఆడపడుచును ఇతిహాసకారులు. ఇప్పటికీ ఈ ప్రాంతంలో దుర్యోధనుడు పేరు కలవారు ఉండడం గమనించాల్సిన విషయం. అది ఈ నవలలో భానుమతి దేవి కథను బైలాట రూపంలో ...

"ధర్మాధర్మాల ఊసు మాకెందుకమ్మ..
పాప పుణ్యాల ధ్యాస మాకెందుకమ్మా..
అమ్మ భానుమతి! నువ్వు కళింగుల బిడ్డవు
సద్గుణాలలో బహుదొడ్డవు
ఏ నోము నోచితువో! రారాజు
నీ రాజయ్యను! కళింగం నీరాజనమందెను" అంటూ

భానుమతి కథను వెలువరించడమే కాకుండా, అలాంటి కౌరవపక్ష కథను ధర్మం పేరుతో పాండవులపక్ష కథగా ఎలా మార్చారో, నవలలో ఆసక్తికరంగా వివరిస్తాడు రచయిత.

ఈ నవలలో కథాంశం బుద్ధుని సమకాలం నుంచి అశోకుని నిర్యాణం మధ్య జరిగిన చరిత్ర. మధ్య కళింగంలో సింహపురాన్ని సింహబాహుడు జైనమత అనుయాయుడిగా, దండకపురాన్ని బ్రహ్మదత్తుడు బౌద్ధమత అనుయాయుడిగా పరిపాలన చేస్తారు. ఈ క్రమంలో బ్రహ్మదత్తుడు తమ రాజ్యంలో మత మహాసభను ఏర్పాటు చేయడం, ఇహం గొప్పదా? పరం గొప్పదా? ఆత్మ ఉన్నదా? లేదా? వంటి ప్రశ్నలకు వైదిక, బౌద్ధ, జైన మతాధికారుల సమాధానం, బుద్ధుని మతానుయాయుల సమాధానం సామాన్య జనులను ఆకట్టుకోవడం, ఈ చర్చను మిక్కిలి రసవత్తంగా నడిపాడు రచయిత.

అలాగే నేటి సింహళ (శ్రీలంక) దేశాన్ని ఈ సింహ బాహుని కుమారుడు విజయబాహుడు ఏర్పాటు చేయడం చరిత్ర చెప్పిన విషయం. అజిత్ అమర్ సింఘె అనే శ్రీలంక వైద్యుడు, తమ రాజు విజయబాహుని మూలాలు తెలుసుకొనే క్రమంలో, భారతదేశం అంతా తిరిగి, ఆఖరికి మన సింగు పురమే సింహళ రాజ్యాన్ని స్థాపించిన విజయబాహుని జన్మస్థల మని నిర్ధారించుకున్నాడు. ఈ విషయాలన్నీ తన finding simhabahu గ్రంథంలో పేర్కొన్నాడు. దానిని తీసుకొని ఇక్కడి రాజకుమారుడు ఎక్కడో ఉన్న సింహళనికి వెళ్లి రాజ్య స్థాపన చేయడమేంటి? అనే ప్రశ్న తొలచి పరిశోధించాడు రచయిత.

శ్రీలంక బౌద్ధ పుస్తకాల్లో విజయబాహుడు చండాలుడు, వంటి మాటలు ఆధారంగా చేసుకుని ఇక్కడనుంచి బహిష్కరణ కు గురై ఉంటాడు అనే ఊహతో అద్భుతమైన కథను కల్పించా డు రచయిత. ఆ కథ నిజం కూడా కావచ్చు. దేశ బహిష్కరణ సమయంలో, తనతో వచ్చిన బౌద్ధ బిక్షువు విజయబాహుని మంచిగా తీర్చిదిద్దాడని, అక్కడ ఉన్న చిన్న చిన్న జాతులను, వశపరచుకొని తన తల్లి సింహళ పేరుతో సింహళ రాజ్య స్థాపన చేశాడని  వివరిస్తాడు రచయిత.

అలాగే కళింగ స్త్రీలు చైతన్యవంతులు. స్వతంత్ర ఆలోచనలు కలవారు అని ఈ నవల స్త్రీ పాత్రలు నిరూపిస్తు న్నాయి. సింహ బాహుని భార్య సింహళ, ఒకపక్క రాజు మంచితనాన్ని నిలబెడుతూ, ఇటు కొడుకు చేసిన తప్పులను సరిదిద్దుతూ, కొడుకు కోసం తపన పడే సందర్భంలో, ఆవిడ మాతృప్రేమను విశదీకరిస్తాడు రచయిత. అలానే బ్రహ్మదత్తుడు కుమార్తె చిత్రా దేవి. స్వతంత్ర భావాలు ఉన్న వనితగా,  బౌద్ధ మతాన్ని అభిమానిస్తూ, బుద్ధుడిని తమ రాజ్యానికి తీసుకు రావాలనే తపనతో, ఆహ్వాన కమిటీని స్వయంగా తయారు చేసి పంపిస్తుంది. పాలన వ్యవహారాల్లో, స్త్రీ ప్రాధాన్యత కలిగి ఉందని, కళింగ స్త్రీస్వేచ్ఛగా ఉన్నదని నిరూపించే పాత్రలవి.

అలాగే అశోకునికి చాలామంది భార్యలున్నప్పటికీ, శాసనాల్లో కనిపించేది కారువాకి మాత్రమే. ఈమె కళింగుల ఆడపడుచు. ఈమె పేరును ఒక చేపకు కూడా పెట్టారని ప్రతీతి. చండాశోకుడు, ధర్మా శోకుడుగా మారడంలో ఈమె పాత్ర ఎనలేనిది. నవల అశోకుని దౌష్ట్యాలను వివరించింది. అశోకుడు కళింగంపై దండెత్తే క్రమంలో, కళింగుల సాహసా లను అద్భుతంగా వర్ణిస్తాడు రచయిత. తానే యుద్ధభూమిలో ఉన్నాడా! అన్నంతగా చదువుచున్నంతసేపు రోమాంచితం చేస్తూ యుద్ధాన్ని వర్ణించాడు.

“స్వేచ్ఛను మించిన ప్రణయం ఉందా ఈ సృష్టిలో” అని ఒక నూతన వధువు, తన మెడను కోసుకొని, భర్తకు రక్త తిలకం దిద్ది, యుద్ధానికి పంపిన ఘట్టం హృదయం ద్రవింప చేస్తుంది. యుద్ధభూమిలో నేలకొరుగుతూ, ఆ వీరుడు అశోకుని నిలదీస్తూ “ఇప్పుడు చెప్పు అశోకా నువ్వు ఎవరిని జయించావు? నన్నా? నా భార్యనా? నా తల్లి కళింగాన్న? నీకు తెలుసో తెలియదో, కళింగమంటే వ్యక్తుల సమూహం కాదు, శక్తుల సందోహం. కళింగమంటే భౌగోళిక ప్రాంతం కాదు, ప్రకృతి శక్తుల కేళీ విలాసం.” అంటూ చండాశోకుడ్ని పరివర్తన చేసే దిశగా ప్రశ్నిస్తాడు.

అశోకుడు అన్న సుషమ. వారసత్వ  పోరులో అశోకుడు సుషమను చంపేస్తాడు. ఆ సుషమ చనిపోయినప్పుడు, భార్య గర్భంలో ఉన్న కొడుకు నిగ్రోదుడు. ఆ నిగ్రోదుడు తర్వాత కాలంలో బౌద్ధయతిగా మారి, అశోకునికి దిశా నిర్దేశం చేసి వెళ్లిపోతాడు. ఇది చరిత్ర లో ఉన్న విషయమే.

ఒక సామ్రాజ్యాధీశుడిని, ఇక్కడి జనపదాల ప్రజలు ప్రశ్నించగలిగారంటే ఈ ప్రజల వ్యక్తిత్వం ఎంత గొప్పదై ఉండాలి. నవల పొడుగునా కళింగుల వ్యక్తిత్వాన్ని నిర్వచించడానికి ప్రయత్నం చేస్తాడు రచయిత. “మన పూర్వీకులు చాలా గొప్పవారు. మంచి వారిగా బతికారే తప్ప, దానికి బహుమతిగా స్వర్గాన్ని ఆశించలేదు. వారికి దొరికింది తోటి వారితో పంచుకున్నారే తప్ప, అది పుణ్యం కోసం చేయలేదు. పనులు విభజించి ఎవరి పనిని వారు చేసుకుని సమిష్టిగా ప్రయోజనం పొందారే తప్ప, వృత్తుల మధ్య తేడా పాటించలేదు. ఈ ప్రకృతిని ఎప్పుడు సొంత ఆస్తిగా భావించలేదు. సత్రంలో బాటసారిలా జీవించారు. వెళ్లిపోతూ సమాజానికి అప్పచెప్పారు.” (పుట 51)

ఇలా చరిత్రను క్రోడీకరించి, ఈ నేల ఔన్నత్యాన్ని, నూతన

తరానికి అందించడానికి, కాల్పనిక సాహిత్యాన్ని ఊతగా చేసుకున్నాడు రచయిత. రచయిత ఈ నవల ద్వారా కళింగానికి ఉన్న ఒక అమేయమైన, అద్వితీయమైన వ్యక్తిత్వాన్ని మన కళ్ళ ముందు ఆవిష్కరించే ప్రయత్నం చేశారు.

ఈ నవల కోసం వాడ్రేవు చిన్న వీరభద్రుడు 'భారత జాతీయ ఉద్యమ తొలికాలంలో ప్రాచీన భారతదేశాన్ని ఊహిస్తూ, ఒక భారతీయ ఆత్మను దర్శించే ప్రయత్నం చేస్తూ, ఇటువంటి రచనలే వచ్చాయి. ఉదాహరణకి బంకింబాబు రాసిన 'ఆనందమఠం' నవల. కల్కి కృష్ణమూర్తి 'పొన్నియన్ సెల్వన్' నవల రాసిన తర్వాతే తమిళనాడులో ద్రావిడ రాజకీయాల బలం పుంజుకోవడం యాదృచ్ఛికం కాదు. ఇప్పుడు ఈ వీరకళింగం నవల ద్వారా డాక్టర్ విజయ భాస్కర్ ఒక కళింగ అన్వేషణ మొదలుపెట్టాడు. ఆ అన్వేషణ రానున్న రోజుల్లో ఉత్తరాంధ్రలో, ఒక నవ్య రాజకీయ, సామాజిక భవిష్యత్తుకు దారితీయగలదని ఊహించడం అసమంజసం కాదనుకుంటాను." అని చెప్పారు. ఆ మాటలు నిజం కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ రచయితకు అభినందనలు.

## మహాకవి శ్రీశ్రీ స్మారక కథల పోటీ

ప్రముఖ రచయిత సింహప్రసాద్ తన సాహిత్య స్వర్ణోత్సవ సందర్భంగా ఆయనకు స్ఫూర్తి, ప్రేరణ అయిన మహాకవి శ్రీశ్రీ స్మారక కథల పోటీ నిర్వహించతలపెట్టారు. ఒక్కో కథకు రూ.2000 చొప్పున మూడు కథలకు మూడు బహుమతులు ఉంటాయి. కథాంశాలు : కుక్కపిల్ల, అగ్గిపుల్ల, సబ్బు బిళ్ళ. ఒక్కో అంశానికీ ఒక్కో బహుమతి అనే నియమం లేదు. బాగుంటే ఒక్క అంశం మీదే రాసినా ముగ్గురికి బహుమతి ఇవ్వవచ్చు. నవ, యువ, నడి వయసు రచయితలను ప్రోత్సహించడమే ఈ పోటీ ఉద్దేశం గనుక 50 ఏళ్లు దాటని వారికే ఈ పోటీ పరిమితం. ఒకరు ఎన్ని కథలనైనా పంపవచ్చు. బహుమతి పొందిన కథలు 'మా కథలు -2022' సంకలనంలో ప్రచురించబడతాయి. కథ చేతిరాతలో 3- 8 పేజీలు , డిటిపి చేయిస్తే 2 - 5 పేజీల మధ్య ఉండాలి. కథలు పంపటానికి ఆఖరు తేది : 20-8-2023. ఫలితాల ప్రకటన 20-9-2023. 14. 10. 2023 తేదీన రవీంద్ర భారతి, హైదరాబాద్ లో బహుమతి ప్రదానం ఉంటుంది.

కథలు పంపాల్సిన చిరునామా : **సింహప్రసాద్ సాహిత్య సమితి, 401, మయూరి ఎస్టేట్స్, ఎం.ఐ.జి -2-650, కెపిహెచ్‌బి కాలనీ, హైదరాబాద్ - 500 072. ఫోను : 98490 61668**

## అమ్మకో ఉత్తరం

అమ్మా!
ఈ మదర్స్ డే
మనిద్దరి జీవితాల్లో మరిచిపోలేని రోజమ్మా
నువ్వు పోగొట్టుకున్న హేపీనెస్
నా ద్వారా మళ్ళీ నీకు సొంతమౌతున్న రోజు!

నువ్వెప్పుడూ అంటుండేదానివి కదమ్మా
నావల్లనే మీరిద్దరూ విడిపోయారని
నావల్లనే నీ ఆశలూ కోరికలూ ఆవిరైపోయాయని
నావల్లనే నీ ఆనందం మాయమయ్యిందని
అందుకేనమ్మా ...
నా ఆత్మహత్యను
నీకు కానుకగా వదిలి వెళుతున్నాను
నేను చచ్చిపోయాక
నువ్వు పోగొట్టుకున్నవన్నీ
నీకు తిరిగి వస్తాయని నమ్ముతున్నాను

కానీ, అమ్మా .. నాకు ఈ ప్రపంచంలో
నువ్వొక అపురూపమైన అమ్మవు
నాకెంతో ఇష్టమైన అమ్మవు
నేనే తల్లినవ్వును మింగేసిన నష్టజాతక బిడ్డను
ఇక మనిద్దరికీ అంతా ఆనందమేలేమ్మా !

ఈ సంతోషం కోసం
నువ్వు ఎదురుచూశావో లేదోకాని
నేను మాత్రం నిన్ను సంతోషంగా చూడాలని
ఎప్పటినుంచో ఎదురుచూస్తున్నాను
నా పదకొండు సంవత్సరాల మనసుకి
ఈ మార్గమే కనిపించింది!

ఇలా అర్ధాంతరంగా చచ్చిపోతున్నందుకు
నాకేమీ బాధలేదమ్మ
ఎందుకంటే, నేను రాకముందటి జీవితాన్ని
మళ్ళీ నీకిస్తున్నందుకు
ఇక నుంచి ప్రతి క్షణం
నువ్వు నన్ను తలుచుకుంటావుగా
నాకు ముద్దులు పెడతావుగా
నన్ను దగ్గరికి తీసుకుంటావుగా
ఇవన్నీ నేను చూస్తూనే వుంటానమ్మా
నీ ఊహల్లోంచీ!

**(తల్లి నిరాదరణకు గురైన పదకొండేళ్ళ కూతురు తల్లికి సంతోషం కలిగించాలని ప్రాణాన్ని మదర్స్ డే గిఫ్ట్‌గా అందించిన కథనం ఓ పత్రికలో చదివి)**

**- బంగార్రాజు కంఠ**
**85003 50464**

- డా. నాగసూరి వేణుగోపాల్
94407 32392

# మండుటెండల జూన్ ... మద్రాసులో పెళ్లి !



'**వె**న్నెల' చాలా అందమైన మాట అని నేను కొత్తగా చెప్పక్కరలేదు. అదే ఓ అమ్మాయి పేరయితే? అలాంటి సందర్భం ఒకటుంది. మదరాసు ఆకాశవాణిలో నేను పనిచేస్తున్నప్పుడు వెన్నెల కొల్లుగన్ మేడమ్ ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తోంది. తనతో ఇదివరకు పనిచేయక పోయినా మొదటి రోజునుంచీ నా పట్ల ఎంతో అభిమానంగా ఉండేవారు. తనకు తెలుగు రాదు. అయినా తెలుగంటే చాలా అభిమానం. ఎంత అభిమానమంటే అను రెండో అమ్మాయిని కుర్రాడికిచ్చి పెళ్ళి చేయాలనేంత ! మనకు తమిళం రాదు, అక్కడున్న రోజుల్లో కూడా నేర్చుకునే ప్రయత్నం కూడా చెయ్యలేదు. అలాంటి అవకాశమూ రాలేదు. అయినా ఈ భాషావరోధం మాకు ఇబ్బంది కాలేదు.

2023 ఏప్రిల్ నెల మధ్యలో మా అమ్మాయి పెళ్లికి రావాలి అని శ్రీమతి వెన్నెల ఫోన్ చేశారు. నిజానికి తను 2022 అక్టోబరులో ఆకాశవాణి మద్రాసు నుంచి రిటైర్ అయ్యారు. ఈ జూన్ మాసం తొలి వారంలో మదరాసులో అమ్మాయి పెళ్ళి అనగానే మద్రాసు మండే ఎండలే మొదట గుర్తుకు వచ్చాయి! విజయవాడ, విశాఖపట్టణం, రాజమండ్రి, కాకినాడ, నెల్లూరు, అనంతపురం, కడప ఇన్ని ప్రాంతాల ఎండలు చూశాను కానీ, మదరాసులో సూర్యకిరణాల కొసలకు కనబడని సూదిమొనలుంటాయేమో అని నాకనిపిస్తుంటుంది. ఎందుకంటే అక్కడ ఓ మూడున్నరేళ్ళు ఉద్యోగం చేశాం కనుక ఆ అనుభవం విలువైనది! కానీ ఆమె నెలన్నర ముందుగా ఫోను వర్తమానం ఇవ్వగానే ఖచ్చితంగా వెళ్ళాలనిపించింది. ఎందుకు? కరోనా కారణంగా మూడేళ్ళు ఎటువైపూ వెళ్ళలేదు. ఇంకో విషయం ఏమిటంటే మనకంటే పెద్దవారైన సహోద్యోగులు ముందుగానే రిటైర్ అయిపోయారు. చిన్నవాళ్ళలో కూడా ఈ రెండున్నరేళ్లలో మరి కొందరు ఉద్యోగ విరమణ చేశారు. వీరందరినీ ఆకాశవాణి ఆఫీసుకి వెడితే కూడా కలిసే అవకాశం లేదు. అట్లని అందరి ఇళ్ళకూ వెళ్ళి కలవలేము, అంత టైమ్, ఓపిక ఎవరికీ ఉండవు. కనుక ఉద్యోగ విరమణ చేసిన తర్వాత సహోద్యోగుల ఇంట జరిగే శుభకార్యాలకు తప్పకుండా వెళ్ళాలి. తద్వారా మనల్ని మనం గతంలోకి విసిరేసుకుని, ఆ అనుభూతుల్ని కొంతకాలమైనా అనుభవించి కొత్త ఉత్సాహాన్ని గిఫ్ట్‌గా పొందవచ్చు. కనుక మదరాసు ఎండలు భయపెడుతున్నా వెళ్ళాలని నిర్ణయించుకున్నాం! "మా హంస ఎండాకాలం గనుక ఫ్లైటెక్కేద్దాం! తక్కువ టైమ్‌లో హాయిగా వెళ్ళిపోవచ్చు", అని ప్రతిపాదన చేసింది. సరే అంటూ అంగీకారానికొచ్చాం.

ఈ తేదీ దగ్గరకి వస్తుండగానే నా చెల్లెలు, నా కన్నా రెండేళ్ళు చిన్నది భాగ్యలక్ష్మి తన రెండో కుమారుడి వివాహ నిశ్చితార్థం 2023 జూన్ 7 అని చెప్పడమే కాక, కరోనా అని చెప్పి తన పెద్ద కొడుకు పెళ్ళికి ఇద్దరూ ఎగనామం పెట్టారు... ఈసారి అలా కుదరదు అని అల్టిమేటం కూడా జారీ చేసింది. మదరాసులో జూన్ ఐదవ తేదీ పెళ్ళి, మారగాని గుంటలో ఏడవతేదీ ఇంకో పెళ్ళి నిశ్చితార్థం. దాంతో ఒక ప్రయాణం ఓ వారంలో మూడు నగరాలు అనే పద్ధతిలో మా టూర్ ప్రణాళిక తయారయింది. హైదరాబాద్–మద్రాసు–బెంగళూరు–హైదరాబాద్ ... మూడు వైపులా ఫ్లైట్ టికెట్లు కొనేశాం. మా చెల్లి వూరు బెంగుళూరు ఎయిర్ పోర్టుకు లేపాక్షి వైపున ఆంధ్రప్రదేశ్ సరిహద్దులో 96 కి.మీ. దూరంలో వుంటుంది.

జూన్ నాలుగు 12.15ని.లకు మదరాసు ఎయిర్ పోర్టు

(మీనంబాకం)లో దిగాం. ఈసారి తక్కువ సమయం వుంది కనుక తప్పనిసరిగా కలవాల్సిన అరుణకాంతి వాళ్ళ ఇంట్లో దిగాలని నిర్ణయించుకున్నాం. నిజానికి ఎంతో కాలంగా అరుణ ఈ విషయం చెబుతూనే వుంది. ఇంతకీ ఆ అరుణ ఎవరనుకున్నారు.? మాకు కూతురులాంటి పిల్ల. రచయిత్రి, చిత్రకారిణి. భీమవరం అమ్మాయి. పెళ్ళి తర్వాత మదరాసులో మెట్టినిల్లుకొచ్చింది. ఆమె మామగారు ఇప్పటి పెద్దతరానికి బాగా తెలిసిన సినిమా పబ్లిసిటీ ఈశ్వర్. థియేటర్లు మాత్రమే సినిమాలు చూడడానికి; పోస్టర్లు మాత్రమే సినిమా ప్రచారానికి; పత్రికలు మాత్రమే సినిమా సమాచారానికి ఉన్న కాలంలో ఈశ్వర్ డిజైన్ చేసిన సినిమా పోస్టర్లు యమక్రేజ్‌తో వెలుగుతూ వుండేవి. ఆ రంగంలో ఆయన మకుటంలేని మహరాజుగా వెలిగారు. ఆయన గత సంవత్సరమే కనుమూశారు. ఆయన రాసిన 'సినిమా పోస్టర్' అనే పుస్తకాన్ని విజయచిత్ర సంస్థ ప్రచురించింది. ఈ పుస్తకం కారణంగా నాకు మదరాసు ఉ ద్యోగ సమయంలో ఈశ్వర్ మిత్రులయ్యారు. అక్కినేని నాగేశ్వరరావు కూడా తన పోస్టర్ డిజైనింగ్ విషయంలో వారి ఇంటికి వచ్చి కలిసేవారంటే ఆయన లెవెల్ ఏమిటో మనం ఊహించుకోవచ్చు. కానీ పాలకొల్లు ప్రాంతానికి చెందిన శ్రామిక నేపథ్యమున్న కొసనా ఈశ్వర్ చాలా నిగర్వి, నిత్య శ్రామికుడు, సజ్జనుడు, చాలా ఓపిక ఉన్న వ్యక్తి కూడా! నాకు పరిచయమైన మొదటి రోజు నుంచే మంచి మిత్రుడిగా మారిపోయారు, వయస్సులో చాలా పెద్దవారైనా. ఆ పరిచయం, స్నేహం పరస్పరం ఇళ్ళకు కూడా వ్యాపించాయి. కరోనా సమయంలో ఇటు మామగారిని, అటు నాన్నగారిని కోల్పోయిన దురదృష్టం మా అరుణకాంతిది.

మీనం బాకం డొమెస్టిక్ ఎయిర్ పోర్టు అంత హడావుడిగా లేదు. పెద్దగా శ్రమ, టైము లేకుండానే బైటకు వచ్చి టాక్సీ బుక్ చేసుకుని అరగంట వ్యవధిలో టి నగర్‌లోని శ్రీనివాసరెడ్డి వీధిలో ఉన్న ఈశ్వర్ ఇంటికి వచ్చేశాం. తమిళ అభిమానం ఆ వీధిని ఇపుడు శ్రీనివాసన్ స్ట్రీట్ అంటోందిపుడు.

ఎంతో అభిమానంగా, మా ఆరోగ్యాన్ని ఏమాత్రం ఇబ్బంది పెట్టని రీతిలో అరుణ మాకు భోజనం సిద్ధం చేసింది. వారి కుటుంబ సభ్యులతో పాటు భోజనం కానిచ్చి, విశ్రాంతి తీసుకున్నాం. మధ్యాహ్నం గమనిస్తే ఆ గదిలో నాకో అద్భుతం కనపడింది! 1997 నుంచి 2010 మధ్య దాకా 'ఆంధ్రభూమి' దినపత్రికలో నేను 'టివీక్షణం' పేరున వీక్లీ శీర్షిక ద్వారా టీ.వి. కార్యక్రమాలు, వాటి ప్రభావం, కార్యక్రమాల తీరు, మీడియా రాజకీయాలు ఇలాంటి విషయాల్ని చర్చించేవాణ్ణి. టి.వి. వచ్చిన తర్వాత 'బుక్ కల్చర్' పోయి 'లుక్ కల్చర్' వచ్చిందని నేను


టీవీ – బుక్ స్టాండ్!

క్షోభిస్తూ వుండేవాణ్ణి. అలా రాసిన ఒక వ్యాసానికి డెస్క్‌లో మృత్యుంజయ్ ఓ అద్భుతమైన కార్టూన్‌తో అదరగొట్టాడు. ఇంట్లో టి.వి. స్టాండ్ నుంచి ఒకతను టి.వి.ని తీసేస్తుంటే ఆ స్టాండ్ లోనే మరొకాయన పుస్తకాలు సర్దుతున్నాడు. అదీ కార్టూను. ఇప్పటి తరానికి గుర్తుండదు కానీ ఒక్క దయానోరా టి.వి. స్టాండ్‌తో సహా అలా వచ్చేది. చూసిన తర్వాత టి.వి.కి రక్షణగా మూసివెయ్యడానికి ఆ స్టాండుకు తలుపులు కూడా వుండేవి. ఈ రెండు దశాబ్దాల క్రితం సంగతి గుర్తుకు రావడం ఏమిటి... ఆశ్చర్యాన్ని కలిగించడం ఏమిటి? మేమున్న గదిలో అచ్చంగా అలాంటి టి.వి. స్టాండును అరుణ బుక్ షెల్ఫ్‌గా మార్చి పుస్తకాలు పెట్టేసింది. అందులో నా పుస్తకాలు కూడా పది పన్నెండున్నాయి. పాత వస్తువులు పడేయకుండా వాటికి కొంత అదనంగా 'యాంటిక్' విలువను జోడించి భద్రపరచడం అరుణలోని చిత్రకారిణికి అలవాటు. మృత్యుంజయ్ ఎప్పుడో నా కాలమ్ వ్యాసానికి వేసిన కార్టూను ఇప్పుడు అలా కళ్ళముందు ప్రత్యక్షం కావడం నాకు చాలా ఆశ్చర్యాన్ని కలిగించింది. ఫొటో తీశాను కనుక మీరూ గమనించి నా ఆశ్చర్యాన్ని కొంత షేర్ చేసుకోవచ్చు.

మదరాసులో మూడున్నర సంవత్సరాలు ఉండటమే కానీ, ఆ నగరపు తలా తోకా దాదాపు తెలియవు. మెరీనా బీచ్, ఆ బీచ్ ఎదురుగా వుండే ఆలిండియా రేడియో... మేము నివాసమున్న అడయారు ప్రాంతపు ఇందిరా నగర్ తప్పామరేమీ

పెద్దగా తెలియవు. అయితే టి నగర్ కు పెళ్ళి స్థలానికి మహాదూరం లేదుగానీ గంటన్నర సమయం కారులో పోవడానికి పట్టింది. పెళ్ళి రిసెప్షన్ లో, మండపంలో పదిహేను, ఇరవై మంది నాలాగే రిటైర్ అయిన నా ఒకప్పటి సహోద్యోగులూ, అలాగే ఇప్పుడు పని చేస్తున్నవారు కనబడి పలకరించి మనసుకు విందు చేశారు. వెన్నెల ప్రేమగా వుండటం అనే లక్షణం కలిగి ఉండటం అనే కారణంగా కావచ్చు. ఇటు పెళ్ళి మండపంలోనూ అటు భోజనశాల లోనూ వచ్చిన బంధుమిత్రులు విశేషంగా వున్నారు. భోజనం చాలా హాయిగా, రుచిగా ఉండటమే కాదు; అంతమందికి చివరి దాకా అన్ని ఐటెమ్స్ వుండడం నిజంగా ఆనందదాయకం. వెన్నెల దంపతులకు శుభాకాంక్షలూ వధూవరులు రాధికా దంపతులకు ఆశీస్సులూ అందజేసి బయటికి వచ్చాం. మంచిగా తిన్న భోజనం అంతా హరించేలాగా ట్రాఫిక్ కారణంగా టాక్సీ రావడానికే 50 నిమిషాలు పట్టింది. మదరాసులో పెళ్ళి ఏవోగానీ మా కాళ్ళకు శోభనం జరిగేలా వుందని అనిపించింది!

మదరాసు అనగానే మెరీనా బీచ్ గుర్తుకు వస్తుంటుంది. దానికి కారణం నా వరకు అయితే తెలుగు కథలలో మెరీనాని వదలకుండా వర్ణించడమే. కానీ నిజానికి మెరీనా ఊళ్ళోనే వున్నా విశాఖపట్నం వలే అంత చేతికందే దూరంలో బీచ్ ఉండదు. అది కూడా అంత అందంగా ఉండదు. మెరీనా బీచ్‌లో ఓ ముప్పావు కిలోమీటరు ఇసుకలో నడవాలి. ఆ ఇసుక కూడా చాలా రకాల కలుషితాలతో అలరారుతూ వుంటుంది. దీనికి ప్రత్యామ్నాయంగా మేమున్న అడయారు ప్రాంతానికి దగ్గరుండే బసంత్ నగర్ బీచ్ అంటే మాకిష్టం. అప్పట్లో మేమున్న ఇంటికి అది దగ్గరుండడమే కాక శుభ్రంగా కూడా వుండేది. నిజానికా బీచ్‌కి ఎడ్వర్డ్ ఇలియట్ (Edward Elliot) బీచ్ అని పేరు. మదరాసు ప్రెసిడెన్సీకి ఛీఫ్ మెజిస్ట్రేట్, సూపరింటెండ్ ఆఫ్ పోలీస్‌గా పనిచేసిన బ్రిటీషు అధికారి జ్ఞాపకార్థం ఈ బీచ్‌కి పేరు పెట్టారు. ఆ పేరును కాస్తా విరూపం చెందించి 'ఎలైట్' (Elite) బీచ్ అని కూడా అంటారు. ఈ బీచ్ లో ఆరోగ్య దేవత 'యాన్ వెల్లంకిణి' చర్చి వుంది. ఇప్పుడయితే ఆ ప్రాంతంలో అదనంగా అష్టలక్ష్మీ ఆలయం కూడా వుంది. వీటికన్నా ఈ బీచ్‌లో కార్ల్ స్కీమియట్ (Karl Schmiot) మెమోరియల్ ముఖ్యమైంది. ఇది పెద్ద ఆర్చిలాగా ఒడ్డున వుంటుంది. డచ్ దేశస్థపు నావికుడు, మునిగిపోతున్న అమ్మాయిని రక్షించబోయి ప్రాణాలు పోగొట్టుకున్నాడట. ఆయన జ్ఞాపకార్థం ఈ మెమోరియల్ వెలిసింది. రామారావు, నాగేశ్వరావు సినిమాల కాలంలో నాయకీ నాయకులు ఈ మెమోరియల్ చుట్టూ గంతులేస్తూ వెన్నెల్లో, ఎండల్లో పాటలు పాడడం తప్పక వుండేది. ఆ మెమోరియల్ ఫొటో చూసిన ఎవరికైనా ఈ విషయం ఎవరికైనా స్ఫురిస్తుంది. నాకైతే వీటన్నిటి కన్నా ఆ బీచ్‌లో సూర్యోదయం చాలా బావుంటుంది, తూర్పు తీరం కదా! ఓసారి ఓ పాతిక దాకా సూర్యోదయం అవుతున్న తీరు సంబంధించి మొబైల్‌తో ఫొటోలు తీస్తే వాటిని ఫేస్ బుక్‌లో ఎంతోమంది ఇష్టపడటం బాగా గుర్తుంది. కనుక మరుసటి రోజు ఉదయం ఓ గంటా, గంటన్నర ఇలియట్ బీచ్‌లో గడపాలని ఉదయం ఆటో ఎక్కి టి నగర్ నుంచి వెళ్ళాం. హంస నీళ్ళలో దిగి ఆనందపడితే, కాస్త దూరం నుంచీ నీటి కెరటాలని, సముద్ర పై భాగాన ఉన్న దూరపు దృశ్యాలని చూసి ఆనందించడం నాకిష్టం. అక్కడ ఉన్న ఓ ఇద్దరమ్మాయిలను ఫోటో తియ్యమని అడిగితే, మేము కలకాలం దాచుకోదగ్గ ఫొటోలను ఒక అమ్మాయి సుజి ఏ జి తీసి పెట్టింది. అక్కడే దార్లో చెరో టి తాగి, దొరికిన తెలుగు పత్రికలను కొనుక్కుని, ఎండను తిట్టుకుంటూ అరుణ కాంతి ఇంటికి టి.నగర్‌కు వచ్చేశాం.

**(ఇంకా ఉంది)**

ఎలైట్ బీచ్ వద్ద కార్ల్ స్కీమియట్ స్మారక కట్టడం



## నీడలు నీడలుగా ...

అప్పుడప్పుడు నేను మేల్కొంటాను సరిగ్గా
ఆ మేల్కోవడం కూడా సూర్యుడు తూర్పున
ఉదయించినట్లు ...

నాకు తెలుసు అస్తమించడం కూడా ఉంటుందని
పడమరకు వాలే తంతులా నేనూ చివరికి
నా భావాలతో అలానే అస్తమిస్తాను

పొద్దు తూరుపుని దాటి పడమరన
వాలడమంటే మాటలు కాదు
మధ్యాహ్నం ఆకాశపు నడినెత్తిని కూడా చుట్టాలి

నేనూ అంతే;
నానుంచి కొత్తగా మేల్కొని పుడుతుంటానా..
ఎక్కడో ఏ భావపరంపరలోనో,
లేకెవరి మనోభావపు తుంపరలోనో
తీవ్రంగా నిస్పృహకి లోనయ్యి
మాడుతున్నట్లే అవుతాను

నీడలు నా నుంచి వీడీ వీడీ నాలో తపనని
సాయంసంధ్యకల్లా తోడీ తోడీ అలసి అస్తమిస్తాయి
అచ్చు సూరీడు పడమరని తడిమి
చీకటిని మనకి పరిచయం చేసినట్లు ...

ఒక్కో నీడ ఒక్కోలా
ఉదయపు నీరెండ కావొచ్చు
మధ్యాహ్నపు మండుటెండ కావొచ్చు
సాయంకాలపు ఆహ్లాదపుటెండ కావొచ్చు

చీకట్లు ముసురుకొని
నీడలన్నీ ఒకే నీడని పులుముకొని
ఆ నీడనే తురుముకొని
చివరికి రాత్రినీడలో నా నీడ కలిసి ...

ఇప్పుడు నేను నన్ను వదిలేసినట్లు
అచ్చు పగలు నన్ను వదిలినట్లు
నేను దిగులుని చీకట్లో వదిలి



దిక్కులు దిక్కులుగా తలో దిక్కుగా
మళ్ళీ నీడలు నానుండి విడిపోతాయి
మరోసారి మరో రోజుకి ...

అంతా ఎప్పట్లానే
భిన్నమంతా భావావేశాల్లోనే ..!

**- అనూరాధ బండి**

## విడుదల

భూమి
తడిగా మారుతుంది
చిగురించిన ఆకులు
రాత్రిని చూస్తుంటాయి

చీకట్లో
చంద్రుడు పెరుగుతుంటాడు
కళ్ళు ముసుకోగానే
చంద్రుడు మాట్లాడుతుంటాడు

కొన్ని చిక్కుముడుల నుండి
విడిపించుకుంటుంటాను
కొత్తగా ప్రారంభించడానికి
మళ్ళీ మళ్ళీ విడుదలవుతూ వుంటాను!

**- లక్ష్మీ కందిమళ్ళ**


కర్నూలులో కవులు, రచయితల నిరసన

# మణిపూర్ ఘటనలపై గళమెత్తిన కవిలోకం

**మణిపూర్‌లో మహిళల పట్ల సాగిన అమానుష పర్వాన్ని, అక్కడి ఘర్షణలను నెలలు తరబడి చూస్తూ ఊరుకున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వైఖరులను కవిలోకం తీవ్రంగా విమర్శించింది. దేశంలో లౌకికతత్వాన్ని, సామరస్యాన్ని కాపాడాలని గొంతెత్తి నినదించింది. మణిపూర్ బాధితులకు సంఘీభావంగా సాహితీ స్రవంతి, ఇతర ప్రజాసంఘాలూ రాష్ట్రంలో పలుచోట్ల సభలు, సమావేశాలు, నిరసన ప్రదర్శనలు, కవి సమ్మేళనాలూ నిర్వహించాయి. కర్నూలు, కదిరి, నంద్యాల, పెనుగొండ, విశాఖపట్నం,కాకినాడ, ఏలూరు, పెద్దాపురం, గుడివాడ, విజయవాడ తదితర ప్రాంతాల్లో కవులు, రచయితలు, వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.**

**పెద్దాపురంలో కొవ్వొత్తుల ర్యాలీ**

పెద్దాపురం మున్సిపల్ ఆఫీస్ సెంటర్లో సాహితీస్రవంతి, యుటిఎఫ్‌ల ఆధ్వర్యంలో జులై 25వ తేదీ సాయంత్రం 6 గంటలకు కొవ్వొత్తుల ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు డా.జోస్యుల కృష్ణబాబు, కార్యదర్శి కె.శివ, యుటిఎఫ్ నాయకులు అనంతరావు, సూరిబాబు, ఎం.నాగేశ్వరరావు, శివశంకర్, ఎం.వెంకట రావు, గోవిందరాజులు, ఉప్పిటి రవికుమార్, ఐజయ్ కుమార్, సిరిపురపు శ్రీనివాస్, రత్నాజయ్, కాపుగంటి కోటి తదితరులు పాల్గొన్నారు.

**కాకినాడలో గళమెత్తిన కవులు**

30-7-2023 ఆదివారం సాయంత్రం సాహితీస్రవంతి, యుటిఎఫ్ శాఖలు కాకినాడ యుటిఎఫ్ హోంలో జనకవనాన్ని నిర్వహించాయి. సభకు యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు ప్రభాకరవర్మ అధ్యక్షత వహించగా సాహితీస్రవంతి జిల్లా అధ్యక్షులు డా.జోస్యుల కృష్ణబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు గనారా, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రవర్తి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సాహితీ స్రవంతి నగరాధ్యక్షులు జానకిరామ చౌదరి అతిథులను వేదికపైకి ఆహ్వానించారు. ఆదివాసీ మహిళలను నగ్నంగా ఊరేగించి, అత్యాచారం జరపటం యావద్దేశం సిగ్గుపడాల్సిన విషయమని ప్రభాకరవర్మ అన్నారు. ఇలాంటి దుస్సంఘట నలు జరిగినపుడు ఉద్యమకారులతో పాటు కవులు కూడా కవిత్వం ద్వారా తమ నిరసన గళాలను బలంగా వినిపిస్తారని డా. కృష్ణబాబు ఉద్ఘాటించారు. గనారా మాట్లాడుతూ.. కుల మతాల మధ్య వైషమ్యాలను రెచ్చగొట్టే సంఘ విద్రోహుల చర్యగాను, అక్కడున్న వనరులను కాజేసేందుకు ఒక బలమైన వర్గం పన్నే కుట్రగాను ఈ సంఘటనను అభివర్ణించారు.


కాకినాడలో మాట్లాడుతున్న జానకిరామ చౌదరి

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన జనకవనంలో గరికపాటి మాస్టారు, మధునాపంతుల సత్యనారాయణ మూర్తి, మార్ని జానకి రామచౌదరి, మేడిశెట్టి శ్రీరాములు, గౌరినాయుడు, కొత్త శివ, అవధానుల మణిబాబు, దొండపాటి నాగజ్యోతి, రత్నాజయ్, రమణ, ఉండవిల్లి, మాకినీడి సూర్య భాస్కర్, సీతారామరాజు, ఇంద్రగంటి నరసింహమూర్తి, ఇబ్రహీం, జనార్దనస్వామి, డా.శిరీష తదితరులు తమ కవితల్ని పఠించారు. ఒక్కొక్కరూ ఒక్కొక్క కోణంలో బలమైన కవిత్వం ద్వారా తమ నిరసన వ్యక్తం జేశారు. అనేకమంది సభ్యులు, ఉపాధ్యాయులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

**విశాఖపట్నంలో ...**

మణిపూర్‌లో జరుగుతున్న హింసాకాండను, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరిని ముక్తకంఠంతో ఖండిస్తూ విశాఖ రచయితలు, కవులు తీర్మానం చేశారు. ప్రజాకవి నూనెల శ్రీనివాసరావు తృతీయ వర్ధంతి సందర్భంగా


విశాఖ సభలో నూనెల శ్రీనివాసరావు కవితా సంపుటి లే ఆవిష్కరణ

అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో సాహితీవేత్తల సమావేశం **22.7.2023న** జరిగింది. ఫ్రాన్సిస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మణిపూర్ ఘటనలపై తీర్మానాన్ని సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని బలపరుస్తూ స్టీల్‌ప్లాంట్ రచయితల తరపున మాటూరి శ్రీనివాసరావు, అమరావతి సాహితీ వేదిక అధ్యక్షులు అర్జునుడు, అరసం కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, కథామంజరి తరపున జెపి.శర్మ, సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్ ప్రభృతులు ప్రసంగించారు. తీర్మానాన్ని కవులు, రచయితలు అందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. ప్రమాదంలో పడిన ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడంలో రచయితలు, కవులు ముందుండాలని పిలుపునిచ్చారు.

**అత్యుత్తమ కవితల ఎంపిక**

నూనెల శ్రీనివాసరావు వర్ధంతి సందర్భంగా నిర్వహించిన స్మారక కవితా పోటీలకు 63 ఎంట్రీలు వచ్చాయి. వాటిలో ఉత్తమమైన తొలి మూడు కవితలుగా మామిడిశెట్టి శ్రీనివాసరావు కవిత 'ఆకుపచ్చని కల', చందలూరి నారాయణరావు కవిత 'చెట్టు కళేబరంపై..', కటుకోర్యుల రమేష్ కవిత 'దిమ్మిస' ఎంపికయ్యాయని న్యాయ నిర్ణేతలు ప్రకటించారు. విజేతలకు నూనెల శ్రీనివాసరావు సన్నిహిత మిత్రులు బాబూరావు, పైడిరాజు నగదు పురస్కారాలను అందజేశారు. బొడ్డ కూర్మారావు, జివిఎన్.చలపతి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. అలాగే గుర్రం జాషువా 52వ వర్ధంతి సందర్భంగా వక్తలందరూ జాషువా సాహిత్యపు విశిష్టతపై మాట్లాడారు. అనంతరం కవితా పఠనం జరిగింది. ఎవిఆర్‌కె.మూర్తి స్వాగతం పలుకగా వై.అప్పారావు వందన సమర్పణ చేశారు.

**ఏలూరులో ...**

సాహితీ స్రవంతి, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 23.7.2023 ఆదివారం సాయంత్రం ఏలూరులో ఓ.వి.ధనుంజయరావు అధ్యక్షతన


ఏలూరులో రామాంజనేయులు ...

రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సాహితీ స్రవంతి జిల్లా బాధ్యుడు కె.రామాంజనేయులు మాట్లాడుతూ, మణిపూర్ మారణకాండ ఘటనలను ప్రజాతంత్రవాదులు ఖండించాలని అన్నారు. జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.ఎన్ రమేష్ మాట్లాడుతూ, మణిపూర్‌లోని సహజ సంపదను కార్పొరేట్లకు అప్పగించడం కోసం కేంద్ర ప్రభుత్వం ఈ అల్లర్లను ప్రోత్సహించి, జాతుల మధ్య సంఘర్షణగా చిత్రీకరిస్తుందని విమర్శించారు. యుటిఎఫ్ నుంచి బి.బి.దుర్గాంబ మాట్లాడుతూ, మహిళల పట్ల జరిగిన అమానుషాలు అత్యంత దారుణమని విమర్శించారు. జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐ.వి.సుధాకర్ మాట్లాడుతూ, 78 రోజుల వరకు ప్రధాని ఈ సంఘటనపై నోరు విప్పకపోవటాన్ని విమర్శించారు. ఈ సమావేశంలో శ్రీనివాసరావు, మోహన్ రావు, దేవేంద్ర, కృష్ణారావు, సి.హెచ్. సుందరయ్య, మావూరి శ్రీనివాస్, కాకర్ల రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


పెనుగొండలో నిరసన

**పెనుగొండలో ...**

సాహితీ స్రవంతి, ఐద్వా, సీఐటీయూ, వ్యకాసం, ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పుట్టపర్తి శ్రీ సత్యసాయి జిల్లా పెనుగొండలో సబ్ కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. మహిళలపై జరుగు తున్న దాడులను అరికట్టాలని, దాడికి పాల్పడ్డవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, మణిపూర్‌లో వెంటనే శాంతిని నెలకొల్పాలని నినాదాలు చేశారు.

**నంద్యాలలో చర్చా కార్యక్రమం**

మణిపూర్‌లో ప్రబలుతున్న అరాచకత్వం భారతజాతిని కలవర పెడుతున్నాయని సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. మణిపూర్ ఘటనలపై సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో నంద్యాల ఎన్జీవోస్ హోంలో చర్చ కార్యక్రమం నిర్వహించారు. మణిపూర్ సంఘటనలు సభ్య సమాజానికి తలవొంపులు తెస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చర్చలో రాజకీయ పార్టీల ప్రతినిధులు చింతల మోహన్‌రావు, మస్తాన్; ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు గోపాల్ నీలకంఠమాచారి, అన్నెం శ్రీనివాస రెడ్డి, శేషఫణి, మాబు భాష, మద్దిలేటి రామసుబ్బయ్య; ప్రైవేట్ విద్యాసంస్థల ప్రతినిధులు డివి సుబ్బయ్య, రఫీ; జెవివి నాయకులు రామరాజు, గురుస్వామి, చిన్నయ్య, ఖాజా హుస్సేన్, డాక్టర్ నాగరాజు, న్యాయవాది పునీత్, దళిత సంఘం నాయకులు లింగస్వామి తదితరులు పాల్గొన్నారు. ఈశాన్య భారతంలో శాంతి పవనాలు వీచే దిశగా అందరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.

**గుడివాడలో ...**

మణిపూర్‌లో జరిగిన దురాగతాలను ఖండిస్తూ సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో గుడివాడలో సాహితీ స్రవంతి అధ్యక్షులు లంక సురేంద్ర



గుడివాడలో సమావేశ దృశ్యం

అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సాహితీ మిత్రులు, కవి వసుధా బసవేశ్వరరావు ముఖ్య అతిథిగా మాట్లాడుతూ, ఇలాంటి విద్వేషాల వల్ల దేశ సమైక్యత సమగ్రత దెబ్బ తింటుందని అన్నారు. కవులు పీటర్, సాయిలక్ష్మి, సురేంద్ర, మాల్యాద్రి కవితలను చదివి వినిపించారు. కళాకారుల సమాఖ్య నాయకులు, నవ్యాంధ్ర దళితసేన లిటరరీ క్లబ్, సంఘాలు, బిఎస్ఎన్ఎల్ యూనియన్, బి.విశ్వేశ్వర రావు, కొమ్ముల సురేష్, రాంబాబు, ఆర్.జోషి, మణిమిత్ర, ఎస్.నాగేశ్వరరావు తదితరులు పాల్గన్నారు ఆవిర్నేని వెంకటేశ్వరరావు గీతాలు ఆలపించారు.

## కదిరిలో నిరసన గళాలు కలాలు

**సా**హితీ స్రవంతి, ఇతర ప్రజా సంఘాలు కలిసి కదిరిలో నిరసన కలాలు, గళాలు కార్యక్రమాన్ని సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమారస్వామి అధ్యక్షతన నిర్వహించారు. కుమారస్వామి మాట్లాడుతూ మణిపూర్లో శాంతి భద్రతలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పునరుద్ధరించాలని అటువంటి సంఘటనలు పునరావతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన తన 'దేశం దుఃఖిస్తోంది' కవితలో చంద్రుని పైకి ఉపగ్రహాలు పంపడం ద్వారా అభివృద్ధి చెందినట్లు కాదని, మనుషుల్లో మమతల కోవెలలు వెలిసినప్పుడే ఆ దేశం అభివృద్ధి చెందినట్లని చెప్పారు.

ప్రముఖ కవి భోగినేని మునీంద్ర వసుధైక కుటుంబం అనే కవితను వినిపిస్తూ 'మహిళలకు జరిగిన అవమానం కాదిది, భరతమాతకు జరిగిన అవమానమిది' అని పేర్కొన్నారు. మరో కవి తాలిబ్ 'మయసభలో మణిపురం ప్రజాస్వామ్య పరాభవం' కవితను వినిపించారు. మయసభలో ద్రౌపదికి జరిగిన పరాభవం మళ్లీ దేశాధ్యక్షులు ద్రౌపది హయాంలో మహిళలకు మళ్లీ జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఓబుళపతి 'మహిళా మార్పుకు నువ్వు తూర్పు కావాలి' కవితలో మహిళలపై జరిగిన అఘాయిత్యాలను, మహిళలు సంఘటితమై ఎదుర్కొని పాలకులను మార్చివేయాలని కోరారు. రియాజుల్లా తన కవితలో మణిపూర్లో నడిచింది నగ్న దేహం కాదు దేశం అంటూ దేశ ప్రతిష్టను మంటకలిపేసిన చాందసవర్గాన్ని దుర్మార్గులను శిక్షించాలని కోరారు. ఇమానుల్లా ఖాన్ మాట్లాడుతూ, పూలపై ఆమ్ల వర్షాలు కురిపిస్తున్నారని దీన్ని ప్రజలు సంఘటితమై ఎదుర్కోవాలని కోరారు. పెన్నసర్ల సంఘం నాయకులు ఆత్మా రెడ్డి మాట్లాడుతూ, మణిపూర్ చారిత్రక నేపథ్యాన్ని వివరిస్తూ మణిపూర్లో జరిగిన సంఘటనలు అందరినీ కలిచివేశాయని, దీన్ని ప్రతి పౌరుడు ఖండించాలని కోరారు. జెవివి నాయకులు నర్సారెడ్డి మాట్లాడుతూ, భారతీయులంతా నా సహోదరులు అన్న వ్యాఖ్యానికి అర్థం మణిపూర్ ప్రజలకు మద్దతుగా నిలబడ్డమే సరైన అర్థమని చెప్పారు. మహిళా సంఘం నాయకురాలు సుగుణమ్మ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ స్పందించే గుణం పెంచుకోవాలని కులమతాలకు అతీతంగా మహిళలపై జరిగినప్పుడు తీవ్రంగా వ్యతిరేకించాలని కోరారు. రాజశేఖర్ మాట్లాడుతూ, తెగల మధ్య జరిగిన విద్వేషం ఇలాగే కొనసాగకుండా వారిలో సహోదరత్వాన్ని పెంపొందించడానికి పాలకులు కృషి చేయాలని కోరారు. తుమ్మల ఇలియాజ్ మాట్లాడుతూ, పార్టీలకతీతంగా మణిపూర్లో జరిగిన సంఘటనను అందరూ ఖండించాలని కోరారు.



కదిరిలో మాట్లాడుతున్న కుమార స్వామి

### కర్నూలులో ...

**మ**తోన్మాదులు పాలిస్తున్న కేంద్రరాష్ట్రాల్లో సామాన్యులకు, యస్సీ యస్టీ మైనార్టీలకు, ఆదివాసిలకు రక్షణలేకుండా పోయిందని, మతోన్మాదుల పాలనకు చరమగీతం పాడాలని సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ అన్నారు. కర్నూలులో సాహితీస్రవంతి ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు సభాధ్యక్షతన **23.7.2023**న మణిపూర్ మారణహోమంపై జనకవనం నిర్వహించారు. మణిపూర్ దురాగతానికి కేంద్రప్రభుత్వం, మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని మోహన్ అన్నారు. ఇప్పటికైనా స్పందించి మణిపూర్ లో శాంతిని నెలకొల్పాలని నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జంధ్యాల రఘుబాబు మాట్లాడుతూ, ఈ తరహా సంఘటనలు దేశపురోగతికి ఆటంకమని, పాలకులు మౌనం పాటిస్తున్నారంటే వాళ్ళ పాత్ర ఉందని స్పష్టమౌతుందని అన్నారు. ఈ అంశంపై త్వరలో కవితా సంకలనం తీసుకువస్తామని, ప్రగతిశీల కవులతో నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామని అన్నారు. అనంతరం జరిగిన జనకవనంలో జి.వెంకటకృష్ణ, కవితా వెంకటేశ్వర్లు, తెలుగు వెంకటేష్ , ఆవుల చక్రపాణి, పులిచేరి మహేష్ , చౌశా, ముర్తుజా, విజయులు, నాగముని, ఇనాయతుల్లా, లక్ష్మణ్ , విశ్వనాథరెడ్డి, పానుగంటి చంద్రయ్య కవితలు చదివారు. విరసం నాయకులు నాగేశ్వరాచారి, సాహితీస్రవంతి నగర అధ్యక్షులు డి.అయ్యన్న సందేశం ఇచ్చారు. కథా రచయిత మారుతీ పౌరోహితం, గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. నల్లబ్యాడ్జీలు ధరించి మతోన్మాదం నశించాలని, మణిపూర్లో శాంతి నెలకొల్పాలని నినాదాలు చేశారు.

■■■

# మంచి అధ్యయనంతోనే మంచి కవిత్వం



నీలి కురింజి కవిత్వ సంపుటిని ఆవిష్కరిస్తున్న దృశ్యం

కళ్ళముందున్న జీవన సత్యాన్ని తెలియజేసేది సాహిత్యమని, వైయక్తిక కవిత్వంతో పాటు సామాజిక సందర్భాలకు కవులు స్పందించి రాయాలని విరసం నాయకులు పాణి అన్నారు. **7.7.2023**వ తేదీన అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో సాహితీస్రవంతి, ఆర్ట్స్ కళాశాల తెలుగు విభాగం సంయుక్తంగా నిర్వహించిన నీలకురింజి సముద్రం కవిత్వ సంపుటి ఆవిష్కరణ సభలో ఆయన మాట్లాడారు. పీడనకు వ్యతిరేకంగాను, పాలకవర్గాల దుర్మార్గాలకు నిరసనగాను కవులు గళమెత్తాలని పిలుపునిచ్చారు. సాహితీ స్రవంతి అనంతపురం జిల్లా అధ్యక్షురాలు, హిందూపురం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రగతి రచించిన ఈ కవిత్వ సంపుటి ఆవిష్కరణ సభకు కవి, విమర్శకుడు రాజారాం అధ్యక్షత వహించారు. విద్యార్థుల మధ్య ఉంటూ సమాజాన్ని దర్శించి ప్రేమతత్వాన్ని అందించిన ప్రగతిని అభినందించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.సి.ఆర్. దివాకర్ రెడ్డి మాట్లాడుతూ వృత్తిని ప్రవృత్తిని చాలా చక్కగా సమన్వయించుకొని రచనలు చేసినందుకు రచయిత్రిని అభినందించారు. పుస్తకాన్ని ఆవిష్కరించిన సాహితీస్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగారమోహన్ మాట్లాడుతూ, కవిత్వాన్ని బాగా అధ్యయనం చేస్తేనే నాణ్యమైన కవిత్వం వస్తుందని, రచయితలు ఎప్పుడూ సమాజంలో ప్రతిపక్ష పాత్ర పోషించాల్సి ఉందని అన్నారు. డాక్టర్ రాధేయ మాట్లాడుతూ, చక్కని భావ ప్రతీకలు సుతారంగా రాసిన ప్రగతిని అభినందించారు. పుస్తక ప్రచురణ కర్త, ఛాయా రిసోర్స్ సెంటర్ బాధ్యులు అరుణాంక్ లత ... ఈ కవిత్వంలోని వస్తువు వ్యక్తిగతమైనది కాదని, సామాజికమైనదని పేర్కొన్నారు. డాక్టర్ హేమమాలిని మాట్లాడుతూ కళ్ళను శాస్త్రాన్ని రెండిటినీ మేళవించి చక్కని కవిత్వాన్ని అందించిన ప్రగతి సాహిత్య కృషి అభినందనీయం అన్నారు. ప్రముఖ కవయిత్రి శశికళ మాట్లాడుతూ ప్రగతి కవిత్వం ప్రేమతో కూడిన రసాయన చర్య అన్నారు. మరొక సమీక్షకురాలు పేరిందేవి మాట్లాడుతూ, జీవితాన్ని ఉన్నతీకరించడమే కవిత్వమని అనేక కవితల్ని సోదాహరణంగా వివరించారు. కవయిత్రి ప్రగతి తన స్పందన తెలియజేస్తూ దైనందిన జీవితపు వొత్తిళ్ళ నుంచి ఉపశమనం పొందటానికే తాను కవిత్వం రాస్తున్నట్టు తెలిపారు. అంకె శ్రీనివాస్ వందన సమర్పణతో సభ ముగిసింది.

**– డా.అంకె శ్రీనివాస్**

# ఘనంగా తెలుగు సాహితీవనం వార్షికోత్సవం



మాట్లాడుతున్న అంపశయ్య నవీన్; వేదికపై సత్యాజీ, ఏనుగు నరసింహారెడ్డి, శాంతికృష్ణ, పెద్దింటి అశోక్ కుమార్

**సా**హిత్యం సమాజాన్ని అనేక కోణాల్లో ప్రతిబింబిస్తుందని, సమాజ అభ్యున్నతికి దోహదపడుతుందని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, ప్రముఖ సాహితీవేత్త అంపశయ్య నవీన్ అన్నారు. తెలుగు సాహితీవనం ఆరవ వార్షికోత్సవం 30.07.23 ఆదివారం హైదరాబాదులోని రవీంద్ర భారతిలో ఆ సంస్థ వ్యవస్థాపకురాలు శాంతి కృష్ణ అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి నెలా వివిధ అంశాలపై ఉత్తమంగా నిలిచిన కవితలతో గత ఏడాది 'పాడవే కోయిలా', 'వసంత వీచిక', 'సమర ధీర' కవితా సంకలనాలు వెలువరించామని, ఆ క్రమంలో ఇప్పుడు ఒక కవితల సంకలనం, ఒక కథల సంకలనం ఆవిష్కరిస్తున్నట్లుగా తెలిపారు. అనంతరం తెలుగు సాహితీ వనం ప్రచురించిన 'అంతర్వాహిని' కథల సంకలనాన్ని ముఖ్య అతిథి అంపశయ్య నవీన్ ఆవిష్కరించారు. ఈ సంకలనంలో 25 మంది రచయితలు రాసిన 25 కథలు వివిధ సామాజిక అంశాలను ప్రస్తావిస్తూ సాగాయని అన్నారు. వస్తుపరంగా, శైలి పరంగా ఇవి పాఠకులను అలరిస్తాయని పేర్కొన్నారు. ఆత్మీయ అతిథులు డా.ఏనుగు నరసింహారెడ్డి, పెద్దింటి అశోక్ కుమార్, సత్యాజీ మాట్లాడుతూ ... ఈ సంకలనంలోని 25 కథలను కథకులు అనేక సమస్యలను సామాజిక సంఘర్షణలను ప్రతిబింబిస్తున్నాయని అన్నారు. అనంతరం ప్రముఖ రచయిత్రి, విశ్వపుత్రిక గజల్స్ ఫౌండేషన్ చైర్మన్ డా.విజయలక్ష్మి పండిట్‌కి జీవన సాఫల్య పురస్కారాన్ని అందజేశారు. యువకవి పురస్కారాన్ని రాజు కల్లూరికి, ఉగాది పురస్కారాలు రావుల దయాకర్, బొప్పెన వెంకటేశ్‌లకు అందజేశారు.

మధ్యాహ్నం సెషన్లో 'ఎన్నో వర్ణాలు' కవితల సంకలనంతో పాటుగా మరో 6 పుస్తకాలను ఆవిష్కరించారు. 'ఎన్నో వర్ణాలు' పుస్తకాన్ని కళారత్న బిక్కి కృష్ణ, శాంతికృష్ణ కవితల సంపుటి 'నిశ్శబ్ద ప్రవాహం'ను డా. ఏనుగు నరసింహారెడ్డి, డా.తిక్కా సత్యమూర్తి 'అంతరంగ తరంగాలు' పుస్తకాన్ని డా.విజయలక్ష్మి పండిట్, కంచిపాటి మూర్తి 'అతన్నలా వదిలేయకండి' పుస్తకాన్ని సత్యాజీ ఆవిష్కరించి పరిచయం చేశారు. చెల్లూరు సాంబమూర్తి 'మనో దర్పణం' పుస్తకాన్ని మౌనశ్రీ మల్లిక్, డాక్టర్ కృష్ణారావు రెడ్నం 'కృష్ణరాగ తరంగిణి' పుస్తకాన్ని ఎం.బిందు మాధవి ఆవిష్కరించి గ్రంథ పరిచయం చేశారు. ఎం. బిందుమాధవి కథల సంకలనం 'కథన కుతూహలం'ను సుమన ప్రణవ్ ఆవిష్కరించి, పరిచయం చేశారు. అనంతరం ఆయా పుస్తకాల రచయితలు తమ స్పందన తెలుపుతూ మాట్లాడారు. ఈ సభలో తెలుగు సాహితీవనం బృంద సభ్యులు మూర్తి కంచిపాటి సుమన ప్రణవ్, నవీన్ హోతా పాల్గొని సభ నిర్వహణ చేశారు. ఈ కార్యక్రమంలో రెండు రాష్ట్రాల నుంచి పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు.

**– శాంతికృష్ణ**



గిడుగు రామమూర్తి పంతులు
(29.08.1863-22.01.1940)



మగ్దూం మొహియుద్దీన్
(04.02.1908-24.08.1969)



ఆరుద్ర
(31.08.1925-04.06.1998)



దాశరథి రంగాచార్య
(24.08.1928 - 08.06.2015)

SAHITYA PRASTHANAM ■ SAMPUTI - 4 ■ SANCHIKA - 11 ■ KRISHNA ■ August 2023
RNI NO.APTEL/2004/18396 ■ Postal Regd. No.VJ/187/2023-25 PAGES : 68
Date of Posting : 2nd of Every Month ■ Date of Publication : 27.07.2023

రెండు దశాబ్దాల మీ సాహిత్య నేస్తం

# సాహిత్య ప్రస్థానం

## అక్టోబర్ - నవంబర్ 2023

## ఇరవయ్యేళ్ల ప్రత్యేక సంచికగా రాబోతోంది !

సాహిత్య ప్రస్థానం 2003 డిసెంబర్ త్రైమాసికగా మొదలై త్వరలోనే మాసపత్రికగా మారి రెండు దశాబ్దాలుగా అవిచ్ఛిన్నంగా నడుస్తోంది. సాహిత్య ప్రస్థానం వచ్చాక సాహిత్య పత్రికల రూపురేఖలే మారిపోయాయి. కొత్త గొంతులను పలికించి... కొత్త భావాలు వెలిగించిన... సమగ్ర దృష్టి కోణాలు ఆవిష్కరించిన నిబద్ధతకు కొత్త నిర్వచనమిచ్చిన సాహిత్య ప్రస్థానం ఇరవయ్యో వార్షికోత్సవ సందర్భం ఇది.

మానవ చైతన్య వికాసంలో సాహిత్యం మహత్తర పాత్ర నిర్వహించింది. మూఢత్వాన్ని, ఆధిపత్యాన్ని, పీడనలూ దోపిళ్లను ప్రశ్నించడానికి అక్షరాలా ఆలంబనగా నిలిచింది. ఆశయాలకు ఊపిరులూదింది. సంఘ సంస్కరణలోనూ, స్వాతంత్ర్య పోరాటాలలోనూ, విప్లవ విజయాలలోనూ ప్రేరణగా నిలిచింది. ఈ కారణంగానే దేశ దేశాల్లో సాహిత్యకారులు, రచయితలు, కవులు అనేక నిర్బంధాలనూ నిషేధాలను ఎదుర్కోవలసి వచ్చింది. మన దేశంలోనూ ఇటీవలి చర్చకు వచ్చిన అనేక పరిణామాల నేపథ్యంలో ఉజ్వలమైన ఉత్తేజకరమైన ఈ చరిత్రను మననం చేసుకోవడం అవసరమని భావిస్తున్నాం. గతంలో వచ్చిన మా ప్రత్యేక సంచికలను మించి ప్రతిష్ఠాత్మక రచయితలు మేధావుల రచనల సమాహారంగా ఈ సంచిక వెలువడనున్నది.

సాహిత్య ప్రస్థానం ప్రత్యేక సంచికకు ప్రకటనలు ఇచ్చి ప్రోత్సహించవలసిందిగా ప్రకటనకర్తలకు విజ్ఞప్తి చేస్తున్నాం. చిరకాలం దాచి వుంచుకోదగిన స్థాయిలో వెలువడుతున్న ఈ ప్రత్యేక సంచికకు మీ నుంచి అదే విధమైన ప్రత్యేకాదరణ లభిస్తుందని ఆశిస్తున్నాం.

---

సమగ్ర సాహిత్య దర్శిని ప్రస్థానం, ఇరవయ్యేళ్ల విశేష సంచిక.

ప్రత్యేక సంచికల్లో మరో విశిష్ట ప్రయోగం, చరిత్ర గమనంలో చెరగని అక్షర దర్పణం.




